9199

రాజా బహద్దరు

# వేంకట రామారెడ్డి, ఓ. బి. ఇ.

# జీవితచరిత్ర.

గ్రంథకర్త:

సు. ప్రతాపరెడ్డి.

ప్రకాశకులు.

బాలికల ఉన్నత పాఠశాల కమిటీ,

నారాయణగూడెము

హైదరాబాదు - దక్కను.

ఫ. స. ౧౩౫౧.

వెల- మేలుప్రతి ౧౨ అణాలు.
సాదాప్రతి ౬ అణాలు.

గోలకొండ ముద్రాలయమున
ముద్రితము.
దక్షిణ హైదరాబాదు.

౨౨ - ౩ - ౧౯౩౮.

# ప్రకాశకుల నివేదన

నిజాంరాష్ట్రములోని ఆంధ్రమహాశయులలో, ప్రభుసేవయందును దేశసేవయందును, విద్యాపోషణమునందును, పరోపకారపారీణతయందును, నిరుపమాన విఖ్యాతి వహించినవారును, బాలికల పాఠశాలకు ముఖ్యాతి ముఖ్యులగు పోషకులును పాఠశాలకమిటీ అధ్యక్షులును అయిన శ్రీ రాజా బహాదరు వేంకటరామారెడ్డి ఓ. బి. ఇ. స్పెషలుఆఫీసరు సర్ఫ్ఖాసు ముబారకుగారి బోధప్రదమగు జీవిచరిత్రమును శ్రీవారి డెబ్బదియవ వర్షారంభమున ప్రకటించు భాగ్యము లభించినందునకు గర్వపడుచున్నాము.

శ్రీ రాజాబహాదరుగారి జీవితమును తెనుగున ప్రకటించ మొదట సంకల్పించినవారు ఈ పాఠశాలయొక్క ప్రాతవిద్యార్థిని శ్రీమతి కామిశెట్టి లక్ష్మీబాయమ్మగారు. వీరు ఈవిషయమున నొకచిన్న పుస్తకము వ్రాసి పాఠశాల కమిటీవారికిచ్చియుండిరి. తరువాత కొంతకాలమునకే క్షయ వ్యాధిచే దివంగతులైరి. ఈపుస్తకమును మా ప్రాతవిద్యార్థినీసంఘము వారు ప్రకటింప సంకల్పించి శ్రీ రాజాబహాదరుగారి ౭౦వ జన్మోత్సవ సందర్భమున సమర్పింపబడిన సన్మానపత్రములో తమ యుద్దేశమును సూచించియుండిరి. కాని శ్రీరాజాబహాదరుగారి జీవితవిశేషములు అంతకొద్ది పుస్తకములో నిముడజాలనందున శ్రీయుత సురవరము ప్రతాపరెడ్డిగారు, ఇట్టి యుద్గ్రంథమును రచించి, పటములు సేకరించి గ్రంథముయొక్క అంతస్స్వరూపమును బహిస్స్వరూపమును ఆకర్షకముగా నుండునట్లు సిద్ధపరచి యిచ్చిరి. ఇటి యుత్తమచరిత్రను రచించిన వీరు మాకు వంద్యులు. మా గ్రంథ రచయిత్రి శ్రీమతి లక్ష్మీబాయమ్మగారు జీవించియుండినచో, నేడు ఆమె యానందము అపారముగానుండెడిది.

శ్రీ రాజాబహాదరుగారి సేవాసక్తి యౌదార్యమును మేమీ విజ్ఞప్తియందు ఎక్కువగా ప్రస్తావించదలచలేదు. తలచినను అది సాధ్యము కాదు. ఈనిజాం రాష్ట్రములో ౫౦ సంవత్సరములకంటె ఎక్కువ కాల

మునుండి ప్రభుసేవయొనర్చుచు దాదాపుగా నీకాలమంతయు పోలీసుశాఖోద్యోగమును గడపియు, జాతి మతభేదములు గాక, సంపన్నులు, పేదలు అను తారతమ్యమును గాని గమనించక అబాల గోపాలము అందరి మన్ననకును పాత్రులై, చేతనైనయుపకారము అడిగినను అడుగకపోయినను. ప్రతివారికి చేయుచు జీవనమును ధన్యముగా గడుపుచున్న శ్రీ రాజాబహాదరు రెడ్డిగారు నైజాము రాష్ట్రములోని ప్రతివ్యక్తికిని — ప్రభుత్వోద్యోగులకు సహితము — ఆదర్శప్రాయులగు తమజీవితమును ప్రకటించుటకు మాకు అంగీకారమొసగి ఈపుస్తకమువలని లాభము వారియభిమానమునకు పాత్రమైన ఈ బాలికా పాఠశాలకు చెందునట్లనుగ్రహించినందునకు వారికి మేము ఎంతయు కృతజ్ఞులము.

శ్రీ రాజాబహాదరుగారు ప్రభుసేవయు, దేశసేవయు చేయుచు చిరకాలము దీర్ఘాయువులై జీవింతురుగాక యని పరమేశ్వరుని మనఃపూర్వకముగా ప్రార్థించుచున్నాము.

బాలికల ఉన్నతపాఠశాల,
౨౯౪౦/౧ నారాయణగూడెము
హైదరాబాదు (దక్కను)
౧౪ అర్దిబెహెస్తు ౧౩౪౮ ఫ.

మా. హనుమంతరావు,
కార్యదర్శి.

# PREFACE.

This life of Raja Bahadur Venkata Rama Reddy forms one of the most interesting and instructive biographies published in Telugu. It is a lucid exposition written in attractive style, of one of the worthiest citizens of Hyderabad, who is also held in high esteem throughout the entire Andhra Country and more especially by the extensive and important community of Reddies. There is no need to review this excellent narrative presented by an accomplished writer of Telugu prose. On the contrary, the only work that I should undertake is to supplement it by a brief account of my personal relations with the distinguished Raja Bahadur and the impression he made on me.

It is however, a quarter of a century since I first met him at Hyderabad. He was then holding a very important post in the Police Department, a post which gave him frequent access to His Exalted Highness the Nizam and for which the utmost delicacy of thought and feeling and the coolest judgment were indispensable qualifications. The Raja Bahadur, a strongman, silent but observant, modest in manner and moderate in speech, cool, calm, unruffled and sympathetic and charitable in his constructions and inferences, was, I was proud to note, regarded by Muslims as well as Hindus as an ideal officer. No wonder he

rose to the Headship of the Department and was awarded, for his signal and faithful services by His Exalted Highness the title of Raja Bahadur.

Mr. Venkata Rama Reddy is not merely a man of broad shoulders but one of a br ad mind also. The perfect affection with which he greeted his English daughter-in-law has always remained in my memory as the best and most conclusive evidence of the great and noble spirit of the Raja Bahadur.

He was not content with being a mere offical, though excellence in the very difficult position he occupied would have by itself constituted merit of no ordinary degree. In his own quiet way he was the friend and adviser of every one in distress. He promoted organisations intended for the uplift of the Reddy community and may be regarded as one of the founders of the noble Reddy Residential school and Library, which is a big factor in the cultural and social life of the Reddy community in Hyderabad. The education of Telugu girls has received powerful impetus from his sympathy and organising capacity. Outside Hyderabad too, his silent influence has not been ineffective. The most astonesihing features in the Raja Bahadur's life is the range of his beneficent activities and the perfect mystery in which they are shrouded. The fact is, he is not secretive but modest---modest by nature, preferring to be the power behind the throne instead of the occupant thereof. To hasty judgment he might look as a man of cold and reserved temperament. Reserved he is, but not cold. I have not come across a

warmer heart or more generous impulses than the Raja Bahadur's. A true friend in private life, he is just as true a comrade in public.

He is popular with the Muslims as with the Hindus. In fact genuine Hindu-Muslim unity can be promoted only by people of the type of the Raja Bahhadur who do not suffer from the inhibition of racial or religious animosities. He is a synthetic genius -- a synthesis that is produced by mutual affection, and reconciliation, and not through attempts at absorbtion of one into the other by force or policy. He is the friend of the Muslims no less than of the Hindus or the Reddies for the simple reason that he places his loyality and duty to His Exalted Highness and the Dominion above all other considerations.

I trust, that this fine life of the illustrious Raja Bahadur will find a wide and enthusiastic audience and that this silent hero of the Reddy race will continue to be, for generations to come, the healthy influeuce that he has been in the grateful appreciation of us all these many years.

May he enjoy many, many more years of noble service to his state, country and community

(Sd) C. R. Reddy,

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| ప్ర | ౧ | విషయ ప్రవేశము ... ... | పుట ౧ |
| ప్ర | ౨ | విద్యాభ్యాసము ... ... | ,, ౫ |
| ప్ర | ౩ | జీవితములోని మార్పు ... ... | ౨౧ |
| ప్ర | ౪ | ప్రారంభోద్యోగము ... ... | ౩౨ |
| ప్ర | ౫ | ఫసలి ౧౩౦౦–౧౩౧౧ జిల్లా అధికారి యగుట | ౪౪ |
| ప్ర | ౬ | ఫసలి ౧౩౧౧– ౧౩౨౩ వరకు | ౫౭ |
| ప్ర | ౭ | సహాయ కోత్వాలు | ౭౨ |
| ప్ర | ౮ | నగర కోత్వాలు | ౮౧ |
| ప్ర | ౯ | ఇతర ప్రభుత్వశాఖలలోని సేవ | ౧౧౯ |
| ప్ర | ౧౦ | సంఘసేవ | ౧౩౦ |
| ప్ర | ౧౧ | గుణవిశేషములు | ౧౫౯ |
| అనుబంధము | | | ౧౭౧ |
| పద్యములు. | | విద్వాన్ రామరావ్ శ్యామరావ్ | ౧౭౩ |
| ,, | | వి. హెచ్. రంగాచార్యులు | ౧౭౭ |
| ,, | | వం. జయ (విద్యార్థిని) | ౧౭౮ |
| రెడ్డివసతిగృహ అభినందన పత్రము | | | ౧౭౯ |
| గోలకొండపత్రిక సంపాదకీయము | | | ౧౮౩ |
| గోలకొండపత్రిక సంపాదకీయము | | | ౧౮౭ |
| గోలకొండపత్రిక సంపాదకీయము | | | ౧౯౦ |
| అవటపల్లి నారాయణరావు ప్రశంస | | | ౧౯౮ |
| వస్త్రప్రదర్శన ప్రారంభోపన్యాసము | | | ౨౦౭ |
| ప్రాతవిద్యార్థినుల పక్షమున సన్మాన పత్రము | | | ౨౨౧ |
| శ్రీరామ సచ్చిదానందశాస్త్రి విజ్ఞాపనము | | | ౨౨౪ |
| బిరుదముల పట్టిక | | | ౨౨౬ |

# ప్రస్తావన

శ్రీ రాజాబహద్దరు వేంకట రామారెడ్డిగారి జీవిత చారిత్రము ఆంధ్రభాషలోఁ ప్రకటితము అయిన మనోహరమైనట్టియు, ఉపదేశాత్మకమైనట్టియు జీవిత చారిత్రములలో నొక్కటియై యున్నది. ఇది ఆకర్షణీయమైన శైలిలో హైదరాబాదు నగర పౌరావతంసులగు నొక్కరినిగూర్చి ప్రకాశమానమగు వర్ణనము. వీరు అంధ్రదేశమువం దంతటను, ముఖ్యముగా, విశాలమగు సుప్రసిద్ధ రెడ్డి సంఘీయులచేత నెక్కువగను, అత్యంత గౌరవ పురస్సరముగ భావింపబడు చున్నారు. ఆంధ్రవచన రచనా ధురీణునిచే సమర్పితమైన యీ యుత్తమ చారిత్రమును విమర్శింప వలసిన యవసరము లేదు. అందుకు బదులుగా, మహిమోన్నతులగు రాజాబహద్దరువారితో నాకుగల వ్యక్తి సంబంధములను గూర్చియు, శ్రీవారినిగూర్చి నా మానసముపై ముద్రితమైన భావములను గూర్చియు కొంత నుడివి, యీ కథాంశమును పూర్ణము గావించుటయే నేను చేయవలసిన కార్యమై యున్నది.

హైదరాబాదులో నేను వారిని మొట్టమొదటసందర్శించి యిరువయిదయిదేండ్లు గావచ్చినది. అప్పుడు వారు పోలీసుశాఖలో చాల ముఖ్యమైన యుద్యోగములో నుండిరి. ఈ యుద్యోగ ధర్మమునననుసరించి మ. ఘ. వ. నిజాంప్రభువు సన్నిధాన వర్తులుగా నుండుటకు పెక్కు అవకాశములు వారికి కలుగుచుండెను. ఇట్టి రాజసన్నిధాన వర్తులయందు ఆలోచనా సునిశితత్వము, గ్రహణశీలము, శాంతసమాలోచనము, ముఖ్యముగా నుండవలసిన అత్యవసర గుణసంజాతము. రాజాబహద్దరువారు ధీరసంపన్నులు, మానశీలురు, అయినను; గ్రహణశీలురు, వినయాచారులు, మితభాషులు, శాంతియుక్తులు, స్తిమితవిభవులు, అచంచలురు, సానుభూతి సంభావితులు, సిద్ధాంత రాద్ధాంతములయందు మహోదారులు, కావున, హిందువులను, ముసల్మానులును సమానముగా వీరిని ఆదర్శనీయులగు అధికారిగా నెన్నుచుండిరని తెలుపుటకు నేను మిగుల గర్వించుచున్నాను. వీరు పోలీసుశాఖా ప్రధానాధికార పదవి కెక్కగలిగి, విశ్వాస పూర్వకముగను, గణనీయముగను చేసిన సేవలకు ప్రతిఫలముగా శ్రీమహాఘనత వహించిన ప్రభువువారు రాజాబహద్దరు బిరుదమును ప్రసాదించుటలో ఆశ్చర్యమేమియు లేదు.

శ్రీయుత వేంకట్రామారెడ్డిగారు విశాల భుజస్కంధులు మాత్రమేగాక, విశాలహృదయులును నైయున్నారు. వీరు

తన కోడలగు ఆంగ్లేయ కన్యకను అత్యంత ప్రీతిపూర్వకముగ సంభావించిన విధము, రాజాబహద్దరువారి సమధిక యౌదార్యశీలమునకు ఉత్తమోత్తమ ప్రబల తార్కాణముగా నా మనోవీధియందు ఎల్లప్పుడు నుండగలదు. దుష్కరమయిన అధికారపదవిని వహించుటయే గొప్ప విషయమై, అసామాన్యమైన కీర్తిప్రతిష్ఠలకు కారణభూతమయినను, శ్రీ వారు కేవల మధికార పదవిమోహితులై తృప్తిపడి యుండలేదు. వారికి సహజమగు నిరాడంబర విధమున దుఃఖభాగులయిన ప్రతివారికి మిత్రులును, ఉపదేశకులును అయియుండిరి. రెడ్డి సంఘీయుల సముద్ధరణాత్మకములగు సమస్త ప్రతిష్ఠాపనములకును దోహద మొసంగిరి. కావున రెడ్డివసతి గృహము, రెడ్డి గ్రంధాలయము అను గొప్ప సంస్థల ప్రతిష్ఠాపకులలో నొక్కరని పరిగణింప వచ్చును. ఈ సంస్థలు హైదరాబాదులోని రెడ్డిసంఘముల విజ్ఞానవికాసమునకును, సాంఘికాభివృద్ధికిని మహోత్కరములయి యుండుట గమనింపదగిన యంశము. శ్రీవారి సానుభూతి, నిర్మాణచాతుర్యముల మూలముననే ఆంధ్రబాలికల విద్యావిషయమునకును ప్రబల ప్రోత్సాహము కలిగినది. హైదరాబాదు ప్రాంతేతర భాగములందును, వీరి నిరాడంబర జీవిత ప్రాబల్యము ఫలరహితముగానుండి యుండ లేదు. వీరానందించు హితవర్ధక కార్యకలాపముల విస్తృ

తియు, వాని సిగూఢశ్లోమును రాజాబహద్దరు వారి జీవితము లోని యత్యంత అద్భుతకథ నాత్మక విషయమై యున్నది. సంగతియేమనగా, వారిలో రహస్యములేదు. కాని నమ్రత కలదు. నమ్రతయే వారిస్వభావము. గద్దెమీదనుండుటకంటె గద్దెనెనుక నుండిగూ తమ శక్తియుక్తులను ప్రయోగించు టయే వారి యభిలాషము, శీఘ్రాభిప్రాయులకు శ్రీవారు విర సులుగను, వాగ్మిగాను గనబడవచ్చును. నిజముగా వాగ్మియే కాని విరసులు మాత్రము కారు. రాజాబహద్దరువారికంటె ప్రేమహృదయులను, ఔదార్యభావులను నేను సందర్శించి యుండలేదు. సాంసారిక జీవితమందెట్టి సత్యమిత్రమో, ప్రజా హిత జీవితమునందంతయు సత్య సహచరులు.

హిందువులకెట్లో ముసల్మానులకును అట్లె ప్రియులయి యున్నారు. రాజాబహద్దరుగారు, జాతీయ లేక ధార్మికవై మనస్య సంబంధములగు అభ్యంతరములతో సంకటపడువారు కాకపోవుటచే, ఇట్టివారే, శుద్ధమైన హిందూ ముసల్మానుల ఐక్యతను పెరిపొందింపగలరనుట ధృవము. వీరిది సంయో గము చెందిన ప్రతిభ. ఈ సంయోగము పరస్పర ప్రేమవల నను, సహనభావము, ఒద్దిక వలనను ఏర్పడివదే కాని బలవంత ముననో, కార్యనీతిని పురస్కరించుకొనియో ఒకరిలో మరియొ కరు ఐక్యము కావలయుననను ప్రయత్నముల ద్వారా ఏర్పడి

నది కాదు. హిందువులయెడను, రెడ్లయెడను చూపెడు మైత్రి కంటె, ముసల్మానులయెడ చూపెడు మైత్రి తక్కువదికాదు. దీనికి ముఖ్యకారణ మేమనగా, వీరు ఇతర విషయ భావనల నటుంచి, శ్రీ నిజాము ప్రభువువారియెడను, రాష్ట్రమునెడను, తన రాజభక్తికిని, విధ్యుక్త ధర్మనిర్వాహణమునకును ప్రధాన స్థానమిచ్చి యున్నారు.

ప్రఖ్యాతులగు శ్రీరాజా బహద్దరువారిదగు సుచారిత్ర మును పెక్కుమంది, ఉత్సాహముతో పఠించెదరుగాక యని నమ్ముచున్నాను. రెడ్డికుల రత్నమగు నీ నిరాడంబర నాయకు డు, భావితరముల వారికిని, ఇన్నేండ్లనుండి మా కృతజ్ఞతాబద్ధ ప్రశంసకు పాత్రమైన జీవశక్తిదాయక ప్రాబల్యమును ప్రసాదిం చుచుండునుగాక!

తన రాష్ట్రమునకును, దేశమునకును, సంఘమునకును తన ఘనమైన సేవను అర్పించుచు, శ్రీరాజా బహద్దరువారు బహుకాలము సౌఖ్యజీవితమును నడిపెదరుగాక.



రాజాబహద్దరు వేంకట రామారెడ్డిగారు,

# మొదటి ప్రకరణము

## విషయ ప్రవేశము

ప్రపంచములోని మహాపురుషుల చరిత్రలు నానా విధములుగా నుండును. అవన్నియు పాఠకులకు కొన్ని గుణపాఠములు నేర్పునట్టివై యుండును. జీవిత చరిత్రలు వ్రాయు నాచారము పాశ్చాత్యులలోనే విశేషము. వారినుండియే యీ విషయమును భారతీయు లనుకరించుచున్నారు. జీవితచరిత్రలు వ్రాసి యుంచుట వలన ముందు సంతతివారికి తమ పూర్వుల లోని గొప్పవారి చరిత్రయు ఆ చరిత్రలోని ఆదర్శ విషయములును ఆ చరిత్రకు కారణభూతములైన మహాపురుషుల కాలములోని కొన్ని ముఖ్య ఘట్టములను:— ఇటువంటి అనేకవిషయములు తెలిసికొనుట కవకాశ మేర్పడును.

ప్రపంచమందలి మహాపురుషు లనేక విధముల వారై యున్నారు. సేనానులును, రాజులును, రాజకీయ వేత్తలును, కవులును, మతకర్తలును, సంఘ సంస్కర్తలును- పరోపకారులును — మహాపురుషులు పలు తెరగులుగా నుందురు. వీరంద

రును తమ తమ శక్తికొలది తమ తమ ప్రాంతములలో సమాజోన్నతికి పాటుపడిన వారే. కొందరికి ఆబాల్యముగా తమ శక్తిసామర్థ్యములను ప్రకటించుట కవకాశము లుండును. రాజుల సంతతివారును, కోటీశ్వరుల పిల్లలును, ఉన్నత పదవులందు వారి సన్నిహిత బంధువులును, తమ శక్తి సామర్థ్యములు ప్రకటించి లోక కల్యాణమున కుపకరించిన వారైన అదియు గొప్ప విషయమే. కాని అంతకన్న గొప్ప విషయమేమన ఆదిలో సాధారణ స్థితి యందుండి స్వీయ గుణముల చేతను స్వయం కృషిచేతను గొప్పస్థితికి వచ్చినవారి చరిత్రలింకను రమణీయముగా నుండును. నెపోలియన్ చక్రవర్తి, అబ్రహాంలింకన్, గార్ఫీల్డు, చాణక్యుడు, హైదరలీ, క్రాంవెల్, వీరేశలింగం, సాక్రటీసు, శంకరాచార్యులు ఇట్టి వారందరును ఈ ద్వితీయవర్గములో చేరినవారు.

అమెరికా దేశములో ఇద్దరి మహాపురుషుల చరిత్ర చాల రమ్యమైనట్టిది. అబ్రహాంలింకన్, జనరల్ గార్ఫీల్డు అను వారిరువురును పూరి గుడిసెలలో పుట్టి పెరిగి తుదకు అమెరికా దేశముయొక్క రాజ్యాధ్యక్షులు (President) అయిరి. వీరిద్దరిని గురించి గార్ఫీల్డు చరిత్రకారుడు (From log-cabin to white House అను గ్రంథములో) ఇట్లు వ్రాసి యున్నారు:–

" ఈ ఇద్దరును కట్టె గుడిసెలలో పుట్టినారు. ఇద్దరును బీదవారే. ఇద్దరికిని బాల్యదశలో విద్యా సౌకర్యములు కలుగకపోయెను. లింకను యొక్క ఎనిమిదవ యేటనే అతని తల్లి గతించెను. గార్ఫీల్డుకు ౧౮ నెలలుకూడ నిండక మునుపే అతని తండ్రి గతించెను. ఈ యిరువురును కష్టపడు స్వభావము కలవారనియు, సమయస్ఫూర్తి కలవారనియు, పట్టుదల, విశ్వాసపాత్రత, ధైర్యము, మితజీవనము, విషయగ్రహణము, సమయజ్ఞత, క్రమనిర్ణయము, దాతృత్వము కలవారనియు, ప్రసిద్ధి గన్నవారు (Both were well known for their industry, tact, perseverance, Integrity, courage, economy, thoroughness, punctuality, decision, and benevolence)" ఈ వాక్యములను జదివిన వెంటనే నిజాంరాష్ట్ర జనులందరికిని రాజా వేంకటరామారెడ్డి బహద్దరు ఓ. బి. ఇ. గారు, తప్పక జ్ఞాపకము రాకమానరు. రాజా వేంకట రామారెడ్డిగారు పై యిరువురి మహాపురుషుల గుణములలో, ఇంచుమించు అన్ని గుణములను గలిగినట్టివారు. వారి వలెనే వీరును (అంత బీద కుటుంబమువారు కాకపోయినను) సాధారణ పటేండ్ల కుటుంబమువారు. వారివలెనే వీరును తమ బాల్యమునందే తల్లి దండ్రులను పోగొట్టు కొన్నట్టివారు. వీరు జన్మించిన మూడవ దినమునాడే వీరి తల్లి చనిపోయెను. వీరి ఐదవ సంవత్సరమునందే వీరి తండ్రి గతించెను. బాల్య

మంది సాధారణవిద్య నభ్యసించిరి. ఈనాడుంనునట్టి విద్యా సౌకర్యములు ౬౦ ఏండ్ల క్రిందట లేకుండెను. ఆ కాలములో మంచి విద్యావంతు లనిన అపురూపము మనుష్యులుగా పరిగణింప బడుచుండిరి. వీరి బాల్యములోనే వీరి సంరక్షణ కర్త యును, మేనమామయునగువారు, అకాల మరణమొందిరి. ఇక వీరికి సహాయపడు వారు అరుదైపోయిరి. అట్టివారు ఆదిలో నొక సాధారణమగు అమీన్ పదవినుండి, క్రమముగా ఉన్నత పదవుల పొందుచు, హైదరాబాదు నగర కొత్వాలు పదవిని పొందినారనిన, దానికి ముఖ్యకారణము లుండవలెను. అవి వారి గుణవిశేషములే. వీరి యుద్యోగ కాలములోని చరిత్ర నంతయు పరిశీలించి చూచిన, వీరి రెండు ముఖ్యగుణములు కనబడుచున్నవి. నిరంతర కృషి, శ్రద్ధ, న్యాయదృష్టి, యివి వీరి ప్రధాన గుణములు.

ఉన్నతోద్యోగములు పొందినవారు హైదరాబాదు రాష్ట్రములో వందలకొలది వేలకొలది కలరు. నగరకొత్వాలు పదవి నలంకరించిన కొత్వాలెందరో వీరికన్న ముందు కాలములలో పదవిని నిర్వహించి యుండిరి. కాని వారెవ్వరును ప్రజల స్మృతిపథము నందులేరు. వీరు మాత్రము సర్వజనులచేతను, నిఖిల నిజాంరాష్ట్రము చేతను, నిఖిలాంధ్రుల చేతను, కొనియాడబడు చున్నారు. ముందు కాలమందును, అజరామరముగా, వీరు నిజాంరాష్ట్ర వాసులచేతను అందు ముఖ్యముగా ఆంధ్రులచేతను కీర్తనీయులై యుందురనుటలో అతిశయోక్తి లేదు.

# రెండవ ప్రకరణము

## విద్యాభ్యాసము.

మహబూబునగరము జిల్లాను పూర్వము పాలమూరుజిల్లా అనేవారు. ఆజిల్లాలోనిదే వనపర్తిసంస్థానము. ఆ సంస్థానములోనిది గాయణిపేట గ్రామము. ఈ గ్రామమే వెంకటరామారెడ్డిగారియొక్క తల్లిగారి పుట్టినిల్లు. ఆయమపేరు బారమ్మ. బారమ్మగారి అన్న విలియంవహాబు. వీరిరువురి తల్లిదండ్రులు కిష్టమ్మ, రాయిరెడ్డి అనువారు. విలియం వహాబుగారి తల్లియగు కిష్టమ్మ వనపర్తిసంస్థానాధీశ్వరులును బహుయుద్ధములందు ఆరితేరినవారును, ౧౮౬౬ వరకు వనపర్తి సంస్థానమును పరిపాలించినవారును, అగు స్వైరాజా (ప్రథమ) రామేశ్వరరావు బహద్దరుగారి సొంతచెల్లెలు. అనగా ప్రథమ రామేశ్వర రాయలవారి మేనల్లుడు విలియంవహాబుగారును, విలియంవహాబుగారి మేనల్లుడు మన వేంకటరామారెడ్డిగారును అనివిశదమయ్యెడి.

విలియంవహాబు అను పేరునుగురించి చాలమందికి ఆశ్చ ర్యము కలుగవచ్చును. అతడు రెడ్డియే. అతని మొదటి పేరు శాయిరెడ్డి. ప్రథమ రామేశ్వర రాయలవారిలో ఆకాలమందే ఆంగ్లసంస్కృతి బాగుగా అతికిపోయెను. అందుచేత వారువ ద్దరు రెడ్డిబాలురను తనవద్ద నేయుంచి పెంచుకొనియుండిరి వీరికందరకును విద్యాభ్యాసము చేయించుచుండిన ఒకఇంగ్లీషు ఫాదిగారు, వీరికి విలియం, హెన్రీ మున్నగు మారు పేరులు పెట్టియుండిరి. ఈ ఇంగ్లీషు పేరులును ముసల్మాను పేరులగు వహా బు అను పేరులును ఈ ఏడుగురికిని ఏర్పడిపోయెను. అందర కును వహాబు అను పేరుమాత్రము సమానమే అయినను, ఇం గ్లీషు పేరులుమాత్రము భిన్నముగానుండెను. ఈ విధముగా ఛార్లస్ వహాబ్, ఎడ్వర్డ్ వహాబ్, హెన్రీవహాబు మున్నగునవి.

విలియం వహాబుగారి చెల్లెలగు బారమ్మను గద్వాల నగరములో పటేలును, చుట్టు ౭-౮ గ్రామములలో పటేలు తనమును పొందినవారును, సంపన్నులును, అగు కేశవరెడ్డి అను వారికిచ్చి వివాహము చేసిరి. కేశవరెడ్డిగారు ఆకాలములో మంచిధనికులుగా పరిగణింపబడియుండిరి. వారుగోపాలుపేట సంస్థానము వారికికూడ సుమారు ౪౦ వేలకుపైగా అప్పయిచ్చి యుండిరి. కాని అదితర్వాత వసూలుకాక మునిగియేపోయెను. ఇట్టిపుణ్యదంపతుల కుమారుడే వెంకటరామారెడ్డిగారు. వీరు

తమతల్లిగారి పుట్టినింటిలో రాయణిపేటగ్రామములో జనన మందిరి. జననమొందినట్టి సరియైన తేది మనకులభించుటలేదు. కాని వారి ఉద్యోగపు కవిలెలో, వారుజననమొందిన తేది ౧౬ అర్దిబెహెష్త్ ౧౨౭౯ ఫసలిఅని యుండుటచే అదియే మన మంగీకరించవలసి యుండును. జననమొందిన మూడవదిన సమే వీరితల్లిగారు గతించుటచేత, తల్లితల్లిగారగు కిష్టమ్మగారు వీరినిపెంచుచు వచ్చిరి. తర్వాత శారమ్మగారి సొంతచెల్లెలగు జానమ్మ అనునామెను కేశవరెడ్డిగారు వివాహమాడిరి.

వేంకటరామారెడ్డిగారి యింటిపేరు "పాశము" వారు. వేంకటరామారెడ్డిగారి వంశీయులగు పాశమువారుకొందరు ఇప్పటికి గద్వాలలో గ్రామాధికారులుగా నున్నారు. వీరి గోత్రము పేరు "ముదునోళ్ళ" గోత్రము. ఈ గోత్రమువారే మోటాటిశాఖలో బహుళముగా నున్నారు. గోత్రమనగా సాధారణముగా ఋషిగోత్రమనియే హిందువులఅభిప్రాయము. కాని రెడ్లలో నెందును ఋషిగోత్రములు కానరావు. వీరి గోత్రములన్నియు విచిత్రనామములతో కూడియున్నవి. కమ్మ వెలమవారలలోను నిదే వ్యవస్థగానున్నది. కొన్నిగోత్రములు ఈ మూడుశాఖలలో నొకటిగా కనబడుచున్నవి. ఇదిపరిశో ధనీయాంశముగా నున్నది. కొందరి యభిప్రాయమున ఈగోత్ర ములు గ్రామముల పేరులనుబట్టి వచ్చినవట. కాని తెనుగు

దేశములోనెందునూ ఈ గోత్రములకు సరిపోవునట్టి గ్రామములులేవు. ఈ గోత్రములన్నియు శివసహస్ర నామావళిలోని శివనామముల అపభ్రంశరూపములని కొందరి యభిప్రాయము. ఉండవచ్చును. రెడ్లు మొదలు జైనులుగా నుండి యుందురు. తరువాత ఓరుగల్లు చక్రవర్తులకాలములో శైవులై యుందురు. అప్పుడు శైవదీక్ష పొంది, శివనామములనే గోత్రములుగా నేర్పాటుచేసికొని యుండవచ్చును. ఈవాదమెంత వరకు నిలుచునో బాగుగా పరిశోధించినకాని నిష్కర్షగా చెప్పుటకువీలులేదు.

రెడ్లలో అనేకశాఖలు ప్రాచీనములో సీమాభేదములనుబట్టి యేర్పడెను. అందుపాకనాటి, మోటాటి, పంట, గోన, గుడాటి, ఎరవాటి మొదలగునవి విశేషముగా కనబడుచున్నవి. రెడ్లు మొదట ఉత్తర దేశమునందుండి రనియు, తర్వాత దక్షిణమునకు వలసవచ్చిరనియు, అట్లువచ్చినవారిలో "మొదటవచ్చినవారు మోటాటివారు" అనియు చెప్పుచుందురు. మోటాటివారిలో ౩౬౦ గోత్రముల వారున్నారనియు, పాకనాటిలో ౧౨౦ గోత్రములవారున్నారనియు చెప్పుదురు. రెడ్లను, ఆశ్రయించి, బ్రతుకునట్టి "పిచ్చుకుంట్ల" వారు అనునొకతెగవారు, జంగముకథారూపముగా ఈవలస యొక్క కథను; గోత్రములవివరములను ఆ గోత్రములవారి

యింటిపేరులను, ద్విపదలలో నేటికిని గానముచేయుచుందురు. "మోటాటి" అనుపదముయొక్క సరియగురూపమును ఎవ్వరును తృప్తికరముగా నిరూపించలేదు. శబ్దరత్నాకర నిఘంటుకారులు మోటాటి అనుపదమునకు అర్థమువ్రాయుచోట "మోటనాడు" అను సీమాభేదము అని వ్రాసియున్నారు. ఎన్నియో సీమల పేరుల మనము వినియున్నాము కాని "మోటనాడు" అనుసీమ పేరు వినమందున అదిసరియైన యూహ కాదనవలెను యథార్థమేమన ఈ మోటాటిపదము "మటెవాడ" అనుపదమునుండి వచ్చినది. సుమారు ౭౫౦ సంవత్సరములకుపూర్వము ఆలంపూరుసీమలో రాజ్యముచేసిన బిజ్జల తిమ్మారెడ్డి అనువారు తాము రచించిన అనర్ఘరాఘవమును తెనుగుప్రబంధములో తనజాతిని గురించియిట్లువ్రాసిరి.

"అట్టిగంగకు తోబుట్టువగుచతుర్థ
"జాతియందు నితాంత విఖ్యాతిదనరు
"చున్న మొటవాడకులమున నొప్పుమీరె
"చాల బిజ్జల దాదభూపాలమౌళి."

ఇతనిచేతను, ఇతని వంశీయులచేతను ఇనాములు పొందిన వారిసనదులలో "మటెవాడకాపులైన", ఫలానివారికి, ఫలాని భూములినాముగా నియ్యబడినవని వ్రాసియున్నారు. ఇట్టి నిదర్శనములనుబట్టిచూడ, మోటాటి జాతివారు మటెవాడ

సీమవారనియు, ఈ మఱెవాడసీమ ఓరుగల్లులోని ప్రస్తుతపు మఱెవాడయేయనియు, నిశ్చయమగును. నిజామురాష్ట్రము లోనే మోటాటికాపులు సమృద్ధిగా నుండుటయున్న ఇతర శాఖలవారు ఏకొలదిమందిగియోతప్ప విశేషముగా కానరా కుండుటయు, పైనిర్ణయమును బలపరచుచున్నది.

వేంకటరామారెడ్డిగారిట్టి మోటాటిశాఖకు చెందిన రెడ్లు. తల్లి చనిపోయినందునను, అవ్వ కిష్టమ్మచేత పెంచబడుచుండుటచేతను, ఈబాలుడు రాయుణిపేట గ్రామములోనే తనబాల్యమును గడపుచు తొమ్మిదిసంవత్సరముల ఈడువచ్చువరకందేయుండెను. ౬౦ సంవత్సరములక్రిందట నిజాంరాష్ట్రములో విద్యావ్యాపకమన్న మాటయేలేదు. ఈనాడే నూటికి అయిదుగురే చదువనేర్చినవారు న్నారనిన, ఆనాడెందరుండిరో యూహింపవచ్చును. ఇంగ్లీషుగాని ఉర్దూగాని రాష్ట్రమందు ప్రచారములో లేకుండెను. తెనుగుబడు లందందు గ్రామస్థుల చేతనే స్థాపించుకొనబడియుండెను- అట్టిబడులలోను పటేలు పట్వారీలపిల్లలును, బ్రాహ్మణవైశ్యబాలురును సంబి, జంగము పిల్లలును, తప్ప యితరజాతులవారికివిద్యతో అవసరమేకానరా కుండెను. బడిపంతులు సాధారణముగా భట్రాజో, నంబియో, చాత్తానియో, జంగమో, యుండుచుండెను. బడిసమయములు చీకటిలో౫ గంటలకు "తెల్లవారెను మేలుకొలుపులు" అను

భూపాళరాగముతో మొదలై ౮ గంటలవరకును, ౮ గంటల నుండి ౯ గం॥ వరకు "అంబళ్ళ"కై సెలవును, ౯ నుండి ౧౨ వరకు మరలబడియు, ౧౨ నుండి ౧ గంటవరకు భోజనమునకై సెలవును, ౧ నుండి సాయంకాలము ౬. వరకును మరలబడియు, తర్వాత దీపాలుపెట్టినప్పుడు "దీపంజ్యోతి పరబ్రంహ్మం" అనిపాటబాడి పిల్లలిండ్లకు పోవుచుండిరి. అష్టమి నగముదినము సెలవు. చతుర్దశియు, అమావాశ్యా పూర్ణిమలును సెలవులు. ప్రతి చతుర్దశినాడు "పలకపూజ" చేసి పిల్లలిండ్లకు పోవుచుండిరి. ఇక బడిలోని పాఠప్రణాళిక; ఓ న మా లు, కాకున్నము, ఎక్కాలు, బొట్లవెరసులు, గిద్దల వెరుసులు, చెప్పిన పద్యము వ్రాయుట, పెద్దబాలశిక్ష, సుమతిశతకము, నృసింహాశతకము, భాగవత భారతములు చదువుట వ్రాయుట, లెక్కలు కూడుట తీసివేయుట, వడ్డీలెక్కలు వేయుట, ఉత్తరములు చదువుట, దీనితో విద్యాసమాప్తి.

పై విధముగుబడిలో పైపాఠ ప్రణాళికను రెడ్డిగారు తమ తొమ్మిదవ సంవత్సరము వరకు పూర్తిచేసినారు. ఆకాలములో బాలుర వ్రాయు సాధనములు రెండు. ఒకటి కట్టెపలకలపై బొగ్గుపొడిని ఆకుపసరునుకలిపి పూసి రాతిబలపములతో వ్రాయుట. రెండవది పెద్దపెద్ద జిల్లేడు ఆకులను తెచ్చుకొని జొన్నదంట్లను కలములుగా చెక్కి బియ్యపుబొగ్గుపొడిని,

గోందును, కలిపి చేసిన మసితో వాటిపై వ్రాసికొనుట. ఆకాలములో మహబూబునగరు జిల్లాలో చేరిన కోయిలకొండ అను ప్రసిద్ధస్థలములో కాగితములు సిద్ధము చేయబడుచుండెను. కాని అవి అందరి యందుబాటులో లేకుండుటచేత, గ్రామాధికారులు ముఖ్యావసరములకు మాత్రమే వాడుకొనుచుండిరి. మన రెడ్డిగారు తమ బాల్యములో జిల్లేడుఆకులపై స్వదేశీమసితో స్వదేశీదంటుకలము పుల్లలతో వ్రాసి విద్యనేర్చుకున్నవారు.

రెడ్డిగారు ఉర్దూలో ప్రవీణులనియు, తెనుగుమాత్రము సరిగా తెలియనివారనియు, చాలమంది అపోహపడుచుందురు. కాని రెడ్డిగారు చిన్నప్పుడు బాగుగా భాగవతభారతములను చదివినవారు. భాగవతమందలి కొన్నిపద్యములుకూడ వారికి బాగుగా జ్ఞాపకమున్నవి. వారు తెనుగుజాబులను స్వంతముగా వ్రాయుచుదురు. చిన్నతనములో నేర్చికొనిన తెనుగు, తర్వాతికాలములో మరల వృద్ధిచేసుకొనుటకవకాశములులేకున్నను, నేటివరకును ఏమియు మాయనిదై యున్నది.

రెడ్డిగారు తమ తొమ్మిదవయేట రాయణిపేటకు ఇంచుమించు ౭ మైళ్లదూరమునుండు వనపర్తికి, విద్యాభ్యాసనిమిత్తమై వెళ్లిరి. వనపర్తిసంస్థానములో రాజవంశమందు మార్పులు కలిగియుండెను. రెడ్డిగారి మేనమామయొక్క మేనమామయైన రాజా (ప్రథమ) రామేశ్వర రాయలు క్రీ. శ.

౧౮౬౫ లో చనిపోయిరి. వారియనంతరము వారిభార్య యగు రాణీ శంకరమ్మగారు రాజా రామకృష్ణారావు (అను వారిని దత్తుగా స్వీకరించిరి. ఆదత్తుకుమారుడు తన ౧౬వ ఏటగుఱ్ఱము స్వారిచేయుచు దాని పైనుండి పడి చనిపోయెను. మరల రెండవమారు ఒక బాలుని దత్తుగా తీసుకొనిరి. అతనికి (ద్వితీయ) రాజా రామేశ్వర రావు బహద్దరు అని పేరిడిరి. మన వేంకటరామారెడ్డిగారును ఈ ద్వితీయ రామేశ్వరరాయలును వనపర్తిలో సహాధ్యాయులుగానుండిరి. వనపర్తిలో రెడ్డిగారు తెనుగువిద్యను అభ్యసించుచు దానితోపాటు ఉర్దూభాషను ప్రారంభించిరి. తొమ్మిదవసంవత్సరమునుండి ౧౨వ సంవత్సరమువరకు ఉర్దూలో "పహిలీ" మొదలుకొని వృద్ధిచేసుకొనుచు ఫార్సీలో "కరీమా" అనుచిన్నగ్రంథమును పూర్తి చేసిరి. వీరికి చదువుచెప్పు మౌల్వీసాహేబు చండప్రచండుడు. వారికి బాలురయొక్క లాలనములో కించిత్తుకూడ విశ్వాసములేదు. ఎంత బాగుగా వీపుపై మోదిన అంతగట్టిగా బాలురలో విద్య అతికిపోవునని వారికి సంపూర్ణవిశ్వాసము. మౌల్వీగారిబడి తెనుగుబడితో కొంచెము భిన్నించుచుండెను. బెత్తముబరిగెలతో అల్లినచాపపై విద్యార్థులు పద్మాసనముతో కూర్చుని శివముపట్టినవారివలె వెనుకముందుకూగుచు గట్టిగా రంతులు పెట్టుచు పాఠముల నొఱలుచుండువారు. పాఠములు చదువు

టలో తప్పులుదొరలిన గోరంటచెట్లబరిగెలతో వీపులపై వాత లు పడమోదుచుండెడివారు. ఈ విధముగా రెడ్డిగారి విద్యా భ్యాసములో రెండవఘట్టము ముగిసెను.

వీరిజీవితమిట్లు గడుచుచుండ వీరి మేనమామగారగు విలియంవహాబుగారు పోలీసుశాఖయందు ఉద్యోగులై తమ శక్తిసామర్థ్యములచే క్రమముగా జిల్లాపోలీసు ప్రధానాధికారి (సదరు మొహతెమిం) పదవినిపొందిరి. వహాబుగారప్పుడు రాయచూరులో జిల్లాపోలీసు అధికారిగా పనిచేయుచుండిరి. అప్పుడువారు తనకుమారునితోపాటుగా చదువుకొనుటకై తన మేనల్లుడగు వేంకటరామారెడ్డిని వనపర్తినుండి రాయచూరు నకు స్వయముగా పిలుచుకొనిపోయిరి. వీరు రాయచూరులో తమ ౧౨ వ సంవత్సరమునుండి ౧౬ వ సంవత్సరమువరకు విద్యాభ్యాసము చేయుచుండిరి. అచ్చట ఉర్దూఫార్సీ భాష లలో పాఠములు చదివినారు. వీరివిద్యకై ఒకమౌల్వీయును తెనుగుచెప్పుటకై ఒకభట్రాజున్ను నియుక్తులై యుండిరి. రాయచూరులో ఇంచుమించు నాలుగుసంవత్సరములు బాల్య మందు గడపుటచేత రెడ్డిగారికి అచ్చటి కన్నడభాషయు మరాటీభాషయు అలవడెను. ఇట్లు సక్రమముగా నెమ్మదిగా, సుఖప్రదముగా రెడ్డిగారి జీవితము గడుచుచుండగా తటాలున పిడుగువంటి విపత్తు వీరికుటుంబమున సంభవించెను. వీరిని

ప్రేమించి, పోషించుచువచ్చిన మేనమామ, అకాలముగా మృత్యువువాతబడిరి. కుటుంబవ్యవహారములంతయు కల్లోలములలోబడెను. ఈదుర్వార్త విన్నతర్వాత వహాబుగారి అన్నగారును, తల్లియగు కిష్టమ్మగారును, మామయగు రామన్న అనువారును రాయచూరుకువచ్చి వహాబుగారు చేసినకొన్ని బాకీల క్రిందికిగాను వారిసామానులనమ్మి, మిగతవానిని బండ్లపై నెక్కించి రాయణిపేటకుపంపిరి. కుటుంబమువారి నందరిని కూడ రాయచూరునుండి తరలించిరి. వేంకటరామారెడ్డిగారినికూడ వెంటతీసుకొనిపోవువారైయుండిరి. కాని దైవఘటన ఇంకొకవిధమ గానుండెను. అచ్చట ఆనాడుజరిగిన చిన్న ఘట్టమే వేంకటరామారెడ్డిగారి జీవితమును పూర్తిగా నింకొక మార్గములో నడిపించెను.

* ఈ ప్రకరణమును ముగించుటకుపూర్వము, హైద్రాబాదు రాజ్యములో విలియం వహాబుగారి కాలములో పోలీసుశాఖలోని ఏర్పాటులను, వారిపరిపాలన, దేశపరిస్థితులు, ఎట్లుండెనో సంగ్రహముగా తెలిసికొనుట అవసరము. అప్పుడు అనగా సుమారు ౬౦-౭౦ సంవత్సరముల క్రిందట, సర్ సాలార్జంగుగారు ప్రధానమాత్యులుగా నుండిరి. వారికాలములోనే

---

* వివరములకై మీర్ విలాయతు హుసేను గారు వ్రాసిన పోలీసు డిపార్టుమెంటు చరిత్రను చూడుడు.

రాజ్యాంగమందు మార్పులు చురుకుగా ప్రారంభమయ్యెను. ఆ కాలములో రాజ్యములో నాలుగు విభాగములుండెను. ప్రతిభాగమునకును ఒక పోలీసు సదర్ మోహతెమీం ప్రధానాధికారిగా నుండెను. పోలీసుసిబ్బందికి యూనిఫారం లేకుండెను. కొందరు ధోవతులను, కొందరు పట్యాలను, కొందరు కోట్లను ధరించి, చేతులలో కట్టెలనో లేక కత్తులనో పట్టి ఉద్యోగములు చేయుచుండిరి. సదర్ మొహతెమీంగారి సేనలో ఒక ఏనుగుకూడ నుండుచుండెను. నెలలపర్యంతము వీరు దొరాచేయుచుండిరి. ఎప్పుడైన దొరాచేయ సంకల్పించిరా వారు ఏనుగుపై సవారియై ముందు పోలీసుసిబ్బంది, అరబ్బులు, రోహిలాలు, నడుచుచుండగా మేళతాళములు బాజా భజంత్రీలు, డప్పులు, వాయించుచుండగా తుపాకులు ప్రేల్చుచు, ఒక పెండ్లి ఊరేగింపువలె బయలుదేరుచుండిరి. ఒక సదర్ మొహతెమీం బైంగన్పల్లి నవాబుగారి వంశీయులైయుండిరి. వారికి బహిరీ పిట్టలయొక్కయు, చిరుతపులులయొక్కయు, వేట చాలాయిష్టము. వారిదొరా అనిన షికారీ అనియే యర్థము. అడవులలో డేరాలువేసి అచ్చటికే గ్రుడ్లు, పెట్టలు, భోజన సామగ్రి వెట్టిపట్టి తెప్పించెడివారు. జవానులకు కల్లు సమృద్ధి. బోగముసానులు రాత్రింబగళ్లు ఆటపాటలతో వారికి వినోదము కలిగించుచుండిరి. సదర్ మొహితెమీములు దొరాచే



రెడ్డిగారి మొట్టమొదటి పటము ౧౮ ఏండ్లవయస్సులో ఇతర అమీనులతో సహా. కుడిప్రక్కనుండి రెండవవారు ఎత్తైన బల్లపై నిలబడినారు.



వెంకటరామశాస్త్రిగారు
(౧౫ ఏండ్ల వయస్సులో)

సిన, వారెక్కడ బసచేసిన అక్కడకే రైతులు, క్రింది అధికారులు, తండోపతండములుగా వచ్చుచుండిరి. కాని వారు రైతులను విచారించు దోషమున కొడికట్టుకొనకుండిరి. క్రింది అధికారులను దేశకాలములెట్లున్నవి అని బుద్ధిపుట్టిన విచారించెడివారు.

"సర్కార్ ఏమిచెప్పవలె. తమరి అనుగ్రహముచేత అంతయు క్షేమము. రైతులు బలిసిపోయినారు. వారు వీధులలో వెండిబంగారము విసరివేసినను ఏమర్మార్గుడును కన్నెత్తియైనను చూడడు" అని క్రింది అధికారులు చెప్పెడివారు. "వాహవా, వాహ్‌వా" అని అధికారియు, తమ అధీనులను ప్రశంసించి వ్యవహారమును ముగించువారు. ఆకాలములో డాకాలు (బందిపోట్లు) పట్టపగలే జరిగెడివి. విశేషముగా ఈ పనులను అరబ్బులు, రోహిలాలు, నేరములు చేయుజాతులవారును, తుపాకులు కత్తులుధరించి చేయుచుండిరి. రాత్రికాలములో డాకాలుచేసిన దివిటీలు వెలిగించి, గ్రామములోదూరి, ధనికుల ఇండ్లను పగులగొట్టి, యజమానులను పట్టుకొని, వ్రేళ్లకు వత్తులంటించి, ఘోరముగాకొట్టి, కొన్నిసమయములలో చంపి, స్త్రీల నవమానపరచి, వారుదాచిన తావులను తెలిసికొని దోచుకొని పోవుచుండిరి. ఇక ఈ దొంగలను పట్టుకొనుటలోను విచిత్రములే జరిగెడివి. పోలీసువారు అసలుదొంగలను పట్టుకొనక గ్రామములోను చుట్టుపట్లులందును నుండు

మంచి మంచి ధనికులను, వీరే దొంగలని, పట్టుకొని కొట్టి బెదరించి, దొరికినంతవరకు వారివద్ద లంచములులాగి వదలిపెట్టెడివారు. ఒక వేళ దొంగలే మూర్ఖులై పోలీసు వారివలలోపడిరా, వారివద్ద దొరకినదానిలో సగము ముప్పాతిక పోలీసువారే మాయముచేసి, మిగిలినదియే దొరకినట్లుగా వ్యవహారములు చేసెడివారు. కొంతమంది అధికారులకు చదువను వ్రాయను కూడ రాకుండెను.

అచ్చటచ్చట కొందరు పోలీసుఅమీనులు దొంగల గుంపుల తమవశములో నుంచుకొని, వారిచేత ప్రక్కతాలూకాలలో దొంగతనములు చేయించి తెచ్చినవాటిలో ఒకభాగము వారికిచ్చి మిగతదంతయు తామనుభవించుచుండిరి. ఎవడైన దిక్కులేనివాడు చచ్చిన, ఆనాటిరాత్రియే వానిశవమును త్రవ్వించి ఒకధనికునియింటిముందు ఉరివేసుకున్నట్లుగా పడవేయుచుండిరి. ప్రొద్దుననే ధనికుని పట్టుకొని చాలినంత లాగుకొనిమరల ఆశవమును పూడ్పించుచుండిరి.

ఆకాలములో ఖుఫ్యా (సి. ఐ. డీ) పోలీసు మొహతెమీం ఒకడుండెను. అతడుదారా కేవలము దొంగలకొరకే చేయుచుండెను. దొంగలవద్దను, నేరములజాతులవద్దను, మనుష్యునికింతయని యేర్పాటుచేసి ప్రతి సంవత్సరమును మామూలు వసూలు చేసికొని వచ్చుచుండెను.

విలియం వహాబ్ గారి కాలములోనే కర్నల్ లడ్లో,అను ఇంగ్లీషువారు పోలీసుశాఖ యొక్క డైరెక్టర్ జనరల్ పదవిపై వచ్చిరి. వారుమంచివారైనను, ఆశాఖలోని లోపములను అణచివేయునంతటి సామర్థ్యము లేనివారైయుండిరి. వారికచ్చేరీలోని సిరస్తదారున్ను యిద్దరు గుమాస్తాలున్ను వారికి నమ్మకము కలిగించి, ఉద్యోగములను అమ్మజూపుచుండిరి. ౫౦౦ రూపాయీలు మొదలు ౫౦౦౦ రూపాయీలవరకు లంచములు తిని ఉద్యోగముల నిప్పించుచుండిరి.

ఇట్టిపరిస్థితులుండిన కాలములో విలియంవహాబుగారు ఉద్యోగము చేయుచుండిరి. కాని విశేషమేమన, వీరు ఈ మలిన వాతావరణములో కొట్టుకొని పోయినవారుకారు. మంచి సంపన్న కుటుంబము వారు. వారికేమియు కొదువ లేకుండెను. రాజబంధువులును, మక్తెదారులును, గొప్ప భూస్వాములును నైయుండిరి.

అయితే చిత్రమేమనగా విలియం వహాబుగారికి ఇంగ్లీషు బాగుగా మాట్లాడుటకు వచ్చియుండెను. కాని వ్రాయనుచదువను రాకుండెను. సంతకము మాత్రము ఇంగ్లీషులో చేయునంతమాత్రము నేర్చుకొనియుండిరి. ఆకాలములో ఫార్సీభాషయే కచ్చేరీ భాషగానుండెను. అందుకూడ వారికి మాట్లాడుప్రవీణత మాత్రమేయుండెను. ఇంగ్లీషును ఫార్సీని

యితరులతో చెప్పి వ్రాయించెడివారు. ఇక మాతృభాష యైన తెలుగుపాండిత్యముకూడ పైభాషలవంటిదే. వారది కూడ నేర్చుకున్న వారు కారు. వారు చాల న్యాయముగాను, ప్రజానురంజకముగాను, తమఉద్యోగధర్మమును నెరవేర్చినవారని ప్రతీతి. రాయచూరు మహబూబునగరము జిల్లాలలోని వృద్ధ జనులు నేటికిని వారి సౌజన్యమును గురించి చెప్పుకొనుచుందురు.

# మూడవ ప్రకరణము

## జీవితములోని మార్పు

విలియం వహబ్ చనిపోవుట వేంకట రామారెడ్డికి తాత్కాలికముగా గొప్ప దెబ్బగానుండెను. అతని కప్పుడు ౧౬ సంవత్సరములు నిండీ నిండని వయస్సు. ఇంకను చదువుకొనవలెనను కుతూహలము మెండుగా నుండెను. ఆశలన్నియు పటాపంచ లయ్యెను. వహబ్ మామయగు రామన్న సామానులన్నియు సదురుచు వ్యవహారము లన్నియు సంస్కరించుచు వారము పది దినములు రాయచూరులో నుండెను. వేంకట రామారెడ్డిగారిని కూడ గ్రామమునకు తీసికొని పోవలెనని చెప్పుచుండెను. గ్రామమునకు పోయిన వ్యవసాయ వృత్తియు, తండ్రిగారి పటేలు వృత్తియు వీరికి క్రమముగా అబ్బియుండును. కాని వీరికి గ్రామమునకు పోవుటకై యేమాత్రము ఇష్టములేకుండెను.

వహాబుగారుండిన భవన సమీపములో ఒక వృద్ధుడైన మాల్వీ యుండెను. ఈ బాలుడా ఫకీరువద్దకు పోయి

దుఃఖించుచు కూర్చునువాడు. ఫకీరదిచూచి దగ్గరకు పిలిచి దుఃఖించుటకు కారణమేమని విచారించెను. తనకు కలిగిన విపత్తును, రానున్న అనిష్టమగు విపత్తును, ఆ పెద్దమనుష్యునితో చెప్పుకొనెను. మాల్వీగారు ఓపికతో అంతయును విని "అల్లా సర్వసంరక్షణకర్త, అతడే నీకును సహాయపడును పో" అని ఓదార్చినారు. ఇంత మాత్రపు సంగతి రెడ్డిగారికిని తెలియును. కాని ప్రకృతాచరణమెట్లో అది మాత్రము మాల్వీగారు చెప్పకపోయిరి. మరల వరుసగా ఆ వారము దినములు మాల్వీయొద్దకు వెళ్లి కన్నీరు కార్చుచు కూర్చునుచుండెను. మాల్వీకి చాల కరుణకలిగెను. దీర్ఘముగా ఆలోచించి ఈతడన దృఢముగానిట్లు పలికెను : "ఏమిన్నీ పర్వాలేదు. నీ కంతయు శుభమే కలుగును పో!" అని గట్టిగా వూని పలికినను, అది ఓదార్పు నీయలేదు.

మరునాడు రాయచూరును వదలి గ్రామమునకు పోవుటకై బండ్లు కదలుటకు సిద్ధమయ్యెను. క్షణకాల మాలస్యమైయుండిన సాగియేపోయి యుండును. అట్టి సన్నివేశములో దైవికముగా నొక సంఘటనము సంభవించెను.

విలియం వహాబ్ గారి కత్యంత పరిచితుడైనవాడు నజర్ మహమ్మద్ ఖాఁ అనునతడు. అతడు సీనియర్ అమీనాగా నుండినవాడై వహాబ్ చనిపోగా అతని స్థానములో రాయ

చూరుజిల్లా పోలీసు అధికారిగా నియుక్తుడయ్యెను. అతడు ఆజాను బాహువు. ఆరడుగుల యెత్తువాడు. స్ఫురద్రూపి. గాంభీర్యము కలవాడు. పఠానుజాతివాడు. విశ్వాసపాత్రుడైన మిత్రుడు. తన మిత్రుడు వహాబ్ చనిపోయినందులకు చాల చింతించి అతని యింటిలో అతని బంధువుల పరామర్శింతమని వెళ్లెను. వెళ్లి చూడగా, ఇండ్లన్నియు ప్రయాణ సన్నాహములో నుండెను. వహాబు కాలములో ఆతని యింటిలో బాలుడగు వేంకట రామారెడ్డిని చూచినవాడు కాన, అతనిని గురించి రామన్నతో నిట్లు సంభాషించెను.

" ఎక్కడికీ సన్నాహ మంతయు

" మా గ్రామమునకు వెళ్లుచున్నాము.

" (వేంకట రామారెడ్డిని చూసి) ఈ బాలునిగూడ తీసుకొని పోయెదరా?

" అవును

" తీసికొనిపోయి?

" వ్యవసాయము చేయింతుము!

" చదివించరా?

" వీలుకాదు

" సరే. మీ రితనిని నాయొద్దనే విడిచిపెట్టి వెడలిపొండు."

" వీలులేదు

"నాకు అప్ప జెప్పవలసినదే మాను మాట్లాడితిరా
ఖబర్దార్!"

రామన్న పఠాను మాటలకు అదరిపడినాడు. పైగా అతడు పోలీసు అధికారి. ఎక్కువ మాట్లాడుటకు ధైర్యము మునుపే లేక పోయెను. పఠాను అతనికంతయు మరల నచ్చ చెప్పినాడు. తానా బాలుని వృద్ధికి తెత్తుననియు ప్రభుత్వమువారి యొద్దతన యావచ్ఛక్తిని వినియోగించి యుద్యోగ మిప్పింతు ననియు, చెప్పి బాలుని తన వెంట తీసుకొనిపోయెను. రామన్న అటు! బాలుడు ఇటు! ఈ చిన్నఘట్టమే వేంకట రామారెడ్డిగారి జీవితములో అత్యంత ప్రధానమైనట్టిది.

విలియం వహాబుగారికి ఒక తమ్ముడు పరకాలరెడ్డి అను నతడుండెను. అతడు పక్కా పఠేలు. దురుసు మనిషి. షికారు (వేట) అనిన చెవులుకోసువాడు. మంచి మాంసాహారి. తదనుగుణ్యమగు గుణములుగూడ అలవాటు చేసుకొని యుండెను. విద్యలో లోపములేదు- తెనుగు బాగుగావచ్చును- ఉర్దూకూడ బాగుగనే చదువుకొన్నవాడు. అన్నయగు వహాబు గారికి తమ్ముని లక్షణములు నచ్చినవికావు. మిత్రులతో అతని తెంపరి తనమును గురించి పలుమారు చెప్పువారు. తన కేమైన కీర్తి తెచ్చువాడు కలడా యనిన తన కుమారుడు కూడ కాదు. తన మేనల్లుడే అనియు మిత్రులతో చెప్పువాడు.

ఆ భావములను పలుమారులు విన్న వారిలో ఈ పఠాన్ నజర్ మహమ్మద్ ఖాను గారొకరు-

తన అన్న చనిపోయిన వెంటనే అతని తమ్ముడను కాన నాకును కొంత హక్కు కలదనియు సర్కారీ ఉద్యోగ మిప్పించ వలసినదనియు పరకాలరెడ్డి తాలూకాదారు సిఫారసుతో వినతిపత్ర మర్పించుకొన్నాడు. అది యట్లుండ నజర్ మహమ్మద్ ఖాను యువకుడగు వేంకటరామారెడ్డిని హైదరాబాదు నగరమునకు పిలుచుకొని తనకు తెలిసిన నవాబులను పోలీసు అధికారులను, సూబేదారులను, ముఖ్యగు వారి నందరిని దర్శించుకొన్నారు. అంతకు ముందే పరకాల రెడ్డి ప్రయత్నము చేయుచుండినందున నజర్ మహమ్మద్ ఖాన్ అతనిలోపములను తెలిపి విలియం వహబ్ గారి కోరికలను అభిలాషలను అధికారులకు తెలిపి వేంకట రామారెడ్డికే ఉద్యోగ మియ్యవలెనని కోరెను.

అప్పటికి వేంకటరామారెడ్డివయస్సు ౧౭సంవత్సరములు. ఇంకను బాలునివలెనే యుండెను. ఇప్పటిరూపమునకును అప్పటి రూపమునకును పూర్తిగా వ్యత్యాసముండెను. బక్క పలుచని మనిషి. పోలీసు ఉద్యోగికి శరీర సౌష్టవము, మంచిఎత్తు, మంచితూకము, నాటికిని, నేటికిని అవసరము ఎత్తులో కూడ పొట్టివాడుగా నుండెను. తనను చూచిన అధికారు లుద్యోగ

మియ్యరేమో అనిపించెను. పఠాను దానికి తగిన యుక్తి పన్ని నాడు. దూదితో కట్టిన బొంత అంగీలుతొడిగించినాడు. ఎత్తైన బూట్లు (అందులోను అడుగున మెత్తపెట్టించి)తొడిగించినాడు. ఈ వేషముతో తన వెంట అధికారుల వద్దకు తీసుకొని పోవుచు వచ్చినాడు. అట్లుండినను సూబేదారు రెడ్డిగారిని చూచి "ఇంకను చిన్నవాడు ఇప్పుడేమి తొందర మరి ఒకటి రెండేండ్లు చదువుకొననిమ్ము. నెలకు ౧౦రూపాయలు సర్కారునుండి యిప్పింతును," అని సెలవిచ్చెను. పఠాను కదంతయు తృప్తిని కలిగించలేదు. ఇప్పుడే నౌకరీ యిప్పించుమని పట్టుబట్టెను. తుదకు సూబేదారనుకూలుడయ్యెను. జిల్లా పోలీసు నాజిం (డైరక్టరు) అగు లడ్లోయను ఇంగ్లీషు అధికారి వద్దకు తర్వాతపోవలసివచ్చెను. లడ్లోగారు యువకునిచూచి మందముగా కనబడుటకై వేసికొనిన దుస్తులను చూచియు తృప్తి చెందక మనిషిని పట్టిచూచినాడు. అంతయు మెత్త మెత్తగా చేతికితగిలెను. "ఇదేమిటి" అని విచారించగా " చలిపెట్టుటచేత మెత్తని బట్టల తొడిగినాను." అని రెడ్డిగారు జవాబు చెప్పవలసి వచ్చెను. పఠాను పట్టుదలగలవాడు. అతని ప్రయత్నముల ఫలితముగా రెడ్డిగారిని అమీను పదవిపై ఉద్యోగిగా నేర్పాటు చేయుటకు లడ్లోగారును సూబేదారుగారును అంగీకరించిరి. మరియు హాసన్ బిన్ అబ్దుల్లా (ఉరఫ్) ఇమాద్నవాజుజంగు అను అకౌంటెంటు జనరల్

అధికారియు వీరికి చాల సహాయము చేసిరి. ఆజ్ఞలు లభించుటకు కొంతకాలము పట్టునని చెప్పిరి. సరేయని నజర్ మహమ్మద్‌ఖాను వేంకటరామారెడ్డిగారిని నగరములోనే వదలి తనయుద్యోగముపై రాయచూరునకు వెళ్ళిపోయెను.

హైదరాబాదునగరములో రెడ్డిగారు జాంబాగు సమీపములో నుండునట్టి జడ్జి రఘునాథరెడ్డిగారి బంగ్లాలో నివాసము చేయుచుండిరి. ఈ రఘునాథ రెడ్డిగారు రెడ్డిగారి బంధువులు. వారు నగరములో మంచిపలుకుబడికలవారు. గొప్పవిద్యావంతులు (థియాసఫీ) దివ్యజ్ఞానసంఘములో చేరినట్టివారు. సిద్దిరిసాలలో చాలకాలము కమాండింగ్ అధికారిగానుండిరి. చాలసౌమ్య స్వభావము కలవారు. రెడ్డిగారికి ప్రతిదినమును ఉద్యోగముయొక్క పైరవీలో కాలము గడుచుచుండెను.

ఆ కాలములోని ఒక చిన్న వినోదవిషయము రెడ్డిగారి జీవితములో పేర్కొనదగినదై యున్నది. వీరు నగరములో నుండుకాలములోనే మొహరం వచ్చినది. రాత్రివేడుకలు చూచుటకై తానును మరిముగ్గురు స్నేహితులును బయలుదేరినారు. కాని ఈ సంగతి రఘునాథరెడ్డికి తెలుపకయే వెళ్లవలెనని వారిసంకల్పము. అందుకై వారొకయుక్తి పన్నినారు. తమతమపడకలమీద దిండ్లను నిలువుగా పెట్టినారు. వాటిపై

దుప్పటి కప్పినారు. తిన్నగా బయటికి జారుకున్నారు. అర్థ రాత్రివేళ రఘునాథరెడ్డిగారు యువకులు పడుకున్నగది చూచినారు. వారేయని భ్రమించి తృప్తిపడినారు. ఇచ్చట రెడ్డిగారును మిత్రులును వేడుకలుచూచి తిరిగివచ్చుచు ఉస్మాన్‌గంజి పోలీసుఠానావద్ద యేదో అల్లరి జరుగుచుండగా చూచుటకై నిలిచినారు. ఠానాపోలీసువారు అందరితో పాటు వీరినిగూడ పట్టుకొన్నారు. "మాకేమియు ఈ తగవులతో సంబంధము లేదు" అని యెంత చెప్పినను పోలీసు వారు వినక ఠానాలో వేసి యుంచినారు. తెల్లవారుజామున ఆనాకా యెదుటనుండునట్టి అబ్దుల్లా రిసాలామిలిటిరీ అధికారి వీరిని చూచినారు. విషయమంతయు విచారించినారు. అదృష్టవశమున రఘునాథరెడ్డిగారికా మిలిటరీ అధికారి పరిచితుడు. అందుచేత తన జవానులను చీవాట్లుపెట్టి ఈ యువకుల ఇంటికి పంపివేసినారు. వేంకటరామారెడ్డిగారానాటి యావన్నివేశము నిప్పటికి మరచిపోలేదు. తాను కొత్వాలుపదవి నందినతర్వాత ఉస్మానుగంజి నాకామీదుగా వెళ్లినప్పుడంతయు తనచిన్ననాటి కథ జ్ఞాపకము వచ్చుచుండునని చెప్పెడివారు.

ఇట్లు కొంతకాలము గడచినతర్వాత వేంకటరామారెడ్డిగారికి ఉద్యోగ నియామకమయ్యెను. ౨౫ షర్వర్ది ౧౨౯౬ ఫసలీనాడు వారు అమీనుపదవిలో నియుక్తులైరి. మొదట

నాల్గవవర్గాపోలీసు అమీనుగా నెలకు ౬౦ రూపాయీల జీతముపై ఏర్పాటు చేయబడిరి. గుఱ్ఱము వ్యయమునకని నెలకు ౨౦ రూపాయీలు అనుమతించిరి. ఉద్యోగములో అనుభవములేనివారని అధికారు లెరిగినవారగుటచేత లింగుసూగూరు జిల్లాపోలీసు అధికారి ఆధీనములో ముద్గల్ ఠానా అమీనుగా నియుక్తులైరి. ఇంతేకాదు, వీరిచేతిక్రింద పనిచేయునట్టి మొహరిర్ గారే ముద్గల్ నాకా వ్యవహారము లన్నింటికిని జిమ్మేదారులుగా నిర్ణయింపబడిరి.

వేంకటరామారెడ్డిగారు తమ ప్రథమోద్యోగమును నిర్వహించుటకు లింగుసూగూరు జిల్లాలో చేరినట్టి ముదగల్లు ఠానాకు వెళ్ళిరి. పోలీసు ఉద్యోగములోకాని మరే ఉద్యోగములోకాని చేయునట్టి విధులును కార్యములును యేమియు తెలియనివారు. అయితే ఒక అనుకూలముండెను. అన్నిటికిని తానుగాక తనచేతిక్రింది మొహర్రిరే ఉత్తరవాదిగా నిర్ణయింపబడియుండెను. మొదటి కొన్ని మాసములందు మొహరిర్ అంతయు నిర్వహించుకొని తెచ్చిన సర్కారీ కాగితములపై ఎచ్చటసంతకము పెట్టుమనిన అచ్చటవీరు సంతకము చేయుచుండిరి.

ఇట్లుండ ముదగల్లు తహసీల్దారుగా "మాల్వీ షాబాఖీసాబ్" అనువారు తహసీల్దారుగావచ్చిరి. వారు స్వర్గీయులైన

విలియంసాహెబ్ గారికి పరమమిత్రులు. అందుచేత వారి మేనల్లునిపై మాల్వీకి అవ్యాజప్రేమకలిగెను. వారు వృద్ధులు. రెడ్డిగారు ౧౭-౧౮ సంవత్సరముల యువకులు. ఆ పెద్దమనిషి రెడ్డిగారిని దినమును తనవద్దకు పిలిపించుకొని వారికొకవిధముగా స్వయం గురువులగుచు వచ్చిరి. తాను కచ్చేరీ వ్యవహారములు సాగించుచున్నను ఈ అమీనుగారిని తనవద్దనే కూర్చునబెట్టుకొనుచు అనుభవము కలిగించుచుండిరి. మరియు మొహరిర్ సంతకమునకై తెచ్చిన కాగితములలో సాధారణమైనవి పోగా ముఖ్యమైన మిసల్లను తమవద్దనే ఉంచుకొని అమీనుగారికి చదివి విషయము బోధించి వాటిపై ఏవిధముగా వ్రాయవలెనో చెప్పి వ్రాయించుచుండెడివారు. అంతేకాక ఉర్దూ ఫార్సీలో ఇంకను ప్రవీణత కలుగుటకై పాఠములు బోధించువారు. ఉర్దూలో మంచిమంచి కవుల కవితల చదివించువారు తుదకు వీరిచేతను కవిత్వము వ్రాయించినారు. వేంకటరామారెడ్డిగారుకూడ ఒకకాలములో కవులైయుండిరన్నమాట యెవ్వరును ఎరుగరు. వారికవితలేమైన లభ్యమైన అవియెట్లుండునో యేమో! తమకవితాభివృద్ధికై ఉర్దూవాఙ్మయములోని ప్రసిద్ధకవులగ్రంథాల ననేకముగా రెడ్డిగారు తెప్పించుకొనిరి. ఆ గ్రంథాలు ఈ ౫౦ ఏండ్ల అనంతరము ఇప్పటికిని వారివద్ద నున్నవి. వీరిని ప్రోత్సహించుటకై ఆవృద్ధు వీరికవితలనువిని

ఆనంద ప్రకటనము చేయుచుండెడివారు. ఇట్లు ఉద్యోగ ప్రాథమికదశ కొంతకాలము జరుగుచువచ్చెను.

వేంకటరామారెడ్డిగారికి వివాహము బాల్యమందే (అనగా వారు ౧౪-౧౫ సంవత్సరాల వయస్సువారుగా నుండినప్పుడు) జరిగియుండెను. వారిభార్యపేరు రంగమ్మ. వారును రాయణిపేటగ్రామమువారే. విలియంవహాబ్ గారి జ్ఞాతివర్గములోనివారు. వివాహకాలమప్పుడు వరునికి ఒక వెండి మొలత్రాటిని, రెండుమూడువందల రూపాయీలను వరదక్షిణగా నిచ్చుట కొప్పుకొనియుండిరట. వెండి మొలత్రాడుమాత్రము ఇయ్యకనేపోయిరి!!

# నాల్గవ ప్రకరణము

ప్రారంభోద్యోగము

ముదిగల్లు చారిత్రిక స్థలము. అందొక కోటయు కలదు ఆ కోటకై విజయనగర రాజులకును బహామనీ సుల్తానులకును పలుమారు యుద్ధములు జరిగియుండెను. అట్టి యుద్ధములలో నొక విచిత్ర యుద్ధము కూడ జరిగియుండె నని ఫిరిస్తాయను చరిత్రకారుడు వ్రాసి యున్నాడు. అదేమన ముదిగల్లులో ఒక కంసాలివారి యువతి చక్కని చుక్కయై దక్కనీ రాజులకే మోహము కలిగించె నట. ఆకాలమందు విజయనగర చక్రవర్తియైన మొదటి దేవరాయలు ఆ కంసాలి సుందరిని తనకిచ్చి పెండ్లిచేయుమని కోరెనట! కంసాలి అది మంచిమనుము కాదని నిరాకరించెనట!! దేవరాయలు ఆగ్రహోదగ్రుడై ముదిగల్లును పెద్ద సేనతో ముట్టడించెనట. కాని గ్రామజనులతోపాటు ఆ సుందరాంగియు బహామనీ సుల్తాను రాజ్యములోనికి పారిపోయెనట. బహామనీ రాజ్యమును ౧౪౦౦ క్రీ. శ. ప్రాంతములో "ఫీరోజుషా"

అను సుల్తాను రాజ్యము చేయుచుండెను. అతనికిని ఆ కన్నెపై మోహ మంకురించెను. దేవరాయలకును ఫీరోజుషాకును యుద్ధము జరిగెనట. అందు దేవరాయలే ఓడిపోయి తన కూతునే ఫీరోజిషాకిచ్చి పెండ్లిచేసి సంధిచేసుకొనెనట! ఇది ఫిరిస్తా కథ, అంతయు కల్పితమేయని కొ॥ లక్ష్మణరావు మున్నగు చరిత్రకారులు స్థిరపంచినారు. ఇంతటి ముఖ్యాంశమును గురించి సమకాలికులగు అబ్దుర్రజాఖ్ అను సుప్రసిద్ధ ముస్లిం చరిత్రకారుడుగాని, నూనిజ్ అను పాశ్చాత్య చరిత్రకారుడుగాని, ఇతర దేశీయ సమకాలిక చరిత్రకారులు కాని, ఒక్కమాటయైనను వ్రాయలేదు. కాని ౨౦౦ ఏండ్ల తర్వాత పుట్టిన ఫిరిస్తాకిది యెట్లు తెలిసెనో యేమో?

వేంకట రామారెడ్డిగారికీ చరిత్రాంశము చూచాగా తెలిసి ముదిగల్లులో అట్టి కంసాలి వంశమున్నదా యని విచారించి, పరిశోధన చేసినారు. ఆ కంసాలి వంశము నిజముగా నుండనే యుండెను. వారి వంశములో ఉభయ రాజుల మోహింపజేసిన, మోహనాంగి వంటి వారిప్పటికిని కలరట! ఆ వంశము వారిని పూర్వచారిత్రక కథలోని యాథార్థ్యమును విచారించగా నిట్లు చెప్పినారట. "మావంశములో పూర్వము అపురూప సుందరాంగి యుండినది నిజమే. ఆమెను, ఫీరోజుషా మోహించి నికా చేసుకొన్నాడు. అందుకు ప్రత్యుపకృతిగా

మాకు చాలా ఇనాములిచ్చినారు. ఇనాము సనదులు వ్రాత కాగిదాలమీదను, రాగిరేకుమీదను వ్రాసి యిచ్చినారు. రాయచూరు జిల్లాను మొదట నిజాముల వద్దినుండి ఇంగ్లీషు వారు తీసుకొన్నప్పుడు మా ఇనాము లన్నియు లాగుకొన్నారు. ఇప్పుడు మాకు సనదులే మిగిలినయాస్తి" వారి వద్ది సనదులనుకూడ తెప్పించి రెడ్డిగారు చూచినారు. ఒక కాగితము అప్పటికే పురుగులు తిని అంతయు రంధ్రములు పడి యుండెను. రాగిరేకు సనదుకూడ యుండెను. అందేమివ్రాసినారో జ్ఞాపకములేదని రెడ్డిగారు చెప్పినారు. ఈ విషయమును బట్టిచూచిన ఇంతమాత్రము నిజమని విశ్వసింపవచ్చును. దేవరాయలు హిందూ మతాచారముల ప్రకారము పరకులస్త్రీని పెండ్లాడజాలడు. కాని, ఫిరోజుషా మాత్రము ఆ కన్యను వివాహము చేసుకొన్నాడు. దీనిపై ఫిరిష్తా కథలు కల్లలు కొల్లలుగా పెంచి వ్రాసినాడు, ఫిరిష్తాకిట్టి వ్రాత లలవాటేనని యెన్నియో యితరాంశములు స్థిరపరచుచున్నవి. అది విషయాంతరము.

వేంకట రామారెడ్డిగారు రెండేండ్లకాలము ముదిగల్లులో అమీను పదవిని నిర్వహించుచు వచ్చినారు. అనగా కార్యభార మంతయు చేతిక్రింది మొహరీరుదే! మొహరిర్ పేరు రాజానాయక్. అతడు భారీమనిషి. బాగా కల్లు, సారా త్రాగనేర్చి

నవాడు. మొగలాయి కాలపు పద్ధతులపై అపరాధ పరిశోధనలు చేయనేర్చినట్టివాడు. ముదిగల్లు తహసీల్దారు పదవిపై కన్నయ్యాలాల్ అనువారుండిరి. అతడు రాజా కంద స్వామికి బావమరది. అతనికి ఉర్దూ సరిగా రాదు. తనతీర్పులు కూడా తెలుగులో వ్రాసేవాడు. ఆ కాలములో తహసీల్దారు లనిన నిరంకుశ మండలాధికారులకన్న మిన్నయైనవారు. భూమ్యాదాయశాఖకు సంబంధించిన అధికారములే కాక, మున్సిఫీ అధికారము లన్నియు వారియందే కేంద్రీకరించి యుండెను. తహసీల్దారు కన్నయ్యాలాలు వద్ద ఒక కార్కూన్ (గుమాస్తా) వెంకోబారావు అను నతడుండెను. చాలామంది అధికారులు పుష్కలముగా లంచములు తినెడివారు. కార్కూను అయిన వెంకోబరావు ఆ విద్యలో పేరు పొందినవాడు.

రెడ్డిగారి అమీను ఉద్యోగకాలములో ఈముదిగల్లులో చెప్పదగిన విశేషము లేమియులేవు. ఒక్కయంశము మాత్రము పేర్కొనదగినదై యున్నది. ఆ కాలములో దొంగతనాలు సర్వప్రాంతములలో విశేషముగా జరుగుచుండెడివి. ముదిగల్లులో గజుగ భీమడు అను గజదొంగయుండెను. వాని కొడుకు కూడ గజదొంగ. వాడు ఒక గాండ్లవాని యింటిలో కొందరి స్నేహితులతో కలిసి దొంగతనము చేసినాడు. గాండ్లవాడును

మంచి సర్దారుమనిషి. గుజుగ భీముని కొడుకును మాత్రము గట్టిగా పట్టుకొని వదలినవాడు కాడు. అదే దినము రెడ్డిగారి ఠాణాకు వానిని పట్టుకొని వచ్చినాడు. మొహరిరు తన విచారణ ప్రారంభించినాడు. అనగా పది పంద్రెండు మారులు కట్టెతో దొంగను మోదినాడు. దొంగ మూగివాడైపోయినాడు. కన్నయ్యాలాల్ తహసీల్దారువద్ద విచారణ జరిగినది. తహసీల్దారుగారితో వెంకోబరావు ఆదొంగయొక్క నిర్దోషిత్వమును గురించి గట్టిగా నచ్చచెప్పినాడు. పైగా దొంగమూగివాడని పైననే కనబడుచుండెను. దొంగ నిర్దోషియని నిర్ణయించి విడిచిపెట్టినాడు. రెడ్డిగారు రెండు దినాల తర్వాత ఏదోపనిపై వెంకోబరావు ఇంటికి పోయిచూడగా ఆ మూగి దొంగ వెంకోబరావుతో ముచ్చట్లు చేయుచున్నాడు! రెడ్డిగారి ఆశ్చర్యమును జూచి దొంగ కిలకిల నవ్వినాడు. ఇప్పుడేమి భయము- తాను నిర్దోషియై పోయినాడుకదా?

ఇట్లుండ మరికొన్ని దినాల తర్వాత మ. స్కీ లో "డాకా" (బందిపోటు దొంగతనము) జరిగినది. సుమారు ౫౦ మంద కొరవలు దివటీలు పట్టుకొని గ్రామములో ప్రవేశించి యెదిరించిన వారిని మెదుగగొట్టి ఒక ధనికుని యింటిలో బడి అంతయు లూటీచేసుకొని పోయినారు. టాణా కీవార్త వచ్చినవెంటనే రాజానాయకు మొహిరిర్, కొందరి జవానుల

వెంటతీసికొని వేంకటరామారెడ్డిగారిని వెంబడించుకొని బయలు దేరినారు. దొంగల జాడలు తీసి వారు రాయచూరు జిల్లా మాన్వితాలూకాలో నాగల్‌బండ కర్ణదొడ్డి అను గ్రామాలలో ఈ కొరవ లుండిరని ఒకని వలన విని ముందు నాగల్‌బండకు పోయిరి. అచ్చట ఆనాడు దొంగలకు పండుగ. వారున్న యింటిని ముట్టడివేసి లోపల దూరినారు. దొంగలు ఒక గదిలో జొరబడినారు. దొరికిరిలే యని బయట చిలుకు పెట్టి పోలీసువారు కావలికూర్చున్నారు. కొంతసేపటికి దివటీలు తీసికొని తిన్నగా తలుపుతీసి నాలుగు మూలలు పరికించుచు లోపలికి వెళ్లినారు. ఎవ్వరును లేరు! ఇంకొక గది కనబడినది. అందున్నారని తెరచి చూచినారు. అందునులేరు. ఇదేమిరా యని దిగ్భ్రమ జెందినారు. మరొకలోపలి కొట్టిడీ చూచినారు. అందు మిద్దెలో ఒకపెద్ద రంధ్రము పడినది ఆ గదిలోని గుమ్ములపై కెక్కి దూకి గవాక్షమునుండి అందరును పారిపోయినారు. అప్పుడు కర్ణదొడ్డి గ్రామములో ఆదొంగల జాడ కనిపెట్టి రాత్రియంతయు నడిచి వెళ్లినారు. వారా గ్రామములోనులేరు. తెల్లవార నాలుగు గంటలకాలమైనది. ఊరిబయట చావడిలో పండుకొనుటకై పడకలు వేసినారు. అప్పు డొక గ్రామస్థుడువచ్చి యిట్లని ఎచ్చరించినాడు. “ మీ చావడీ ముందటి చెట్టుపైననే మంచెలు వేసుకొని కొరవదొంగలు పండు

కున్నారు" పోలీసులు నిద్ర దులుపుకొని చెట్టును ముట్టడివేసి నారు, కొరవలు తుప్పు తుప్పున చెట్లపైని మంచెలమీది నుండి క్రిందికి దుమికినారు. కొందరు దొరకినారు. కొందరు పెనగులాడి తప్పించుకొని పోయినారు. పట్టుబడిన వారిలో మన గుజుగ భీముడును, వాని కొడుకగు మూగిదొంగయు నుండిరి. ఈ మూగిదొంగ యిదివరలో పట్టుబడినవాడే కొన్ని దినాలకు ముందు వెంకోబరావుకు 300 రూపాయల లంచమిచ్చి సిఫారసుపొంది తప్పించుకొన్న వాడే! దానికి ప్రత్యుపకారముగా వెంకోబరావు ఇంటిలో ౫ — ౬ వేల ధనము దోచుకొని పోయియుండెను. ఇప్పుడు పట్టుబడినప్పుడు వెంకోబరావు యొక్క దుస్తులనే ధరించియుండెను. కొరవలు చాల మొండిదొంగలు. రాజానాయకుకూడ ఘోరాతిఘోరుడు. వారిని చావకుండ నానావిధముల హింసించినాడు. తలక్రిందుగా వ్రేలాడగట్టి క్రింద నీటితొట్లలో తలలుముంచి లేవనెత్తుచు పీడించినాడు. వేంకటరామారెడ్డి గారికీ దృశ్యములు ఘోరమనిపించి తన మొహిరిర్‌ను మందలించినాడు. కాని అన్నిటికి మొహిరిరేకదా ఉత్తరవాది! "ఉండవయ్యా. మీరు చూస్తుండండి యీ తమాషాలంతా" అనేవాడు.

మొహరిర్ ఇంకొక యుక్తి పన్నినాడు. ఆ కొరవలవారి ఒక యువతిని పరిచయము చేసికొని దానికిప్రియుడైనాడు. ఇద్దరును

కల్లుకుండలపై కాలము గడిపినారు. ఆ ముచ్చటలో కొరవల దాపటక స్థలాలన్నియు కనిపెట్టినాడు. కొరవలకు చిన్నప్పటి నుండియు ఎంతకొట్టినను "ఇల్‌లీ" (నాకు తెలియదు) అనుపదమే నేర్పేవారు. మొహారిర్ దెబ్బలకన్నిటికి ఇల్‌లీ జవాబే దొరికెడిది. ఇప్పటి క్రొత్తపద్ధతిచేత దాచిన సొమ్ములన్నియు గుర్తుపట్టినాడు. దొంగల కందరకిని శిక్షయిప్పించినాడు.

వేంకట రామారెడ్డిగారు ముదిగల్లునుండి ౯ ఫర్వర్ది ౧౨౯౮ ఫసలీనాడు రాయచూరుజిల్లాలోని యాద్‌గీరు తానాకు మార్చబడినారు. యాద్గీరులో ఒకటిన్నర సంవత్సర కాలము అనగా ౧ మెహర్ ౧౩౦౦ ఫసలీ వరకు ఉద్యోగము చేసినారు. యాద్గీరులో అప్పుడు వరదారావు అను వారు తహసీల్దారుగా పనిచేయుచుండిరి. ఈ వరదారావుగారు న్యాయశాస్త్రము (ఖానూను)లో మంచి ప్రవీణులని పేరుగన్నవారు. తాలూకాలో ముఖ్యాధికారులుగాన రెడ్డిగారికిని, వరదారావుగారికిని మంచి పరిచయ మేర్పడినది. పలుమారు ఈ తహసీల్దారువద్ద రెడ్డిగారు న్యాయశాస్త్ర మభ్యసింప మొదలుపెట్టినారు. కాని ఉభయులును ఉద్యోగులగుటచేత రెడ్డిగారికంతగా అవకాశము దొరకలేదు. అదే కాలములో సుప్రసిద్ధ న్యాయవాదులును తర్వాత హైదరాబాదు ఉన్నతి న్యాయస్థాన న్యాయమూర్తులును (రుకున్) అయినట్టి రాజాబహద్దరు గిరి

రావుగారు యాద్గీరులోని తహసీలు కచ్చేరీలో కార్కూను ఉద్యోగము సంపాదించుకొనుటకై ఉమీద్వారు (ప్రొబేషనర్) గా పనిచేయుచుండిరి. గిరిరావుగారు తహసీల్దారువద్ద న్యాయ శాస్త్రమభ్యసించి వకీలు పరీక్షకు కూర్చుని మూడవదర్జా వకాలతులో కడతేరి ప్రాక్టీసుచేయుటకై రాయచూరునకు వెళ్లిరి, వారు యాద్గీరులోనుండు కాలములో వేంకటరామారెడ్డిగారి పరిచయము కలిగెను. నాటినుండి సుమారు ౪౫ ఏండ్లకాలములో ఉభయులు తమ తమ జీవితములను వేరువేరు శాఖలలో నడుపుచు నుండిరి. ఉభయులలో గాఢమగుమైత్రి యేర్పడి, అది రాజాబహద్దరు గిరిరావుగారి అవసానకాలము వరకును అవిచ్ఛిన్నముగా దినదిన ప్రవర్ధమానముగా నుండుచు వచ్చెను.

యాద్గీరు తహసీలు కచ్చేరీలో కొందరు కార్కూనులుండిరి, అందొక కార్కూనుకును వరదారావునకును ఏదో యొకవిధముగా ప్రేమ సంబంధము లేర్పడినవి. దాని ఆధారముచేత కార్కూను లంచములు అపరిమితముగా తినుచు ధనికుడయ్యెను. అది ఇతర కార్కూనులకు కన్నుకుట్టెను. యాద్గీరులోని అరబ్బులు పహిరా జవానులుగా నుండిరి, కార్కూనుల ప్రేరేపణముచే ఆ యరబ్బు లొకనాటి రాత్రి దివిటీలతో తుపాకీ కాల్పులతో భయంకర కోలాహలముచేయుచు ధనికు

హైన కాహ్మాను ఇంటిని దోచినారు. పోలీసు కచ్చేరి సమీపమునసే యున్నది. వారి కండ్లయెదుట యీ దివిటీ దోపిడి జరుగుచున్నది. వేంకట రామారెడ్డిగారు ౫-౬ మంది జవానులను తీసికొని తుపాకుల బారుచేసి ఒక సందులో కూర్చున్నారు. అరబ్బులు కాల్చుచుండిన సీసముగుండ్లు తమవద్ద కూడ చిట్లి పడుచున్నవి. దోపిడి అయినతర్వాత అదేమార్గమున వత్తురుకదా అప్పుడు వారిపై తుపాకులు కాల్చి పట్టుకుందమని సంకల్పించిరి. కాని వారు దోచుకొని నెమ్మదిగా ఇంకొక మార్గములో వెళ్ళినారు. తుదకు యెన్నియో దినములు శ్రమించి వారినొకరిగా నొకరిని పట్టుకొని నానాఅవస్థలుపడి వారినుండి అపహృత ద్రవ్యమును చాలమట్టుకు లాగికొని వారికి శిక్షల నిప్పించిరి.

యాద్గిరులోనుండు కాలములో వరదారావువద్ద వేంకట రామారెడ్డిగారు న్యాయశాస్త్రమభ్యసించి పరీక్షలో కూర్చున్నారు. కాని ఉత్తీర్ణులుకాలేదు. అంతటితో నిరుత్సాహపడలేదు. మరల మరుసంవత్సరము వకీలు పరీక్షలో కూర్చున్నారు. కాని మరల అపజయమే కలిగినది.

వీరు యాద్గిరులో అమీనుగా నుండుకాలములో అచ్చటి హిందూ మునల్మానులలో మత కలహములు చెలరేగెను. యాద్గిరులో కలరా (గత్తర) జాడ్యము వ్యాపించి చాలమంది

చనిపోయిరి. హిందువులలో పెక్కురు నాటికిని నేటికిని కలరా యనునది మారికా లేక మహామారియను నొక క్షుద్రదేవత యొక్క కృత్యమని, జాడ్యమునకు చికిత్సలు చేయుటకు మారుగా "మారెమ్మ"ను శాంతిపరచుటకై "దేవర" చేయుదురు. "మారెమ్మ"ను తృప్తిపరచుటకై కొన్ని దున్నపోతులను, గొర్రెలను బలియిత్తురు. హిందువులు యాద్గిరులో కొన్ని కట్టెబొమ్మలుచేసి మారెమ్మ పూజలుచేసిరి. అది అచ్చటి తురకలకు గిట్టక వారిలో కొందరు ఆ బొమ్మలను పగుల గొట్టిరి. హిందువు లుద్రిక్తులైరి. కలహము ప్రారంభమయ్యెను. అది ౧౩౫౦ ఫసలీ నాటిమాట. రెడ్డిగారు వెంటనే తమ చాతుర్యము నంతయు నుపయోగించి యుభయ మతముల వారిలో నుండు వైషమ్యములను బోవునట్లుగా వారిలో ఐకమత్యము కలిగించి సమాధాన పరచిరి. ఆ నాటి యాపద్ధతి రెడ్డిగారిలో నీ ౫౦ సంవత్సరముల యుద్యోగకాలమందంతటకు వర్తించుచు వచ్చినందువల్లనే వారెందెందు ఉద్యోగము చేసిరో ఆ ప్రాంతములందంతటను హిందూముసల్మానుల కొట్లాటలు జరుగక శాంతిపద్ధతు లేర్పడుచువచ్చినవి. యాద్గిరు హిందూ ముసల్మానుల మతకలహములను గూర్చి అప్పటి జిల్లాతాలూక్దారు ౧౩౫౦ ఫసలీలో ఈ ప్రకారముగా నిజాంరాష్ట్రజిల్లా పోలీసు ప్రధాన శాఖకు వ్రాసిరి:—

"యాద్గీరు తాలూకా అమీను అయిన వేంకట రామారెడ్డిగారు చాల ఉత్తములును చతురులును, చురుకుతనము కలవారును నై యున్నారు. ఉర్దూ, పార్శీ, తెలుగు భాషలలో పూర్తి పాండిత్యము కలవారు అవసర పూర్తిగా మరాటీ, ఇంగ్లీషును వ్రాయను చదువను నేర్చినారు. యాద్గీరులో హిందూముసల్మానులలో మతకలహములు చెలరేగియుండెను. రాత్రిం బగళ్ళు ప్రయత్నము చేసి మంచి నేర్పుతో ఆ కలహములను వీరు అణచివేయుటయే కాక ఉభయ వర్గములలో సమాధానములు కుదిరించిరి. లేకున్న ఉభయ వర్గములలో ఎల్లప్పటికిని తగవులు పెరుగుచు ఎన్నడో ఒకగొప్ప పోరాటము జరుగుచుండెడిది. ఒకరినొకరు చావగొట్టుకొనుచుండెడివారు. అట్టి పోరాటమును అణచివేయుటలో జిల్లా అధికారులకు చాల కష్టములు సంభవించుచుండెడివి."

వేంకట రామారెడ్డిగారు యాద్గీరులో ౧300 ఫసలి మహారేవర్ నెల తుదివరకుండిరి. తాలూకాదారుయొక్క మెప్పుకొనుటనుజూచిన రెడ్డిగారిక మొహరర్ చేతులలో లేరనియు, న్యాయశాస్త్రములోగూడ ప్రవీణులైరనియు, స్వతంత్రముగాను సమర్థతతోను తమ ఉద్యోగధర్మమును నిర్వహించుటకు మొదలు పెట్టినారనియు విశదమగుచున్నది. యాద్గీరునుండి వీరు కల్వకుర్తి తాలూకాకు అనగా లింగుసూగూరు జిల్లానుండి మహబూబునగరము జిల్లాకు మార్చబడినారు.

# ఐదవ ప్రకరణము

౧౩౦౦౧—౩౧౧ ఫసలీవరకు- జిల్లాఅధికారి యగుట

జిల్లా పోలీసు ప్రధానాధికారియగు లడ్లో గారు ఉపకారవేతనముపై వెళ్లిపోయియుండిరి. వారియనంతరము గాఫ్ అనువారు నియుక్తులైరి. అంతలోననే మధ్యపరగణాలలో ఠగ్గులనణచుటకై నియుక్తులైనట్టి హేంకిన్ అనువారు అప్పుడు నిజాంరాష్ట్రములో ప్రధానమంత్రిగానుండినట్టి విఖారుల్ ఉమ్రాఅనువారిచే పిలిపింపబడి జిల్లాపోలీసు సర్వాధికారిగా నియుక్తులైరి. హేంకిన్ గారు అపూర్వమగువ్యక్తి. మెడోసుటెయిలర్, సర్ థామస్ మన్రో, కర్నల్ టాడ్, వంటి వారి ఉత్తమతరగతికి చేరిన ఇంగ్లీషువారు. వారుద్యోగము నందినవెంటనే సర్వలోప భూయిష్టమైన పోలీసుశాఖను సంస్కరించుటకు మొదలుపెట్టిరి. వారనిన పోలీసులకందరికిని సింహస్వప్నము. వారికాలమునకు మునుపును వారువచ్చిన ఆదిలోను రాష్ట్రమందంతటను ఎటుచూచినను దొంగలగుంపులే. ఎటుబట్టినను దోపిడులే డాకాలే జరుగుచుండెను.

వేంకటరామారెడ్డి యుద్యోగములో పొందిన కీర్తివలన కల్వాకుర్తిలో ౧౩౦౩ ఫసలి సంవత్సరాంతము వరకుండి ఆ తాలూకాలోని డాకాలను దొంగల గుంపులను అణచివేసిరి. ఇంతలో నాగర్కర్నూలులో ఇదేవ్యవస్థ యున్నదని రెడ్డిగారిని అచ్చటికి మార్చిరి. కాని అచ్చట రెండుమాసములే యుండిరి. అచ్చటినుండి అదే మహబూబునగరు జిల్లాలోని కోయలకొండ తాలూకాకు వీరిని ౧౩౦౪ లో మార్చిరి. అక్కడకూడ మూడు మాసములుకూడ నుండకమునుపే మరల నాగర్కర్నూలు కునాల్గవదర్జానుండి మూడవదర్జా అమీనుపదవిపై పంపిరి. అచ్చట ఒకసంవత్సరకాలమున్నతర్వాత ౧౩౦౫ ఫసలీ ౫ ఫర్వర్దివాడు ఇప్పుడు నిజామాబాదు అనబడునట్టి ఇందూరుజిల్లాకు కోర్టుఇన్స్పెక్టరుగా పంపబడిరి. వీరు ఇందూరులో నుండుకాలములో బ్రిటిషిండియా సైన్యమునుండి డగ్లస్ అను సోల్జర్ తనపటాలములో పై అధికారిని కొట్టి పారిపోయి యెచ్చటనో దాగికొనియుండెను. అతనిని పట్టుకొనుటకై నిజాము రాష్ట్రములోని పోలీసు అధికారులకు ఆజ్ఞఅయియుండెను. ఇట్లుండ ఇందూరులోనొక ఇంగ్లీషువానియొద్ద కిరొక ఇంగ్లీషువాడువచ్చి పరిచయము కల్పించుకొని నివసించుచుండెను. అతడొకనాడుల్లాసమెక్కువయె మిలటరీసాధన (Drill) ను చూపించినాడు. అనుమాన

ముకలిగి అతనిని పరీక్షించగా ఏమియు సంశయము లేదు. తుదకు అతని బూట్లలోనుండు కాన్వాసుబట్టపై అతని మిలటరీ పటాలము పేరుండెను. అతనిని వెంటనే పట్టుకొని సికింద్రాబాదుకు పంపిరి. అచ్చట (కోర్టుమార్షల్) సైన్యశాఖా విచారణలో రెడ్డిగారు సాక్ష్యమిచ్చుటకై పిలిపింపబడిరి. ఇంగ్లీషు భటులను వరుసగా నిలబెట్టి నిందితుని గుర్తించుమనిరి. ఒక్కమారే చూచినందునను, తెల్లవారి ముఖాలన్నియు ఏకాకారముగా గన్పడుచుండినందున రెడ్డిగారు ఉక్కిరిబిక్కిరియై వరుసగా అందరి ముఖాలను పారజూచుచు వెళ్లుచుండగా మనడగ్లసుగారే వారికిసహాయపడిరి. డగ్లసును సమీపించగా అతడు రెడ్డిగారినిచూచి నవ్వినాడు. దొరికెరా దొంగఅని అతనిని పట్టి చూపించిరి. మొత్తముపై రెడ్డిగారికి నిందితుని పట్టియిచ్చినందులకు ఇండియా ప్రభుత్వమునుండి ౧౧ రూపాయాల బహుమతి ప్రసాదింపబడెను.

వేంకటరామారెడ్డిగారు ఇందూరులోనుండు కాలములో ౧౩౦౭ ఫ. లో గంగయ్య అను ౪-౫ ఏండ్ల అనాథ బాలుని స్థితినిగురించి వినుట తటస్థించినది. ఆబాలుని తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయిరి. పోలీసువారు వానిని జైలులో సాకుచుండిరి. అనాథ బాలునికి జైలు సరియగు స్థలము కాదనియు, కాని అనాథాశ్రమము లేనందున ఏమిచేయవలె

నోఅని అధికారు లాలోచించుచుండగా రెడ్డిగారు తామా బాలుని పెంచుకుందు వినతి పత్రమర్పించుకొనిరి. "వేంకట రామారెడ్డి ఉత్తముడనియు (Gentleman) దయాగుణము కలవాడనియు" ప్రశంసించుచు అధికారులా బాలుని వారికిచ్చి వేసిరి. ఆ గంగయ్య ఇప్పటికి జీవించియున్నాడు. సికింద్రాబాదులో ఒకచిన్న నౌకరీచేయుచు జీవించుచున్నాడు. అప్పుడప్పుడు తననాకుకు తండ్రిడినవచ్చి చూచి పోవుచుండును.

ఇందూరులో రెండుసంవత్సరము లుద్యోగము చేసిన తర్వాత వీరిని ౧౩౦౭ ఫ లో యెల్గందల్ జిల్లాకు పంపిరి. ఇప్పటి కరీంనగరుజిల్లానే అప్పుడు యెల్గందల్ జిల్లాయని వ్యవహరించుచుండిరి, కాని జిల్లా ప్రధానస్థలము అప్పుడును కరీంనగరులోనేయుండెను. కరీంనగరులో తాలూక్దారుపదవిపై ఫరాముర్జంగు తాలూక్దారుతర్వాత పిస్టంజి అను వారు జిల్లాతాలూక్దారుగా పనిచేయుచుండిరి. ఈ పిస్టంజీగారి కూతురు అప్పటిమంత్రిగానుండిన విఖారుల్ ఉమరాగారి భార్య. ఎల్గందల్ జిల్లాలోవీరు నాలుగున్నర సంవత్సరములు కొంతకాలము కోర్టు ఇన్‌స్పెక్టరుగాను, కొంతకాలము తాత్కాలిక పోలీసు మొహతెమిమాముగాను నుద్యోగము నెరవేర్చిరి.


వీరు ఎల్గందల్ జిల్లాలో నుండుకాలములో దొంగతనాలు విశేషముగా జరుగుచుండెను. కాని దొంగలు

మాత్రము పట్టుబడకుండిరి. ముఖ్యముగా ఈతచాపలల్లి బ్రతుకుచుండినట్టి వడ్డెవాగులను జాతివారు దొంగతనాలు ఎక్కువగా చేయుచుండినట్లు అనుమానించుచుండిరి. కాని వారినెన్నిమారులుపట్టుకొనినను పాపమువారివద్ద ఏమియు లభించకుండెడిది. కరీంనగరు గ్రామము యొక్క యూరివెలుపల ఈ వడ్డెరుల గుంపొకటి యుండెను. వారు పగలంతయు చాపలల్లుకొనుచు రాత్రులందుమాత్రము మాయమగుచుండిరి. వారినందరిని పట్టుకొని వారిబట్టలు, పెట్టెలు గుడిసెలు అన్నియు శోధించిరి. కాని యేమియు దొరకలేదు. వారుండు చుట్టుపట్టులలో అనుమానప్రదేశములన్నియు త్రవ్వికూడ పరీక్షించిరి. ఏమియు లాభము లేకపోయెను. ఇదేమి చిత్రమోయని తుదకు నిరాశతో వెళ్ళిపోవుచు రెడ్డిగారు స్వయముగా వారుపయోగించు బొంతలను సూక్ష్మముగా పట్టిపట్టి చూచినారు. అదియు వ్యర్థప్రయత్నమే అయ్యెను. తుదకు వారి ఈత చాపలను చేతితోఎత్తి జాడించిచూచినారు. తనమొహాజిర్ అందేమియు లేదనిచెప్పెను కాని రెడ్డిగారికి చాపలు చాల బరువుగానుండుట విచిత్రముగా కనబడెను. చాపలను అన్నిటిని తునకలుగా కోయించినారు. చాపల అంచులలో ఎంగారు, వెండిసొమ్ములు పొంకముగాజోడించి అల్లినది కనబడెను. సొమ్ములన్నియు జలజల రాలిపడెను. సుమారు



వేంకట రామా రెడ్డి గారు

( సుమారు ౭౮ ఏండ్ల వయస్సులో )



వేంకట రామా రెడ్డి గారు

(రాజా బహద్దరు బిరుదమందినప్పుడు పుష్పమాలాలంకృతులైయుండుట)

౨౦౦౦ రూపాయీల సొమ్ములు దొరికెను. వారందరిని న్యాయస్థానములో శిక్షింపజేసిరి. ఇది అపూర్వ విషయము. హెంకిన్‌గారు చాలసంతోషించి ప్రభుత్వమునుండి రెడ్డిగారికి ౫౦ రూపాయీల విలువచేయు గడియారమును బహుమతిగా నిప్పించిరి.

హెంకిన్ గారు జిల్లాలలో పోలీసు ఠాణాల విచారణకై బయలుదేరినవార్త రెడ్డిగారికి తెలిసెను. హెంకిన్ గారిని తృప్తి పరచుట చాలకష్టమని రెడ్డిగారికి తెలియని విషయముకాదు. హెంకినుగారు మార్గములోని ఠాణాలను ఇతర పోలీసుకచ్చేరీలను విచారించుకొనుచు మూడు మాసాలలో కరీంనగరు వచ్చేసిరి. పోలీసుకచ్చేరీ పరీక్ష తీసుకొన్నిరి. మొదలు పోలీసు ఏమియు లోపములేనట్లుగానున్నది. తుపాకులు పరీక్షించిరి. వారి ఉడుపులను చూచిరి. అన్నియు చక్కగా పరిశుభ్రముగా చిలుమన్న మాటలేక చకచక మెరయుచుండెను. జవానులందరిని వరుసగానిలిపి, వారిదినసాధనను (Drill) పరీక్షించిరి. ఏమియు లోపములేదు. హెంకిన్ గారు దిగ్భ్రమచెంది అందరిని అందుముఖ్యముగా రెడ్డిగారిని ఎగదిగ చూచిరి. సరే ఇంకను విషయము కనుగొందమని రెడ్డిగారినే డ్రిల్లు చేయుమని ఆజ్ఞాపించిరి. వెంటనే రెడ్డిగారు తుపాకిని మెడపై వైచు

కొని మామూలి జవానులతో కలిసి ఏపొంపాటును లేనట్లుగా తమసాధనను ప్రకటించినారు. అధికారికి మరింత ఆశ్చర్యము కలిగి జిల్లాపోలీసు అధికారినిట్లు విచారించినారు:-

"నేను ఇదివరలో చూచిన తావులందెల్లడ నన్నియు లోప భూయిష్ఠములే. నేను విచారణ చేసిన స్థలము లందంతటను ఏ యే సంస్కారములు సూచించితినో అవన్నియు యిచ్చట సవ్యముగానున్నవి. మరియు పోలీసుఅధికారులకు డ్రిల్లు రాకుండుట గమనించి నాను. కాని యిచ్చట ఈ వేంకటరామారెడ్డి డ్రిల్లు చాలబాగుగా చేసినాడు. ఇదంతయు చిత్రముగా నున్నది. తప్పువెదకుదమన్న దొరకకున్నది"

జిల్లా పోలీసు అధికారి (మొహి తెమీాం) మొగలాయిమనిషి. అతని పేరు మీార్ ఆవళ్ ఆలీసాహెబ్ అతనికిని హెంకిన్ గారికిని ఇట్లు సంభాషణ జరిగినది.

మొహ. "సర్కార్ క్షమింతురని మాటయిచ్చిన అంతయు మనవి చేసుకొందును.

హెం. "సరే. చెప్పుము. విందునుకాని

మొహ. "తాము దొరాకు బయలుదేరిన సంగతివిని ఈ కోర్టు ఇన్‌స్పెక్టర్ తాము తమపర్యటనములో ఏ యే విషయములను సంస్కరించుచుంటిరో అవన్నియు

తెలిసికొని అదే ప్రకారమిచ్చుట సిద్ధము చేయించి నాడు.

హెం. అయితే ఇతనికాసంగతులన్నియు నెట్లు తెలిసెను.

మొహ. ఇద్దరు జవానులను సాధారణ వేషములతో పంపి మీ వద్దినుండి వార్తలెప్పటికప్పుడె తెప్పించుకొనుచు వచ్చెను.

హెం "అయితే స్వయముగా డ్రిల్లుబాగా చేయుట యెప్పుడు నేర్చుకొనెను.

మొహి. "ఈ మూడు నెలలనుండియు దినమును అదే పనిగా కష్టించి సాధారణజవానులలో కలిసి నేర్చుకున్నాడు.

హెంకిన్ ముసిముసి నవ్వునవ్వి "ఇతడు చాలా "చాలాక్"గా ఉన్నాడు" అనిపలికి ఆనాడే రాష్ట్రములోని అన్ని నా కాలకును "ఎల్గందల్ పోలీసుతానా అధికారియగు వేంకట రామారెడ్డిని ఆదర్శముగా తీసుకొని అందరు నుపనిచేయువలెను." అనిఅత్యంత ప్రశంసనీయముగా ఆజ్ఞలు వ్రాసి పంపుచు, వేంకట రామా రెడ్డిగారికిని ఒక ప్రతిపంపినారు. రెడ్డిగారు ఆప్రశం సనుచూచి మురిసిపోయినారు. ఆ ప్రశంసాపత్రముతో కూడ ఇంకొక చిన్న వాకుముండెను. అందిట్లుండెను. "వేంకటరామారెడ్డి ఈ మూడుమాసములలో వరంగల్ సదర్ అదాలత్ న్యాయస్థానమందు రెండుమారులు హాజరీ యియ్యలే

దని తెలిసినది. అందుచేత పదిరూపాయీలు అపరాధము (జుర్మానా) విధింపబడుచున్నది." ఆనందము మాయమయ్యెను. తన పైఅధికారితో తనశ్రమకంతకును దొరికిన యీ పదిరూపాయీల అపరాధమును గురించి మొరపెట్టుకొనెను. ఆ మొగలాయి మొహతెమీంగారును ఆశ్చర్యపడి హెంకిన్ గారిని అతిదీనముగా ప్రార్థించిరి. తుదకు హెంకిన్ గారిట్లనిరి. "ఇతడు అతిచతురుడు. నేను పొగిడి రాష్ట్రమంతటను ప్రఖ్యాతి కలిగించినానని ఉబ్బిపోయి చెడిపోవచ్చును. అందుకై ముందు గర్వికాకుండ వృద్ధికి రావలెనని ప్రీతితో ఇట్లు బెదరించినాను."

హెంకిన్ గారు వెళ్ళిపోయిన కొంతకాలమునకు తాలూక్దారుగారగు పెస్తొంజీగారు జిల్లాపర్యటనము చేయుచుండ అతని యింటిలో అయిదారు వేల విలువగల సొత్తులు దొంగతనమయ్యెనని వార్త వచ్చెను. వేంకటరామారెడ్డిగారును తాలూక్దారుగారివెంట దౌరాలో నుండిరి. వెంటనే వారిని తత్పరిశోధనార్థమై పంపిరి. తాలూక్దారునకు ఆరువేలు పోయినందున అంతగా విచారము కలుగలేదు. కాని ఆ వస్తువులతో పాటు కొన్ని ముఖ్యమైన రాజకీయ సంబంధమగు సొంతకాగితములు ఉత్తరప్రత్యుత్తరములును ఉండెను. అవెక్కడ బయటపడునో తనకేమి ప్రమాదము కలుగునోయని తహతహపడెను

రెడ్డిగారు కరీంనగరువచ్చిరి. తాలూక్దారు ఇంటి తాళము భద్రముగానేయున్నది. తలుపులన్నియు అట్లే మూతపడి యున్నవి. ఇంటివెనుకభాగములో ఒకతలుపుమాత్రము తెరువబడినది. కాని తలుపు పగులగొట్టబడలేదు. ఎందును రంధ్రములులేవు. "లోపలి చిలుకు ఎట్లువదలిపోయెను?" అని వీరాందోళన పడుచుండిరి. వీరికుమారులగు రంగారెడ్డిగారును లక్ష్మారెడ్డిగారును చిన్నబాలురు. వారుతను తండ్రిగారిఆందోళనమునుచూచి అమాయికముగా నిట్లనిరి. "డిప్టి తలుపును బయటినుండి తిన్నగా చరచుచు వచ్చిన లోపలి చిలుకు జారిపడును. బేగంగారి వద్దకు వారి సంబంధకుడు అదే విధముగా ఆతలుపును తెరచి మమ్ము అప్పుడప్పుడు తీసికొని పోవుచుండెను." ఈ మాటలవలన రెండుసంగతులు తెలియ వచ్చెను తలుపు తెరచుమార్గమేకాక, తలుపుతెరిచినవాడు తాలూక్దారిగారిసంబంధికుడే అని విశదమయ్యెను. ఇంటిలోపల ప్రవేశించి చూడగా మెట్లవద్ద మట్టినేలపై కాలిజాడలు కనిపించెను- అందొకకాలివ్రేలు మడతపడినదిగా కనుపించెను. అనుమానింపబడినవానికి ఒకకాలివ్రేలు మడతపడినదిగా నుండెను. వానిని కొన్నిదినములక్రిందటనే తాలూక్దారు పంపివేసియుండెను. అతడెచ్చటనుండినది విచారింపతుదకు అతనిని ఓరంగలులో పట్టుకొని నేరమునొప్పించి అతడెత్తుకొని

పోయినధనమును, సొమ్ములను దొరకించుకొనినారు. అతడు రాజకీయ సంబంధముగు కాగిదములు పనికిరావని కరీంనగరు కును మానకొండూరునకును మధ్యనున్ను నదిలో పూడ్చి పెట్టియుండెను. కాగితములన్నియు తాలూక్దారునకియ్యబడెను. అతని యానందమునకు మేరయేలేదు. రెడ్డిగారిని గాఢముగా కౌగలించుకొని, ప్రత్యుపకృతిగా ప్రభుత్వముద్వారా ౧౨౫ రూపాయీల విలువకల రిపీటర్ గడియారమును బహుమతిగా నిచ్చెను. ఆగడియారమిప్పటికిని రెడ్డిగారివద్ద మంచి స్థితిలోనున్నది.

రెడ్డిగారు ఎల్లందల్ జిల్లాలోనుండు కాలములోనే వారిని తాత్కాలిక జిల్లాపోలీసు అధికారిగా ౭ ఫర్వరి ౧౩౧౧ ఫసలీలో నియమించిరి. ఈ ౮ ఏండ్ల లోపల రెండు ఉద్యోగముచేసిరి. ఆయా స్థలములందంతటను జిల్లా అధికారులువీరి నిచాల మెచ్చుకొని యుండిరి. ౧౩౦౮ ఫసలీలో ఇందూరుజిల్లా తాలూక్దారు హెంకిన్ గారి కిట్లు వ్రాసిరి:-

> " వేంకట రామారెడ్డిగారు న్యాయశాస్త్రము తెలిసిన వారు. మంచి అనుభవము సంపాదించినారు. వీరు నిజమైన నిరంతర కృషిచేసి తమ కప్పగింపబడిన అభియోగములలో విశేషముగా జయమందినారు. వీరిని ఇప్పుడే మార్చవలదు. మార్చిన అభియోగము

లన్నియు చెడిపోవును. మీరు చేతిక్రింది పోలీసుల అజ్ఞానమును, చెడు నడతలను తొలగించినారు. ఇట్టి గుణములతో నొప్పిన అధికారి ఈ జిల్లానుండి వెళ్ళి పోవుచున్నాడనిన ఈ జిల్లాయొక్క దురదృష్టమే యనవలెను. "

అంతకు రెండుసంవత్సరములకు పూర్వమే ౧౯౦౬ వ. లో, ఇందూరు జిల్లాపోలీసు నాజింగారు రెడ్డిగారిని గురించి యిట్లు వ్రాసిరి:-

" క్రొత్త ఇన్స్పెక్టరుగారికి (రెడ్డిగారికి) తనపనిలో అత్యంతాసక్తి గలదు. శ్రద్ధతో దినమంతయు ఉపవాసముండి న్యాయస్థానమందే పనులు నెరవేర్చుచుండును. ఇతని శ్రమను చూచిన మాకు జాలి కలుగుచున్నది. ఇతని యెడ మాకు చాల గౌరవము హెచ్చినది. "

అదే సంవత్సరమింకొక సందర్భములో రెడ్డిగారిని గురించి పై అధికారి యిట్లువ్రాసెను;

" వేంకటరామారెడ్డి తప్ప ఇక ఈ జిల్లాలో నమ్మకమైన (పోలీసు) వారు కనిపించరని జాయింట్ మేజస్ట్రేటుగారు హెంకిన్ గారితో చెప్పగా వారాశ్చర్యపడిరి ".

రెడ్డిగారు ఇందూరులోను ఎల్లందల్ లోను అందరిని మెప్పించి కీర్తిని ప్రతిష్ఠించి కొనియుండు కాలములో వారిని

౯ ఖుర్దాదు ౧౩౧౨ ఫసలీలో లింగసూగూరులో నొకగొప్ప హత్య జరిగినందున ఆ హత్యాభియోగమును చూచుకొనుటకై తాత్కాలిక జిల్లా మొహతమీము పదవిపై మార్పు చేసిరి.

వారు లింగసూగూరునకు వెళ్లిన కొన్నిమాసాలలోనే అనగా అదే ౧౩౧౪. వ సంవత్సరములో హెంకిన్ గారు ఎల్గందల్ జిల్లా పోలీసుఅధికారిగారినితీవ్రము గా నిరసించుచు ఈ క్రిందివిధముగు జాబును వ్రాసిరి:-

> “ వేంకట రామారెడ్డి మీ జిల్లానుండి వెళ్ళిపోయినప్పటి నుండియు నేను చూచినంత వరకు జిల్లా పనులన్నింటి లోను, (anthropomody) వేలిముద్రల శాస్త్రశాఖా విషయమునను చెడుగుదలకు వచ్చినది. తమకు తాలూకాలలో ఉంచవలసిన వ్రేలిముద్రల రిజష్టర్లనగా ఏవియో ఇంతమాత్రముకూడ తెలియదు. ఇంతవరకు మీకచ్చేరిలోను ఉత్తమ కార్యమంతయు వేంకటరామా రెడ్డివలననే జరిగినది అనిమాయభిప్రాయమై యుండెను. అదిప్పుడు నిశ్చయమయ్యెను. ఆ మాట తమతో కూడ అనియుంటిని. వేంకటరామారెడ్డి వెళ్ళిపోయి నప్పటినుండియు మాకుడిచేయి విరిగిపోయినట్లున్నది”.

హెంకిన్ గారు సాధారణముగా క్రింది అధికారులను మెచ్చుకొనువారు కారు. ఇట్లువారు మెచ్చుకొనుట చేత రెడ్డి గారియొక్క గొప్పతనము మరింత ప్రకాశమానమయ్యెను.

# ఆరవ ప్రకరణము

౧౩౧౧ — ౧౩౨౩ వరకు

లింగ్సూగూరులో నుండునట్టి జిల్లాపోలీసు అధికారి మారిపోయియుండెను. అతని కాలములో ఒక విచిత్రమైన అభియోగము ప్రారంభింపబడి యుండెను. లింగుసూగూరు జిల్లాలో చేరినట్టి గుర్గుంటా సంస్థానము ప్రాచీనమైనది. దాని పాలకులు బేండర్ (బోయ) జాతివారు. ఆ సంస్థాన మిప్పటికిని మంచి స్థితిలోనున్నది. సంస్థానపు రాణీగారి యల్లునికొక భార్యయు ఒక ఉంపుడుగత్తెయు నుండిరి. ఉంపుడుగత్తె అత్యంత సుందరాంగి. దానిమూలముననే రాణీగారి అల్లుడు చిక్కులలో బడెను. ఒకనాడొక త్రాగుబోతు సగముపూడిన బావిలోబడి చచ్చెను. పోలీసువారు వాని నొసటిపైనను, నెత్తిపైనను, ఇతరభాగములపైనను దెబ్బలు తగిలినది గాంచినారు. సంస్థానపు ఇల్లటపల్లునికి సంతానము కలిగినప్పుడంతయు విచ్ఛిన్నమగుటచేత గ్రహాణకాలము నాడొక మనుష్యుని నొసటి రక్తముతీసి దానితో మంత్రాక్షరములు వ్రాసి తాయెతులో

వేసి పెట్టుకొనిన సంతానము నిలుచునని మాంత్రికుడొకడు బోధించినందున ఈ బావిలోపడి చచ్చినవానిని అతడు పట్టి తెప్పించి నెత్తినపొడిచి రక్తము తీసుకున్నాడనియు, అందుచే వాడు చనిపోయినందున ఆత్మహత్య చేసికొనినట్లు కనబడవలెనని వానిని బావిలో పారవేసిరనియు నొక అభియోగము న్యాయస్థానములో ప్రప్రవేశపెట్టిరి.

ఇట్లు ప్రవేశపెట్టిన తర్వాత వేంకట రామారెడ్డిగారు మొహతెమీమముగా లింగసుగూరునకు వెళ్లిరి. అభియోగముయొక్క పూర్వాపరములను బలాబలములను శోధించి చూడగా వారికి అభియోగమంతయు అబద్ధముగానే యుండినట్లు నిశ్చయమయ్యెను. కాని ఈ అభిప్రాయమును వెల్లడించిన గుర్గుంటా దొరవద్దనే ౨౦ - 30 వేలో జాడించుకొని పక్షవర్తియై అభియోగమును చెడగొట్టెనని నిందమోపక మానరని ఆలోచించికొని తన అభిప్రాయమును తనలోనే దాచుకొని తన శక్తికొలది దానిని నడపుటకు పూనుకొనెను.

ఘోరహత్యాభియోగమునకు గురియైన దొరగారిని పట్టుకొనుట మొదటిపని. డిప్యూటీ డైరెక్టరుగానుండిన జైనార్డ్క్ అనువారు ౫౦ మంది రోహిలాలను, ఇతర జవానులను తుపాకులతో గూడ సిద్ధముచేసి దొరవారి కోటను ముట్టడివేయుట కాజ్ఞాపించిరి. రెడ్డిగారూరకుండిన ఆ చిన్నసిబ్బంది యంతయు

హతమై యుండెడిది. ఇట్టి సన్నివేశములందే రెడ్డిగారి సమయ స్ఫూర్తి పరిణతి పొందుచుండెడిది. ఇదియే వీరి జీవితములోని రహస్యము. గోటితో పోవుదానిని గొడ్డలిపెట్టువరకు ఎన్నడును రానిచ్చి యెరుగరు, రెడ్డిగారికిని డిప్యూటీ రెక్టరుగారికిని ఇట్లు సంభాషణము జరిగెను:—

రెడ్డి “ఈ సిబ్బంది - ఈ అట్టహాసము ఇదంతయు ఎందుకొరకు?

డిప్యూ “రాజాసాబ్‌ను పకడ్బంద్ చేయుటకు

రెడ్డి అయితే యీ సిబ్బంది మరల బ్రతికి వచ్చునా?

డిప్యూ “ఎందుకు రాదు?

రెడ్డి “దొరవారి గడీలో నాలుగైదు వందల బేండర్ (బోయ) సిబ్బంది కలదు. వారికిని తుపాకులున్నవి. వారును మంచిశూరులే.

డిప్యూ “అయితే దొరను పట్టుటయెట్లు?

రెడ్డి “మీ రందరు ఊరకుండుడు- నే నొక్కడనే పట్టుకొని వత్తును.

డిప్యూ “ఒక్కడవే? మీరు మరల బ్రదికిరారుసుమా. ఇదేమి పిచ్చి ఆలోచన.

రెడ్డి “సర్కారువారి సేవలో నాకు ప్రాణభయమేమియు లేదు”

వేంకటరామారెడ్డిగారు తమవెంట ఒక నిరాయుధుడగు జవానును మాత్రమే తీసికొని కోటలో ప్రవేశించినారు. గడీలోనంతయు కోలాహలముగానుండెను. బోయలందరు తమ దొరను పట్టియియ్యమనియు, చంపుదుమనియు చత్తుమనియు బెదరించుచుండిరి. రెడ్డిగారు దొరగారి అత్తగారితో పరిస్థితులను విమర్శించిచెప్పినారు, సర్కారువారు తలచిన యెంతనష్టమైనను దొరవారిని పట్టుకొని తీరుదురనియు. ప్రతిఘటించిన సంస్థానమునకే ముప్పువచ్చుననియు, దొరవారికి అవమానము జరుగకుండునట్లుగా తాను పూచీగానుందుననియు, పరిపరివిధముల చెప్పి యొప్పించి దొరవారిని తన వెంబడి ఒక టాంగాబండిలో తీసికొని నాకానుచేరినారు. దొరవారు వచ్చినదిచూచి డిప్టీగారాశ్చర్యపడినారు. కాని వెంటనే తనరోహిలాసీపాయీలను చుట్టును ముట్టడివేయ ఆజ్ఞాపించినారు. రెడ్డిగారు తాను అన్నింటికి పూచీపడినానని చెప్పి సీపాయీలను వెడలిపొమ్మనెను.

అభియోగ విచారణ న్యాయస్థానములో ప్రారంభమయ్యెను. దొరవారి పక్షమున డిసాంటస్ బ్యారిస్టరును, అహమ్మద్ షరీఫు వకీలును మరికొందరు పెద్దపెద్దవకీళ్లు — మొత్తముపై ఆరుమంది— వాదించినారు. పోలీసు పక్షమున రెడ్డిగారు మాత్రమే వాదించినారు. కేసులో బలములేకున్నను

రెడ్డిగారు, అంతటి కొమ్ములు తిరిగిన పెద్దపెద్ద న్యాయవాదుల నెదిరించి వాదించుటను జూచి ఆకాలములో హైద్రాబాదులో ప్రచురింపబడుచుండిన "దక్కన్ పోస్టు" అను స్థానిక ఆంగ్లపత్రికా విలేఖరి చాల ప్రశంసించుచు వ్రాసెను! కేసు బలహీన మగుటకు ముఖ్యకారణము దొరవారి యుంపుడు గత్తె యొక్క వాఙ్మూలమై యుండెను. ఆపై తనను పూర్వపు సంస్థాన న్యాయస్థాపు నాజిమున్ను, పూర్వపు మొహతెమీమున్ను కాంక్షించిరనియు, ఆమెను పలుమారు మోసగించి పిలిపించి దౌర్జన్య ప్రయత్నము చేయదలచి రనియు, విపులముగా వాఙ్మూలమిచ్చి యుండెను. ఎట్లైననేమి? తుదకు కేసు కొట్టి వేయబడెను. గుర్గుంట రాణీగారి అల్లుడు వదలిపెట్టబడెను.

లింగుసుగూరునుండి రెడ్డిగారు ౧ ఆబాన్ ౧౩౧౩ ఫ. నాడు. గుల్బర్గాకు (మొహతెమీం) జిల్లాపోలీసు అధికారిగా మార్చబడిరి. హెంకిన్ గారి సహాయాధికారిగా పనిచేయుచున్న గాఫ్ గారు వేంకట రామారెడ్డిగారి ప్రాముఖ్యతను గుర్తించి గుల్బర్గా పెద్దజిల్లా యగుటచేత అచటికి వారిని పంపుటచాల యవసరమని కోరినందున వీరిని హెంకిన్ గారు మార్చివేసిరి. గుల్బర్గాలో వీరు పోలీసు అధికారిగా నుండిన కాలములో అనగా ఫసలీ ౧౩౧౩ వ సంవత్సరములో నిజాం రాష్ట్రములో ప్రథమ పర్యాయము ప్లేగురోగము ప్రవేశిం

చెను. ఆరోగముయొక్క దాడి మొకటి పర్యాయము దగుటచే జనులు భీతాత్ములైరి. సరియైన చికిత్సలు లేనందున అనేకులు చనిపోయిరి. అట్టి పరిస్థితులలో వేంకట రామారెడ్డిగారు ప్లేగు వలన నిబ్బంది పడువారిని విచారించుట తన పని కాదని తూష్ణీంభావము వహించినవారుకారు. అట్టి లక్షణము వారిలో ఎన్నడును లేదు. తనకు సంబంధము లేనిదైనను ఒక కార్యము ప్రజాహితమైనట్టిదనియు, మానవాభ్యుదయమునకు అవసరమైనట్టి దనియు వారికి తోచిన. వారందరికన్న ముందుగానే జోక్యము కలిగించుకొనెడివారు. ఈప్లేగు వలన బాధపడు జనులకు తమ యావచ్ఛక్తిని వినియోగించి సాయపడివారు. వీరి యీ సత్కార్యమునకు ప్రభుత్వము వారు మెచ్చికొని ౫౦ రూపాయల విలువగల పతకమును పసదనముగా ప్రసాదించిరి.

గుల్బర్గాలో నుద్యోగముచేయుచుండు కాలములోనే రెడ్డిగారి (మోహతెమీం) జిల్లా పోలీసు అధికారపదవి ఇదివరలో తాత్కాలికముగా (మున్సరంగా) నుండునట్టిది ౨౦షహారేవర్ ౧౩౧౩ ఫసలీనాడు స్థిరముగా (ముస్తఖల్ — పర్మనెంటు) చేయబడి నెలకు ౨౦౦ రూపాయల జీతమును ౨౫ రూపాయలు గుఱ్ఱము వ్యయమునకును అంగీకరింపబడెను.

గుల్బర్గానుండి రెడ్డిగారిని ౧౩౧౪ ఫసలీలో నిజామాబాదుకు మార్చి పంపిరి. (ఇదివరకు ఇందూరు అని వ్యవహరింపబడుచుండిన జిల్లాయే రెడ్డిగారు రెండవమారు వెళ్లువరకు నిజామాబాదు అనునూతన నామకరణము బొందియుండెను.) హెంకిన్ గారి నిరుపమానమగు శ్రద్ధచేత జిల్లాలలోని అల్లకల్లోలములు తగ్గియుండెను. మరియు వేంకటరామారెడ్డిగారి చాకచక్యము వలన నిజామాబాదులో పరిస్థితులు శాంతగాయుండెను. నిజామాబాదులో మూడున్నర సంవత్సరములుండిన తర్వాత వీరిని ఔరంగాబాదు జిల్లాకు ౧౩౧౭ ఫసలీలో 300 రూపాయల వరకు జీతము హెచ్చించి పంపిరి.

ఔరంగాబాదునకు వెళ్లిన కొన్ని దినములలోనే అచ్చట కొన్ని పరిస్థితు లేర్పడెను. గుల్బర్గాలో బ్రిటిషిండియా నుండి క్రొత్తగా ప్లేగు ప్రవేశించినట్లుగానే, ఔరంగాబాదులోనికి బ్రిటిషిండియానుండి రాజకీయ వాతావరణము ప్రవేశించెను. ఔరంగాబాదు బొంబాయి రాజధాని యొక్క సరిహద్దుజిల్లా, బొంబాయిలో లోకమాన్య బాలగంగాధర తిలకుగారిని బ్రిటిషు ప్రభుత్వమువారు రాజద్రోహపు నేరములో శిక్షించి జెయిలులో వేసియుండిరి. మహారాష్ట్రీయులుద్రిక్తులై యుండిరి! అదేసమయములో ఇంకొక దిక్కు బెంగాలు రాష్ట్రములో రాష్ట్రవిభజనపై బెంగాలీలు విజృంభించి “ వందేమాతరం ”

అను జాతీయ గీతమును ప్రచారముచేయుచు హింసామార్గములను దొక్కుచుండిరి. ఆ వందేమాతర గీతముకూడ ఔరంగాబాదులో ప్రచారము గావింపబడెను. ఈ ఆందోళన మంతయు బ్రిటిషిండియాలో హిందువుల చేతనే కావింపబడు చుండెను. ఔరంగా బాదులోను హిందూ యువకులు కొంతవరకు కల్లోలములు గావించిరి. అట్టి సందర్భములో వేంకట రామారెడ్డిగారి యొక్క అవసరము ఆజిల్లాలో అత్యంతముగా కనబడెను. ఔరంగాబాదు సూబేదారుగా నుండిన నవాబ్ బర్జోర్ జంగ్ బహాదర్ గారు హోంకిగారికి వేంకట రామారెడ్డిగారి విషయమునను, ఔరంగాబాదు పరిస్థితుల విషయమునను ఈప్రకారముగా జాబువ్రాసిరి:—

"... ... ఔరంగాబాదు నగరములో పాఠశాలలందలి విద్యార్థులు తిలకుగారు శిక్షను పొందిన విషయమున బళ్ళను వదలివెళ్లి పోయినారు. వందేమాతరం యొక్క ప్రకటనలను ఊరిలో అతికించినారు. ... ... వేంకట రామారెడ్డిగారు హిందువులైనను ఈ గడబిడలను ఈ జిల్లాలో వ్యాపింపకుండునట్లుగా ఏర్పాటుచేసినారనిన వారి బుజవర్తనము వారి ప్రభుభక్తియు వెల్లడియగు చున్నవి. ... ఇట్టి గడబిడలు ముందు ముందుకూడ ఈ జిల్లాలో సంభవింపవని నాకు పూర్తిగానమ్మకముగలదు. ఎందుకనగా:—

౧. వేంకట రామా రెడ్డిగారు హిందువులు.

౨. ఈ జిల్లాలో ఇట్టి గ్రంబిడలు వృద్ధియైన జనులు తనను గురించి నానా విధములుగా వదంతులు కల్పింతురని వారికి తెలియును ... ..

౩. హిందువులతనిని తమ వానినిగా భావింతురు. ముసల్మాను అధికారికన్న హిందూ అధికారికి హిందువుల భావములు గుర్తుపడుటకు ఎక్కువ అవకాశములున్నవి.

౪. వేంకట రామా రెడ్డి సత్యవర్తనుడు, విశ్వాసపాత్రుడును అగు అధికారి."

మొత్తముపై ఔరంగాబాదులో "రాజద్రోహ" ఉద్యమ ప్రచారము వృద్ధికాలేదు. వేంకట రామా రెడ్డిగారు ౧౩౧౪ ఫసలీలో వరంగల్ జిల్లాకు మార్చబడిరి. వరంగల్ జిల్లాలో ఒక సంవత్సరము రెండు మాసములవరకు ఉద్యోగముచేసిన తర్వాత అచ్చటినుండి అత్రాఫుబల్దాజిల్లాకు ౧ తీరు ౧౩౧౫ ఫసలీనాడు పంపబడిరి.

అత్రాఫుబల్దాజిల్లా అనునది హైదరాబాదు (బల్దా) నగరముచుట్టును (అత్రాఫ్) నుండు గ్రామాలతో కూడినజిల్లా! పూర్వమందు ప్రభుత్వకోశమునుండి నిజాం ప్రభువులు తమ సొంత వ్యయములకై ఎల్లప్పటికిని మితిలేని ద్రవ్యమును తీసి

కొనుచుండుటలో ఇబ్బందులు కలుగుచుండెను. ఈ లోపమును సంస్కరించుటకై ౫/౨ నిజాం ప్రభువువారు తమ సొంత వ్యయమునకై అత్రాఫుబల్దా జిల్లా యను దానిని కల్పించి ప్రత్యేకించి యుంచిరి. ఈ జిల్లా ప్రభువుగారి యొక్క సొంత వ్యయమున కేర్పడినందున దీనిని ఫార్సీలో "సర్ఫెఖాస్" అనియు వ్యవహరింతురు. సర్ఫెఖాసునుండి ప్రతి సంవత్సరము పన్నుల రూపమున సుమారు అర్ధకోటి రూపాయీలు వసూలగును. ఈ మొత్తము గాక ప్రభువుగారికి (దీవానీ) రాష్ట్ర ప్రభుత్వకోశము నుండి ఏటేట ౫౦ లక్షల రూపాయీలు సమర్పించుకొను ఏర్పాటుకూడ గలదు. ఈ సర్ఫెఖాసు మండలములో వ్యవస్థ నంతయు మ. ఘ. వ. నిజాం ప్రభువుగారె స్వయముగా విచారించుకొందురు. అట్లుండినను పోలీసు శాఖను మాత్రము ఖాల్సా అనగా నేరుగా ప్రభుత్వముచేత పాలింపబడు రాజ్యాంగముయొక్క అధీనములో నిచ్చియున్నారు. అత్రాఫుబల్దా జిల్లాలో మంచి సమర్థతకల జిల్లాపోలీసు అధికారియొక్క యవసరము చాల కలదని హెంకిన్ గారితో ఆలోచించగా వారు వేంకట రామారెడ్డిగారు తప్ప మరెవ్వరును సరియైనవారు లేరని వారి నచ్చటికి ౪౦౦ రూపాయీల జీతముపై పంపిరి.

అత్రాఫుబల్దా జిల్లాలో రెండేండ్లుకూడ పనిచేయక మునుపే వీరు వనపర్తిలో ఉద్యోగము చేయవలసి వచ్చెను. వీరి సమకాలికులును, సమవయస్కులును, సహాధ్యాయులును, బాల్యమిత్రులును, బంధువులును అయిన వనపర్తి రాజుగా రగు శ్రీ (ద్వితీయ) రాజా రామేశ్వరరావు బహద్దరుగారు ప్రభుత్వమువారితో ఉత్తరప్రత్యుత్తరములు జరిపి వేంకట రామారెడ్డిగారిని తమ సంస్థానమునకు రప్పించి సంస్థాన కార్యదర్శి (Secretary ) గా నియమించిరి. నెలకు ౯౦౦ రూపాయీల జీతము నిచ్చుచుండిరి. ౧౩౨౧ ఫసలీ వీరా యుద్యోగమందు ప్రవేశించి రెండు సంవత్సరముల కాలము వరకు నిర్వహించుచుండిరి.

వేంకట రామారెడ్డిగారు అత్రాఫుబల్దాజిల్లా పోలీసు మొహతెమీముగా నుండిన కాలములో పూర్వపు నిజాము గారైన నవ్వాబ్ మీర్ మహబూబు అలీఖాన్ బహద్దరు గారు రాజ్యము చేయుచుండిరి. వారి స్వంత వ్యయముకై ప్రత్యేకింపబడిన అత్రాఫుబల్దా జిల్లాకే రెడ్డిగారు పోలీసు అధి కారిగా నుండిరి. గత నిజాముగారగు నవాబు మీర్ మహ బూబుఅలీఖాన్ బహద్దరుగారు మొగల్ చక్రవర్తుల మర్యా దలను అనుసరించిన తుది ప్రభువు అనవచ్చును. వారి నిజ మైన జీవిత చరిత్రను మహారాజా సర్ కిషన్ ప్రసాద్ బహా

ద్దరు వంటివాడు వ్రాయవలసి యుండెను. గత నిజాముగారిని గురించి రాష్ట్రమంతటను, సామంత ప్రభువులును, ప్రజలను కొల్లలుగా కథలు చెప్పుకొను చుందురు. అందనేకములు చాల వినోదకరములుగా నుండును. వారెన్నియో మాసముల కొకమారు జనులకు దర్శనమిచ్చుచుండిరనియు, వారు బయటికి వెళ్లినప్పుడు వేలకొలది ధనమును వీధులలో చల్లుచు పోవుచుండిరనియు, మహాదాతలనియు, వారి దర్బారు మొగలు చక్రవర్తుల దర్బారువలె సర్వ మర్యాదలతో కూడి యుండినట్టిదనియు వారికి సర్వమతములందు సమానదృష్టి యుండెననియు, ప్రజలందరు వారిని పూజ్యభావముతో ప్రేమించుచుండిరనియు జనులు నేటికిని విరివిగా చెప్పుకొను చుందురు.

గత నిజాముగారి సర్ఫెఖాసులో రెడ్డిగారు పోలీసు ప్రధానోద్యోగులుగా నుండినను వారి సమక్షములో పోవుటకు గాని, వారితో మాట్లాడుటకుగాని వారి కవకాశము కలుగలేదు. అయినను వారి కాలములో రెడ్డిగారికి సంబంధించిన యొక ముఖ్యమగు ఘట్టము పేర్కొనదగినదై యున్నది. గత నిజాముగారు హైదరాబాదు నగరమునకు ఇంచుమించు ఆరు మైళ్ళదూరమున నుండినట్టి పహాడిషరీఫ్ అనుస్థలమందు నివాసము చేయుచుండిరి. నగరమునుండి ప్రతిదినము సాయంకాలము వారి నౌకరులలో ఒకగుంపు అచ్చటికివెళ్ళి అచ్చట

పనిచేయు నౌకరులను నగరములోని ప్రభువుగారి దేవిడీకి పంపుచుందురు. ఇట్లు సేవకులు మారుకాలములో ఒకనాటి సా. ౫గం కాలమందు చెన్నరాయనిగుట్ట సమీపమందు మహేశ్వరము పటాలములో చేరినట్టి అరబ్బులుకొందరు సేవకురాండ్రతో సరసాలాడుచు వారిని బెదరించిరి. ఈ అరబ్బులు చెన్నరాయని గుట్టచుట్టుపట్టు ప్రాంతాలలో ఇప్పపూత దొంగలించి సారాయిభట్టీలు పెట్టి దొంగతనము చేయుచుండిరి. వీరి దౌర్జన్యము లధికమయ్యెను. తుదకు ప్రభువుగారి నౌకరుల పైననే తమ దర్పము చూపునంతటి ధైర్యము వీరికి కలిగెను. ఈ సంగతి ప్రభువుగారికి తెలియగా రెడ్డిగారికిని జిల్లాలపోలీసు కచ్చేరీలోని డిప్యుటీ ఇనస్పెక్టరు జనరల్ గ నుండినట్టి మనోహర్ లాల్ పూరీగారికిని ఆ దుర్మార్గులను పట్టుకొనుటకై ఆజ్ఞయిచ్చిరి. వేంకట రామారెడ్డిగారును, మనోహర్లాల్ పూరీగారును చెన్నరాయని గుట్టవద్దకిపోయి అరబ్బులను పిలిచి విచారణము సాగించి నిందితులను పట్టుకొనజూచిరి. అంతట సుమారు ౨౦౦ అరబ్బులు కత్తులు, తుపాకులు, బాకులు, ధరించి వీరిరువురిని ముట్టడించి భయంకర కోలాహలముచేసిరి. అరబ్బులు చెలరేగిన అసాధ్యులై పోదురు మరియు అట్టి స్థితిలో వారు వెనుక ముందుచూడక హత్య కూడ చేయుటకు వెనుదీయరు. మనోహర్లాలు పూరీగారి

కప్పుడే యముడు ప్రత్యక్షమైనట్లు తోచెను. పూర్తిగా ప్రాణములపై ఆశవదలుకొనినారు. రెడ్డిగారు మాత్రము అణుమాత్రముకూడ జంకలేదు. అరబ్బులతోనిట్లు క్రోధోద్రిక్తులై గర్జించినారు. " మేము చేరివారి నౌకరులముకాము మేము నిజాం ప్రభువుగారి ఆజ్ఞాబద్ధులము. ప్రభుసేవలో చనిపోవుటకు మాకేమియు చింతలేదు. మాకేయపకారమైనను మీయందరి తలలను త్వరలో యెగిరిపోవుననియు, మీరు తప్పించుకొనజాల రనియు గుర్తించుడు. మీరు తెలివితెచ్చుకొని నిందితులను మాకు పట్టియిండు లేదా. మీరందరును నిదితులే అగుదురు" ఈ ప్రకారముగా ఒక చిన్న ఉపన్యాసమే ఝూడించినారు. అరబ్బులు తత్తరపాటుతో తమ యపచారమునకై ప్రాధేయపడిరి. వారి నాయకులు పాదాక్రాంతులై నిందితులను పట్టియిచ్చిరి. మనోహర్లాల్ పూరీగారికి యెగిరిపోవుచుండిన ప్రాణములు స్వస్థానము చేరుకున్నవి. వేంకట రామారెడ్డిగారికి వేలకొలది ధన్యవాదము లర్పించుకొన్నారు. ఆ కృతజ్ఞతను మరువనివారై తాము రచించిన "ఇన్సిదాదె నురాగ్ రసానీజురాయం" అను గ్రంథముయొక్క వ్యాఖ్యానములో ఆనాటి ఘట్టమును గురించి యిట్లు వ్రాసియున్నారు:—

" క్రీ. శ. ౧౯౧౨లో అత్రాఫుబల్దా మొహతెమీంగారును(అనగా వేంకట రామారెడ్డిగారు); నేనున్ను (అనగా

మనోహర్‌లాల్ పూరీగారును) ఒక నిందితుని పట్టుకొనుటకై గృహశోధన చేయుటకై మైసరమునకు వెళ్ళితిమి. నిందితుడు దొరకకపోయెను. కాని వాని యింటి శోధన మొదలుపెట్టితిమి ఆసమయములో (మైసరము పల్లెలోని) సిపాయీలు ఏదోవిధముగా మాకు యిబ్బందులు కల్పింప మొదలిడిరి. మా పని పూర్తి కాకముందే మాకు నిందితుని జాడలు తెలిపినవాడు మావద్దకువచ్చెను. వానిని సిపాయీలు చుట్టివేసి తిరుగుబాటునకు సంసిద్ధులైరి. ఆసమయమున మొహతెమీంగారు సిపాయీల ఆఫీసర్లను పిలిచిరి. మరియు జాడలు తెలిపినవాని చుట్టును పోలీసువారిని నిలబెట్టిరి. సిపాయీలకు బుద్ధిచెప్పుటకు మొదలుపెట్టిరి. ఒక అర్ధగంటసేపీ ప్రకారము వారిని సమాధానపెట్టి వానిని రక్షించుకొని బయటకు తీసికొని వచ్చిరి. వేంకటరామారెడ్డిగారు ఆనాడు ధైర్యముతో, ఆలోచనతో గండము తప్పించిరి. ఆనాడు యెన్నియో ప్రాణములు నాశనమై యుండెడివి."

వేంకటరామారెడ్డిగారు జిల్లామొహతెమీంగా నుండిన కాలముందే జర్మనీ యువరాజుగారు హైదరాబాదు నగరమునకు వచ్చిరి. వారు వేటకై వెళ్లినప్పుడు రెడ్డిగారు వారివెంటనుండి ఏర్పాటులలో సాయపడినారు.

# ఏడవ ప్రకరణము

## సహాయకొత్వాలు

కాలము మారిపోయెను. నవాబ్ మీర్ మహబూబలీ పాషాగారు చనిపోయియుండిరి. జిల్లాపోలీసు సర్వాధికారగు హెంకిన్ గారు ఉపకార వేతనముపై ఉద్యోగమునుండి విశ్రాంతి పొందియుండిరి. నిజామురాష్ట్రమునకు వచ్చిన ఆంగ్ల ఉద్యోగులలోను, దేశీయోద్యోగుల లోను ఇంతటి సమర్థుడు ఇదివరకు లభింపలేదని చెప్పవచ్చును. హెంకిన్ గారి కాలములో దేశమం దెందుచూచినను అల్లకల్లో లములు, దౌర్జన్యములు, దోపిళ్ళు జరుగుచుండెను. జిల్లా పోలీసు అధికారులలోను చాలమంది దౌర్జన్యయుక్తులుగా నుండిరి. పైగా వారికి పోలీసు విచారణాపద్ధతులు తెలియకుండెను. అట్టి సందర్భములలో శాంతిని స్థాపించి, పోలీసు వారికి క్రమశిక్షనిచ్చి, రాష్ట్రమునకు మహోపకార మొనర్చినారు. తెలంగాణములో బీదరైతులు ఇప్పటికిని హెంకిన్ గారిని తలచుకొనుచుందురు. వారి నామమునుకూడ మార్చి

వారిని తెనుగువారినిగా జేసినారు. తెలంగానా జనులు హెంకినును వెంకన్న లేక యంకన్న అని పిలుతురు. నగరములోని జిల్లాపోలీసు నాజము కచ్చేరీని ఇప్పటికిని తెనుగుజనులు "యంకన్న కచ్చేరి" అని వాడుకొను చుందురు.

వేంకట రామారెడ్డిగారు అత్రాఫుబల్దానువదలి వనపర్తి రాజాగారు ప్రత్యేకముగా కోరినందున ప్రభుత్వమువారి అనుమతితో వనపర్తి రాజుగారి కార్యదర్శిగా పనిచేయుచుండిరని యిదివరకే వ్రాయబడినది. అట్లువారు వనపర్తిలో నుద్యోగము చేయుచుండగా హైదరాబాదు నగరములోని కొత్వాలీ యుద్యోగములో కొన్ని మార్పులు జరిగెను.

నగరపు కొత్వాలుపని యనిన సామాన్యమైనదికాదు. ఉద్యోగము చిన్నదైనను ప్రాచీనమునుండి దాని ప్రాముఖ్యతనుబట్టి ప్రధానమంత్రి యుద్యోగము తర్వాత కొత్వాలీ యుద్యోగమే ప్రాధాన్యత వహించి యుండినట్టిది. కారణమేమనగా హైద్రాబాదు నగరములో ప్రభువుగారును, గొప్ప నవాబులు, ప్రధానియు, ఇతర ముఖ్యాధికారు లందరును నివసింతురు. వారందరి యోగక్షేమములు విచారించుకొనువాడు కొత్వాలు. పైగా కొత్వాలునకు ప్రతిదినము ప్రభువుగారి ప్రాపకముండుటచే ఉన్నతోద్యోగులు మొదలుకొని, గొప్ప కోటీశ్వరులును, ధనికులును, బీదలును, అందరును కొత్వాలును గౌర

వముతో చూచుచుందురు. మరియు కొత్వాలు చేతి|కింద సుమారు 3౦౦౦ పోలీసు భటులును, వివిధోద్యోగులును, పని చేయుచుందురు.

పూర్వము కొత్వాలులు మహాప్రచండులై యుండిరనియు, వారు ఉచ్చరించినవే ఆజ్ఞలుగను, వారు వ్రాసినవే శాసనములుగను నుండుచుండినట్లు జనులు చెప్పుకొందురు. వేంకట రామారెడ్డిగారు వనపర్తిలో నుండుకాలములో లాల్ ఖాన్ అను నతడు కొత్వాలు పనిచేయుచుండెను. ఒక యింగ్లీషువానిపై యేదో అభియోగము తెచ్చి కష్టపెట్టుట అతని పతనమునకు కారణమయ్యెనని యందురు. ఇట్లుండ ప్రకృత నిజాముగారగు నవ్వాబ్ సర్ మీరా్ ఉస్మానలీఖాన్ బహద్దరుగారు గుల్బర్గా ఉరుసును సేవించుకొనుటకై వెల్లిరి. అచ్చట నవ్వాబ్ ఇమాద్జంగు బహద్దరు అను వారు మొదట జిల్లాపోలీసు నాజముగా పనిచేసి కొంతకాలము హైకోర్టులో కార్యదర్శిగా పనిచేసి, తర్వాత గుల్బర్గాలో రెండవమారు సెషన్ జడ్జీగ నియుక్తులై యుండిరి. నిజాం ప్రభువుగారు గుల్బర్గా ఉరుసునకు వేంచేసియుండినప్పుడు నవ్వాబ్ ఇమాద్జంగుగారిని చూచి వారి శక్తిసామర్థ్యములను విచారించి మెచ్చుకొని తర్వాత వారిని నగర కొత్వాలుగ ఏర్పాటుచేసిరి.

పూర్వము గుల్బర్గాలో ఇమాందజంగుగారు జిల్లాపోలీసు అధికారిగ నుండినప్పుడు వేంకట రామారెడ్డిగారదే గుల్బర్గాలో మొహతెమీమాముగ పనిచేయుచుండిరి. ఆ సందర్భములో ఉభయులకును స్నేహము బాగుగా కుదిరియుండెను. పైగా ఒకరి గుణము లింకొకరికి బాగుగా పరిచితమైపోయెను.

ఇమాందజంగుగారు కొత్వాలు పదవిని స్వీకరించిన తోడనే వారికి వేంకట రామారెడ్డిగారు జ్ఞాపకమునచ్చిరి. వారు తనకు ప్రధాన సహాయకులుగా నుండిన కాని తమ కచ్చేరీవ్యవహారములు సంస్కరింప బడజాలవని వారికి గట్టిగా స్ఫురించెను. అందుచేత వారు రెడ్డిగారిని వనపర్తినుండి రప్పించుటకును తనకు ప్రధాన సహాయకులుగా నుంచుటకును ప్రభుత్వముతో వ్యవహారము సాగించిరి. ఆ సందర్భములో సర్ఫేఖాసు కార్యదర్శిగారికి కొత్వాలు ఇమాందజంగుగారు ౧౩౨౩ వ ఫసలీలో రెడ్డిగారిని తన శాఖకు పంపుమని ఇట్లువ్రాసిరి:— " నగర పోలీసు కచ్చేరిలో అత్యంతముగా విశ్వాస పాత్రుడైన వాని అవసరముకలదు. మరియు అతడు పోలీసుపనియొక్క మంచి అనుభవముకూడ కలిగియుండినవాడై యుండవలెను. లేకున్న మా కచ్చేరీలో ఏమియు సంస్కరించుటకు వీలులేదు". ఇట్టి గుణములు కలవారు రెడ్డిగారుతప్ప మరెవ్వరును లేరని ఇమాందుజంగుగారు వ్రాసి పత్రవ్యవహారముజరిపి రెడ్డిగారిని జిల్లా

పోలీసు శాఖనుండి నగర కొత్వాలీ శాఖలోనికి మార్పుగా వించిరి. కేవలము మార్పు కావించుటయే కాక తనకు ప్రధాన సహాయకులను (అవ్వల్ మదద్గార్ కొత్వాల్) గా నెలకు ౫౦౦ రూపాయాల జీతముపై వారిని నియమించిరి. రెడ్డిగారి ప్రధాన సహాయ కొత్వాలీ పదవిలోనికి ౧౨ బహిమన్ ౧౩౨౩ ఫసలీనాడు వచ్చిరి.

నవాబు ఇమాదుజంగుగారు మంచి దర్పముతో కూడి యుండినట్టివారు. నవాబీ పద్ధతిపై ఉద్యోగము నిర్వహించి నట్టివారు. పెద్ద పెద్ద అధికారులకును, జాగీర్దారులకును వారన్న భయము. క్రింది ఉద్యోగు లందరును సదా భయపడు చుండెడివారు. వారి ఆజ్ఞలన్న సింహ స్వప్నములు. అట్లుండినను వారు రెడ్డిగారి విషయములో మాత్రము సదా ప్రసన్నులై యుండిరి. వారిపై సంపూర్ణ విశ్వాసమును, నిండు ప్రేమను, అధికాభిమానమును వహించి యుండిరి. వారి కాంపౌండు లోపలనే ఒకచిన్న బంగ్లాను రెడ్డిగారికి ఉచితముగా నివాసమునకై యిచ్చియుండిరి. అందుచేత రెడ్డిగారికి రాత్రింబగళ్ళను వారి దర్శన మగుచుండెను. ఉభయుల దేశాభిప్రాయముగా నుండెను.

ఇమాదుజంగు గారు పోలీసుశాఖలో కార్యనిర్వాహముచు, నగరములోని పోలీసు విధ్యుక్త చర్యల పర్పాటులను

స్వయముగా విచారించు కొనుచుండిరి. ఆ విషయములలో రెడ్డిగారికి జోక్యము లేకుండెను. కచ్చేరిలోని దఫ్తరము పను లన్నియు వారివశము చేయబడియుండెను. వేంకట రామారెడ్డి గారు ప్రధాన సహాయకొత్వాలు అయినప్పటినుండియు పోలీసు కచ్చేరిలో, పోలీసువారి విధులలోను, వారి ఏర్పాట్లలోను క్రొత్త క్రొత్త సంస్కారములు ప్రవేశపెట్టి ప్రభుత్వమువారి అంగీకారమును పొందుచు వచ్చిరి. అంతకు పూర్వము ప్రతి అమీను నాకాలో కూడ దఫ్తరము లుంచుచుండెను. వీరు వచ్చిన తర్వాత అమీన్లనుండి ఆ యధికారము తీసివేసి సదర్ అమీనులవద్దనె ఆపనిజరుగునట్లేర్పాటుచేసిరి. మరియు నిదేవిధ ముగా ఎన్నియో సంస్కారములు గావించిరి. తమ చేతిక్రింది వారితో దిట్టముగా పనితీసికొనుచుండిరి. ఇట్లు వీరు పరిశ్ర మించి సహాయపడుటచేతనే నవాబు ఇమాదుజంగుగారు తమ కొత్వాలీ నివేదికలో నొకమారిట్లు వ్రాసిరి:—

"వేంకట రామారెడ్డిగారు ఈ కచ్చేరీకి వచ్చినప్పటి నుండియు, కచ్చేరీ సమయములందే కాక ఇతర సమయములం దుచు అపారమైన కష్టము లనుభవించి స్వయముగా పరిశీలిం చుచు ఏర్పాటులన్నిటిలోను లోపములేనట్లుగ చేసియున్నారు. నేరము లన్నింటియొక్క శాఖ వీరి అధీనములోనే యున్నది. అశాఖపై వీరు అతికఠినముగా విచారణలు కావించు

చుందురు. వీరు అత్యంతముగా విశ్వాస పాత్రులును, మంచి పరిశ్రమ చేయువారును నై యున్నారు. వీరి మూలమున కొత్వాలీ కచ్చేరిలో సంస్కారములు కావించుటలో నాకు చాల సహాయము కలిగినది" — నవాబు ఇమాదుజంగుగారు ౧౩౨౮ వ ఫసలీ వరకు కొత్వాలు ఉద్యోగమును నిర్వహించుచు అదే సంవత్సరములో మరణించిరి. వేంకట రామారెడ్డి గారికి తామే కొత్వాలుగా నియమింపబడుదురను నాశలేకుండెను. హిందుస్థానమునుండి యెవ్వరైన క్రొత్తవారు వత్తురనియు, ఇంగ్లీషు అధికారి యెవ్వరైన నియుక్తులగుదురనియు, వదంతులుండెను. ఇందుకు ముఖ్యకారణమేమనగా, కొత్వాలీ యుద్యోగ చరిత్రలో నంతవరకు ఏహిందువుకూడ నియుక్తుడై యుండలేదు. పైగా వేంకట రామారెడ్డిగారు ౬ సంవత్సరములు ప్రథమ సహాయకొత్వాలుగా నుద్యోగము నిర్వహించిన వారైనను మ. ఘ. వ. నిజాంప్రభువుగారి సముఖమునకెన్నడును వెళ్లినవారుకారు- వారు ప్రతిదినము తమ బసకు పోవునపుడు ప్రభువుగారి దేవిడీ మీదుగనే పోవలసి వచ్చినను ఇంకొక చుట్టు బాటనుండి తమ యిల్లు చేరుకొనెడివారు. వారంత గొప్ప యుద్యోగముచేసినను ప్రభువుగారి దేవిడీలోనికి వెళ్ళియెరుగరు. ప్రభువుగారితో మాట్లాడుట కూడ వారికి తటస్థించలేదు.

ఇమాదుజంగుగారు చనిపోయిన కాలములో నవాబు ఫరీదూన్ ముల్కు అనువారు ప్రధాన మంత్రులుగా నుండిరి. ఇమాదుజంగు చనిపోయిన మూడవ దినము ప్రభువుగారు వేంకట రామా రెడ్డిగారిని పిలిపించినారు. ప్రభువుగారి వద్ద (పేషీలో) కార్యదర్శిగా నవాబ్ అజ్మార్ జంగ్ బహద్దరు అను వారు పనిచేయు చుండిరి. ప్రభువుగారితో ప్రథమపర్యాయము మాట్లాడవలసి వచ్చినందులకు రెడ్డిగారికి ఒక విధమగు భీతి కలిగెను. దర్బారు మర్యాదలెట్టివో, ఎట్లాచరించు కొన వలెనో, ఏమి అడుగుదురో, ఏమి చెప్పవలెనో. ఏమి పొరపా టగునో, ఏటి మాట వచ్చునో, ఏమో? అను తహతహ కలిగెను. ప్రభువుగారి ఆజ్ఞాబద్ధులై రెడ్డిగారు దేవిడీ ద్వారము వద్ద సేవలో నిలచినారు. ఆనాడు శుక్రవారము. నమాజుసమ యము. ప్రభువుగారు దేవిడీనుండి బయటికి విచ్చేసి నేరుగా నమాజుకై మక్కామసీదునకు వెళ్లిరి. వేంకట రామా రెడ్డి గారును వారి వెనువెంటనే మసీదువరకు వెళ్లి దూరముగా నిలిచియుండిరి. ప్రభువుగారు నమాజు చేసికొనిన తర్వాత "సహాయ కొత్వాలు ఎక్కడ" అని విచారించగా వారి పేషీలో నుండునట్టి నవాబ్ అజ్మార్ జంగు బహద్దరుగారు వెనుక భాగ ములో నిలిచి జంకుతు వెనుదీయుచున్న రెడ్డిగారిని ముందరకు పెట్టినారు. ప్రభువుగారు రెడ్డిగారిని నాలుగైదు మారులు

ఎగదిగ అదేపనిగా చూచినారు. "సరే మంచిదిపో" అని సెలవిచ్చి దేవిడీకి వెళ్ళి "మరల ఆజ్ఞాపించు వరకు వేంకట రామారెడ్డి తాత్కాలిక కొత్వాలుగా పని చేయు చుండ వలెను." అని ఆజ్ఞాపత్రమును పంపినారు.

వేంకట రామారెడ్డిగారు కొత్వాలీ యుద్యోగమును ఫసలీ ౧౩౨౮ వ సంవత్సరములో పొందినారు. మొదలు మొదలు ప్రభువుగారి సన్నిధికి వారు జ్ఞాపకము చేసినప్పుడు నాలుగైదు దినాల కొకమారు వెళ్లుచుండెడివారు. రాను రాను దినమును, ఒక్కొక్కమారు దినమున కెన్నియోపర్యాయములును పోవలసిన వారై తమ ప్రభువుగారి సేవలో నప్రమత్తులై యుండిరి.

# ఎనిమిదవ ప్రకరణము

## నగర కొత్వాలు

హైదరాబాదు నగరకొత్వాలు పదవిలో ఆదినుండియు నేటివరకు ముసల్మానులే అందును విశేషముగా సున్నీ తెగవారే నియమితులగు చుండిరి. రెడ్డిగారే ప్రప్రథమహిందువు లీ పదవి నలంకరించుటకు! ఈ సందర్భములో కొత్వాలీ చరిత్ర కొంత తెలిసికొనట వినోదకరముగా నుండును.

సర్ సాలార్జంగుగారి కాలములో "జిల్లాబందీ" పద్ధతి యేర్పడెను. అంతకు పూర్వము నగరములో ౧౮ మంది కొత్వాలులు పని చేసియుండిరి. వారిని "అతారాకొత్వాల్" అని యందురు. వీరిలో తాలిబుద్దౌలా, గాలిబుద్దౌలా అను నిద్దరన్నదమ్ములు ప్రసిద్ధులైనవారు. వారిక్రింద ౮౦౦ పోలీసు సిబ్బంది మాత్రమేయుండెను. వారి కాలములో పోలీసువారి అధికారములకు పరిమితి లేకుండెను. ఎవరిపై కన్నుబడినవారిని పట్టుకొనుచుండిరి. ఎంతకాలము వరకైనను వారిని జెయిలులో

విచారణ లేకుండమూసియుంచుచుండిరి. ఈకొత్వాలీ యుద్యోగము గ్రామ కరణీకమువలె వంశపారంపర్యముగా వచ్చు ఉద్యోగముగా భావింపబడు చుండెను. గాలిబుద్దౌలా చని పోయినప్పుడు అతని కుమారుడు రెండేండ్లవాడు. ఆ పిల్లవాని పేర కొత్వాలీ పదవిని స్థిరపరచి అతనికి బదులుగా నొక సహాయ కొత్వాలును నియమించి పని తీసికొనిరి.

కొత్వాలీ పదవి నలంకరించిన వారిలో నవాబ్ జోరా వర్ జంగ్ అనువారు కూడ చాలప్రసిద్ధులు. వారు జనుల ముఖములను చూచియే దొంగలెవరో దొరలెవరో గుర్తించెడి వారట! వారు అరుదుగా నగరములో సవారీ వెళ్లుచుండెడివారు. ఎప్పుడైన వాహ్యాళి వెళ్ళినప్పుడు వారు గుర్రముపై నెక్కి ముందు వెనుకల అరబ్బులు, రోహిలాలు, పోలీసు జవానులు నడుచుచుండగా నగర వీధులలో తిన్నగా గంభీరముగా వెళ్లుచుండెడివారు. జవానులకు డ్రెస్సులు లేకుండెను. కొందరకు లాగులు, కొందరకు ధోవతులు, కొందరకు తెల్లని అంగీలు, అందరికిని నడుములో తోలుపట్టీలు, చేతులలో కట్టెలును ఉండుచుండెను. కొత్వాలుగారు సవారీ వెళ్ళినప్పుడు వీధులలో ఉభయ పార్శ్వములందు జనులు క్రిక్కిరిసి నిలుచుకొని యుండెడివారు. కొత్వాలుగారు ఆదిక్కు ఈదిక్కు జనులను తేరిపార చూచుచు అందందు గుర్రమునాపి తన జవా

నులతో ఫలానివాడు దొంగ వానిని పట్టుకొనుడు అని యాజ్ఞాపించి ముందు సాగిపోయెడి వారు. ఈ ప్రకారముగా వారు ఇల్లు చేరుకొనువరకు కొంతమందిని త్రాళ్లతో గట్టి జవానులీసుకొని వచ్చెడివారు. ఆ నిర్బంధితులు తమ తప్పు లన్నింటిని ఒప్పుకొన్న తర్వాత వారిని జెయిళ్లలో వేయుచుండిరి!!

ఆ కాలములో ఉత్తరమునను, మధ్యహిందూ స్థానమునను వ్యాపించినట్టి ఠగ్గులు హైద్రాబాదు రాజ్యములోను వ్యాపించుకొని యుండిరి. నిజామాబాదులోని సిర్నపల్లి ప్రాంతాలలో గుట్టలును, దట్టమగు అడవులును నిప్పటికిని కలవు. అందు విశేషముగా ఈ ఠగ్గుల ఘోరములు జరుగుచుండెను. మరియు హైదరాబాదు నగర సమీపములో నుండిన ఆసఫ్ నగరు గుట్టవద్ద నొక దేవాలయ ముండెను. అది గోసాయీల యొక్కయు, ఫకీరుల యొక్కయు; సన్యాసులయొక్కయు ఆశ్రయమై యుండెను. వారు వేషధారులైన దొంగలుగా నుండిరి. ఠగ్గులు తాము దోచిన ధనమును ఈ సన్యాసుల కిచ్చుచుండిరి. లక్షలకొలది విలువగల సొమ్ములు, ముత్యములు, వజ్రములు వీరివద్ద దాచియుంచ బడుచుండెను.

నగర కొత్వాలుల చరిత్రలో నవాబ్ అక్బర్‌జంగు కొత్వాలుగారి కాలపు చరిత్రయు చాల వినోదకరముగా నున్నది. అక్బర్ జంగు గారు ౧౨౬౩ ఫసలీలో

(అనగా వేంకట రామారెడ్డిగారు సుమారు ౧౪ - ౧౫ సంవత్సరముల వయస్సు బాలుడుగా నుండిన కాలములో) నగర కొత్వాలీ పదవినందిరి. అతడు చండశాసనుడు. అతని పేరు చెప్పిన దొరలు, దొంగలు, ధనికులు అందరును గడగడ వడకుచుండిరి. కొత్వాలుగారి కెవ్వరిపైన కోపము కలుగునో వారు నాశనమైనట్లే. వారికాలములో నగరమందు సుమారు ౧౦౦౦౦ అరబ్బులుండిరి. ఈ అరబ్బులు నగరములో హత్యలు లూటీలు విశేషముగా చేయుచుండిరి. మొహర్రము పండుగలో వీరి దౌర్జన్యములు పారమందుచుండెను. నవ్వాబు అక్బరుజంగు కాలములో నొక ఘోరమైన ఘట్టము సంభవించెను. మొహర్రమునాడు గొప్ప గొప్ప నవాబులు ఏనుగులనెక్కి తమ తమ సిబ్బందితో వీధులందు వాహ్యాళికి వెళ్ళుచుండెడివారు. ఆచార ప్రకారము కొత్వాలుగారును రాత్రిసమయమున తన సిబ్బందితో ఏనుగుపై నెక్కి సవారీవెళ్ళినారు. పత్తర్ ఘట్టీ బాజారువరకు వారువచ్చినారు. ఇంతలో ఎదురుగా నగర భాగమునుండి అరబ్బుల నాయకుడైన సుల్తాన్ నవాజుజంగు గారి పిల్లలు ఏనుగునెక్కి చారుమినారు నుండి బయలుదేరి వచ్చిరి. కొత్వాలుగారు వారిని ప్రక్కకు పొమ్మని ఆజ్ఞాపించినారు. వారి యేనుగు ప్రక్కకుపోయినదికాదు. ఇంతలో కొత్వాలుగారు స్వయముగా తన ఏనుగును నడిపించికొనుచు

సుల్తాను నవాబుజంగుగారి పిల్లలెక్కిన ఏనుగును సమీపించి తుపాకీని గురిపెట్టి "ఒక్క అడుగు మీ ఏనుగు ముందుకడి చెనా మిమ్ముల కాల్చివేయుదును. ఖబర్దార్" అని గర్జించిరి. పిల్లలు గడగడ వడకిపోయిరి. ఒక పిల్లవాడు ఉక్కిరి బిక్కిరియై ఏనుగునుండి దిగజారినాడు. పిల్లలు ఏడ్చుచు ఇంటికి మరలి పోయిరి. వారి తండ్రికి తన పిల్లలకు జరిగిన అవమానము తెలిసినంతనే యత్తు మండిపడి "నగరములో ఎచ్చటనైనను సరే పోలీసువాడు కాని, పోలీసు డ్రెస్సులోనుండినట్టి వాడుకాని కనబడిన వెంటనే కాల్చివేయుడు" అని తన అరబ్బులకు ఆజ్ఞా పించెను. ఇంకేమున్నది! అరబ్బులు చెలరేగి పట్నముపై విరు గబడిరి. చారుమినారునుండి హత్యలు ప్రారంభించిరి. కనబడిన పోలీసువారి నందరిని కాల్చుచు వచ్చిరి. వీథులలో పీనుగులు పడియుండెను. కొత్వాలుగారు పారిపోయి తమ యింటిలో దాగుకొనినారు. పోలీసువారు వస్త్రులను తొందర తొందరగా విడిచి మురికి కాలువలలో విసరివేసి పారిపోయి కనబడిన దగ్గరి యిండ్లలో దూరి దాగుకొనినారు. సాలార్జంగుగారికి ఈ వార్త తెలిసెను. వెంటనే మిలిటరీ సేన కాజ్ఞయిచ్చెను. మిలిటరీవారు నగరము నాక్రమించుకొనిరి. ఒకదిక్కు సుల్తాను నవాజు జంగునకు తన సిబ్బందిని వెంటనేపిలిపించుకొనుట కాజ్ఞాపించిరి. ఈ ఆజ్ఞను అఫ్సర్ జంగు అనువారి ద్వారా పంపిరి. వారును

అత్యంత ధైర్య సాహసయుక్తులు. ఒక్కరే సుల్తాన్ యార్జంగు దేవిడీకిపోయి ఆజ్ఞవినిపించి వారినిభయపెట్టి శాంతిసంరక్షణార్థమై అతని కమాను లను జమాతుగా తీసుకొని వచ్చినారు. తర్వాత శాంతినెలకొనెను. విచారణలు జరిగెను కొందరిఅరబ్బులకు జెయిలుశిక్షలు! సుల్తానునవాజు జంగుగారికి కఠిన మైనమందలింపు!! ఇది పర్యవసానము! అక్బరుజంగు తర్వాత సుల్తాను యార్జంగు అనువారు, లాల్ ఖాన్ అనువారును సుప్రసిద్ధులైన కొత్వాలులుగా పనిచేసిరి. వారియనంతరము ప్రసిద్ధులైనవారు నవాబ్ ఇమాద్‌జంగుగారు. వారి కాలములోను పెద్దలు చిన్నలు నగరమందు వారిని చూచి భయపడు చుండెడివారు. కాని పూర్వమువలె పరిస్థితులు లేకుండెను. చాల మారిపోయి యుండెను. వారికాలమునందే వేంకట రామారెడ్డిగారు సహాయకు కొత్వాలుగా వారి కోరికపైననేనియుక్తులైరి.

కొత్వాలీ దర్బును సాగించిన తుది కొత్వాలు నవాబు ఇమాద్జంగు గారే! వారితో పూర్వకాలము పరిసమాప్తి. క్రొత్తకాలము, క్రొత్తపరిస్థితులు, ఏర్పడెను. వేంకట రామారెడ్డిగారు కొత్వాలు అయిన కాలమునుండి నగర కొత్వాలీ పదవి బ్రిటిషిండియాలోని నగర పోలీసుకమిషనరు పదవి యొక్క పద్ధతుల పైననే ఏర్పడుచు వచ్చెను. మరియు వేంకట రామారెడ్డిగారు పూర్తిగా క్రొత్త మార్గమును ద్రొక్కిరి.

పూర్వము కొత్వాలు పేరు చెప్పిన ప్రజలకు సగము ప్రాణము పైననే ఎగిరిపోవు చుండెను. వారి చేతులలో పడిన వారు మరల బయట పడిననాడు పునర్జన్మమెత్తినట్లు భావించుకొనెడి వారు. ఆ కాలము దాటిపోయెను. రెడ్డిగారు శాంతమూర్తులై సర్వప్రజానురంజకులై ముఖ్యముగా బీదవారియందు అపారమైన దయగలవారై తమ యుద్యోగ కాలమును గడపిరి. రెడ్డిగారు నగర కొత్వాలీ పదవికి వచ్చునప్పటికి దేశకాల పరిస్థితులు చాల మారిపోయెను. బ్రిటిషిండియాలో సహాయ నిరాకరణోద్యమము విజృంభించుచుండెను. వేనవేలు జెయిలుకు పోయిరి. లాఠీప్రయోగములు, తుపాకీ కాల్పులు, ఆర్డినెన్సులు విరివిగా ప్రయోగములోనికి వచ్చెను. లార్డు రీడింగు వైస్రాయిగా నుండిరి. గాంధీగారి సత్యాగ్రహ తత్వము ఇంగ్లీషు వారిని గందరగోళములో పడవేసెను. తుదకు లార్డు రీడింగు గారుకూడ "నేను దిగ్భ్రమ చెందినాను. నాకు దిక్కు తోచ లేదు." ( "I am puzzled aud perplexed" ) అని సెలవిచ్చిరి.

ఆ బ్రిటిషిండియాలోని వాతావరణము నిజాంరాష్ట్రములోనికి వీచెను. అట్లువీచుటకు ప్రబల కారణము ఖిలాఫతు సమస్యయే. హైదరాబాదు నగరములో ( ఇప్పుడు ఉన్నత న్యాయస్థాన మూర్తులైన) బ్యారిస్టర్ అస్గర్ గారును, ధర్మవీర

వామన్ నాయకుగారును, పండిత్ కేశవరావుగారును హిందూ ముసల్మాను నాయకులై ప్రచండ సభలుచేసిరి. ఆనాడు రాజకీయ వాతావరణ మెట్లుండినను హిందూ ముసల్మానుల ఐక్యత మాత్రము ప్రశంసనీయముగా నుండెను. ఖిలాఫత్ గడబిడలలో బ్రిటిషిండియాలోని వారు కొందరు నిజాంరాష్ట్రములో ప్రవేశించి ఆందోళనము చేసిరి. అహమ్మదాబాదునుండి ఇద్దరు ముగ్గురు ఖిలాఫతు సంఘమువారు హైదరాబాదు నగరములో ప్రచారముచేసి వేలకొలది జనుల గుంపును తీసికొని రెసిడెన్సీ కోర్టుపైబడి అల్లరులు చేసిరి. రెసిడెన్సీ న్యాయస్థానముపైబడి అచ్చటి బంగ్లాలోని తలుపులను, అద్దములను పగులగొట్టిరి. వేంకట రామారెడ్డిగారికీవార్త తెలిసినవెంటనే ఏమియును జంకక, అనితర సహాయులై ఆందోళన రంగముజేరి ప్రజలకు శాంతిపద్ధతులను బోధించి గుంపులను చెదరిపోవునట్లు చేసి తర్వాత అహమ్మదాబాదునుండి వచ్చినవారిని పట్టుకొని రాష్ట్రమునుండి వెడలగొట్టించిరి. తర్వాత నగరములో మరే అల్లరులును జరుగకుండునట్లుగా మంచి యేర్పాట్లుచేసి ప్రభుత్వమువారి కేమియు చింత కలుగకుండునట్లుగా చూచుకొనిరి.

ఇట్టి వాతావరణములో వేంకట రామారెడ్డి గారు నగర కొత్వాలు పదవి నలంకరించిరి. పూర్వకాలపు పరిస్థితులు పట్టువిడువక ఒకప్రక్క వర్తించుచుండెను. ఒకప్రక్క

రాజకీయపు సంబంధమగు ఖిలాఫత్ ఆందోళనము, ఇంకొక ప్రక్క బ్రిటిషిండియాలోని సత్యాగ్రహపు గాలి వీచుచుండుట తటస్థించెను. నవాబులు, రాజులు, తమ ప్రాచీనాధికారములను వదలువారుకారు. వారేమైన అక్రమములు చేసినను వారిపై అధికారము పూర్ణముగా చూపించిన వారు ప్రబల శత్రువులగుదురు. ప్రజాందోళనమును అణచిన అపయశస్సును పొందుదురు. అల్లరులు జరిగినప్పుడు సమయము కనిపెట్టుకొని యుండినట్టి సరిపడనివారికి ప్రభుత్వమువద్ద విరుద్ధప్రచారము చేయుట కవకాశము లభించును. ఇవన్నియు నిట్లుండ నగరములో ఒకజాతివారు, ఒక దేశమువారు, ఒక మతమువారు అను పరిమితి లేకుండెను. నడుము చుట్టును బాకులు, కత్తులు, మెడలపై తుపాకులు వేసుకొని తిరుగు అరబ్బులును, బీదల పాలిటి భయంకరులై పీడకులని వ్యక్తపరచుకొనిన రోహిలాలును, పఠానులును, చెలరేగిన పట్టశక్యముగాని సిక్కులును, ఇట్టివే యితర జాతులవారును నగరమందు బహుళముగా నుండిరి. (ఇప్పటికిని కలరు.)

ఈ పరిస్థితులలో వేంకట రామారెడ్డిగారి ఉద్యోగము అసిధారా వ్రతము వంటిదై పోయెను. ఏ క్షణమున ఏ వి పొరపాటు జరుగునో యే [illegible]నికి అసంతృప్తి కలుగునో, ఏమి ఆగ్రహ[illegible]నో అను ఆందో

నము వారిలో లేకపోలేదు. ఇట్టి సన్నివేశములలో ఇట్టి అగ్ని పరీక్షలకు లోనై అందు విజయమును పొంది మ. ఘ. వ. నిజాం ప్రభువుగారిని మొదలుకొని, పోలీసు సిపాయివరకును, మోటారునెక్కు రాజులను మొదలుకొని, మోటకొట్టు రైతు వరకును, అందరును ప్రశంసించునట్లుగా వేంకట రామారెడ్డి గారు వర్తించుకొనినారు. హిందూ ముసల్మానులు సమానముగా ఒక అధికారిని ప్రేమించుట ఈ రాష్ట్రములో అరుదైనట్టియు, విచిత్రమైనట్టియు సంఘటనము. అట్టి సమానప్రేమకు పాత్రులైనవారు శ్రీ వేంకట రామారెడ్డి గారొక్కరే కాన వచ్చుచున్నారు.

వీరు కొత్వాలు పదవికి వచ్చిన కొలది కాలములోనే పోలీసు శాఖలో అనేకములైన మార్పులు కావించిరి. పూర్వ పద్ధతిని వదలివేసి క్రొత్తపద్ధతిపై చేతిక్రింది యుద్యోగులను సిద్ధముచేసిరి. వీరిలో నింకొక్క విశేషమున్నది. ప్రతిచిన్న విషయమునుగూడ తాము స్వయముగా విచారించుకొని తృప్తిపడిన పిమ్మటనే క్రింది అధికారులకు చర్యగైకొనుటకై అనుజ్ఞ యిచ్చెడివారు. ఈ కారణముచేత వారికి నిరంతరము పనియే యుండిన దన్నమాట. పగమురాత్రివేళ కూడ నగరములో ఏదైన దౌర్జన్యములు కలిగిన క్రింది అధికారులు వారినిలేపి స్వయముగా తెలుపుచుండిరి. లేదా టెలిఫోనుద్వారా వారి

తో మాట్లాడి విషయములు తెలిపి ఆజ్ఞలుపొందు చుండిరి. ఇట్లు రాత్రిం బగళ్లును కష్టపడిన అధికారి మొత్తము నిజాం రాష్ట్రిమంతటను వీరొక్కరే కానవచ్చుచున్నారు.

వీరి కాలములోనే లార్డురీడింగుగారు హైద్రాబాదునకు వచ్చిరి. వీరు తమ కచ్చేరిలో "వైస్రాయిశాఖ" అనున దొకటి ప్రత్యేకముగా వైస్రాయిగారు వచ్చుటకు మూడు నాలుగు మాసములకు ముందే ఏర్పాటుచేసి, తగు కట్టుదిట్టములు చేసినారు. వైస్రాయిగారికిగాని, ప్రజలకుగాని ఏయిబ్బందులును కలుగకుండునట్లుగా ఏర్పాటు చేయుటలో వీరి చాకచక్యము, దూరదృష్టి, నేర్పరితనము, సువ్యక్తమగు చున్నది. సాధారణముగా వైస్రాయిగారి వంటివారు నగరమునకు వచ్చిన ప్రజల కిబ్బంది కలుగును. గంటలకొలది వైస్రాయిగారు పోవు వీధులలో పోలీసువారు నిలిచి ఆ బాటలలో, జనులుకాని, బండ్లు, మోటారులు గాని పోకుండునట్లుగా నిరోధించుట వాడుకయై యుండెను. అట్లు చేయుటచేత ప్రజలకును, వ్యాపారస్థులకును, వ్యవహారస్థులకును నష్ట కష్టములు సంభవించెడివి. అట్టి వేవియు సంభవింపకుండు నటుల కొత్వాలుగారు ఏర్పాట్లు చేసినారు. వైస్రాయిగారు వచ్చిరి. అన్నియు సవ్యముగా జరిగినవి. వారు సురక్షితముగా వెళ్లిపోయిరి.

ఇదే కాలములో వేల్సు యువరాజుగారును 5వ జార్జిచక్రవర్తిగారి పెద్దకుమారులును అగు యెడ్వర్డు యువరాజుగారు హిందూస్థానమునకు విచ్చేసిరి. హిందూస్థానములో సహాయ నిరాకరణోద్యమము ప్రచండముగా జరుగుచుండినందున యువరాజుగారు వచ్చుటకిది సమయము కాదనికూడ గాంధీగారు తెలిపియుండిరి. అట్లు తెలిపినను వారు రానే వచ్చిరి. పెద్దపెద్ద నగరాలలో హర్తాలులు జరిగెను. వీధులు నిర్మానుష్యమయ్యెను. ఇండ్లపై నల్లజండా లెగురుచుండెను. కొన్నితావులందు వీధులలో కలహములు జరిగెను. కొంత ప్రాణనష్టముకూడ కలిగెను. యువరాజుగారి కార్యక్రమములో హైదరాబాదునకు వచ్చుటయు ముఖ్యమైనదిగా నుండెను.

యువరాజుగారు ఇంకొక సంవత్సరమునకు హిందూస్థానమునకు రానున్నవారని వేంకటరామారెడ్డిగారికి తెలియగా వారు తప్పకుండ హైద్రాబాదు నగరానికి రాగలరనియు, వారితో మాట్లాడు నవసర మేర్పడుననియు ఊహించుకున్నారు. ఊహ సరియైనదిగానే యుండెను. వారు వెంటనే తమ అరువదవయేట ఆరేండ్ల బాలునివలె ఇంగ్లీషు విద్యాభ్యాసమును మొదలుపెట్టిరి. తాము ఉద్యోగములో ప్రవేశించిన కొలదికాలము తర్వాత అనగా తమ యిరువదవయేట

ఇంగ్లీషులో ఏ బీ సీడీలు పూర్తి చేసికొని "యెస్" "నో" వంటి నాలుగైదు ముక్కలు నేర్చుకొని యుండిరి. కాని ఉద్యోగ ధర్మములో ఊపిరి తిరుగనివారై ఆ కొలదిపాటి ముక్కలనెన్న డో మరచి యుండిరి. ఇప్పుడు మరల బుద్ధిపుట్టెను ఒక బీ. ఏ. పండితుని గురువుగా నేర్పాటు చేసికొన్నారు. పాఠములు మొదలు పెట్టినారు. పదముల కాగుణితము (స్పెల్లింగు) ఉచ్చారణ, అర్థము, వ్రాత పూత శ్రద్ధతో రాత్రికాలములో చెప్పించుకొనుచు తెల్లవార ౪ గంటలకే లేచి గట్టిగా మన నము చేసికొనుచు పాఠముల నేర్వ మొదలిడిరి. ఒక నాడు రాత్రి ౧౧ గంటల కాలమప్పుడు తన పాఠములను గట్టిగా కంఠపాఠము చేయుచుండిరి. గది ముందట నేయుండిన షహరా జవాను (పూటకాపరి) యీ విపరీత శబ్దములను ధ్వనులను విని నాడు. అదరిపడినాడు. ఎన్నడును విననికీతిగా క్రొత్త క్రొత్త ధ్వనులతో కొత్వాలుగారు తనలో తానే వదరుకొను చున్నారు. ఉర్దూకాదు, ఫార్సీకాదు, అరబీకాదు, తెనుగు కాదు, పడిన్నీ కాదు. ఇవేమి ధ్వనులు? ఆయనకు పిచ్చిలేచి యుండును. లేదా దయ్యమైనను పట్టియుండును. అని తర్కించు కొని నిశ్చయించుకొనినాడు. ఆ భటుని కిది నిశ్చయమైన వెంటనే తన తుపాకీని గోడ కానించి పరుగు పరుగున సమీ పములోనుండు ఒక సదరు అమీనును సమీపించి కొత్వాలు

గారికి సంభవించిన యీ యకాండ విపత్తును మనివి చేసికొని నాడు. సదరమీనుగారును దిగ్భ్రమజెంది ఉక్కిరి బిక్కిరిగా పరుగెత్తుకొనివచ్చి కొత్వాలుగారి బంగ్లా తలుపు తట్టినారు. కొత్వాలుగారు తలుపు తెరచినారు. సదరమీనుగారు తనతో జవాను చెప్పినవార్త తెలిపినారు. కొత్వాలు గారదంతయు పొరపాటనియు, తాము ఇంగ్లీషు పాఠమును నేర్చుకొనుచుం టిమనియు, జవానుయొక్క నిర్ణయమును గురించి కొంతసేపు ముచ్చటించుకొని తమలో తాము నవ్వుకొనిరి. ఇట్లు వీరు ఇంగ్లీషువిద్యాభ్యాసము అతి శ్రద్ధతో చేసినారు. తప్పులో ఒప్పులో మాట్లాడుటకును మాట్లాడిన మాటలు అర్థముచేసి కొనుటకును నేర్చుకొనినారు.

వేల్సు యువరాజుగారు హైద్రాబాదునకు రానుండిరి. కాని ఒకచిక్కు సంభవించను. వారు నాలుగు గుర్రాలబగ్గీ లోనే ఊరేగింపు వెళ్ళకలచినామని తెలిపినారు. భారతదేశము లోని ఆందోళనములను దినదినమును వినుచున్నందున హైద్రాబాదు ప్రభుత్వమువారు వారిని బగ్గిలో తీసికొని పోవుట ఉచితముకాదనియు మోటారులోనే తీసికొని పోవలె ననియు నిర్ణయించినారు. కాని వేల్సు యువరాజుగారు పట్టిన పట్టు వదలు స్వభావము లేనివారని అప్పుడేకాదు తర్వాత కూడ సామ్రాజ్య పీఠమునే వదలి నిరూపించినారు. అప్పుడు

హైద్రాబాదులో సర్ అలీ ఇమాముగారు ప్రధాన మంత్రిగాను, రస్సల్ అనువారు రెసిడెంటుగాను నుండిరి వీరును ఇతర మంత్రివర్గము వారును, శ్రీ నిజాం ప్రభువుగారును. అందరును వేల్సు యువరాజుగారిని మోటారులోనే తీసుకొని పోవుట యుక్తమని నిర్ణయించిరి. తుదకు వేంకట రామారెడ్డిగారిని పిలిపించి వారి అభిప్రాయ మడిగిరి. "వేల్సు యువరాజుగారు బగ్గిలోనే వెళ్ల నిశ్చయించిన అటులే కానీయుడు. అన్నిటికి నేను బాధ్యుడనై యుందును. మీరు కేమాత్రము విచారపడ వలసిన పనిలేదు" అని రెడ్డిగారు ప్రత్యుత్తరమిచ్చిరి. అందరును ఆశ్చర్యపడిరి. "నీ కేమైన మతి తప్పినదా! పిచ్చివాడవైనావా- నీ వేమి మాట్లాడుచున్నావో ఆలోచించుకొన్నావా? ఇంత గొప్ప బాధ్యతను నీవు నిర్వహింప జాలుదువా? బ్రిటిషు ఇండియాలోని పరిస్థితులను దిన దినము జరుగు ఆందోళనములను నీవు గమనించినావా?' ని యెన్నియో ప్రశ్నా పరంపరలు మంత్రిగారును, అందరును, వీరిపై కురిపించినారు- అన్నిటికిని ఒకటే ప్రత్యుత్తరము — "నేను సంపూర్ణ బాధ్యత వహించియే మాట్లాడుచున్నాను".

"ఏదైన ప్రమాదమైన".

"నా తల సమర్పించుకొందును"

"బాగా ఆలోచించు కొనుము. ప్రమాద మేమాత్రము జరిగినను రాష్ట్రమునకు శాశ్వతమైన కళంకము కలుగును"

"అటుకాకుండ చూచుకొన కుండిన నా సేవ యింకెందుకు ?"


"నీ యిష్టము"

అని తుదకు రెడ్డిగారి మాటగా వేల్సు యువరాజుగారి కంగీకారమును తెలుపుకొనినారు.

వేల్సు యువరాజుగారు వచ్చుటకు రెండు మూడు మాసములకు ముందునుండియే కొత్వాలుగారు పడిన పాటులు వారి యాలోచనలు, వారి ఏర్పాటులు, వారి జాగరూకత, అవన్నియు, వారికే తెలియును. అదంతయు వర్ణించుట ఒక గొప్ప గ్రంథమే యగును. నగరములోనికి వచ్చునట్టి యే క్రొత్త వారైనను వారి దృష్టిలోనికిరాకుండ పోలేదు. రహస్య పరిశోధకులగు చారుల సంఖ్యను అపారముగా పెంచినారు. అనుమానస్థుల నందరిని నెప్పటి కప్పుడే బయటికంపుచు వచ్చినారు. పోలీసు సిబ్బందిని ఎక్కువ చేసినారు. యువరాజుగారు వెళ్ళు రాజవీధులను ముఖ్యముగా దృష్టిలో నుంచుకొన్నారు. ప్రజల కిబ్బందులు కలుగకుండునట్లుగా ఏర్పాటులు ముందు ముందుగానే కావించినారు. యువరాజుగారింక ౧౦ — ౧౫



రా బ. ౦కటరామారెడిగారు, ౧. మ. ఘ. న. నిజాం గారి కుమా[illegible] ౨. మ. ఘ. న. నిజాం ప్రభువ గారు



బాలికలఉన్నతపాఠశాల, అధ్యక్షులు: రాజా సాహెబు వేంకట రా… కె. సి. ఐ. ఇ. గారు

దినాలకు రానున్నారనగా పూర్వపు జిల్లాపోలీసు డైరెక్టరైనట్టి హెంకినుగారినికూడ పిలిపించి యువరాజుగారి బంగ్లా సంరక్షణ కర్తగా నియోగించినారు. హెంకినుగారు రెడ్డిగారు చేసిన ఏర్పాట్లన్నియు విమర్శనతో చూచి అన్నియు తెలిసికొనిన తర్వాత ఇట్లన్నారు. " నా శిష్యులలో నీ వొక్కడవే నిజమైన శిష్యుడవు. ఇంతకన్న మించిన ఏర్పాటులు నేను కూడ చేయువలసినదిలేదు. అయితే ఒక్కమాట. ఇంత కట్టుదిట్టములు చేసిన తర్వాత తీరా యువరాజుగారు వచ్చునాడు వీధులు నిర్మానుష్యముగా నుండిన అదియు వికారముగాను విపరీతముగాను భావింపబడునుగదా. దానికేమి యాలోచించితివి." రెడ్డిగారు యువరాజుగారి ఆగమనమునకొరకు దినము ముందు నగరమంతటను దండోరా వేయించినారు. యువరాజుగారి వేడుకలుచూడ గోరువారందరును ప్రొద్దుననే ఎనిమిదిగంటలలోగా వచ్చి శాంతముగా వీధులలో బాటప్రక్కన కూర్చున వచ్చునని చాటింపు చేయించినారు. తుదకు యువరాజుగారు రానేవచ్చిరి- వీధులలో జనులు క్రిక్కిరిసినారు. నాలుగు గుర్రాల బగ్గీలో తిన్నగా నెమ్మదిగా ఊరేగింపు చేసినారు. ఫలక్నుమా సౌధములో చేరుకున్నారు. అంతయు శుభావహముగానే జరిగినది.

యువరాజుగారు వచ్చుటకు ౧౫ దినాలకు ముందుగా సిమ్లాలో నుండిన సి. ఐ. డీ. పోలీసు డిప్యుటీ డైరెక్టర్ జనరల్ గారు హైద్రాబాదుకు వచ్చి కొత్వాలుగారి ఏర్పాట్లన్నియు సూక్ష్మముగా విచారించిచూచినారు. నగరమంతయు తిరిగినారు. ముఖ్యముగా పాతుగోడలను పరిక్షించినారు. ఆ గోడల దాపున ఒకరిద్దరు ప్రతిచోటను కనబడినారు. సి. ఐ. డీ. అధికారి వారి విషయమై విచారించినారు. కొత్వాలుగారు సీటీ యిచ్చ్యగానే ఆగోడల లోపలివారు వచ్చినారు. వీరు మా చారులే అని చూపించినారు. సీ. ఐ. డీ. అధికారికి సంపూర్ణముగా తృప్తి కలిగినది. యువరాజుగారు వచ్చిననాడు వీధులలో సుమారు ౩ — ౪ లక్షలమంది కనబడినారు. సి. ఐ. డీ. అధికారి కొత్వాలుగారి మోటారులోనే యుండినారు. జన సమ్మర్దమునుచూచి భయపడిపోయినారు. "ఏమి మీరు భయపడవలసిన పనిలేదు. అంతయు నాదే బాధ్యత" అని కొత్వాలుగారు నిర్భయముగా చెప్పినారు.

యువరాజుగారు ఐదు దినములు నగరములో అతిథిగా నుండినారు. మరునాడు శ్రీ నిజాం ప్రభువుగారి వద్ద విందు. కొత్వాలుగారు యువరాజుకన్న ముందుగా దేవిడీకి వెళ్లినారు. దేవిడీ ద్వారమువద్దనే మిలిటరీవారు ఆతని నాపినారు. "నేను కొత్వాలును నన్ను వదలుడు" అని తెలుపుకొనినను వదల

లేదు. ద్వారమునుండి దేవిడీలోపలి భాగము మిలిటరీవారు వశపరచుకొనినారు. విధిలేక రెడ్డిగారు బయటనే ఆగిపోయి నారు. శ్రీ యువరాజుగారు దేవిడీలో ప్రవేశించినారు. దేవి డీలో ఎన్నియో బంగ్లాలు కలవు. విందుకై ఏర్పాటుచేసిన బంగ్లా యేదియో తెలియదు. ఒక బంగ్లాయొద్ద మోటారు చేరినది. అక్కడ శ్రీ నిజాం ప్రభువుగారులేరు. ఆహ్వానించు వారును లేరు. యువరాజుగారికిని వారి కమాండరుగారికిని ఆగ్రహాము కలిగినది. సాపుగింట వరకు వేచుకొనినారు. తుదకు నిజాం ప్రభుగారికి తెలిసినది. అందరును కొత్వాలు గారిపై యెగిరిపడినారు. "నేను మిలిటరీవారిని ప్రార్థియపడి నను లోనికి రానీయకపోయిరి. మరి తాము సరియగు వ్యవస్థ చేయకపోయితిరి. నాదేమియు తప్పులేదు." అని రెడ్డిగారు తెలుపుకొనినారు.

మరునాడు వేరొకచోట విందు. ఆవిందులో శ్రీ నిజాం ప్రభువుగారు రెడ్డిగారిని ప్రత్యేకముగా పిలిచి యిట్లుచెప్పినారు. "ఇదిగో, రేపు నగరల మా దేవిడీలో విందు ఏర్పాటుచేసి నాము. ఎవరేమన్ననుసరే నీవు నేరుగా మా బంగ్లాకు రావ లసినది. నీవు లేనిదిమరల పొరపాటులు జరుగును" "చిత్తము" అని రెడ్డిగారు ఆదేశప్రకారం మాచరించుకొని అంతయు సవ్య ముగా జరుగులాగున చూచుకొన్నారు.

నాల్గవవాడు వేల్సు యువరాజుగారు నగరమును తా మొక్కరే ప్రైవేటుగా చూడదలచుకొనినారు. కొత్వాలు గారికికూడ తెలుపవద్దనినారు. కాని కొత్వాలుగారికి వారి సంకల్పమప్పుడే తెలిసిపోయినది. నగరమంతటను పోలీసు వారికి మెలకువతో నుండుటకై టెలిఫోను లిచ్చినారు. వేల్సు యువరాజుగారు మోటారులో ప్రైవేటుగా ఫలకున్నమా సౌధమును వదలి గుట్టక్రిందికి వచ్చినారు. రావడములోనే కొన్ని కట్టెలబండ్లు అడ్డముగా వచ్చినవి. అవన్నియు పోవుటకుగాను పదిపదేను నిముషాలుపట్టినవి. ఇంతలో వారు వెనుకకు తిరిగిచూచినారు. వెనుక రెడ్డిగారు సిద్ధముగా నుండినారు. వారిని పిలిచినారు. "నీవెందుకు నావెంట వచ్చుచున్నావు. అవసరములేదు" అని సెలవిచ్చినారు. "చిత్తము" అన్నారు రెడ్డిగారు. యువరాజుగారు చారుమినారువద్ద వెళ్ళుచున్నారు. అచ్చటి పోలీసులు దిగ్భ్రమతో నెత్తిరుమాలుల సవరించుకొనుచు తుపాకులు అపసవ్యముగా పట్టుకొనుచు కొందరులేచి కొందరు సగములేచి అడ్డాదిడ్డి సలాములు కొట్టినారు. యువరాజుగారికి మంచి వినోద దృశ్యము కనిపించినది. బాగానవ్వుకొని తరువాత కొత్వాలుగారితో ఆ దృశ్యము వర్ణించి వర్ణించి నవ్వినారట.

యువరాజుగారు వీథులలో వెళ్ళునప్పుడు దూరములో ఎన్ని యోబండ్లు, మంది, మోటారులు, సైకిళ్ళు అన్నియు కనుపించు చుండెడివి. దగ్గరకు వచ్చువరకు అన్నియు మాయము. ఇది వారికి ఆశ్చర్యము కలిగించెను. వారి మిలిటరీ సెక్రటరీగారు కొత్వాలుగారి నిట్లు విచారించినారు. మీ వీథు లన్నింటిలో భూ సురంగములేమైన యున్నవా? బండ్ల న్నియు జనసమూహమంతయు గారడివాని చేతివస్తువులవలె అప్పటి కప్పుడే మాయమగు చుండును. అప్పటి కప్పుడే పుట్టు చుండును" అని విచారించినారు. రెడ్డిగారి ఏర్పాట్లలోని విచిత్రములలో విచిత్ర మిదొకటి! ప్రజలకు ఏవిధమగు నష్ట కష్టములు కలుగకుండునట్లుగా చూచుకొనుటయే వారి ప్రధానోద్దేశమై యుండెను.

యువరాజుగారు అయిదవ దినము నగరమునుండి వెళ్ళువారైయుండిరి. అందరితోను సెలవు తీసుకొనుచుండిరి. తమ విడిది సౌధములోనికి ప్రధాన మంత్రిగారిని, మహారాజులను, నవాబులను, అధికారులను నొకరివెంట నొకరిని పిలిపించి రెండుమూడు నిముషాలు వారితో మాట్లాడి వారికేదో బహుమతి యిచ్చి పంపుచుండిరి. వేంకట రామారెడ్డిగారి వంతు వచ్చినది. వారు ద్వారము వద్దకువెళ్ళి అచ్చటి పైవేటు కార్యదర్శితో ఇట్లు చెప్పి పంపినారు. "నాకు సరిగా

ఇంగ్లీషు రాదు. అందుచేత మా రెస్కార్ట్ నైన ఉర్దూ, ఇంగ్లీషు తెలిసిన దుబాసీని పిలిపించిన బాగుండును." వేల్సు యువరాజుగారిట్లు జవాబు పంపినారు "నీకు ఇంగ్లీషు సరిగా రాదు. నాకు ఉర్దూ రాదు. ఇద్దరమును వచ్చినట్లుగా మనము మనమే మాట్లాడుకొందము రమ్మనుము."

రెడ్డిగారు యువరాజుగారి సన్నిధిలో సలాముచేసి దూరముగా నిల్చినారు.

"దగ్గరకు రమ్మ" నినారు యువరాజుగారు. రెడ్డిగారు దగ్గరకు వెళ్లినారు. యువరాజుగారు తామే ముందుకు వచ్చి రెడ్డిగారి చేయిబట్టి తన ప్రక్కన కూర్చున బెట్టుకున్నారు. "మీ ఏర్పాటులు నాకు అపరిమితముగా ఆనందము కలిగించినవి. నీకు నేను ఎల్లప్పటికిని కృతజ్ఞుడను." అని సెలవిచ్చినారు. మరియు ఈ క్రింది విధముగా సంభాషించినారు:

యువరాజు— "మీరు పంజాబునుండి వచ్చినారా లేక మదరాసునుండి వచ్చినారా!

కొత్వాలు— "నేను ఈ రాష్ట్రము వాడనే కాని అన్యుడను కాను. మా పూర్వులు తరతరాలనుండి అనాదిగా ఈ రాష్ట్రములోనివారే.

యువరాజు:— "ఈ ఉద్యోగము మీ కెప్పుడిచ్చినారు

కొత్వాలు:— "నేను ౩౦ ఏండ్లనుండియు పోలీసులో ఉద్యోగము చేసి అమీన్ పదవినుండి యీ స్థానమునకు క్రమ క్రమముగా వచ్చినాను

యువరాజు; "నేను వచ్చిననాడు ప్రేక్షకులు ౪ లక్షల వరకుండిరేమో వారందరెక్కడివారు

కొత్వాలు:— "నగరము వారును - చుట్టు పట్టుల గ్రామా ములనుండి వచ్చినవారును నై యుండిరి

ఈ విధముగా ౧౫ నిముషాలవరకు మాట్లాడు కున్నారు. రెడ్డిగారు జంకు గొంకు లేక ఇంగ్లీషులో సంభాషించినారు. వారితో మాట్లాడు కుతూహలముతో నేను పలి ముప్పన ముప్పతిప్పలుపడి ఇంగ్లీషు నేర్చియుండిరి. యువరాజు గారు వీరి తప్పందు ఇంగ్లీషు మాటలను, ఉచ్చారణను విని పొరలి పొరలి నవ్వినారు. బాగుగా ముచ్చటగా వినినారు. ఇట్లు ఎవ్వరికిని చేయని మర్యాదను, ప్రీతిని కనబరచినతర్వాత సెలవిచ్చునప్పుడు ఒక పెద్ద వెండి సిగారుకేసును రెడ్డిగారికి బహుమతిగా నిచ్చినారు. రెడ్డిగారు తమ జీవితములో ఎన్నడును, ఏ దుర్వ్యభాసమునుగాని ఎరిగినవారు కారు. నస్యము గాని, సిగరెటుగాని డిన్నరులలోనైన కొంత బ్రాండీ సేవించుటగాని, ఇట్టివేవియు వారు ఎరుగరు. కొత్వాలు పదవిపై నుండి ఇంత మంచి ఏర్పాటులు చేసినవారు ఘనమైన సిగా


రులు త్రాగకుండ ఉందురా అని యువరాజుగా రూహించి హాదు కాబోలు! రెడ్డిగారా బహుమతిని గౌరవముతో తమ యింట నుంచుకొనినారు.

వీరి కొత్వాలీ కాలములోనే ఇర్విన్ ప్రభువుగారును, వెలింగ్డన్ ప్రభువుగారును హైదరాబాదునకు విచ్చేసిరి. ఆ సందర్భములందును వీరు చాల మంచి యేర్పాటులు చేసి అందరి మెప్పును బడసిరి. వీరి కొత్వాలీ కాలములో స్పెయిన్ రాజుగానుండిన డాన్ అల్ఫొన్సో గారు హైదరాబాదు విచ్చేసి యుండిరి.

పూర్వమునుండియు కొత్వాలీశాఖ, హోం సెక్రటరీ శాఖకు అధీనముగా నుండెను. భూమ్యాదాయ శాఖతో సంబంధము లేకుండెను. సర్ కర్నల్ ట్రెంచి అను భూమ్యాదాయ శాఖామంత్రిగారు వచ్చిన తర్వాత వారి స్వాధీనములో కొత్వాలీశాఖ యుంచబడెను. సర్ ట్రెంచిగారు వచ్చిన తర్వాత పోలీసు వ్యవస్థలో కొన్ని మార్పులు జరిగెను. అంతకు పూర్వము శ్రీనిజాం ప్రభువుగారి దేవిడీ పనులకుగాను ప్రత్యేక పోలీసు లేకుండెడిది. సర్ ట్రెంచిగారు వచ్చిన తర్వాత దేవిడీకి గాను ౪౦౦ పోలీసు జవానులను, ఒక సహాయ కొత్వాలును, కొందరి అమీనులను ప్రత్యేకించిరి.



వేంకట రామారెడ్డిగారు [illegible] ( [illegible] )



క్రీ. శ. ౧౯౩౩ లో వైస్రాయిగారు వచ్చిన సందర్భమున వేంకట రామారెడ్డిగారు చేసిన ఏర్పాట్లను చూచి ఇప్పుడు ప్రధాన మంత్రిగానుండి అప్పుడు ఆర్థిక శాఖా మంత్రిగానుండిన నవాబ్ సర్ హైదర్ నవాజుజంగు బహదరుగారు చాల ప్రశంసించిరి. మరియు ౧౩౪౦ ఫసలీ నాటి కొత్వాలీ శాఖా నివేదికను చదివి సర్ అక్బర్ హైదరీగారిట్లు రెడ్డిగారికి ౧౫ జూలై ౧౯౩౩ నాడు వ్రాసిరి.

“మీ నివేదిక నిప్పుడే అందుకున్నాను. మే మందరమును ( ఈమాట నా ఉద్యోగ ధర్మముచేతనే కాక నా హైద్రాబాదు పౌరత్వ ధర్మముచేతను చెప్పుచున్నాను) మీ కఠినమైన ఉద్యోగవిధులను మీ రెట్టి చాకచక్యముతోను, విశ్వాస పాత్రముగను, భక్తితోను, నిర్వహించుచున్నారో ఆపద్ధతిని అత్యంతముగా ప్రశంసించుచున్నాము.”

( It is not necessary for me to say how we all ( & in this I am speaking not only in my official capacity but also as a citizen of Hyderabad) appreciate the great tact, honesty, and loyalty, with which you are discharging the duties of your onerous position.)

క్రీ. శ. ౧౯౩౩ లో ప్రధాన మంత్రిగా నుండిన నవాబ్ ఫరీదూన్ ముల్కుగారును వైస్రాయిగారి ఆగమన సందర్భపు ఏర్పాటులను ప్రశంసించుచు నిట్లు వ్రాసిరి:—

" వైస్రాయిగారి ఆగమన సందర్భములో తాముచేసిన ఉత్తమమైన మీ పోలీసు ఏర్పాటులను నే నత్యంతముగా ప్రశంసించుచున్నాను. నే నిచ్చట ఎన్నియో సంవత్సరముల నుండి నివసించుచున్నాను. ఈ తడవ మీ ఏర్పాటులకన్న మించిన యేర్పాటులను నే నెన్నడును జూచి యుండలేదు. అన్నిటి కన్న ఆనంద దాయకమగు విషయ మేమనగా ప్రజల కేవిధమగు ఇబ్బందులు కలుగలేదు. ఇదివరలో గంటలకొలది కాలము వరకు బాటలు అరికట్టబడుచుండెను. అట్టిది యీ తడవ లేకుండినది."

రా॥ బ॥ వేంకట రామారెడ్డిగారి ఉద్యోగ కాలములోని అన్నింటికన్న ముఖ్యమగునంశము చెప్పవలసియున్నది. నగరములో నానా మతముల వారున్నను వారికాలములో ఎన్నడుగాని మతకలహములన్న మాట లేకుండెను. సుమారు ౧౫ సంవత్సరములనుండి హిందూస్థానములో హిందూ, ముసల్మానుల ద్వేషములు, కలహములు, నిత్యాభి వృద్ధితో ప్రబలుచు వచ్చెను. కేవలము బ్రిటిషిండియాలోనే గాక అనేక దేశీయ సంస్థానములందును ఈ కలహములు సంభవించెను. హైదరాబాదులోని, జిల్లాలలోను అందందు కొంచెము పొడచూపినను హైదరాబాదు ముఖ్యపట్టణములో మాత్రము వీరి కాలములో ఒకనాడైనను హిందూ ముసల్మానుల కలహములు జరుగక

పోయెను. ఇది ఉభయ మతస్థుల నిగ్రహ శక్తి వలనకాదు. కేవలము రెడ్డిగారి చాకచక్యమే దీనికి కారణమని పూర్వము తెలుసుకొనకుండిన గత సంవత్సరము నగరములో గొప్ప హిందూ ముసల్మాను మత కలహము చెలరేగిన కాలములో నిష్పక్షపాత బుద్ధికలిగిన అనేక ప్రభుత్వాధికారులును, ప్రజలందరును బాగుగా గ్రహించుకొన గలిగిరి. సుమారు ౧౫ సంవత్సరముల క్రిందట గుల్బర్గాలో గొప్ప హిందూ ముసల్మాను మతకలహము జరిగెను. దానిగాలి హైద్రాబాదు వరకు వీచినను రెడ్డిగారు కొత్వాలుగా నుండిరి కాన ఏమియు ప్రమాదము లేకపోయెను! గణపతి నవరాత్రులలో ఊరేగింపుల సందర్భములలో ప్రతి సంవత్సరమేదో విధముగ సంఘర్షణ జరుగునట్టి పరిస్థితులేర్పడుచుండెను. కాని ఒక్కసారియైనను ప్రమాదము కలుగకుండ చూచుకొనినారు. ఒకతడవ కొందరు పోలీసు జవానులే గణపతి ఊరేగింపులో అనవసరముగ చొరవ కల్పించుకొని సంఘర్షణమునకు కారకులైరి. అంతట గణపతి విగ్రహమును వీధిలోనే దించి హిందువులు సత్యాగ్రహము ప్రారంభించిరి. రెడ్డిగారికీవార్త తెలిసిన వెంటనే అచ్చటికి వెళ్లి వారి నెన్నియో విధముల సంతృప్తి పరచుటకై ప్రయత్నించిరి. ఎన్నివిధముల చెప్పినను వినకపోవుటనుచూచి మరి ముగ్గురు హిందూపోలీసు అధికారులను జతచేసికొని

తాము నాల్గవవారై గణపతి విగ్రహముండు పల్లకీని మోసి కొనిపోవుటకు సమకట్టిరి! అంతటితో హిందువులు శాంతించి యథాప్రకారముగ గణపతి ఊరేగింపును ముగించుకొని వెళ్లి పోయిరి.

నగరములో బక్రీదు వంటి పండుగల సందర్భములలో ముసల్మానులకును, లోధీలు అను హిందువులకును, సంఘర్షణ యేర్పడు సూచనలు కనుపించెడివి. ఆ సందర్భములలో రెడ్డి గారు బహు చాకచక్యముతో లోధీలలోని ముఖ్యులను తాత్కాలిక పోలీసు సిబ్బందిలోనికి తీసుకొని వారిద్వారా శాంతిని నెలకొల్పెడివారు.

కొత్వాలీ పదవిలో నింకొక ముఖ్యాంగము శ్రీ నిజాం గారి సేవయైయుండెను. ప్రాచీనము నుండియు నగరకొత్వాలు ముఖ్యముగా నిజాముగారి మొదటిబంటు. ప్రతిదినము తన ప్రభువుతో కలిసి నగరములోని పరిస్థితులు తెలుపుటయు, ప్రభువుగారి ఆజ్ఞలను శిరసా వహించుటయు నతని ముఖ్యమైన విధులు. ప్రభువుగారి దేవిడీలోని కార్యములను, పోలీసు జవానలద్వారా పూర్తి కావించ వలసియుండెను. మరియు పూర్వము ప్రభువుల కెవ్వరిపైన నేని ఆగ్రహముకలిగిన కొత్వాలును పిలిపించి అతనిద్వారా వారిని నిర్బంధమందుంచు చుండెడివారు. ఇట్టి కార్యవిధానములలో ఆధునిక పరిస్థితులబట్టి

కొన్ని మారులను వేంకట రామారెడ్డిగారు ప్రతిదినము తప్పని విధిగా తమ యేలికతో కలిసి వచ్చెడివారు. కొన్ని సమయములలో కచ్చేరి పనులు చేయుసమయములో శ్రీ ప్రభువుగారి నుండి టెలిఫోను వచ్చెడిది. అన్నియు వదలి తత్క్షణమే వెళ్ళి వచ్చెడివారు. మరియు ఒక్కొక్కమారు దినమునకు రెండు మూడు మారులు సహితము శ్రీ ప్రభువుగారితో కలిసెడివారు ఒక్కొక్కతడవ రెండుమూడు గంటలకాలము ప్రభుసన్నిధిలో నిలిచి ఆజ్ఞలను పొందుచుండెడివారు.

ఎవ్వరినైన మెప్పించవచ్చునుగాని ఏలికను మెప్పించుట సామాన్యమైన విషయము కాదు. వేంకట రామారెడ్డిగారు తమ ఏలికను సంపూర్ణముగా మెప్పించినారు. వీరి యుద్యోగ కాలము పూర్తియై ఉపకార వేతనమును పొందవలసిన కాలము వచ్చినను ప్రతి సంవత్సరమును శ్రీ ప్రభువుగారు వీరి యుద్యోగకాలమును పొడిగించుచునే వచ్చిరి. క్రొత్త రెసిడెంట్లు వచ్చినప్పుడుగాని, వైస్రాయీలు వచ్చినప్పుడుగాని, ఇతర దేశీయ సంస్థాన పరిపాలకులు వచ్చినప్పుడుగాని, ప్రతి సంవత్సరము శ్రీ ప్రభువుగారి జన్మదినోత్సవములు జరిగినప్పుడుగాని, దేవిడీలో ఏర్పాటగు విందులందును, రాజకీయపు విందులందును ముఖ్యమగు ఏర్పాటులన్నియు వీరిద్వారానే చేయించుచుండెడివారు.

హిందూ ముసల్మాను నాయకులందరును వీరి చేతిలోని వారై యుండెడివారు. వారి కేదోవిధముగా సమాధానములు చెప్పి సంతృప్తిపరచి వారిని తన వశమందుంచుకొనెడివారు. అందుచేతనే వీరికాలములో అశాంతి ఎన్నడును ప్రబలలేదు.

మహాత్మా గాంధీగారు వచ్చినప్పుడు వారు ఒక ఖద్దరు ప్రదర్శనశాలను దర్శించువారై యుండిరి. కాని సర్ ట్రెంచి గారి నిషేదాజ్ఞ అయియుండెను. గాంధీగారికి ఆగ్రహము కలిగి తమ కార్యక్రమము నంతయు ఆపివేసి వెంటనే వెళ్ళిపోవుటకు సమకట్టిరి. అప్పుడు కొత్వాలు వేంకట రామారెడ్డి గారు వారితో స్వయముగా కలిసి మాట్లాడి సమాధానము చెప్పి శాంతిపరచి మరల కార్యక్రమము సాగించుకొనునట్లు చేసిరి.

మ. ఘ. వ. నిజాం ప్రభువుగారు ౨౭ బహమన్ ౧౩౩౯ ఫ॥ నాడు తమ జన్మదినోత్సవ సందర్భమున రెడ్డిగారికి "రాజాబహద్దర్" అను బిరుదమును అనుగ్రహించిరి. ఆ బిరుదమును పొందినందున నగరములోని హిందువులును ముసల్మానులును ఒకరినిమించి యొకరు వారి గౌరవార్థము సభలు చేసిరి. ఎన్నియో విందులు చేసిరి.

సికింద్రాబాదు రైల్వే లాలగూడా కార్యాలయము లోని వేలకొలది కూలీలు ఎక్కువజీతములు కావలెననియు

తక్కువ పనికాలము ఏర్పాటు కావలెననియు, సమ్మెకట్టి హడ్తాలుచేసిరి. ఆసమయమున చాల అల్లరులు జరుగునట్లుండెను. అప్పుడు రెడ్డిగారు రెసిడెన్సీ ప్రభుత్వమునకు అత్యంతముగా సహాయపడి సమ్మెదారులను తృప్తిపరచి ఏ అవాంతరములును జరుగకుండునట్లుగా సహాయపడిరి. ఈ విషయమును గురించి జిల్లాపోలీసుడైరెక్టర్ జనరల్ గారికి సహాయాధికారిగా నుండిన మీర్ విలాయత్ హుసేనుగారు తాము రచించిన "హైద్రాబాదు పోలీసు చరిత్ర" అను గ్రంథములో నిట్లు వ్రాసినారు.

"వీరి యీసహాయమువలన కేవలము మాప్రభుత్వమే కాక రెసిడెంటుగారున్ను వీరికి కృతజ్ఞతల నర్పించిరి. దీనికి ప్రతిఫలముగా వీరికి ఓ. బి. ఇ. బిరుదము ఇచ్చి యుండవచ్చుననుటలో నేమి యాశ్చర్యము?"

రాజా బహద్దరు వేంకట రామారెడ్డిగారికి క్రీ. శ. ౧౯౩౧ సంవత్సరాదిలో (౧౩౪౦ ఫసలీలో) జార్జి చక్రవర్తిగారి నుండి "ఓ. బి. ఇ." అను బిరుదము ప్రసాదింపబడెను. ఇంతకు మునుపు రాజాబహద్దరు బిరుదము లభించినప్పుడు అన్ని శాఖల వారే ప్రకారముగా వీరిని గౌరవించిరో అదే ప్రకారముగా ఈ ఓ. బి. ఇ. బిరుదము లభించినప్పుడును ప్రీతి పూర్వకముగా సభలు విందులుచేసి గౌరవించిరి. స్థానిక పత్రికలన్నియు వీరి నత్యంతముగా ప్రశంసించెను.

రెడ్డిగారి కొత్వాలీ కాలములో నింకొక విశేషముం డెను. సాధారణముగా పోలీసువారనిన కఠినులనియు, భయంకరులనియు, జనుల విశ్వాసము. శ్రీరెడ్డిగారు పోలీసు ఉద్యోగములో పరమావధి పొందినవారైనను, సర్వశక్తిమంతులై యుండినను, శ్రీనిజాం ప్రభువుగారి మన్ననకు సంపూర్ణముగా పాత్రులైనను ఒక నాడును తనను తాను మరచి యెరుగరు. గర్వమనునది వారి జీవితములోనే లేనట్టిది. అధికార మత్తత యనునది వారికి చిన్నప్పటినుండియు అలవాటు కానట్టి గుణము. వారిని జూచి దుర్మార్గులుమాత్రమే భయపడెడివారు. అట్టి దుర్మార్గులును వారి దయాగుణమును గుర్తించి వారికి వశవర్తులగు చుండెడివారు.

హైదరాబాదు నగరములో దావూద్ అను పేరుగల ఒక గజదొంగ యుండెను. వాడు ఒకటి రెండు మారులు జెయిలు శిక్షనుబొంది అచ్చటినుండి తప్పించుకొని పోయినట్టి వాడు. పలుమారు మార్వాడీ దుకాణములపై బడి మార్వాడీలను బెదరించి వారినుండి సొమ్ములు లాగుకొనుచుండెడివాడు ఒకతడవ వానిని పట్టుకొని హైకోర్టులో విచారణకై పోలీసువారు తీసికొని పోయియుండగా అచ్చట బహిర్భూమికని కొట్టిడీలోనికిపోయి అందలి రంధ్రములలో జొరబడి తప్పించుకొనిపోయి యుండెను. వానిని పట్టుకొనినవారికి మంచి

బహుమతి యిచ్చునట్లు ప్రభుత్వమువారు ప్రకటించియుండిరి. రెడ్డిగారు ఒకనాడు తెల్లవారు జామున ఎండకాలములో తన యింటిలోని వసారాలో ద్వారము లన్నియు తెరచిపండు కొనియుండగా నొక ఆయుధపాణియగు వాడు పహారా పోలీసులు నిరాకరించినను వినక వారిని త్రోసివేసి పోలీసులచే వెంబడింప బడినవాడై కొత్వాలుగారిని సమీపించెను. వాని వద్ద ఒక తుపాకియు, ఒక పిస్తలును, ఒక కత్తియు, నడుములో బాకులును ఉండెను! కొత్వాలు గారికి వానివార్తను రోహిలా పహిరా జవాను తెలిపినాడు. వానిదగ్గరకు పిలిచినారు. వాడు కొత్వాలు గారి కాళ్లు పట్టుకొని తానే దావూద్ పేరుగల దొంగనని తెలుపుకొని తనను రక్షించుమని వేడినాడు. "సరే. ఇచ్చటనే పండుకొనుము. నీకేమియు భయము లేదు" అనినారు కొత్వాలు. వాని ఆయుధములను మాత్రము తీసివేయించినారు. వానికి భోజనము పెట్టించినారు. తమ మోటారులో వానిని తీసికొని పోవుచు ఏ యే మార్వాడీలకు వాడిబ్బంది కలిగించి యుండెనో వారివద్దకు వెళ్ళి "దావూద్ అను దొంగను ఎరుగుదురా?" అని వారిని ప్రశ్నించగా వారు మోటారులోనే డ్రైవరు ప్రక్కననే ఆదొంగయున్నను గుర్తు పట్టజాలక వాని దౌర్జన్యములను వర్ణించి "సర్కార్ వాన్ని పట్టుకొని ఉరివేయించండి తలనరికించండి- లేకుంటే

వాడు మమ్ముల బ్రతుకనియ్యడు" అని ప్రాధేయపడినారు. కొత్వాలుగారు ఆదొంగను పోలీసు జవానుల వశము చేసి న్యాయస్థానములో విచారణ చేయించి శిక్షింపజేసినారు. ఆ దొంగను దొరకినప్పుడే పోలీసుభటుల వశము చేయక వానిని ౧..౨ గంటల కాలము తనవద్దనే స్వేచ్ఛతోనుంచి బేడీలైనను వేయక తన మోటారులోనే త్రిప్పి తర్వాత పోలీసువారి వశము చేయుటలో రెడ్డిగారి ఆత్మవిశ్వాసము ధైర్యమును ప్రశంసనీయములు. శిక్షపొందిన తర్వాత ఆ దొంగ ఇట్లన్నాడట " కొత్వాలుసాబ్ ఇంతమోసము చేయునని నాకప్పుడే తెలిసియుండిన నేనా రాత్రియే ఆయనను ముగించియుందును." అందుపై రెడ్డిగారిట్లనిరట. "అదేమో నిజమే, వాడేమిచేసినను సాధ్యముగా నుండెను".

రెడ్డిగారి కొత్వాలీ కచ్చేరీ వ్యవహారములు బహువినోదకరముగా నుండెడివి. వారియాస్థానములోనికి ఏ పోలీసువాని అడ్డంకునులేక ఎట్టి దరిద్రుడైనను, పోవచ్చును. హాలంతయు పోలీసులచేతను, చేతిక్రింది అధికారులచేతను, వకీళ్ల చేతను, గుమాస్తాలచేతను, అభ్యర్థులచేతను నిందితులచేతను క్రిక్కిరిసియుండెడిది. కొందరు భోగమువారు నగరములో కొన్ని దినాలు గాన సభలు చేసికొనుటకు స్వయముగా కచ్చేరీ నలంకరించి వినతి పత్రము లర్పించుకొను చుందురు. వారితో ముచ్చటించి తీర్పులు చేయుదురు, కొన్ని మొర లీవిధముగా నుండెడివి.

" అయ్యా, నాభార్యను నామామగారు పంపకున్నారు

" సర్కార్. న భార్యను ఫలానావాడు ఎత్తుకొని పోయినాడు

" నా భార్య పోతేపోయినది. అదినాపిల్లలనుగూడ తీసికొని పోయినది సర్కార్. పిల్లలనైనా ఇప్పించగలరు.

" దొరా! నాకు ఫలానివాడు ఇన్నిరూపాయీలు బాకీ పడినాడు. చూడండి ఇదిగో ప్రాంసరినోటు. నారూపాయీలిప్పించండి.

" సర్కార్ నేను ముసలిదాన్ని. నాయింటిలో ఫలానా బ్యారిష్టరు 3 ఏండ్లనుండి అద్దెకున్నాడు. అద్దె ఇయ్యడు. ఇల్లు వదలడు. గట్టిగా మాట్లాడితే నన్నే వెళ్లగొడ్తానంటాడు. నాదేయిల్లు అంటాడు. నేను దిక్కులేనిదాన్ని, ఆబ్యారిష్టరును వెళ్లగొట్టించండి.

ఈ విధముగా పోలీసువారికి సంబంధించినట్టివియు, పోలీసు వారికి సంబంధము లేనట్టివియు నగు మొరలును వారివద్ద కావింపబడుచుండెను. అయినను ఇదినాకు సంబంధములేదు పో అని వెడలగొట్టెడివారుకారు. అన్నియు విచారించుచుండిరి. సంబంధము లేనివాటిలో మొదలు మొదలు నాకు సంబంధములేదుపో అని కసరుకొని మరల బీదవారు ప్రాధేయపడుటచేత ఎదిరి పక్షమువారిని పిలిపించి విచారించు

దురు. వారు వినిరాసరియే. తీర్పుచేసి పరిష్కారము చేయు దురు. వినకపోయిరా అన్యాయమే జరిగినదని వారికి స్థిరపడిన నాలుగైదుమారులు త్రిప్పించి విచారణలు చేయుచుందురు. "అయ్యా, ఈవిచారణపోలీసుశాఖకుసంబంధించినదికాదు" అని యెవ్వరైనను ఆక్షేపించిన "ఆ సంగతి మా విచారణపూర్తి యైన తర్వాతకదా నిర్ణయింపబడును" అని యింకను విసిగించెడివారు. తుదకు ప్రతిపక్షులు వారుచెప్పినట్లు వినుకొనిపోయెడివారు. ఇట్లు చేయుటవలన బీదలకెంతయో శ్రమ, కష్టము, నష్టము, అన్యాయము అన్నియు తప్పిపోయెడివి. కొన్నిమారులు కొందరు ఉన్నతన్యాయస్థాన న్యాయాధికారులకు వీరి యీ సంబంధములేని విచారణల వలన న్యాయస్థానానికి స్టాంపుల నష్టము కలుగుచున్నదని మొరపెట్టుకున్నారట. అందుపై ఒకతడవ ఉన్నత న్యాయస్థానపు న్యాయాధికారి యొకరు వీరి కచ్చేరీలో వీరి ప్రక్కననే కొన్ని గంటలకాలము కూర్చుని వీరి తీర్పులను నెమ్మదిగా విని ప్రభుత్వానికి నష్టమైనను వీరు బీదల పాలిటి కల్పవృక్షము, న్యాయమే పరిపాలించుచున్నారు" అని పలుకుచు సెలవు తీసికొని పోయినారట.

వేంకట రామారెడ్డిగారి కొత్వాలీ యుద్యోగకాలము మరల ౧౩౩౭ ఫసలీలో హెచ్చింపబడి నపుడు గుల్బర్గాలో రెవిన్యూ (మాల్) మదద్గారు పదవిలోనుండిన మహమ్మద్

ఎక్రాంఅలీ అనువారు ౧౯ అర్దిబెహిష్తు ౧౩౩౫ ఫసలీనాడు రెడ్డిగారికిట్లు జాబువ్రాసిరి.

" మీ యుద్యోగకాలమును ప్రభుత్వమువారు పొడిగించిన వార్తనాకు పరిమితిలేని ఆనందము కలిగించినది. హైదరాబాదు ప్రజలవిషయమున మీ అస్తిత్వము దైవ ప్రసాదితమైన వరమువంటిది. దక్కన్ చరిత్రలో మీ అధికార కాలము స్వర్ణాక్షరములలో వ్రాయదగినదై యున్నది. మీ ఉద్యోగకాలములో హైదరాబాదు ప్రజలకు లభించిన శాంతి భద్రతలు మరెవ్వరి కాలములోను నేటివరకు లభించినవి కావు. ......ఏ విధముగా మీయుద్యోగకాలము హెచ్చుచున్నదో అదేవిధముగా పరమాత్ముడు మీఆయుర్వృద్ధిని, ఐశ్వర్యాభివృద్ధిని ప్రసాదింతుగాక."

పోలీసు చరిత్ర (History of the Police) అను ఉర్దూగ్రంథము వ్రాసిన మీర్ విలాయతు హుసేనుగారు రెడ్డిగారిని గురించి యిట్లువ్రాసినారు.

" వేంకట రామారెడ్డిగారు కొత్వాలు అయిన కాలములో పోలీసు (డిసిప్లిన్) క్రమ శిక్షణములో మంచి మార్పు కలిగెను. వారు తమ దీర్ఘానుభవముచేతను సర్వజన ప్రియత్వముచేతను తమ శాఖను ఉత్తమవిధముగా వశమందుంచుకొని కార్యసాధన కావించిరి. పోలీసు కార్యనిర్వహణలో వీరిశా

ఖలో ఏమియు లోపము కలుగలేదు. వీరు హిందువులగుటచేత రాజకీయ పరిస్థితులలో తీవ్రస్వరూపము దాల్చకుండ జరిగి పోయెను...... ఈ కాలములో మతకలహములు అంతటను చెలరేగు చున్నవి. కాని వేంకట రామారెడ్డిగారు అట్టివేవియు నగరములో తలనెత్తనీయక నిరోధించియుంచినారు."

ఈ ప్రకారముగా ఇంకను పై గ్రంథకర్తగారు కొత్వాలు వేంకటరామారెడ్డిగారిని గురించి ప్రశంసించుచు వ్రాసియున్నారు.

రెడ్డిగారు కొత్వాలు పదవినుండి ౨౫ అమర్దాదు ౧౩౪౩ ఫసలీనాడు విరమించుకొని ఉపకారవేతన మందిరి. వీరిజీతములో సగము అనగా ౭౫౦ రూపాయిలే వీరికి ఉపకారవేతనముగా దొరుకవలసియుండినను మ. ఘ. వ. ప్రభువుగారు వీరి గుణవిశేషములను, యావజ్జీవసేవ, భక్తిశ్రద్ధలను, ప్రశంసించుచు వీరికి ప్రత్యేకముగా ౭౫౦ రూ॥ లకు మారుగా నెలకు ౧౦౦౦ రూ॥ లు లభించునట్లు ఫర్మాను ఇచ్చిరి.



౧. శ్రీ రాజా సురభి వేంకట లక్ష్మారావు బహద్దరు



[illegible] సర్ కరుల్ | రెంది గారితో సు

# తొమ్మిదవ ప్రకరణము

ఇతర ప్రభుత్వ శాఖలలోని సేవ.

కొత్వాలీపదవిలోనే రెడ్డిగారి కాలమంత యువినియోగింపబడుచుండెను. పలుమారు సగము రాత్రి వేళలందును వారి పడక ప్రక్కననుండు టెలిఫోనుతో క్రింది అధికారులే కాక నగరమందలి గొప్పగొప్పవారును అవసరముకొలది వారిని లేపి మాట్లాడెడివారు. రాత్రులందును ప్రాతః కాలమందును ఇంటివద్దనుకూడ జనులు దరఖాస్తులు పట్టుకొని పోవుచుండిరి. ఇట్లు విరామము లేనివారైయుండినను రెడ్డిగారు నగరములోని అనేక శాఖలలో ఏదోయొక గౌరవోద్యోగ కార్యమును నిర్వహించుచు వచ్చినారు. అవన్నియు విపులముగా వ్రాయబూనిన గ్రంథము పెరిగిపోవును. అందుచేత సంగ్రహముగా సూచన మాత్రము చేయబడును.

(౧) ౧౩౨౯ ఫసలీలో వీరు నగర పురపాలక సంఘములో సభ్యులైరి. మరియు ౧౩౩౬ ఫసలీనుండి ౧౩౩౯ ఫసలీవరకు పురపాలక సంఘముయొక్క ఉపాధ్యక్షులుగా నియుక్తులై చాల దక్షతతో పనుల నెరవేర్చిరి.

(౨) నగరముయొక్క మురికినీటి కాలువల పూర్తి నిర్మాణము ప్రారంభమయ్యెను. (Drainage Scheme) దాని కార్యవర్గములోను వీరు సభ్యులై సలహా లిచ్చుచుండిరి.

(౩) నగరములో ప్లేగు విశేషవ్యాప్తినొందగా ప్రజల కనేక సౌకర్యములు కలిగించి చికిత్సలు చేయించి ఐసొలేషను ఆస్పత్రికి పంపించియు, నగరమును వదలినవారికి స్థలములు చూపించియు సహాయపడిరి. ప్లేగు నివారణ సంఘములో బహుకాలము సభ్యులుగాను నుండిరి.

(౪) విక్టోరియా మెమోరియల్ ఆర్ఫనేజ్ (అనాథ శరణాలయము) యొక్క కార్యనిర్వాహక వర్గములో వీరొక ముఖ్యసభ్యులై యుండిరి.

(౫) కొలతలను తూకములను సంస్కరించు సంఘములో సభ్యులై ౧౩౩౩ ఫసలీనుండి ౧౩౪౧ ఫసలీవరకు పని చేసిరి.

(౬) శాసనసభలో సభ్యులుగా నేటివరకును పనిచేయుచున్నారు. అందు ప్రవేశపెట్టబడు ప్రతిశాసనమును శ్రద్ధగాచూచి విమర్శించి మంచిసలహా లిచ్చుటలో ముఖ్యులని ప్రసిద్ధిగాంచినారు.

(౭) నగరాభివృద్ధిశాఖ (ఆరాయిషెబల్దా) లో సభ్యులై పనిచేసినారు. ఈ శాఖవారు వీధులను విశాలపరచిన

వ్వుడు ఇండ్లను పడగొట్టవలసివచ్చెను. అప్పుడు ఇండ్ల యజమానులతో ప్రతిఫల పరిష్కారార్థము ఒకన్యాయస్థానమునే ప్రత్యేకించియుంచిరి. అందు విచారణలై తీర్పులనువరకు చాల కాలము పట్టుచుండెను. రెడ్డిగారు ఇండ్ల యజమానులతో మాట్లాడి వారిని ఏదోవిధముగా తృప్తిపడునట్లుచేసి తొందర తొందరగా పరిష్కారములు చేయించి సహాయపడినారు.

(౫) సర్ఫెఖాస్ గౌరవ కమిటీలో వీరు ఒక ముఖ్య సభ్యులు. ప్రతి కమిటీలోను వీరు కేసుల పరిష్కారములలో చాల సహాయ పడుచున్నారు.

(౬) రాజా శివరాజబహద్దరు ఎస్టేటు చాల ప్రసిద్ధమైనట్టి సంస్థానము. దాని సంవత్సరాదాయము సుమారు ౧౨ లక్షలు. ఆ సంస్థాన ప్రభువగు రాజా శివరాజ బహద్దరు గారు "ధర్మవంత" అనుబిరుదము కలవారుగానుండిరి. బిరుదమునకు తగినట్లే దానధర్మాలు చేసినవారు. తత్ఫలితముగా సంస్థానము సుమారు ౨౦ లక్షల రూపాయీలవరకు అప్పుల పాలయ్యెను. రాజా శివరాజ బహద్దరు పుత్రసంతానములేక చనిపోగా వారిసంస్థానమునకు మరల వారసుల నిర్ణయమగు వరకు సంస్థానపరిపాలనమును ఒక కమిటీ అధీనములో శ్రీప్రభువుగారుంచిరి. ఆకమిటీకి అధ్యక్షులై శ్రీ వేంకట రామారెడ్డిగారు ౧౩౩౫ ఫసలీనుండి ౧౩౪౬ ఫసలీవరకు సంస్థా

నమును ధర్మదృష్టితో పరిపాలించిరి. అప్పులన్నియు చెల్లించి తాను పదవిని వదలుకొనువరకు సుమారు ౯ లక్షలు సంస్థాన కోశములో నిలువయుంచి పోయిరి. సంస్థానములోని బీదరైతులకు సదా సహాయముచేసిరి. "ధర్మవంతు ఉన్నతపాఠశాలను" స్థాపించి సంస్థానపక్షమున నడిపించి, మరియు అనేక గ్రామములలో ప్రైమరీ పాఠశాలలను నెలకొలిపి విద్యావ్యాప్తి కనుకూలపడిరి. ఆ సంస్థానములో కేవలము భూమ్యాదాయశాఖా వ్యవహారములను పరిష్కరించుటయే కాక, ఆ సంస్థానపు పోలీసుశాఖకును అధ్యక్షులై (నాజిం) పోలీసుశాఖను సంస్కరించిరి. ఆ సంస్థాన వ్యవహారములను ప్రతి బుధవారమునను, ప్రతి శనివారమునను సాయంకాలము ౫ గంటలనుండి రాత్రి ౯ గంటలవరకు విచారించుచుండిరి. ఈ ఉద్యోగమునకుగాను గౌరవార్థము నెలకు ౧౦౦ రూపాయలు మాత్రమే అలవెన్సుగా వీరికి ఇయ్యబడుచుండెను.

(౧౦) సహకారసంఘము (కోఆపరేటివ్ సొసైటీ) లో వీరు ౧౩౩౮ ఫసలీలోచేరిరి. ౧౩౩౬ ఫసలీలో జరిగిన సంఘమహాసభలో పాల్గొనిరి. ఉపసంఘములో అధ్యక్షులుగా నియమింపబడిరి. సహకార సంఘపక్షమున వెలువడు మాసపత్రికలు నాలుగుభాషలలో వీరి అధీనమునుండియే వెలువడుచుండెను. బెంగాలులోని శాంతి నికేతనమునుండి కాళీమోహన్ ఘోష్

అనువారిని పిలిపించి వారిచేకొన్ని గ్రామములలో ఆర్థిక విచారణలు గావించి మెదకు తాలూకాలోని బర్గుపల్లియను గ్రామములో గ్రామ పునర్నిర్మాణ కార్యమారంభించిరి. ౧౩౩౫ లోను ౧౩౩౬ లోను సహకార మహాసభలు జరిగినప్పుడు రెడ్డిగారు ఆహ్వాన సంఘాధ్యక్షులై ఉపన్యాసములు గావించి మహాసభలను జయప్రదముగా నడిపించిరి.

(౧౧) ఉన్మాద వైద్యశాలయొక్క పాలకవర్గములో పిరోక మఖ్యసభ్యులుగా నుండిరి.

(౧౨) కుష్ఠురోగుల ఆశ్రయముయొక్క పాలకవర్గములోను సభ్యులుగనుండిరి.

(౧౩) నజంజమియాయత్ (సైన్యశాఖ) లో విచారణ సంఘములో సభ్యులుగ నుండిరి.

(౧౪) దిక్కులేనిపిల్లల (లావారస్) విచారణసంఘముయొక్క సభ్యులును నై యుండిరి.

(౧౫) జూడిషియల్, రెవిన్యూ, మునిసిపల్, మరియు పోలీసు ట్రెయినింగుస్కూలు అభ్యర్థులను పరీక్షించు పరీక్షకులుగా నుండిరి.

(౧౬) సీతారాంబాగు దేవాలయము నగరములో చాలగొప్పది. దీనివ్యవస్థ చాలచెడిపోగ వీరందు పాల్గొని దా

నిని మంచి స్థితిలోకి దెచ్చిరి. ఇప్పుడది ఒక పాలక వర్గముచే పరిపాలింపబడుచున్నది.

(౧౭) శ్రీ ప్రభువుగారి బంధువర్గములో చేరినట్టి పూర్వ నిజాముల సంతతివారు చాలమంది అప్పులపాలైరి. వారిఅప్పులను తీర్పుచేయుటకై సాహెబ్జాదాల అప్పుల విచారణ సంఘమునొకదానిని శ్రీప్రభువుగారు ఏర్పాటుచేసిరి. దానికి అధ్యక్షులుగా శ్రీ రాజా వేంకటరామా రెడ్డి గారు నియమింపబడిరి. ప్రభు బంధువుల అప్పులను సుమారు నాలుగు లక్షలవరకు పరిష్కరించి గొప్ప సహాయముచేసిరి.

౧౮. అవసరముకొలది ప్రత్యేకమగు కొన్ని కేసులను విచారించుటకు రెడ్డిగారు పలుమారు స్పెషల్ కమిషనులలో నియుక్తులై పనిచేసిరి.

(౧౯) మూడు నాలుగేండ్లక్రిందట మద్యపాననిషేధసంఘమును ప్రభుత్వమువారేర్పాటుచేసిరి. ఈ సంఘమునకు నవాబు మిర్జాయార్జంగు బహద్దరుగారు అధ్యక్షులు. ఈ సంఘములో శ్రీ రెడ్డిగారు ముఖ్యసభ్యులు.

(౨౧) వ్యవసాయాభివృద్ధి సంఘములో సభ్యులై మంచికోళ్ళు పెంచినవారికిని, మంచి ఫలముల పండించిన వారికిని బహుమతు లిప్పించుటలో శ్రద్ధవహించినారు.

ఇదిగాక శ్రీ ప్రభువుగారు రెడ్డిగారిని ఈ క్రింది ముఖ్య విషయములను విచారించుటకు సంపూర్ణాధికారమును ప్రసాదించి (కమిషనరు) నిర్ణయకర్తగా నియమించిరి.

(౨౧) నగరాభివృద్ధి శాఖవారు వీధులను విశాలముగా చేయుసందర్భములో కొందరుద్యోగులు గోరీలకవమానముకలిగించినారను అభియోగమును విచారించుటకును,

(౨౨) కెప్టన్ మొహియుద్దీన్ అలీఖాను అనునతనిపై కావింపబడిన ఆరోపణములను విచారించుటకును,

(౨౩) ఫయ్యాజున్నిసా బేగం అనునామె అబ్బాస్ హుసేన్ అనుపోలీసు అమీనుపై మోపిన నేరములు విచారించుటకును,

(౨౪) సెంట్రల్ జైలు (హైదరాబాదు) నుండి కొందరు ఖైదీలు పారిపోయినప్పుడు ఆకారణములను విచారించుటకును,

(౨౫) అఫజలున్నిసా బేగంఅనునామె మీర్ ఖాజిమలీ సాహెబ్జాదాపై చేసిన ఆరోపణములను విచారించుటకును,

(౨౬) నూరుద్దీన్‌షా ఖాదిరీ అనునతని జాగీర్లను కోర్టు అధీనమునుండి విడుదల చేయువిషయమున విచారించుటకును,

(౨౭) నవాబ్ అబ్దుర్ జబ్బార్ ఖాన్ జమాదారు యొక్క యెస్టేటును విడుదల చేయు విషయమున విచారించుటకును,

రాజాబహద్దరు వేంకటరామారెడ్డిగారిని శ్రీ ప్రభువుగారు ప్రత్యేకాధికారములిచ్చి కమిషనర్‌గా ఏర్పాటుచేసిరి.

(౨౮) యువరాజులు యూరోపులో వివాహితులై నగరము వచ్చినప్పుడు వారిని గౌరవించుటకు ఆహ్వాన సంఘమేర్పడెను. దాని అధ్యక్షులుగా ఫర్మానుద్వారా రెడ్డిగారు నియుక్తులైరి.

(౨౯) ప్రభువుగారి సిల్వర్ జూబిలీ మహోత్సవకాలమందు రెడ్డిగారుచేసిన కృషి అపారముగా నుండెను.

(౩౦) ప్రభువుగారు ఢిల్లీనుండి తిరిగివచ్చినప్పుడు నగరములో అపూర్వమైన వేడుకలు కావింపబడెను. ఆ సందర్భమందును రెడ్డిగారే ముఖ్య బాధ్యత వహించినవారై యుండిరి.

(౩౧) రెడ్డిగారికి స్కౌటింగులో (బాలభటవర్గములో) చాల అభిమానము. రెడ్డిహాస్టలులోని ౧౫౦ మంది విద్యార్థులలో నించు మించు ౫౦-౬౦ మంది విద్యార్థులు వీరిప్రోత్సాహములచేతనే స్కౌటింగులోచేరి "రెడ్డిట్రూపు" అను పేరుతో ఒక సంఘముగా నేర్పడినారు. వీరికి డ్రెస్సును తామే తెప్పించి

యిచ్చినారు. వీరి శిక్షణకై చాల శ్రద్ధవహించినందు చేతనే రెడ్డిట్రూపువారు వివిధసంఘముల పోటీపరీక్షలో ఉత్తమములుగా నిర్ణయింపబడి లెక్కలేనన్ని బహుమానములు పొందినారు. "స్కౌటురాలీ"లో రెడ్డిగారే ముఖ్యశ్రద్ధ వహించినట్టివారు. వీరి యీసేవనుగుర్తించి స్కౌటుసంఘమున కొన్నిసంవత్సరములకు పూర్వము ఛాదర్‌ఘాట్ హైస్కూలులో గొప్ప సభచేసి వీరికి గౌరవపతక మిచ్చి మంచి సమ్మానము గావించినారు. అనేకస్కౌటుసభలలో ప్రస్తుత ప్రధానామాత్యులగు రై. ఆ. సర్ అక్బర్ హైదరీగారు రెడ్డిగారి స్కౌటు సేవను బహువిధముల ప్రశంసించియున్నారు.

ఈ విధముగా రెడ్డిగారు నిరంతరముకృషిచేసి ప్రభుత్వమునకు అపారమైన సేవచేసినారు. పై విషయములలోనేకాక ఇట్టి మరియితర ముఖ్య సందర్భములందును సంఘాధ్యక్షులుగానో సభ్యులుగానో పనిచేసి తమ దేశసేవానురక్తిని వెల్లడించినారు.

రా. బ. వేంకటరామారెడ్డిగారు ౨౬ అమర్దాదు ౧౩౪౩ ఫసలినాడు కొత్వాలీ పదవినుండి ఉపకారవేతనమంది విశ్రాంతినొందినారు. కాని మరునాడే వారియేలిక వారికింకొక పదవినిచ్చిరి. కొత్వాలీ పదవిలో వీరుండినప్పుడు సుమారు ౧౩ సంవత్సరములవరకు ఉద్యోగకాలమును

హెచ్చింపుచేయుచు వచ్చిరి- ఇట్లుండ వర్. గ్రెంచిగారు అప్పుడు తాలూకుదారు పదవిలోనుండిన నవాబ్ రహమత్ యార్జంగుగారిని కొత్వాలుగా నియమింప అభిలాషకలవారై యుండిరి. వారిని నియామకము చేయుటకును ఆజ్ఞలుపొందిరి కాని మరిరెండేండ్లు వారు అనుభవము పొందవలెననియు ఇట్లె న్నియో కారణాలనుబట్టి రహమతుయార్జంగుగారికి కొత్వాలుపదవి దొరకకపోయెను. దీనికి ముఖ్య కారణము శ్రీ ప్రభువుగారికి రెడ్డిగారిపైననే అభిమానము మెండుగా నుండుటయే. తుదకు రెడ్డిగారు కొత్వాలి పదవినుండి విరమింపవలసినప్పుడు శ్రీ ప్రభువుగారు వారితో "నీకంతకంటె గొప్పపదవినిత్తునులే" యని సెలవిచ్చిరట. మరునాడు రెడ్డిగారు తమయేలికవద్దకు వెళ్లి నజరానా (కానుక) అర్పించుకొనినారు. ఎందుకని విచారించగా "నాకు తలపైనుండి మహాభారము వదలిపోయినది. ఆ సంతోషముతో నజరానా చెల్లించుకొనుచున్నాను" అని మనవి చేసికొనినారు. "నిన్ను వదలుటలేదు. అంతకంటె ఎక్కువభారము మోపుచున్నాను" అని వారిని తమ సర్ఫ ఖాసు మండలమునకు స్పెషల్ అధికారిగా నియమించిరి. వారికన్న పై అధికారులున్నను వారికి నేరుగా శ్రీ ప్రభువుగారితోనే సంబంధముండుననియు శాసించినారు. ౧౩ వివిధ శాఖలపై వారిని ముఖ్యాధికారిగానిర్ణయించిరి. ఇతరులకు ప్రత్యేక



నియమిత కాలములందే ప్రభుదర్శనము. "నీవుమాత్రము ఎప్పుడు బుద్ధిపుట్టిన అప్పుడునాతో వచ్చి కలసి పోవలసినది. నీకొక దినముకాని సమయముకాని నిర్ణయములేదు" అని ప్రభువుగారు సెలవిచ్చినారు. స్పెషల్ ఆఫీసర్ పదవికిగాను రెడ్డిగారికి నెలకు ౫౦౦ రూపాయిలు వేతనమిచ్చుచున్నారు.

---

# పదవ ప్రకరణము

## సంఘసేవ

ఎందరో భారత దేశములోను, ఈ రాష్ట్రములోను గొప్ప గొప్ప ఉద్యోగములను జేసినారు. ద్రవ్యము బాగుగా గడించినారు. గొప్ప గొప్ప బిరుదములను పొందినారు. కాని వారి యనంతరము మాట యటుండ వారి కాలములోనే వారు పేరుగాని, ఊరుగాని, గుర్తులేనట్లుగా విస్మృతులై పోయినారు. కారణమేమన ఎంత ధనికులైనను, ఎంత అధికారులైనను, ఎంత పలుకుబడి కలవారైనను, వారు సంఘసేవ చేయకుండిన, తమ ద్రవ్యములో ఒక అంశమునైనను, సమాజోన్నతికి వ్యయము చేయకుండిన, తమ పలుకుబడిని, దేశాభివృద్ధికి వినియోగించకుండిన, తమ అధికారబలమును ప్రజా ప్రబోధమునకు అర్పించకుండిన వారికి ప్రజల హృదయములలో కొంచమైనను స్థానములేదు. వారిని ఎవ్వరును ఎప్పుడును మరచియైనను స్మరింపనొల్లరు.

రాజాబహద్దరు వేంకటరామారెడ్డిగారు శక్తివంతమైన గొప్ప ఉద్యోగమును తమ బుద్ధిశ్రద్ధల చేతనే సంపాదించుకొనినారు. తద్ద్వారా మంచి వేతనమును పొందుచు ధనికులైనారు. అన్ని సంఘములందును మంచి పలుకుబడిని సంపాదించుకొనినారు. నవాబులు, రాజులు, మహారాజులు, కోటీశ్వరులు, మార్వాడీలు, వకీళ్లు, ఉద్యోగులు, బీదవారు, రైతులు, సర్వవిధముల జనులును వారికి వశవర్తులైనవారు. వారాంధ్రులైనను కేవలాంధ్రులలోనే కాక కర్ణాటక మహారాష్ట్రులలోను, ముసల్మానులలోను క్రైస్తవులలోను మంచి పలుకుబడి కలవారు. వారు ఇంచుమించు రాష్ట్రములోని అన్ని జిల్లాలలోను ఉద్యోగము చేసినారు. ఉర్దూ రానట్టి బీదరైతులు తమ కచ్చేరికి వచ్చినప్పుడు వారి భాషలలో మాట్లాడుచునారు. వారికి తెనుగేగాక, కర్ణాటకము, మహారాష్ట్రము, ఉర్దూ, ఫారిసి, భాషలు బాగుగా వచ్చును. ఇంగ్లీషు బాగుగా మాట్లాడుటకు నేర్చినట్టివారు.

ఇట్లు అనేక భాషలను నేర్చి, లోకానుభవము అపారముగా గడించిన రెడ్డిగారు ఇతరులవలెగాక తమ ధనమును, తమ శక్తిని, తమ బలమును, తమ పలుకుబడిని, ప్రజాభ్యుదయమునకు బాగుగా వినియోగించినారు. భావికాలములో రెడ్డిగారి ఉద్యోగ చరిత్రను ప్రజలు మరచిపోయిన మరచి పోవచ్చును. కాని వారి సాంఘిక సేవ మాత్రము అజరామరముగా కీర్తింపబడును.

## రెడ్డి హాస్టలు.

రెడ్డిగారు ప్రజాసేవ చేయుటలో రెడ్డివిద్యార్థులకు వసతి గృహమును స్థాపించుట ముఖ్యమైనట్టిది. ఇరువదేను సంవత్సరములకు పూర్వము హైదరాబాదు నగరములో ఒకే హిందూ హోటలుండెను. అందును భోజన వసతుల సౌకర్యములు సరిగా లేకుండెను. రెడ్డి విద్యార్థులకు అందువలన చాల యిబ్బందిగా నుండెను. విద్యార్థులసంఖ్యయు చాల తక్కువగానే నుండెను. ఏ పదిమందియో చదువుకొను చుండిరి- ఇట్లుండ వనపర్తి మహారాజాగారగు రాజా రామేశ్వరరావు బహద్దరు గారి చిన్నకుమార్తెగారిని సీర్నపల్లి రాజుగారికిచ్చి వివాహము చేయు సందర్భములో గొప్పగొప్పవారందరును సమకూడిరి. ఆ సందర్భమున వేంకట రామారెడ్డిగారును దయచేసియుండిరి. రెడ్లలో వివాహాదులందు వెనుకముందు చూడక వ్యయముచేయుదురనియు, ఇంతమంది రెడ్డిరాజులు, జమీందారులు, ధనికులు, ఉండియు రెడ్డి విద్యార్థులకే విద్యాసౌకర్యములు చేయకపోయిరనియు అచ్చట సమకూడినవారితో రెడ్డిగారు ప్రసంగించిరి. "ఎవరైన బాధ్యత వహించినట్లైన మేమందరము సహాయము చేయుదుము" అని అచ్చటిపెద్దలు పలికినారు. "నేను సర్వదా ఈ వ్యవస్థను నిర్వహించుటకు బాధ్యత వహింతును" అని వేంకట రామారెడ్డిగారు పూనిపలికినారు.

ఈ వాక్యము వినినంతనే అందరికన్న ముందే శ్రీయుత పింగిలి వేంకట రామారెడ్డిగారు మహౌదార్యముతో ౧౦,౦౦౦ రూపాయీలు చందా వేసినారు. వారినిజూచి రాజులందరును పెద్దమొత్తులోనే పోవలసివచ్చెను. వనపర్తి మహారాజుగారు ౨౫ ౦౦౦ రూ॥ను గద్వాల మహారాజుగారు ౩౦, ౦౦౦ రూపాయిలును పింగిలి కోదండరామా రెడ్డిగారు ౮౦౦౦ ను, గోపాలుపేట రాణీగారు ౮౦౦౦ ను రాజా రాజేశ్వరరావు బహద్దరు దోమకొండ సంస్థానా ధీశ్వరులు ౫౦౦౦ ను, రాజా సురభి వేంకట లక్ష్మారావు బహద్దరు జటప్రోలు రాజుగారు ౫౦౦౦ రూపాయీలును, చందాలు వేసినారు. ఇతర మహాశయులగు దేశముఖులును, జాగీర్దారులును, ధనికులగు పటేండ్లును, మున్నగు వారందరును తమ శక్తి కొలది ఉదారముగా చందాలు వేసినారు.

ఈ ప్రకారముగా సుమారు ౮౦ వేల రూపాయీల చందాలు వేయబడెను. ఇందు విశేషభాగము కొలదికాలములోనే వసూలయ్యెను. అటుపిమ్మట వేంకటరామా రెడ్డిగారు కాళయుక్తి సంవత్సర జ్యేష్ఠ శు॥ ౫ గురువారము, (౮ అమర్దాదు ౧౩౨౮ ఫసలీ) నాడు హైద్రాబాదు నగరములో రెడ్డి హాస్టల్ అనుపేర నొక విద్యాసంస్థను ఒకబాడుగ ఇంటిలో స్థాపించినారు. దాని ప్రారంభోత్సవమును కీ. శే. రాజా మురళీ


ధరుగారు గావించినారు. సంవత్సరాంతము లోపలనే ౫౦గురు విద్యార్థులు వచ్చిచేరిరి. అంతలోననే ఉల్లాసమెక్కువగుటచే "రెడ్డిహాస్టలు"ను కూడ స్థాపించి రెండేండ్ల వరకు నడిపినారు, కాని దానివలన నష్టము కలుగుటచేతను ప్రభుత్వ పాఠశాలలే విరివిగా నుండుటచేత ఈ నష్టవ్యవహారముతో నవసరములేదని తోచినందునను ఆపాఠశాలను తీసివేసి కేవలము రెడ్డి హాస్టలునందే శ్రద్ధను కేంద్రీకరించిరి. స్థాపితమైన నాటి నుండి నేటివరకును దానికి రెడ్డిగారే ప్రధాన కార్యదర్శిగా నున్నారు. ఇతరులెందరున్నను ఈ హాస్టలు సంపూర్ణముగా వారిచేతనే వృద్ధికి వచ్చినది. వారే ప్రతి ధనికునివద్ద చందాలెత్తినారు. ప్రతి వివాహములో విరాళములు ప్రోగుచేసినారు. ౧౩౩౩ ఫసలీలో సుమారు ౫౨౦౦౦ రూపాయిలకు ౯౦౦౦ చదరపు గజముల వైశాల్యముగల యొక పెద్దస్థలమును బంగ్లాయుక్తముగా హాస్టలునకుగాను కొనినారు. అందే యిప్పటికిని రెడ్డిహాస్టలు దినదినాభివృద్ధి నొందుచున్నది. ౧౩౩౪ లో భోజనశాలయు దానిపై ఒక పెద్దహాలును వంటశాలయు సుమారు ౨౮౦౦౦ రూపాయీలు వ్యయముచేసి కట్టించినారు. ౧౩౩౫ లో గ్రంథాలయ భవనమును ౪౮౬౯౦ రూపాయలకు పైగా వ్యయముచేసి కట్టించినారు. అందిప్పుడు సుమారు ౧౧౦౦౦ గ్రంథములున్నవి తర్వాత దాని

ప్రక్కననే మరొక బంగ్లాను ౭ జూ౯ ౧౯౨౭ సం॥లో ౩౦౦౦౦ రూపాయీలకు కొనినారు. ౧౩౪౬ ఫసలీలో రూ ౧౦౦౦౦ వరకు ఖర్చుపెట్టి వైద్యశాలయు, అతిథిగృహమును కట్టించినారు. విద్యార్థులసంఖ్య ౧౬౦ వరకు హెచ్చెను.

ఈప్రకారము రెడ్డిహాస్టలు దినదినాభివృద్ధి నొందుచుండ కొందరు ఓర్వలేనివారు దానిపై లేనిపోని అపోహములు కల్పించిరి. రెడ్డిగారు రెడ్డిహాస్టలులో బండ్లకొలది ఆయుధములను తెప్పించియుంచినారనియు విద్యార్థులకు వాటితో యుద్ధములుచేయుటకు నేర్పించినారనియు ఇట్టివిచిత్ర కథలనుకొందరు మతావేశపరులు వ్యాపింపజేసినారు. ముసల్మానులలో పేరుపొందినట్టి హజరత్ ఖాజాహసన్ నిజామీ అనువారు ఒకకడవ రెడ్డిగారి ఆహ్వానము నంగీకరించి హాస్టలును దర్శించినారు. వారు ప్రతివస్తువును పరిశీలించి చూచినారు. భూ గృహములు శోధించినారు. "అదిపాయఖానా" అనిచెప్పినను దానినికూడ చూచినారు. "అవిస్నానపుగదులు" అనిచెప్పగా గదులనన్నింటిని పరిశోధించినారు. "ఆ కొట్టిడీలో ప్రాతసామాను వేసినారు" అనినంతనే సామానులనన్నింటిని తొంగితొంగి చూచినారు. "ఆగదులందు విద్యార్థులు దేహపరిశ్రమచేయుదురు" అని పలికీపలుకకమునుపే ఆ గదులను ప్రత్యేకముగా తెరిపించిచూచినారు. ఇట్లు సూక్ష్మ

పరిశీలనము చేసి వెళ్లిపోయిన తర్వాత నిజామీగారు తాము ప్రచురించునట్టి ఉస్తా వారపత్రికలో నిట్లు వ్రాసినారు. "నాకు రెడ్డిహాస్టలు విషయమై చిత్ర విచిత్రవార్తలు తెలిసియుండెను. ఎన్నియో కత్తులను తెప్పించి బాలురను సిద్ధముచేయుచున్నారని కొందరు తెలిపినారు. నాకాహ్వానము వేంకట రామారెడ్డిగారు చేసినప్పుడు అచ్చటికివెళ్లి పాయఖానాలు, భూగృహము, ప్రాతగదులు, మూలమూలలోనిగదులు ఏదియును విడువకుండ చూచినాను. వేంకటరామారెడ్డిగారు నాపరిశోధనలోని యర్థమేమో తెలియక ఆశ్చర్యపడుచుండిరి. నాకిప్పుడు సంపూర్ణముగా తృప్తికలిగినది. వట్టి అశుద్ధ ప్రచారమును సరిపక్షపు వారు రెడ్డిగారి విషయమునను వారి హాస్టలువిషయమునను చేసినారని దృఢపడినది."

శ్రీ రెడ్డిగారికి గ్రంథములందు అత్యంతప్రీతి. వారిశ్రద్ధవలననే రెడ్డిహాస్టలులో ౧౨౦౦౦ గ్రంథాలు సేకరింపబడెను. అందనేకములు అపూర్వమైనవిగాను, విలువగలవిగాను నున్నవి. హైద్రాబాదునగరములో ప్రభుత్వమువారి అసఫియా గ్రంథాలయములో ౧౫౦౦౦ గ్రంథాలకన్న ఎక్కువగాలేవు. ఒకప్రజాసంస్థలో ౧౧౨౦౦ గ్రంథములు ఉండుట ఎంతయో గొప్ప విషయము. సర్కారీగ్రంథాలయమును, కాలేజీల గ్రంథాలయములను తప్పిన, రాష్ట్రములో ఈరెడ్డిగ్రంథాలయమును విం



రా॥ సర్ కిషన్ ప్రసాదు బహద్దరుగారు. ౨ వేంకటరామా రెడ్డిగారు 3 ప్రస్తుతపు కొత్వాలు న॥ నహ్మద్యార్ జంగు



హైదరాబాదు రెడ్డిహాస్టలు స్పోర్టు సంఘమువారితో రాజా బహద్దరు వేంకటరామారెడ్డిగారు.

చినట్టిది వేరెందును లేదు. ఇంతేకాక రెడ్డిబాలురకు వ్యవసాయవిద్యయందు శ్రద్ధ కలుగుటకును, రెడ్డిహాస్టలునకు కూరగాయలు సప్లైఅగుటకును ౫ ఎకరముల తోటను, ఒకచిన్న బంగ్లాయుక్తముగా రూ॥౬౦౦౦ లకు ఖరీదుచేసినారు. అది హుసేనుసాగరు చెరువుక్రిందకలదు. దానికి "రెడ్డిబాగ్ అని నామకరణము చేసినారు. ఇప్పుడు రెడ్డిహాస్టలునకు నెలకు సుమారు ౧౦౦ రూపాయీల కూరగాయలు ఖర్చగుచుండును. అందుసగమువరకు క్రయముచేయు కూరగాయలు ఈబాగునుండియేవచ్చుచుండును. రెడ్డివిద్యార్థులు సెలవు దినములలో అచ్చటికివెళ్ళి తోటపనులలో పాల్గొనుచుందురు.

రెడ్డిహాస్టలులలో బాలురకు వ్యాయామములందు శ్రద్ధ కలుగుటకై మంచిస్థలము ఏర్పాటుచేసి బంతిఆటలకు, క్రికెటు హాకీ మున్నగువానినేకాక, ముగ్దర్లు, మొదలగు కసరతు వస్తువులుకూడ ఏర్పాట్లుకావించి ప్రత్యేకముగా వ్యాయామశాలలను కట్టించినారు.

హాస్టలులో స్కౌటుశాఖనుకూడ ఏర్పాటుచేసినారు. ౪౦—౫౦ మంది విద్యార్థులు స్కౌట్లుగా ఏర్పడి పోటీలలో అనేక బహుమతులంది ప్రసిద్ధిగాంచినారు.

ఈ రెడ్డిహాస్టలులో వందలకొలది బీద విద్యార్థులకు ఉచితముగా భోజనము లభించుచున్నది. ఎందరో ఉత్తమ తర

గతులలో పరీక్షలందుత్తీర్ణులై మంచిఉద్యోగములుపొందినారు. పేరు రెడ్డిహాస్టలేకాని ఇందు రెడ్డిబాలురేకాక వెలమ, కమ్మ విద్యార్థులును ఎందరోచేరి లాభముపొందినారు. మరియు నాయుడు, మొదలియార్. పిళ్ళై, ముసల్మాను మున్నగువర్గము వారును చేరినారు. ఇటీవల అదే రెడ్డిహాస్టలులో బీదబాలురకుగాను "అనాథాలయము" అను పేరుతో ఒకశాఖ యేర్పాటుచేసి ఉచిత భోజన వసతు లేర్పాటు చేసినారు.

ఈ రెడ్డిహాస్టలు అభివృద్ధిచరిత్రలో వేంకటరామారెడ్డిగారి సిద్ధహస్తము అంతటను సువ్యక్తమగుచున్నది. వారు హాస్టలు భవనముల ఖరీదుచేసినతర్వాత నిలువ ధనమంతయు వ్యయమైపోయెను. భోజనశాలను కట్టించుటకు చేతిలో ద్రవ్యములేదు. కాని దానికై ౫౮౦౦౦ రూపాయలు పట్టినను దానిని పూర్తిగావించిరి. మొట్టమొదలు విద్యార్థులే ఒకచిన్న గ్రంథాలయమును "శారదా నికేతనము" అను పేరుతో ఏ నాలుగైదు వందల పుస్తకములతోనో ప్రారంభించిరి. కాని రెడ్డిగారి శ్రద్ధచే రెండు మూడేండ్లలోనే గ్రంథములసంఖ్య పెరుగుచు పెరుగుచు క్రమక్రమముగా ౧౧౦౦౦ వరకు వృద్ధినొందగా దానికొక ప్రత్యేక భవనమే అవసరమయ్యెను. కాని చేతిలో ఏమియు ద్రవ్యము లేకుండెను. గ్రంథాలయభవనము ప్రారంభమే మోాఅయ్యెను. ఒకసంవత్సరములోగా పూర్తి

కూడ నయ్యెను. దానికి ౪౫౦౦౦ రూపాయలకు పైగా పట్టె నని తెలిపియేయున్నాము. ఇట్లే యితర విషయములందును జరుగుచు వచ్చినది. రెడ్డిగారి యీ విజయముల రహస్య మేమియని విచారించవచ్చును. ప్రచండమైన సంస్థలను నడిపించుటకారిపద్ధతులు మనోహరముగా నుండును. రెడ్డిగారిదొక సిద్ధాంతము ముఖ్యమైనదిగానున్నది. "మనమేమైన ప్రజాహితకార్యము చేయదలచిన పనియును ప్రారంభింపకముందే ప్రజలను ద్రవ్య సహాయము చేయుమని విచారించిన అందు నసునకు విజయము లభింపదు. మనమూపనిని ప్రారంభించి ప్రజలకు మనము చేయుచున్నపనిని చూపించి సహాయము చేయుటకై విచారించిన అప్పుడు అనాయాసముగా ద్రవ్యము లభింపగలదు" అని శ్రీ రెడ్డిగారు పలుమారు చెప్పెడివారు. అదే పద్ధతిపై వారే బంగ్లాను ప్రారంభించినను సరే దాని శంఖుస్థాపన మొకపెద్ద మనుష్యునితో వేయింతురు. అట్లు గౌరవింపబడినవ్యక్తి కొంత ద్రవ్యమును ఇచ్చును. దానితో పాదులు పూర్తి అయినట్లే! తర్వాత ప్రతి ధనికునిగూడ "మానూతన భవన నిర్మాణమును తిలకించి ఆశీర్వదించ రండి" అని వారి కాస్థలమును చూపించుచుందురు. వచ్చినవారందరును ఏదో కొంత సహాయము చేసి పోవుచుందురు. ఈ ప్రకారముగా పనిసాగుచు పూర్తియగును. ఇట్టి చాకచక్య

ముచేతను, నిరంతర శ్రద్ధచేతను, ఎడతెగని పరిశ్రమచేతను, అత్యంతమైన ఓపికచేతను శ్రీ రెడ్డిగారు సుమారు మూడులక్షల విలువగల నొక ప్రచండమైన రెడ్డిసంస్థను స్థాపించి చిరస్థాయిగా నడుచునట్టి పద్ధతులపై ఏర్పాటు చేయగలిగినారు.

ఇదే రెడ్డిహాస్టలులో బాలుర ఆరోగ్య విచారణకొరకై ఒక వైద్యాలయమునే స్థాపించినారు. ఈవైద్యాలయములో అన్ని విధములగు మందులను తెప్పించి యుంచినారు. ప్రతిదినము సాయంకాలము ౫ గంటలనుండి ౬ గంటలవరకు రంగారెడ్డిగారుఅను డాక్టరుగారు (వీరు రెడ్డిహాస్టలుయొక్క ప్రాతవిద్యార్థియే) అత్యంత శ్రద్ధతో ఓపికతో విద్యార్థుల ఆరోగ్యమును విచారించుకొని ఉపచారములు చేయుచుందురు.

మరియు విద్యార్థుల వక్తృత్వ ధోరణియు, చర్చాసామర్థ్యము అభివృద్ధినొందుటకై హాస్టలులో నొక విద్యార్థి యువజన సంఘమును స్థాపించి దానిద్వారా ప్రతివారమును చర్చాసభలు (Debates) చేయించి వారిని వృద్ధికి దెచ్చుచున్నారు.

రెడ్డిగారు గావించిన సాంఘిక సేవలో నీ రెడ్డిహాస్టలుకొరకై వారుచేసిన సేవలో నిప్పుడు శతాంశముకూడ తెలుపుకొనలేదనిన అది అతిశయోక్తి కాదని హైద్రాబాదులోని ప్రతి విద్యావంతుడును ఒప్పుకొనమానడు.

## బా లి క ల ఉ న్న త పా ఠ శా ల

మొత్తము హైదరాబాదు రాష్ట్రములో మన బాలికల మాతృభాషలో విద్య చెప్పించునట్టి ప్రభుత్వోన్నత పాఠశాల లేకపోవుట దేశీయుల దురదృష్ట విశేషమని యైనను చెప్పవలసియుండును. ఈ లోపమును నివారించుట చాల యవసరమనిపించెను. ప్రభుత్వము వారు స్థాపించిన ఉన్నత పాఠశాలలో ఉర్దూకో, ఇంగ్లీషుకో ప్రాధాన్యత ఇయ్యబడినది. ఈ రాష్ట్రములోని ప్రత్యేక పరిస్థితులలో విద్యా సమస్య చాలచిక్కులతో గూడినదైనది. అందులో బాలికలవిద్య మరింత ఆశ్చర్యకరమైనట్టిది. ఉర్దూభాషలో ప్రధానముగా ఉన్నత విద్యాభ్యాసము శాసించుటచే ఉర్దూ మాతృభాష కాని బాలికలకు గొప్పకష్టముగానున్నది. ఆకారణముచేత హైదరాబాదు నగరములోనైనను ఒక బాలికల ఉన్నతపాఠశాలను మనబాలికల కొరకేర్పాటుచేసిన బాగుండునని స్త్రీవిద్యాభిమానులగు శ్రీ మాడపాటి హనుమంతరావుగారికిని మఱియితర ప్రముఖులకును తోచినది. అట్టి దృక్పథముతో వారొక బాలికల పాఠశాలను స్థాపించిరి. మొదటిఫారము తరగతితో నారంభమై కొన్ని యేండ్లలో క్రమ క్రమముగా ఉన్నత పాఠశాల అయినది. ఉస్మానియా విద్యాపీఠమువారు ఇంగ్లీషునకు మారుగా ఒక దేశీయభా

షకు ప్రాధాన్యతనిచ్చి యుండినందున బాలికల మాతృభాషకు ప్రాధాన్యతనిచ్చి స్థాపించిన కారణమున విద్యాపీఠాధికారులు ఆ పాఠశాలకు తమ విద్యాపీఠమందు స్థానమిచ్చి అంగీకరింతు రని నమ్మి పాఠశాల కార్యనిర్వాహక వర్గమువారు విజ్ఞప్తిసి సమర్పించుకొనినారు. కాని ఉస్మానియా విద్యా పీఠము వారు బాలికల ఉన్నత పాఠశాలలో ఉర్దూభాషద్వారా పాఠములు నేర్పుటలేదను కారణముచేత అంగీకారమును (Recognition) ఇచ్చుటకును నిరాకరించినారు. అదేకార ణముచేత ద్రవ్యసహాయముకూడ చేయుటకు వీలులేదనిరి. పునర్విజ్ఞప్తి లంపుకొన్నను ప్రభుత్వమువారి ద్రవ్యసహాయము లభించియుండలేదు. తుదకు బాలికల ఉన్నత పాఠశాలను బొంబాయి రాజధానిలోని పూనా నగరములో కర్వే మహా శయులచే స్థాపింపబడిన మహిళా విద్యాపీఠముతో జతచేసి అచట అంగీకారమును పొంది వారిచే మెట్రికు పరీక్షా పట్ట ములను బాలికలకిప్పించి ఈ పాఠశాలను నడుపుచున్నారు.

ఇట్టి పాఠశాలయొక్క పాలకవర్గమునకు శ్రీ వేంక టరామారెడ్డిగారు అధ్యక్షులైరి. వారు ప్రతి విషయమునను మంచిశ్రద్ధను వహించి మంచి సలహానిచ్చుటయేకాక స్వయ ముగా ద్రవ్యసహాయము చేసియున్నారు. బహుకాలమీ పాఠశాల ఒక అద్దెయింటిలో నడుపబడుచుండెను. కానిఅట్లు

ఎంతకాలము నడిపినను పాఠశాలకు స్థిరత్వ మేర్పడదని గ్రహించి శ్రీరాజాబహద్దరుగారు దానికొక మంచిభవనము కట్టించుటలో శ్రద్ధాళువైరి. బాలికల ఉన్నత పాఠశాలకై రెడ్డిగారి ప్రయత్నములచేత సుమారు ౩౫౦౦౦ రూపాయిల చందాలు వసూలయ్యెను. గత సంవత్సరము నారాయణ గూడాలో రెడ్డిగారి బంగ్లా వెనుకభాగములోనే ఒకవిశాలమైన ప్రదేశములో నూత్నభవనము పూర్తియై యిప్పుడందే పాఠశాల నడిపింపబడుచున్నది. పాఠశాలలో ఇప్పుడు దాదాపు ౪౦౦ బాలికలు విద్య నభ్యసించు చున్నారు. మెట్రిక తరగతివరకు విద్య గరపి పరీక్షలకు పంపు చున్నారు. ఇంతేకాక బి. ఏ. తరగతివరకును చదువు నుత్సాహముకల బాలికలకు ప్రైవేటుగా విద్య చెప్పించి వారిని పరీక్షలకంపుచున్నారు. ఈ రీతిగా కొందరు యువతులు బీ. ఏ. పరీక్షలో కడ తేరినారు.

### రెడ్డిబాలికల వసతిమందిరము

రాజాబహద్దరుగారు బాలికల ఉన్నత పాఠశాల యొక్క పాలక వర్గములో అధ్యక్షులైనతర్వాత వారిదృష్టి బాలికల వసతి మందిరము విషయమున ప్రసరించెను. జిల్లాల లోని గ్రామాలనుండి కొందరు బాలికలు ఉన్నతవిద్య నభ్యసించుటకై నగరమునకు రాగోరిరి. కాని వారి భోజనవసతులు

కిబ్బందియుండెను. ఈ లోపమును నివారించుటకై శ్రీ రెడ్డిగారు రమారమి ౬ సంవత్సరముల క్రిందట రెడ్డిబాలికల హాస్టలు నొకదానిని స్థాపించిరి. స్థాపనోత్సవమునాడే నగరప్రముఖ్యులు సుమారు ౩౦౦౦ రూపాయల విరాళములనిచ్చిరి. ఈ ద్రవ్యసహాయముచే మంచిబంగ్లా అద్దెకుతీసుకొని హాస్టలు కార్యమారంభించిరి. కొన్ని మాసములలోనే సుమారు ౨౫ మంది బాలికలు అందులోచేరిరి ఆ వసతి మందిరములో మంచి సౌకర్యములు నేర్పాటు చేసినారు. కేవలము రెడ్డిబాలికలే కాక వెలమ నాయుడు మున్నగు కులముల బాలికలును అందుచేరి లాభమందుచున్నారు. బాలికలను పాఠశాలకు బండ్లలో తీసుకొనుపోవుటకు వారిని విచారించుకొనుటకొరకు ఆంగ్లో ఇండియన్ స్త్రీని, ఏర్పాట్లుచేసినారు. బీద బాలికలకు ఉచితముగా భోజనము నిచ్చుచున్నారు. ఈ బాలికల హాస్టలునకుకూడ నొక సొంత భవన మవసరమని తలచి బాలికల ఉన్నత పాఠశాలా భవనముప్రక్కననే నొక విశాల భాగమును ౫౦౦౦ రూపాయీలకు కొనిపెట్టియుంచినారు. అందు భవనము నిర్మించు ప్రయత్నములో నున్నారు. రెడ్డిగారు చేసిన యితర కార్యములవలెనే ఇదియు త్వరలో సాధింపబడుననుటలో సందేహము లేదు-

### పరోపకారిణీ బాలికా పాఠశాల.

హైదరాబాదు నగరములో ఈ బాలికాపాఠశాల ప్రైమరీ తరగతి వరకు స్థాపించినారు. దాని పాలక వర్గము నకు అధ్యక్షులు శ్రీ రెడ్డిగారే. ఇదియు మంచి స్థితిలో నడుప బడుచున్నది. ఈ పాఠశాలలో నిప్పుడు సుమారు ౬౦ , ౭౦ బాలికలు తెనుగులో విద్యనేర్చుకొనుచున్నారు.

### ఎక్సెల్‌సియర్ మిడిల్ పాఠశాల

ఈ పాఠశాలలో విశేషముగా తెనుగు బాలురే చదువుచున్నారు. దీని పాలకవర్గమునకు అధ్యక్షులు శ్రీ రెడ్డిగారే. వారి అధీనములో ఈ పాఠశాలయు నడుపబడుచున్నది. ఈపాఠశాలా విషయమున స్థానికాంధ్రులు ఎక్కువ, అభిమానము చూపని కొరత యొకటిగలదు. ఆంధ్రులీ పాఠశాలపై మంచి అభిమానము చూపినచో నైన కొన్ని సంవత్సరములలో ఇది హైస్కూలుగా మారి మంచి ఆంధ్రసంస్థగా నుండగలదు.

### స్త్రీక్లబ్బు. (కాస్మపాలిటన్ క్లబ్బు)

నగరములో బొగ్గులకుంట సమీపమున మహిళా సంఘము పేర నొక గొప్ప బంగ్లా కట్టబడియున్నది. దాని నిర్మాణమునకుగాను రాజాబహద్దరుగారు రాజా సర్ బన్సీలాలు గారిని ప్రోత్సహించి వారివలన సుమారు రూ ౧౫౦౦౦ ను

మరి యితరులవలన మరికొంత ద్రవ్యమును ప్రోగుచేసి మంచి భవనమును కట్టించినారు. ఈ క్లబ్బులో రాణీలు మున్నగు పెద్దపెద్ద వారు సభ్యులుగ నున్నారు-

రిఫాహెఆం పాఠశాల

నగరములో రిఫాహెఆంఅను మాధ్యమిక పాఠశాలను కొందరు విద్యాప్రియులైన ప్రజానాయకులు నడుపుచున్నారు. ఈ పాఠశాలయొక్క పాలకవర్గములో ఈరెడ్డిగారు అధ్యక్షులై పాఠశాలను నడిపించుచున్నారు, ఈ పాఠశాలలో నిప్పుడు సుమారు ౨౫౦ వరకు విద్యార్థులు చదువు నేర్చుకొనుచున్నారు.

బాలికా పాఠశాల (గొల్లఖిడ్కి)

హైదరాబాదు నగరములో గొల్లఖిడ్కీలో నొక ఆంధ్రబాలికా ప్రాథమిక పాఠశాలను ప్రజాసేవకులు కొందరు కలసి స్థాపించి నడిపించుచున్నారు. ఈ బాలికా పాఠశాలకును శ్రీరెడ్డిగారే అధ్యక్షులు- ఈ పాఠశాల నగరములోని గొల్లఖిడ్కీ చుట్టుపట్టులలోనుండు ఆంధ్రబాలికలకు తమ మాతృభాషాద్వారా విద్యను నేర్చికొనుటకు చాల సహాయపడుచున్నది-

పరోపకారిణీ బాలికా పాఠశాల (సికింద్రాబాదు)

సికింద్రాబాదు నగరములో కీః శ్రీ- సీతమ్మగారు స్వార్థత్యాగముతో తమ జీవితమునంతయు ధారపోసి ఒక

ప్రాథమిక పాఠశాలను స్థాపించి నడుపుచుండిరి. శ్రీమతి సీతమ్మగారు గతసంవత్సరము చనిపోయిరి. ఇప్పుడా పాఠశాల సీతమ్మగారి కుమారుని చేతను, మనుమరాలిచేతను నడుపబడుచున్నది. ఆపాఠశాలకు శ్రీరెడ్డిగారు చాల సహాయముచేసి యితరులచే చేయించి దాని అభివృద్ధికి కారకులైనారు. ఇటీవలనే శ్రీరెడ్డిగారి అధ్యక్షతలో ఆ పాఠశాల యొక్క వార్షికోత్సవము అతి వైభవముతో జరుపబడెను.

## సంఘసంస్కారము

రెడ్డిగారు పూర్వకాలపువారైనను మంచిసంఘసంస్కారులు. బాల్యవివాహములు కూడదనియు, వితంతూ ద్వాహములు చేయవలయుననియు, శాసనసభలో కీ॥ శే॥ పండిత కేశవరావుగారు రెండు చిత్తు శాసనములను ప్రవేశపెట్టినప్పుడు వీరు ఆశాసనములకు అనుకూలముగా చాల ప్రయత్నములు చేసిరి. వితంతూ ద్వాహశాసనమును విమర్శించి అభిప్రాయమిచ్చుటకొరకు ఉపసంఘమును శాసనసభవారు నియమించిరి. అందు రెడ్డిగారు ముఖ్యులు. ఈ యుపసంఘము వారి అభిప్రాయము ననుసరించి తుదకు వితంతూద్వాహ శాసనమును ప్రభుత్వమువా రంగీకరించిరి. రెడ్డిహాస్టలులో ఒక విద్యార్థి సుమారు ౧౨ సంవత్సరముల క్రిందట వితంతూ ద్వాహము చేసికొనెను. దానికి వేంకటరామారెడ్డిగారు మంచి ప్రోత్సాహము కలిగించిరి.

రెడ్లలో ఎన్నియో అంతశ్శాఖలున్నవి. ఒకే శాఖలోనే కులము తప్పులుపొందిన ఉపశాఖలను కలవు. ఈ మూర్ఖాచారములను పోగొట్టవలెనని సుమారు ౨౫ సంవత్సరముల క్రిందటనే వేంకట రామారెడ్డిగారు ప్రారంభించినారు. గద్వాల మహారాజులగు శ్రీమంతు శ్రీసీతారామభూపాలరావు బహద్దరుగారి వివాహ కాలమునాడే వీరు మోటాటి పాకనాటి మున్నగు రెడ్లలోని ఉపశాఖలను అన్నింటిని ఏకము చేయవలెనను ప్రబోధముచేసి రాజులయొక్కయు దొరలయొక్కయు, కుల ప్రముఖులయొక్కయు, అంగీకారపు సంతకములు గైకొనిరి. వనపర్తి, దోమకొండరాజులు, ఇందుకు సంపూర్ణముగా నంగీకారమిచ్చిరి. నాటినుండి యెన్నియోమారులీ విషయమున ప్రబోధము జరుగుచు వచ్చెను. తత్ఫలితముగా మునగాలవారును, పింగిలివారును, ఇదిగాలవారును, మరి యిట్టివారెందరో అంతశ్శాఖావివాహములు చేసిరి. ఇప్పుడు గోన, మోటాటి, పాకనాటి, గుడాటి, పంట అను రెడ్డికులశాఖలు కలిసి పోయినవి.

రాజా బహద్దరుగారిలో కుల భేదముల పట్టింపుగాని, మూర్ఖాచారాభిమానముగాని, మూఢ విశ్వాసములుగాని, (Orthodoxy and Superstition) ఏ మాత్రమునులేవు. వారు అన్నికులములవారితో, అన్ని మతముల వారితో భుజింతురు.





విలియం సహేబ్ గారు

(వేంకట రామారెడ్డిగారి మేనమామ)

హిందువులకు సముద్ర ప్రయాణమును మధ్యకాల ములో నిషిద్ధము చేసినట్టి కొన్ని సూత్రములుబయలు దేరెను. ప్రాచీన కాలములో హిందువులు, అందు ప్రధానముగా ఆంధ్రులు ఖండఖండాంతరములకు సముద్రముపై ప్రయాణ ముచేసి వ్యాపారము చేయుచుండిరి. మరియు నానా ద్వీపము లలో వేద మతవ్యాప్తిని గావించి వలస రాజ్యములు స్థాపిం చిరి. కలకట్టుబాటు విపరీతముగా ముదిరినతర్వాత సముద్ర ప్రయాణము చేయకూడదని కొన్ని తప్పుడు శాస్త్రములు బయలు దేరెను. నిజాం రాష్ట్రములో రెడ్లును ఈ శాస్త్రభీ తిచే తమపిల్లలను యూరోపు, అమెరికా ఖండములకు పంపు టకై జంకుచుండిరి. ఆ సందర్భములో నిజాం రాష్ట్రము లోని రెడ్లలో ప్రథమమున సముద్రప్రయాణమును కను కూలించినవారు శ్రీ రెడ్డిగారును శ్రీయుత పింగిలి వేంకట రామా రెడ్డిగారును నైయున్నారు. శ్రీరెడ్డి గారి కుమారులగు వేంకట లక్ష్మణ రెడ్డిగారును, పింగిలి వేంకట రామారెడ్డిగారి తమ్ములగు శ్రీకృష్ణారెడ్డిగారును. మరియు రాజగోపాలరెడ్డి (బ్యారిష్టరుగారను) మొట్టమొదట ఇంగ్లాండు దేశము నకు బారిష్టరీచదువుటకుగాను సముద్రప్రయాణము చేసివెళ్ళిరి.

## వక్తృత్వ సామర్థ్యము

అనేకమంది అధికారులు తామెంత గొప్పవారైనను సభారంగముపై నిలిచినప్పుడు నోట తడిలేక మాటలేక

ఉక్కిరిబిక్కిరిగా స్తబ్ధులై నిలిచిపోవుదురు. వేంకట రామారెడ్డి గారు అట్టిశ్రేణిలోనివారుకారు. వారియందు హిందువులకే కాక మహమ్మదీయులకును సంపూర్ణమగు గౌరవముకలదు. వారుసభలో ప్రవేశించగానే అందరును లేచినిలుచుకొని కొని గౌరవింతురు. ఈ విశేషమును విశ్వనాథ సత్యనారాయణగారను సుప్రసిద్ధాంధ్రకవులు హైదరాబాదు నగరములో ఉపన్యసించుచున్నప్పుడు తాము స్వయముగాచూచి చాల ఆశ్చర్యపడిపోయినారు.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ ఎం. ఏ. గారు ౨౮ సెప్టెంబరు ౧౯౩౬ నాడు గోలకొండపత్రికలో "హైదరాబాదులో పదునుదినములు" అనువ్యాసమందు రాజా బహద్దరుగారిని గురించి యీ విధముగా వ్రాసినారు. —

"ఒకరోజు పొద్దున ప్రతాపరెడ్డిగారు శ్రీ శ్రీ రాజా సాహెబు కొత్వాల్ వేంకట రామారెడ్డి బహద్దరుగారి సన్నిధికి తీసుకవెళ్లారు. రాజా వేంకటరామారెడ్డిగారు వృద్ధులు. వార్థికమువారి శరీరమందున్న దేమోకాని ఆ మొగములో యవ్వనమే తాండవిస్తుంది. ఠీవి, దర్జా, ప్రసన్నత్వం ఆయన ముఖంలో కొట్టవస్తున్నవి. వారి యిద్దరుకుమారులు, శ్రీ దోమకొండ రాజాగారు, మేమున్న ప్రాతఃకాల ఫలాహారము

లకు కూర్చున్నాము. రకరకాలైనపండ్లును, మిఠాయీలు, బల్లమీదనున్నవి. రాజా సాహేబుగారు అప్పుడు చేసిన ఆద రము, బెట్టులేనిచనువు నెరపడముచూస్తే నాకు ఆశ్చర్యం వేసింది. ఆ మహా పురుషుణ్ణిగూర్చి ఒక్కమాట చెబితే అంతా చెప్పినట్లౌతుంది. అది యేమిటంటే నేనొకరోజున రెడ్డి హాస్టలులో ఉపన్యాసమిస్తూ ఉండగా, వారు లోనికి వచ్చారు. సభలో అయిదారు వందలమంది జన మున్నారు. వారు వచ్చినంతనే ఆరువందలమందీ ఒక్కసారి లేచి నిలుచు న్నారు- ఇటువంటి గౌరవము మాదేశములో ఎవ్వరికీ జరు గదు. నేను ఒక్కనిముసం దిగ్భ్రాంతుడనైపోయి మళ్ళీ ఉపన్యాస మారంభించుకొన్నాను. వారు నేనిచ్చిన రెండుమూ డు ఉపన్యాసములకు దయచేశారు. చాలాసేపు కూర్చు న్నారుకూడాను. అంతసేపు కూర్చోరని యెవరో చెప్పగ విన్నాను. దానికినేను కృతజ్ఞుడను."

రాజాబహద్దరు రెడ్డిగారు సభలో మాట్లాడుటకు నిలిచినారనిన సభయంతయు ఆనందముతో నిరీక్షించుచుం డును. వారు ఉర్దూలో అనర్గళధారతో జంకుగొంకులేక మంచి ధారాశుద్ధితో నుపన్యసింతురు. ఎటువంటి సమస్యావిషయ మునకైనను హాస్యరస ముట్టిపడునట్లుగా మాట్లాడుదురు. వారు గ్రంథ పరిశోధనములు చేసినవారుకారు. ఉద్యోగ

ధర్మములో దినపత్రికలు చదువుటయు, ప్రభుత్వ నివేదికలను చదువుటయు, వారికి అలవాటు- అట్లు విజ్ఞాన సంబంధమగు గ్రంథములు బహుళముగా చూచుటకు వారి కవకాశము లభింపకుండినను వారికి విశాలమైనట్టి లోకానుభవము లభించినది. మద్యపానము గురించి మాట్లాడుదురు. విద్యార్థులకు ఉపదేశములు చేయుదురు. బాలికలకు బుద్ధులు చెప్పుదురు. సహకారమును గురించి ముచ్చటింతురు. అస్పృశ్యతా దోష నివారణనుగురించి బోధింతురు- వ్యాయామములను గురించియు ఆరోగ్య సాధనమును గురించియు ఉపన్యసింతురు. సంగీతమును గురించకూడ మంచి పరిశోధనతో కూడిన ఉపన్యాసమిత్తురు.

ఒకతడవ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయములో మనోహరబర్వేఅనుప్రసిద్ధ బాలగాయకుని సమ్మానించిన సందర్భములో రాజాబహద్దరుగారు అధ్యక్షులుగానుండిరి. పోలీసువారికేమి సంగీతసంబంధమేమి? అని యందరకును విచిత్రముగానె యుండెను. కాని వారు సంగీత ప్రాశస్త్యమును గురించి ఒకగంటకాలము మనోహరముగా నుపన్యసించిరి. ఎద్దులు వడిగా నిరాయాసముగా నడుచుటకై గజ్జెలు గంటలు కట్టుటలోను సంగీత ప్రాధాన్యతయే యున్నదనియు బాలురను తల్లిజోకొట్టునప్పుడును గానమే చేయుననియు, పసులబాలురు

కాలహరణార్థము పిల్లనగ్రోవిపై పాడుదురనియు, దేవుడు కూడ సంగీతముతో కూడిన భజనచే వశీకృతుడగుననియు, ఇంకను నెన్నియో యిట్టి యుపమానములనిచ్చి తను అఖండ లోకానుభవమును ప్రకటించి అందరిని ఆశ్చర్యములో తన్మయులగునట్లుగా చేసిరి.

వీరి యుపన్యాసములలో మంచి ఉత్తమమైన హాస్యరసముండును. వీరు తమ ప్రజాహితకార్యములలో సహాయపడిన వారినెవ్వరిని మరచిపోరు. సభావేదికలపై వారికి సుకుమారముగా తమకృతజ్ఞతను వెల్లడింతురు. ఎట్టి క్లిష్టసమస్యలైనను సరే, చర్చించి, ప్రతి పక్షులలో నిండియుండిన అనుమానములను, ద్వేషములను సహితము పటాపంచలగునట్లుగా వివరించి విమర్శించి సమర్థించి మెప్పింతురు. వీరివక్తృత్వమును గురించి ఖాజాహసన్ నిజామీగారు ఒకమారు ఇట్లు మిత్రులతో సెలవిచ్చినారు "నేను హిందూస్థాన మంతటను వేలకొలది ఉపన్యాసములను వినినాను. రాజాబహద్దరువలె సర్వపక్షముల వారిని మెప్పించునట్లుగాను చమత్కారముగాను ఉత్తమశ్రేణిలో నుపన్యసించు వ్యక్తులనేను చాల అరుదుగా చూచినాను. ఈతడు అసాధారణ ప్రజ్ఞావంతుడు"

## అనాథులపై ప్రేమ

రాజా బహద్దరుగారికి అనాథ బాలబాలికల పైనను, వృద్ధులపైనను, రోగపీడితులపైనను, తుదకు జంతువులపైనను చాల ప్రేమ. వీరు జంతుహింసా నివారణసంఘములో ముఖ్యులుగా చేరి చాల సేవచేసినారు. కొత్వాలుగా నుండిన కాలములో అనాథశిశువుల కేసులను విశేషముగా విచారించుట తటస్థించెను. హైద్రాబాదు రాష్ట్రములో "పెంపుడుపిల్లల" (పర్వర్దాల) ను ధనికులును, నవాబులును, రాజులును తమ సేవలోనుంచుకొనుట ఆచారమైపోయినది. ఆ పిల్లలు శాశ్వతముగ వారి బానిసలుగానుందురు. వారిని చాల కష్టపెట్టుటయు సహజమైయుండెను. ఈ విషయములను అప్పుడు పోలీసుశాఖా మంత్రిగానుండిన సర్. ట్రెంచిగారికి చెప్పి శాసన సభలో "శిశువుల సంరక్షక శాసనము"ను కావించుటలో ముఖ్యకారకులైరి.

సికింద్రాబాదులోను హైద్రాబాదులోను "వృద్ధాశ్రమములు" రెండుకలవు. అచ్చటికి పలుమారువెళ్ళి దర్శించి ద్రవ్య సహాయముచేసి యితర ధనికులతో చేయించుచుందురు. గొప్ప వారి యిండ్లలో వివాహాది శుభకార్యములైనప్పుడు వారివలన చందాలు వసూలుచేసి వృద్ధాశ్రమములకు మిఠాయిని కొని పంపించుచుందురు. అదేవిధముగా నగరసమీపమున సరూన

గరులో ప్రభుత్వమువారు స్థాపించిన అనాథబాలుర ఆశ్రమమును పలుమారు దర్శించి బాలురకు మిఠాయిని పంచిపెట్టింతురు. మరియు దీని పాలకసంఘములో వీరొక సభ్యులుగా నున్నారు. డిచ్పల్లిలోని కుష్ఠరోగులకు సహాయము అనేక మారులు చేయించినారు. హైదరాబాదు నగరములోను కొంతకాలము ఒక కుష్ఠురోగుల చికిత్సాలయమును స్వయముగా స్థాపించి చికిత్సలు చేయించిరి.

నగరములో విషజ్వరాలు వ్యాపించి ప్రతిదినమును వందల కొలది చచ్చు కాలములోను, ప్లేగు తీవ్రరూపమును దాల్చి ప్రజానాశనము చేసిన కాలములోను వీరు బీదవారికి మందులిప్పించి వసతులు కల్పించి, టీకాలను దీయించి సహాయపడిరి. ప్రభుత్వమువారును వీరి సాంఘిక సేవను గుర్తించి ఒక విలువగల గడియారమును బహుమతిగా నిచ్చిరి. మరియు ఒక బంగారు పతకమునుగూడ నిచ్చినారు.

అనాథులపై వీరికెట్లు గాఢానురాగము కలదో అదే విధముగ శ్రీ రెడ్డిగారికి హరిజనులపైనను మంచి అనురాగము కలదు. హిందువుల దురాచారములలో అగ్రస్థానము వహించినట్టి అస్పృశ్యతా దోషమును రెడ్డిగారు అత్యంతముగా నిరసించునట్టివారు. హరిజను లెందరో వారిసేవలో నియుక్తులై వృద్ధికి వచ్చినారు. మరియు ఈ రాష్ట్ర హరిజనులందొక విచా

రకరమగునా చారముకలదు. కొందరుహరిజనులు తమబాలికలకు చిన్నతనమందే "మురళీలు అనియు "బసివిరాండ్రు" అనియు, పేరుపెట్టి వారినియావజ్జీవ వ్యభిచారిణులనుగా నిర్ణయించుచుందురు. ఈ సంఘ కళంకమును తుడిచివేయుటలో హరిజన నాయకులకు శ్రీరెడ్డిగారివలె మరెవ్వరును సాయపడలేదు.

### రాజాబహద్దరుగారి సంతానము

రాజాబహద్దరుగారికి మొదటి భార్యవలన శ్రీయుత రంగారెడ్డిగారు అనువారు కలిగినారు. రంగారెడ్డిగారు జన్మించిన కొలది దినములలోనే వారి తల్లిగారు గతించినారు. రంగారెడ్డిగారి కిప్పుడు సుమారు ౫౦ సంవత్సరముల వయస్సు. వారు కొంతకాలము పూనాలో విద్యాభ్యాసము చేసినారు. మెట్రికు వరకు చదివినారు. ఉర్దూలో మంచి పాండిత్యముకలదు. వారు సుమారు ౨౨ సంవత్సరముల క్రిందట నిజాం ప్రభుత్వ అబ్కారీశాఖలో ఉద్యోగిగా నియమితులైరి. వారిప్పుడు అబ్కారీ డిప్టీకమిషనరు పదవిలో నున్నారు. నెలకు రూ. ౧౦౦౦ జీతముపొందుచున్నారు. వారికి సంతానములేదు.

రాజాబహద్దరుగారికి రెండవ భార్యవలన శ్రీయుత లక్ష్మారెడ్డిగారును, శ్రీమతి నరసమ్మగారు అను పుత్రికయు కలిగినారు. లక్ష్మారెడ్డిగారు పూనాలో విద్యాభ్యాసము ముగించిన తర్వాత ఇంగ్లాండునకు వెళ్ళినారు. అచ్చట కొన్ని

సంవత్సరములు విద్యాభ్యాసముచేసి బ్యారిష్టరు అయివచ్చి నారు. స్వదేశమునకు తిరిగి వచ్చిన కొంతకాలమునకు వారు మద్రాసులో కొంతకాలము పనిచేసి హైదరాబాదు హైకో ర్టులో సర్కారీ వకీలుగా (కౌన్సిల్‌గా) నెలకు ౨౦౦ రూపా యిల జీతముపై నియమితులైనారు. ఇట్లు కొన్ని సంవత్సర ములు గడచిన తర్వాత వారిని ప్రభుత్వమువారు అడిషనల్ సెషన్‌జడ్జి పదవిపై నియోగించినారు. ఈ పదవిని తర్వాత సెషన్‌జడ్జి అయిన మూడునాలుగు సంవత్సరములు నిర్వహిం చిన తర్వాత హైకోర్టు జడ్జిపదవిపై నియుక్తులైరి. అచ్చట నుండి స్వతంత్రులైన న్యాయమూర్తులని పేరుపొందినారు. ఇటీవలనే వారిని జూడిషియల్ కమిటీ మెంబరుగా ఏర్పాటుచేసి యున్నారు.

శ్రీ లక్ష్మారెడ్డిగారు ఇంగ్లాండునుండి వచ్చునప్పుడే ఆంగ్లకన్యకను వివాహమాడినారు. వారితో ఇరువది సంవత్స రములుపైగా సంసార సౌఖ్యమనుభవించినారు. ఆమె చాల ఉత్తమ గృహిణిగాను, స్త్రీసోదర్యనుములందు మంచి సేవా సక్తి కలవారుగాను ఉండినారు. సుమారు మూడు సంవత్సర ముల క్రిందట ఆయమ మరణించెను.

శ్రీ లక్ష్మారెడ్డిగారికి యిద్దరు కుమార్తెలును ముగ్గురు కుమారులును కలరు. చివర బాలుడు నాలుగేండ్ల వాడు. తక్కిన వారందరును విద్యాభ్యాసము చేయుచున్నారు కుమార్తె లిరువురును ఇంగ్లాండులో చదువుచున్నారు. ఒకరు బారిష్టరు వృత్తికిని, ఇంకొకరు వైద్యవృత్తికిని చదువు చున్నారు.

# పదునొకండవ ప్రకరణము

## గు ణ వి శే ష ము లు.

రెడ్డిగారు ప్రతి దినమును ప్రాతఃకాలమున ౫ గంటలలోపలనే నిద్రనుండి మేల్కొని పత్రికలు, ముఖ్యమగు కాగితములు, గ్రంథములు చదువుకొందురు. వారుచదువదలచిన పత్రికాదులన్నియు వారి మంచము ప్రక్కననే యుంచుకొని యుందురు. ౭ గంటలు కొట్టువర కీప్రకారము చదువుకొనిన తర్వాత కాల్యకృత్యములు తీర్చుకొని స్నానముచేసి ఏకాంతములో పరమేశ్వర ధ్యానము చేసికొందురు. ౮ గంటలవరకు పూర్తిచేసికొని తేనీరు ఫలాహారమును తీసుకొందురు. ఆ సమయమున బయట తమకొరకై యెరిగిన వారెవరైన వచ్చినారా చూడుమని ప్రతిదినము మరువకుండ సేవకులకు చెప్పుచుందురు. వారితో విశేషముగావచ్చి కలిసిపోవువారిని తమతోకూడ తేనీరు త్రాగుటకు పిలుతురు. వారిభోజనము రాజభోజనము. సాధారణముగా నానావిధముల మధుర పదార్థములును వివిధ ఫలములును ఇతరలోభనీయ భోజ్య

వస్తువులును వారి బల్లపై నిండియుండును. తమతో కూడ కూర్చున్నవారికి కడుపునిండుగా భుజించుటకై స్వయముగా ప్రోద్బలము చేయుచుందురు. నాజూకువారు అజీర్ణబాధను పొందకమానరు. సుమారు ఎనిమిదిన్నర గంటల కాలము ప్పుడు బట్టలువేసికొనిబయటికివత్తురు

బయటి పెద్దహాలులో జనులు క్రిక్కిరిసియుందురు. సిఫారసులకు వచ్చినవారు, ఊరక కలిసిపోవుటకు వచ్చిన వారు, రాజులు, నవాబులు, రాజకీయములలో ఆలోచనలు చేయుటకై వచ్చినవారు, ధనసహాయార్థము వచ్చినబీదవారు, చేతిక్రింది ఉద్యోగులు, చందాలకై వచ్చినవారు, బ్రిటిషిండియానుండి కార్యార్థులై వచ్చినవారు, రెడ్డిగారి పాలనలోనుండు వివిధసంస్థలకు సంబంధించినవ్యక్తులు, హిందువులు, ముసల్మానులు, అన్నివిధములవారును అచ్చట చేరియుందురు. వారందరితోను ఒక అర్ధగంట లేక గంటకాలముమాట్లాడి పంపివేసి తమ యితర వ్యవహారములను చూచుకొందురు. ఏదే కమిటీ పనులుండునో అవి ౧౧ గంటలలోపల ముగించుకొందురు. తర్వాత కొత్వాలీ పనికాలములో ౧౧ గంటలవరకు కచ్చేరీకివెళ్ళి మధ్యాహ్నానంతరము ౨ గంటలవరకో 3 కొట్టువరకో కచ్చేరీపనులు చూచుకొందురు. మూడు గంటలకింటికివచ్చి భోజనము చేయుదురు.

భోజనముకూడ మంచి రాజభోజనము. నానావిధముల కూరలు, రుచ్య పదార్థములు, మున్నగునవి సదా వారిభోజనములో చేరియుండును. తర్వాత అర్ధగంట విశ్రమించి ఒక గంట విశ్రమింతురు. మరలలేచి నాలుగు నాలుగున్నరగంటలసమయములో శ్రీ నిజాం ప్రభువుగారి దర్శనార్థము వెళ్ళుదురు. అచ్చట అర్ధగంటయో గంటయో ఒక్కొక్కప్పుడు రెండుగంటలో తమ ఏలిక సన్నిధిలోనుండి తెలుపవలసినవి తెలిపి పొందవలసిన ఆజ్ఞలుపొంది, అభిప్రాయములడిగిన తమకు తోచిన మనవిని గావించికొని తిరిగివత్తురు. సాయంత్రము ౬ లేక ౭ కొట్టినతర్వాత రెడ్డివిద్యార్థి వసతిగృహమో, బాలికల పాఠశాలా కార్యములో లేక ప్రజాహిత సంస్థల కార్య నిర్వాహకవర్గమందు కార్యవిచారణయో చూచుకొని రాత్రి ౮ లేక ౯ కొట్టువరకు ఇల్లు చేరుకొందురు. సాధారణముగా, సాయంకాలమందు నగరములోని పోలీసునాకాలను పరిశీలించుచు వాహ్యాళి వెళ్ళెదరు. రాత్రి ౯ గంటలకు భోజనము పగటివలెనే. తర్వాత పడకగదికి వెళ్ళుదురు. కాని అప్పుడే నిద్రపోరు. ప్రత్యేకముగ ముఖ్య విషయముల గురించి అవకాశముతో వారితో ముచ్చటించదలచినవారికది మంచిసమయము. కొన్ని సమయములలో అనేకులదేప్రకార మాలోచించుకొని వారియింటివద్ద గుమికూడి

యుండురు. వారందరితోను తీరికతో మాట్లాడుదురు. ౧౨ గంటలసగము రాత్రివేళ వరకీ ప్రకారముగా ముచ్చటించిన తర్వాత అందరిని పంపివేసి నిద్రపోదురు. ౧౨నుండి తెల్ల వార ౫ గంటలు కొట్టువరకు అనగా అయిదు గంటల కాల ముమాత్రమే నిద్రపోవుదురు. ఇదివారి దినచర్య. దీనినిబట్టి వారు ఎంతటి విరామము లేనివారో, ఎంతటి పరిశ్రమ చేయు వారో, యెంతటి ఓర్పుకలవారో బోధపడగలదు. కార్యబా హుళ్యము మెక్కువైనప్పుడు అనేకులకు చీకాకుపుట్టును, కసరు కొనుటలును, కోపము తెచ్చుకొనుటలును కలుగుట సహజము. కాని శ్రీ రెడ్డిగారు నిండుకుండవలె తొణకనివారై, శాంత మూర్తులై యెవ్వరెవ్వరి నెట్లెట్లు తృప్తిపరచవలయునో ఆ ప్రకారము చేసిపంపుచుండురు. వారికి కోపము చాల అరుదు గా కలుగును. కాని ఆకోపము విచిత్రమైన కోపమే. చాల మందికి దాని రహస్యము తెలియదన్నమాట. వారు కార్య సాధనకై కొన్ని సమయములలో ఉగ్ర భైరవరూపము దాల్తురు. వారు కోపించుకొనిరా ఎదుటివారు గడగడలాడి పోదురు. అంతటితో కార్యసాధనమైనట్లే! తప్పు చేసినవా రింకొకమారుచేసి ఆ ఉగ్ర స్వరూపమునకు గురికానొల్లరు. కాని లోపలి రహస్యమేమన ఆ కోపములోనే ప్రేమ యిమిడి యున్నది. తప్పుచేసినవాడు సవరించుకొని బాగుపడవలెనను

నభిప్రాయమే వారిలోనుండును. అట్టివారిని సంస్కరించువారే కాని, ఎన్నడును ఎవ్వరిని చేతలార, మనసార, శక్తిసామర్థ్యములపారముగానుండియు చెడగొట్టిన పాపాన పోయినవారు కారు.

వారికి ప్రభువుగారివద్ద ఆజ్ఞలుపొంది ఆచరించుటలో ఎంతశ్రద్ధయో రెడ్డిహాస్టలులో ఊరుగాయకు కావలసిన పాయి గ్రి సరిగా వచ్చినదాలేదా? పిల్లలు ఉస్కూలు సరిగా చదువుచున్నారాలేదా? బాలికల పాఠశాలకు సరియైనట్టి అగ్గువయైనట్టి ఇంటికిలు వచ్చినవాలేదా? అను చిన్న విషయములలోను అంతటి శ్రద్ధయే యుండును.

సుమారు ౫౩ సంవత్సరములు (అర్థశతాబ్దము) కాలము ఉద్యోగము చేసినందునను, అందును పోలీసు ఉద్యోగముచేసి నానా విధములగు మనుష్యులను వారిచర్యలను గమనించినందునను వారు మనిషిని చూచినంతనే వారిగుణ విశేషముల నగము గ్రహించినారో యేమో అనునట్లుండును. వచ్చిన వ్యక్తియొక్క లక్షణములను బట్టియే గుర్తింతురు. మరియు నతడు కొంత మాట్లాడువరకే పర్యవసానము గ్రహించుకొందురు. తమతో మాట్లాడువాడు సత్యము చెప్పుచున్నాడా అబద్ధము చెప్పుచున్నాడా అను అంచనా వేసికొందురు.

ఒకనిపై మంచి అభిప్రాయము కలిగిన సాధారణముగా దానికి విరుద్ధముగా ప్రబల కారణములు వారికి గోచరించిననేతప్ప తమ అభిప్రాయమును మార్చుకొనరు.

సాధారణముగా ఇంతయో అంతయో విద్యాసంస్కారముకల నవనాగరికులును, ఇటులో అటులో ద్రవ్యమును సంపాదించుకొన్న ధనికులును, చిన్నదో పెద్దదో ప్రభుత్వోద్యోగమును ముప్పతిప్పలు పడి సంపాదించుకున్న ఉద్యోగులును, నైనట్టిజనులు విద్యాగంధ రహితులను, పేదవారిని, పల్లెటూరివారిని, మోటువారిని చూచి వారనాగరికులని భావించి దగ్గరకైనను రానీయరు. వారితో మాట్లాడిన గౌరవము పోవునేమోయని యనుకొందురు. కాని వేంకటరామారెడ్డిగారు కొత్వాలీ పదవియంతటి గొప్ప ఉద్యోగము నందుండియు, ఎట్టివారు వచ్చినను ప్రీతితో ఆదరించి దగ్గరకుతీసి బుద్ధులుచెప్పి, సహాయముచేసి పంపుదురు. తమతో చిన్ననాడు తెనుగు బడిలో చదువుకున్న ఒకబీదకాపు వార్ధక్యదశలోవచ్చి కలిసెను. అతడు కడుబీదవాడైనను, ఎన్నియో యేండ్ల యనంతరము అనగా అర్ధశతాబ్దానంతరము వచ్చినను అతని నాదరించి, తన పంక్తిలో దినము భోజనము చేయించి, మంచిబట్టలిచ్చి, ఒకమాసమువరకు తనవద్దనుంచుకొని సెలవు తీసికొని పోవునప్పుడు క్రొత్తబట్టలు కట్టించి కొంతద్రవ్యమిచ్చి

పంపినారు. తమతల్లిగారి గ్రామమగు రాయణిపేటనుండి వచ్చిన పేదవారిని సత్కరించుచుండురు. తనకన్న వృద్ధుడైన యొకబీద కాపుకులమువారు వచ్చినప్పుడు అతనిని అత్యంతముగా గౌరవించి పంపినారు.

తమతండ్రిగారి జన్మభూమియగు గద్వాలలో రెడ్డిగారికి కొంత స్థిరాస్తి యుండెను. వీరి తండ్రిగారగు కేశవరెడ్డిగారు కొన్ని గ్రామములకు పటేలుమాలీపటేలుగిరులున్నై యుండెను. కాని వారు చాల ఉదారులగుటచేత గోపాలుపేట సంస్థానము వారికి ౪౦౦౦౦ రూపాయీల అప్పును ఇతరులకు వేలకొలదిగా అప్పును ఇచ్చియుండిరి అవన్నియు వసూలుకాక మునిగిపోయెను. పటేలు గిరీలపై రెడ్డిగారి కభిమానము లేనందున అవియు నూడిపోయెను. కొంత పట్టాభూమియు ఇనాములును మిగిలి యుండగా ఆ శేషమునుకూడ రెడ్డిగారు తమదాయాదులును, గద్వాలలో పోలీసు, మాలు, పటేలుగిరీ చేయునట్టివారును నగువారికి ఉచితముగా పంచియిచ్చినారు. మరియు తమ జన్మభూమియగు రాయణిపేటలోని బంధువర్గములోచేరిన బీద బాలురనేకులకు వీరుస్వయముగా భుక్తికి బట్టలకును ద్రవ్యమిచ్చి అనేక సంవత్సరములు నగరములో చదివించినారు. ముఖ్యముగా విలియం వహాబుగారి మనుమలపై వీరికి చాల ప్రీతి. వారందరికిని చాలసహాయము చేయుచు వచ్చినారు. విలియం వహాబుగారి వంశమువారిని తనవారికన్న హెచ్చుగా చూచుకొనుచు వచ్చినారు.

ఇంతవరకు రాజాబహద్దరుగారు బీదలయెడ ఆర్తత్రాణపరాయణులని పాఠకులు బాగుగా తెలిసికొనియున్నారు. ధనికులును వారినాశ్రయించు వారని తెలిపితిమి. వీరివలన ముఖ్యలాభములు పొందిన సంస్థానములు వనపర్తి గద్వాల, జటప్రోలు, శివరాజ బహద్దరుసంస్థానము, పాపన్నపేటఅనునట్టివి- శివరాజ బహద్ధరు సంస్థానము విషయమున ఇదివరకే కొంత చర్చించియుంటిమి. వీరు ఆసంస్థాన పరిపాలకాధ్యక్షులుగా నుండునంతకాలము బీదరైతులు గొంగళ్లను మెడమీద వేసికొని గుంపులు గుంపులుగావచ్చి వారికాళ్లపై బడి వారినిచుట్టికొని తమ మొరల వినిపించెడివారు. వారిదరఖాస్తులను తీసికొని మొట్టమొదలు వారిని విచారించి వారికి న్యాయమును ప్రసాదించి తృప్తిపరచి పంపి తర్వాత ఇతర వ్యవహారములను విచారించుకొనుచుండిరి.

వనపర్తి సంస్థానాధీశ్వరులగు స్వర్గీయులైన రాజా రామేశ్వరరావు బహద్దరుగారును, రెడ్డిగారును చిన్ననాడు సహాధ్యాయులుగా నుండిరి. నాటినుండియే వారిరువురికిని పరిచయము హెచ్చుచువచ్చెను. కాని వనపర్తి రాజాగారి అపరవయఃకాలములో కొంతకాలమువరకు వీరిరువురికిని మనస్తాపములు కలిగెను. నంచెర్ల అను చిన్న సంస్థానమున కొకే బాలిక వారసైనిలిచెను. ఆ బాలికను తమ కుమారుడగు

రంగారెడ్డి గారికి వివాహము చేయులాగున నిశ్చయమయ్యెను. రెడ్డిగారు తమశక్తిని వినియోగించి ఆమెపేర విరాసతును పొందించెను. అది పూర్తియైనంతనే వనపర్తి రాజాగారు ఆమెను పెండ్లాడిరి. ఇది మనస్తాపములకు కారణమయ్యెను- కాని వనపర్తి రాజాగారా వివాహమువలన సౌఖ్యమొందక పోయిరి. ఆనూత్న రాణీగారికి సంతానము నిలువకపోయెను. ఆమెయుగతించెను. ఆమెసంస్థానము రాజాగారికి దక్కక ఆమె వంశీయులగు వారసులకు చెందెను. వనపర్తి మహారాజుగారును క్షయరోగ పీడితులై అవసాన దశకువచ్చిరి. ఇంకకొన్ని దినములలో చనిపోవుదురనగా శ్రీ మహారాజాగారు వేంకటరామా రెడ్డిగారిని తమవద్దకు పిలిపించుకొని కంటనీరుపెట్టుకొని జరిగిన అపకారమంతయు మరచి పొమ్మనిచెప్పి తనయిద్దరి చిన్న కుమారులను రెడ్డిగారి చేతులలో పెట్టి తనకు మారుగా విచారించుకొనుమని చెప్పిరి. ఉభయులును ఒకరనొకరు పట్టుకొని కన్నీరుకార్చినారు. ద్వేషమంతయు ఆకన్నీటి కాల్వలో కొట్టుకొని పోయెను. మరల యథాపూర్వముగా ప్రసన్నులైరి.

వనపర్తిమహారాజుగారు దివంగతులైరి. వారి సంస్థానము కోర్టు నిగరానీలో చేరెను. వారి పెద్దకుమారులు తమ ౨౦ వ ఏటనే మరణించిరి. చిన్నకుమారులగు రాజా రామ

దేవరావుగారును, పెద్ద కుమారులగు రాజాకృష్ణ దేవరాయులకు కలిగిన ఒకశిశువును మిగిలిరి- కాని శిశువు పక్షము వారికి రాజా రామదేవరావు బహద్దరుగారికి రాజ్యభాగములో వివాదమేర్పడెను. రా॥ బ॥ వెంకటరామారెడ్డిగారు తమవాగ్దానప్రకారము రాజారామదేవరావు గారి కాశ్రయభూతులై వారిభాగము వారికి దొరకునట్లు ప్రయత్నించిరి-

గద్వాలసంస్థానము ఈ రాష్ట్రములోని ఆంధ్రసంస్థానములలో ప్రాచీనమైనదియు, పెద్దదియునై యున్నది. దాని పరిపాలకులగు శ్రీ మహారాజా సోమ భూపాలరావుగారి కాలములో కొందరు ప్రజలు అల్లరులు చేయగా రెడ్డిగారు వారికిసాయపడిరి. మరియు గద్వాల మహారాజుగారు చిందు వయస్సులో మృత్యువు వాతపడగా గద్వాలసంస్థానము కోర్టు ఆధీనమయ్యె. మహారాజుగారికి పుత్రసంతానములేదు. ఇద్దరు బిడ్డలుమాత్రముండిరి. అందుచేత సంస్థానము ఖాల్సాలో చేర్చబడునో యేమో అని వదంతులు బయలుదేరెను అప్పుడును రెడ్డిగారు తమచేతనైన సహాయము చేసి తుదకు శ్రీ ప్రభువుగారికి నచ్చచెప్పిరి. సంస్థానమును మహారాణీగారి వశముచేసి వారి దౌహిత్రునికి రాజ్యాధికారము కలుగునట్లు ఫర్మాను వెలువడెను.

పాపన్న పేట సంస్థానము రాణీగారికి సంతానములేదు. వారు వేంకటరామారెడ్డిగారితో ఆలోచించి ఒకసాధారణ కుటుంబమునకు చెందిన ఒక బాలుని దత్తుగా స్వీకరించిరి. కోర్టు ఆఫువార్డు ఆజ్ఞాప్రకారము దత్త పుత్రుని రెడ్డిహాస్టలులో రాజా వేంకటరామారెడ్డిగారి పర్యవేక్షణములో నుంచి ఒకటి రెండు సంవత్సరములు విద్యాబుద్ధులు చెప్పిరి. ఆబాలునికి గద్వాలమహారాణీగారి రెండవకుమార్తెనిచ్చి వివాహము గావించిరి.

కొల్లాపురము సంస్థానమునకు జటప్రోలు సంస్థానమనియు ప్రతీతి. ఆ సంస్థానాధీశ్వరులకును పుత్రసంతానము లేదు. ఇద్దరు మాత్రెలుకలరు. సంస్థానాధీశ్వరులు దత్త స్వీకారము చేసిరి. వారు చనిపోవునప్పుడు తమదత్తపుత్రునికిని, తమ సంస్థానమునకు శ్రీ రెడ్డిగారిని (గార్డియనుగా) విచారణకర్తనుగా నియమించి పోయిరి. ఇప్పటికిని ఆదత్తపుత్రుని విద్యాభ్యాసము వారి అవసరములు, సంస్థానములోని ప్రతి విషయమును రెడ్డిగారి అభిప్రాయాను సారముగా జరుగుచున్నవి.

మరియు దోమకొండ సంస్థానమువారును, ఆత్మకూరు సంస్థానమువారును, గోపాలుపేట సంస్థానమువారును శ్రీ రెడ్డిగారికి ముఖ్య పరిచితులై వారిసలహాను పలుమారు పొందుచుండురు. వీరుకాక అనేక చిన్నచిన్న జాగీరాదు లును, ఇతర జమీందారులును వీరివలన ఎన్నియో మారులు లాభము పొందినారు. ఇట్లు వీరు సర్వజనప్రియులై, పరోప కార పారీణులై, కరుణాసముద్రులై, ప్రజానురంజకులై, రాష్ట్రసేవా పరాయణులై అఖండ కీర్తిగడించియున్నారు.

# అనుబంధము

శ్రీయుత కొత్వాలు

# వేంకట రామారెడ్డిగారి ప్రశంస

---

శ్రీ విభుడు నిజాము ధరి
త్రీ వల్లభ కార్యకరణ దీక్షాదక్షుం
డై వెలయు సదరు కొత్వా
లీ వేంకటరామ రెడ్డి నేలెను గాతన్. ౧

గీ. వాద నిర్ణయమున సమవర్తి యగుచు
క్రూరజనుల పాలికి దండధారి యగుచు
ప్రబలె ధర్మరాజన నిజాంప్రభువు ధర్మ
రాజ్యమందు వేంకటరామ రాడ్వరుండు. ౨

సీ. ఆత్మీయ రాజ్య మంత్రాలోచ నౌచితి
ప్రభు మనోల్లసితమై పరిఢవిల్ల
నిజశాసన మలంఘనీయమై రాష్ట్రీయ
జనుల సన్మార్గ వర్తనుల జేయ
నాత్మీయ రాజకీయాంగ రక్షార్థ భట
నియుక్తి ఖలుల దౌష్ట్యము నడంప
నిజ పరామర్శైక నియతి హూణ ప్రభు
సంతతికైన విస్మయము గూర్ప,

గీ. రాజసభల ప్రధాన గౌరవ పదంబు
నందిన నిజాము ప్రభువు రాజ్యమున నదరు
కోతువాలు ఘన పదవిగొని వెలసితి
రాజమాన్య వేంకట రామరాడ్వరేణ్య. ౩

చ. అనయము జార చోర కిత
వాదులుగూర్చు సపర్యలన్ గ్రహిం
ప నిఖల దిక్తతిన్ గవిసి వర్తిలు
గాఢ తమోగ్రశక్తి భా
గ్యసగరిం ద్వత్ప్రతాప రవికాంతికి
భీతిలి నేటి కట్టిదు
ర్జనకృత సంగతిన్ దొరగి శాం
తిలె వేంకట రామ రాడ్వరా. ౪

చ. సకల రిపు క్షితీంద్రులకు సాక్ష్య
పదంబయి క్షత్రధర్మ వృ
త్తికి ననుగుణ్యమై తగు త్వదీ
య నియోజిత పౌర దుర్గ ర
క్షక భట శాసన క్రమముగాంచి
గుహాలుం డిటులే స్వకీయ దై

వికట భటులఁ బిగించెనా ప్రీతిఁ జూప
మందటుగాఁగ యుండెనఁ
ప్రకృతము స్వాస్థ్యమై యెటుల
రాజిలు వేంకట రామ రాడ్వరా. ౫

సీ. భవదీయ దృఢభుజ ప్రకటితోద్యత్ప్ర
తాప రుచులర్యమునకు బరిధిగాఁగ
ద్వద్యశశ్చంద్రికా పటలము దశహరి
ద్యావ్రతమునకు లే నవ్వుగాఁగ
భవదీయధైర్య గౌరవ మలమేరు
శైలంబున కాలవాలంబుగాఁగ
ద్వత్కృపా గంభీర భావంబులు పయోం
బురాశికి యమళ పాఠములు గాఁగ

గీ. ప్రబలి తఖల రిపుక్షితీడ్బాహుచటుల
తటనటద్భూరిజయసతి పటుడవగుచు
జగతి ప్రఖ్యాతమైన నిజాము ప్రభువు
రాజ్యమందు వేంకట రామ రాడ్వరేణ్యా. ౬

మ. భవదీయోన్నత బాహు యుగ్మ
నివసత్ప్రాగ్భార కీర్తి ప్రతా
ప విభూతి గ్రహణాను రక్తిని
శిరాత్పద్మాప్త దెనంది నో

ద్భవ పంచత్వ కృత త్రిలోక జన
సేవాకార్య దేవేంద్ర వై
భవ శ్రీ వేంకటరామ రాడ్వర
శుభప్రారంభ నిత్యోత్సవా.

సీ. సంస్థాన విభులై ప్రజారక్షణ
క్షాత్రవృత్తి శోభించిరే రెడ్డిగారు
బహు దాన విధుల విద్వాంసుల భూషించి
కృతులంది యుండిరే రెడ్డిగారు
ధన సమృద్ధి కుబేరతములై మహి
బరోపకృతుల బ్రాపించిరే రెడ్డిగారు
గైర్వాణ వైకృతాంగ్ల తురుష్క
విద్యాపరీక్షల దేలిరే రెడ్డిగారు
గీ. అట్టి రెడ్డికులము మాన నార్హమైన
ప్రథితివహియించె మరియు శ్రీరాముకతన
ద్యుమణి సంతతి బలె భవన్మూలమున ధ
రాతలమున వేంకటరామ రాడ్వరేణ్యా.

—విద్వాన్ రామరాజు
శ్యామరాజు గారలు
సోదరకవులు.

శ్రీమతాం రాజాబహద్దర్ వేంకట రామారెడ్డి, ఓ. బి. ఇ.

మహోదయానాం జన్మదినోత్సవ

# ప్రశంసా పద్యాని

---

శ్రీవిద్యామృతవల్లరీ కుసుమితాదిగ్వ్యాప్త సౌగంధికా
నిర్యత్సుప్రసరస ప్రహృష్ట మధుపోద్గీతి ప్రపంచాన్వితా
యచ్ఛత్యద్యఫలాని స్వర్ణరుచి రాణ్యాసించతౌ సర్వతః
శ్రీరాజాబహాదూరు వేంకటవిభోః కారుణ్యావార్స్రోతసా.

కస్తూరత్నవిసూక్తిగుంభిత మహాకావ్యాత్మ చారిత్రకః
ప్రఖ్యాతాంధ్ర వియత్తలప్రకటితస్ఫార ప్రభాభానురః
ఫుల్లేందీవర దృగ్విభాకలయుతే శ్రీవేంకటోరామ రాట్
భద్రాణ్యంబకరే ప్రమోదయ సదా సర్వాంధ్రవిద్యాలయే.

కుందామోద సుకౌముదీవిలసితం దిక్కామినీభూషణం
వందారూదగ్రు కల్పశాఖి సుమనోరాజద్యశోరాజతు
బృందారాధిప వందితాంఘ్రి సరసీజాతో మురారిః కృపా
మందానందిత భక్తబృందవిభవః పాయాత్ అభీష్టాన్ దదత్.

ఏకోనసప్తత్యతిధాన్మికస్యజన్మోత్సవోయం కురుతేసుమోదం
అముంసపాయాత్ భగవాన్ వితన్వన్ ఆయుశ్చభాగ్యం
శరదాం శతంసః.

సి. హెచ్- రంగాచార్యులు.

శ్రీ రాజాబహద్దర్ వేంకట రామారెడ్డి, ఓ. బి. ఇ. గారికి

స మ ర్పిం చి న

# ప్ర శం సా ప ద్య ము

---

సీ. మా పాఠశాలకు నేపార మిక్కిలి
యశమును, జేకూర్చి యలరఁజేయు
మా యభివృద్ధియే మహనీయుమైనట్టి
తన యభివృద్ధిగఁ దలఁచుచుండు
మహిళామణుల సంస్థ మహోన్నతిగాంచ
బలు విధంబుల సాయ పడుచునుండు
కలిమి యెంతయిననుఁ గడు బీదలకు దాన
ధర్మంబు సేయుచే తగవునెంచు

గీ. మిగుల విఖ్యాతికెక్కిన మేటి యితడు
రాజబహదూరు వేంకట రామరెడ్డి
మనియ గావుత నిచ్చలు మాధవుండు
దనకు సైదోడుగానుండ ధరణిలోన,

వం. జ యా. ( విద్యార్థిని)

---

రాజా వేంకట రామారెడ్డి బహద్దరు ఓ. బి. ఇ. గారికి

రెడ్డిఛాత్రగృహ విద్యార్థులు సమర్పించిన

# అభినందన పత్రము

పూజ్యమహాశయా !

నమస్కారములు. హృదయపూర్వక నమస్కారములు. దాదాపు అర్ధ శతాబ్దమువరకు అనమాన ప్రతిభతో రక్షక (పోలీసు) శాఖయందలి వివిధ పదవులను, ముఖ్యముగా ౧౮ సంవత్సరములనుండి క్లిష్టబాధ్యతలు గల నగరపు కొత్వాలి పదవిని మహా ఘనత వహించిన ప్రభుసత్త్వమునకు ఆమోద కరముగను, ప్రజలకు అనురంజకముగను నిర్వహించి ఉపకార వేతనము (వజీఫా) పొందిన మీకు, మీ కృపావిశేషమున ఆర్జించు విజ్ఞానమునకును, పొందుచున్న వికాసమునకును, యావజ్జీవము కృతజ్ఞతా బద్ధులమగు మేము, ఈ సందర్భమున అభినందన పత్రమును సమర్పించు గౌరవము గలుగజేసుకొను చున్నాము.

దేశసేవాపరాయణా,

మాతృదేశమగు నీ రాష్ట్రమునకు మీరు చేసిన సేవ యపారము. మీ తోడ్పాటుపొందని సదుద్యమము లేదు. మీ చేయూతబడయని విద్యాసంస్థలేదు. మీ సహాయ సాను భూతుల నందని సంస్థానములేదు. బ్రిటిషు ప్రభుత్వము

మిమ్ముల ఓ. బి. ఇ. బిరుదముచే సత్కరించెను. మన ప్రభువు గారికి మీ యెడలగల విశ్వాసాతిశయమునకు, మీ నామము నలంకరించుచున్న రాజాబహాదరు బిరుదమేగాక, ఒక ప్రక్క మీకు నుపకార వేతన మొసంగుచు, వేరొక ప్రక్క సరఫ్ ఖాను ముబారకునంచు ఉన్నతి పదవి ననుగ్రహించి, శాసన సభయందును, పురపాలక సభయందును, అనాథాలయము నందును, తదితర యుపసంఘముల యందును, మిమ్ము తమ ప్రతినిధిగా నియోగించుటయే ప్రజల నిదర్శనము.

స్వకులోద్ధారకా,

మీరు రెడ్డి సోదరులకు నిరుపమానముగు సహాయము చేసితిరనుటకంటె, రెడ్డి కులోద్ధరణమే మీ జీవితాదర్శమన దగును. ఒకనాడు ప్రభువులై, ప్రభుభక్తిపరాయణులై, వీరులై, వీరజన పోషకులై కవులై, కవిజనాశ్రయులై చరిత్రకు వన్నె దెచ్చి, మాతృదేశమును తేజోవంతముగను, విజ్ఞానవంతము గను జేసి యలరిన రెడ్డికులజులు, కొండొకనాటికి, స్వతంత్రాభిలాషచే కాబోలు, గ్రామవాస మేర్పరచుకొని అజ్ఞానాంధకార నిమగ్నులై, సంఘీభావ దూరులై, దుర్దశ జెందియుండుటను మొట్టమొదట పరికించినవారు మీరే. వారి పునరుద్ధరణము నకు సంకల్పించినవారు మీరే. కార్యారంభ మొనర్చిన వారును మీరే- నేడు వారియందు వ్యక్తమగుచున్న ప్రబోధ

వికాసములు మీ ప్రయత్న ఫలితములే. రెడ్డి వసతిగృహము, రెడ్డి గ్రంథాలయము, దేశమునకును, సంఘమునకును, కాంతి వంతమగు భవిష్యత్తును సమకూర్చగలవు.

పితృతుల్యా !

వసతి గృహవాసులమగు మాయెడ తోము జూపు నాదరణము మరువబడునది కాదు. గ్రామములందు విద్యాసౌకర్యములులేక, నగరము లందలి సంస్థల నుపయోగించుకొను శక్తి సామర్థ్యములులేక, ఉన్నతవిద్యా దూరులగుచున్న విద్యార్థుల ఉపయోగార్థము మీరు నవీనముగ నవలంబించిన వసతిగృహ పద్ధతివలన గ్రామవాసులయందు ఉన్నత విద్యావ్యాప్తికై యొక యుత్తమమార్గ మేర్పడినది. నిరాధారులమగు మా విద్యాభివృద్ధికి మీరు జేసిన సహాయ మపారము, చేయవలసినదికూడ యపారమేయని మా మనవి. బాలికల వసతిగృహమునకు సొంత భవనము నిర్మింపబడ వలసియున్నది. స్త్రీల విద్యాభి వృద్ధికై ప్రచండ ప్రయత్నము జరుగవలసి యున్నది. మీ రారంభించిన సంస్థలు చిరస్థాయిగా నుండుటకు మూల ధనము సేకరించవలసియున్నది. కార్య శూరులగు తామీ మహదాశయములను సాధించి, మీకీర్తిని యజరామర మొనరించెదరుగాక. మీ జీవితము తోడిసోదరులకు ఆదర్శప్రాయమై పరగుగాక.

పరోపకార పారీణా !

ఈశ్వరుడు మీకు చిరాయువొసంగి, మీ సత్సంకల్పముల సిద్ధింపజేయుగాక, మీయందు మహోదారుడగు ప్రభువునకు గల విశ్వాస మచంచలమగుగాక, దేశీయుల భక్తి ప్రేమలు మీయెడ దృఢతరము లగుగాక. రెడ్డి సోదరులు మీ నాయకత్వముక్రింద క్రమాభివృద్ధిని జెందుదురుగాక. తథాస్తు.

భావ సం॥ ఆషాఢ శు॥ విదియ
(౮ షహరేవరు ౧౩౪౩)
రెడ్డి గ్రంథాలయ భవనము
సుల్తాన్ బజారు
హైదరాబాదు-దక్కన్

ఇట్లు విన్నవించు విధేయులు,
రెడ్డి వసతిగృహ
విద్యార్థులు
( భూత, వర్తమాన )

## శ్రీ యు త కొ త్వా లు

# వేంకట రామా రెడ్డి గారు

**అక్షయ నామ సం॥ ఆషాఢ బ. ౪.**

**గోలకొండ పత్రికా సంపాదకీయము**

---

సోమవారమునాటి రాత్రి రెడ్డి విద్యాలయములో జరిగిన సన్మాన సభాకార్య క్రమమును వేరుచో ప్రకటించి యున్నారము. ఈ సభ అనేక విషయములందు చాల ముఖ్యమైనది. హైదరాబాదులో హిందూ ముసల్మానులచే సమానముగా గౌరవింపబడిన శ్రీ కొత్వాలుగారిని రెడ్డి విద్యాలయ విద్యార్థులు గౌరవించుట చాల సంతోషావహ విషయము- ఈ సభ 3 నెలల క్రిందట జరిగియుండ వలసినది. కాని హాస్టలు విద్యార్థి సంఘపు కార్యదర్శిగారి యుపన్యాసమువలన ప్లేగు కొంతకాలము, సెలవులు కొంతకాలము, ఆటంకములు కలిగించిన వని తెలిసినది.

శ్రీకొత్వాలుగారి జీవితము బాలురకందరికిని (నాయకు గారు నడిపిన రీతి) నాదర్శప్రాయముగా నుండదగినది. వీరు ప్రారంభమున పోలీసు శాఖలోనే యొక చిన్న యుద్యోగములో

చేరి, క్రమ క్రమముగా నగర రక్షణాధికారమందు శ్రీ నిజాము ప్రభువుగారిచేతను, ఉన్నతోద్యోగులచేతను, మన్నింపబడి రాష్ట్రమందలి సర్వజనులచేతను గౌరవింపబడిన వారైరి. హైదరాబాదు రాష్ట్రమందలి యాంధ్రులలో వీరొక్కరే యున్నతోద్యోగమందుండిన వారు. బ్రిటిషు ఇండియాలోని యాంధ్రులుకూడ యనేకులు వీరిపేరు వినినవారు కలరు.

వీరిని హైదరాబాదు హిందూ, ముసల్మానులందరును గౌరవించుచుండినను ముఖ్యముగా వీరిని రెడ్లు గౌరవించుటలో రెడ్డి సంఘమువారు తమ్ము గౌరవించుకొనిరి- ఇంతటి గొప్ప యధికారము, ఇచ్చుటకు, నింకెవరికెన్నడును, నే రెడ్డియును వహించి యుండలేదు-

శ్రీ కొత్వాలుగారి నామము రెడ్డివిద్యాలయమందు నంతకాలము స్మరణీయముగా నుండుననుటలో సందేహము లేదు. ప్రతిచిన్న విషయమందును వారు శ్రద్ధవహించుట, ప్రతి విద్యార్థిని విచారించుకొనుట, వారిని నెరిగినవారికే తెలియును. వీరు రెడ్డిసంఘమునకు చేసిన సేవ యపారము. మోటరులందు తిరుగు మహారాజులు మొదలుకొని యెండలో మడక దున్ను మోటుకాపు వరకును, వీరి నీరాష్ట్రమున నెరుగనివారు లేరు.

రెడ్డి విద్యాలయముతో నుండు వీరి సంబంధమునుబట్టి వీరు కేవల స్వజాతి పక్షపాతులని వీరి నెరుగనివారే చెప్పవలయును- ప్రతి శాఖాభివృద్ధి మొత్తము సంఘమున కభివృద్ధి కరమగునదియే. వీరు రెడ్డిసోదరులకు నితర శాఖలవారి నంద రనొకే దృష్టితో చూడవలయునని నిరంతరము బోధించుచుందురు. హాస్టలు నిబంధనలందును నిట్టి సూచనలేకలవు.

రెడ్డివిద్యార్థులు వీరిని సన్మానించినందులకు వారి చర్యను మే మభినందించుచున్నాము. శ్రీ వేంకట రామారెడ్డి గారి కృషివలననే రెడ్డి విద్యాలయము దిన దినాభివృద్ధికి వచ్చుచున్నది. కొత్వాలుగారు తమ యుపన్యాసములో సెలవిచ్చినట్లు శ్రీ దోమకొండ రాజాగారు, శ్రీ పింగిలి వెంకట రామారెడ్డిగారు, ఇతర మహారాజులు మున్నగువారు ద్రవ్యసహాయము చేయకుండిన రెడ్డివిద్యాలయమప్పు మాట మరచి పోవలసియే యుండును. అయినను శ్రీకొత్వాలుగారు దానికి జనరల్ సెక్రటరీగారగుటచే, ప్రతిదినము శ్రద్ధవహించిన వారగుటచే, నేటికాలమున హాస్టలునుండి బి, ఏ., యఫ్. ఏ. మున్నగు నుత్తమ తరగతులలో విద్యార్థులు కృతార్థులగుచున్నారు సుమారు ౧౦ సంవత్సరములకు పూర్వము ౧౦-౧౨

రెడ్డివిద్యార్థులే హైద్రాబాదులో నితరుల నాశ్రయించి కష్ట పడుచుండిరి. నేడు ౧౩౦ కన్న నెక్కుడు విద్యార్థులు రెడ్డి హాస్టలులో నుండుట రాష్ట్రీయులెల్లరును ప్రశంసింప వలసిన విషయమే.

ఇట్లు సంఘాభివృద్ధికి పాటుపడు శ్రీ వేంకట రామా రెడ్డి కొత్వాలుగారికి సర్వేశ్వరుడు నిత్యైశ్వర్యమును, ఆయు రారోగ్యాభివృద్ధిని ప్రసాదించుగాత.

రాజాబహద్దూర్

# వేంకట రామారెడ్డి గారు

ప్రజోత్పత్తి నామ సం. పుష్య బ. ౪

గోలకొండ పత్రికా సంపాదకీయము

ఒక వారము దినముల క్రిందట శ్రీయుత రాజాబహద్దరు వేంకట రామారెడ్డి ఓ. బి. ఇ. గారి యుద్యోగకాల పరిమితి మరియొక సంవత్సరము హెచ్చింపబడె నని వినుటకు ప్రత్యాంధ్రుడే కాక నిజాంరాష్ట్రమందుండు సమస్త జనులును ముఖ్యముగా, నగరవాసులును చాల సంతసించుచున్నారు. సమకాలిక పత్రికయగు బులెటిన్ పత్రిక మొన్నటి సంపాదకీయమందు చేసిన మన కొత్వాలుగారి ప్రశంసతో మేము సంపూర్ణముగా నేకీభవించుచున్నాము. ఇతర స్థలములం దెచ్చట జూచినను హిందూ ముసల్మానుల కలహములు జరుగు చుండుట మనము ప్రతిదినము వినుటకు విషాదము చెందుచు న్నాము. తోడి సంస్థానమగు కాశ్మీర రాజ్యమందు సుమారు ౩ — ౪ మాసములుగా ఘోరదురంతములు జరుగుచున్నవి. కాని మన హైద్రాబాదు నగరమందు అట్టి భయము మన

కేమియులేదు. కారణమేమన శ్రీయుతులగు కొత్వాలుగారు హిందూ మునల్మానుల నుభయులను సంతుష్టిచేసి యుభయులకు ప్రీతిపాత్రులైయున్నారు. కొన్ని మాసముల క్రిందట నగరములో హిందూ మునల్మానులకు తగవులు జరుగునని యబద్ధపు వదంతులు బయలుదేరి యందఱను కలతపెట్టెను. కాని మన కొత్వాలుగారి యుత్కృష్టములగు పోలీసు ఏర్పాట్లచే నీ భయము లన్నియు నిర్ధములయ్యెను.

సుమారు ౭౦ సంవత్సరముల ముదుకతనములో మన కొత్వాలుగారు శరీరదార్ఢ్యత కలవారే కాక ఇతరాధికారుల వలెకాక రేయింబవళ్ళును శ్రమించువారు. వీరు కేవలము కచ్చేరీయందే కాక యితరకాలము లందును ప్రాతఃకాలము నుండి మధ్య రాత్రమువరకు ప్రజలసేవయందే తమ కాలమును వినియోగించు చున్నారు. ఇట్లు పరిశ్రమచేయు నున్నతోద్యోగినింకొకనిని బహుశః మన రాష్ట్రమందు కానమనిన వింత కాదు.

మన కొత్వాలుగారికన్న గొప్పయుద్యోగు లెందరో కలరు. వారికిని ననేకమారులు ఉద్యోగకాల పరిమితి హెచ్చింపబడు చుండును. కాని యీ యుద్యోగమునకుండు ప్రాముఖ్యమితరోద్యోగమునకు లేదు. ఇంతియకాక వీరియందుండు సర్వ

జనానురాగము ఇతరులందులేదు. ఈ కారణముచేత వీరియుద్యోగ విషయమున నింత యభిమానము అందరును చూపించుచున్నారు.

శ్రీయుత రాజాబహద్దరుగారు కేవలము కొత్వాలీపనినే కాక మునిసిపాలిటీ యందును. శాసన సభయందును ముఖ్యముగా పాల్గొనుచున్నారు. ఇట్టి సర్వజన ప్రియులగు కొత్వాలుగారిని, వారి యుద్యోగ పరిమితి హెచ్చైన సందర్భమున మే మభినందించుచున్నాము.

# రాజా వేంకట రామారెడ్డి

## బహద్దరుగారు

శ్రీ భావనామ సం॥ జ్యేష్ఠ బ॥ ౯

గోలకొండ పత్రికా సంపాదకీయము

మొన్న ఆదివారమునాడు రాజాగారు తమ కొత్వాలు పదవిని వదలుకొని ఉపకారవేతనము పొందిరి. వీరు మొత్తము పైన ౪౦ సంవత్సరములు ప్రభుత్వోద్యోగమందుండిరి. వీరి విషయమై కేవలము నగరమందేకాక, కేవలము నిజాంరాష్ట్రమందేకాక, మొత్తము హిందూస్థానములో సహితము అనేకులు యెరిగియున్నారు. అయినను వీరిని గురించి యెన్నమారులు వ్రాసినను కొదువయే కనబడుచుండును. వీరి చరిత్ర చాల గంభీరమైనట్టిది. వీరి గుణములు సజ్జన ప్రియములు. వీరి అభివృద్ధి అద్వితీయము. వీరి వంశము రాజవంశముతో చాల సన్నిహిత సంబంధముకలది. వీరు వనపర్తి రాజులగు ప్రథమ రామేశ్వరరావుగారి బంధువర్గములో చేరినవారు. ఆ రామేశ్వరరావుగారి చరిత్ర ప్రత్యేక గ్రంథమేయగును. ప్రస్తుతము మనకు సంబంధించిన దేమన ఆ రామేశ్వరరావు

గారి మేనల్లుడు విలియం వహాబు అను వారు. వీరు గారే. రామే శ్వరరావుగారు ఆకాలముననే చాల గొప్పసంఘసంస్కారులు. ఇంగ్లీషువిద్య, ఇంగ్లీషు అచారములం దాయనకు ప్రీతియెక్కువ. అందుచేతనే మేనల్లుని కింగ్లీషు పేరుపెట్టెను. ఆ విలియంవహా బుగారి మేనల్లుడే మన రాజాబహద్దరు వేంకట రామా రెడ్డి గారు. ఆ విలియం వహాబుగారు పోలీసులో మొహతెమిా ముగానుండి చనిపోయిరి. వారు చనిపోవునప్పుడు మన రాజా గారు వారి పోషణలోనుండిరి. తల్లి దండ్రులు చిన్నప్పుడే గతించిరి. అప్పుడు వీరి వయస్సు సుమారు ౧౮ సంవత్సరములు. అప్పుడే వీరికి అమిానుపదవి దొరకెను. అట్టి మామూలి యమిాను పదవినుండి ఇంత గొప్ప కొత్వాలీపదవికి వచ్చుటలో వారికి సహాయు లెవ్వరును లేరు. సిఫారసులులేవు. కాలేజీ డిగ్రీలులేవు. ఇంగ్లాండు పోయివచ్చిన వారుకారు. బ్రిటిషిండియా తరిబీయతు పొందిరా లేదు. వీరి సిఫారసంతయు వీరిఅఖండ పరిశ్రమ, విశ్వాసపాత్రమైన నౌకరి వీరిసద్గుణములును, నై యున్నవి

మొదటినుండియు వీరు పోలీసులోనే జీవితము గడపి నారు. జిల్లాపోలీసులో పనిచేసినప్పుడు అనేక జిల్లాలలో — వరంగల్, అత్రాపుబల్దా, కరీంనగరు, ఔరంగాబాదు, మహ బూబునగరు, రాయచూరు, గుల్బర్గా మున్నగు తావులలో

పనిచేసినారు. మాతృభాష తెలుగు. కాని కన్నడము, మరాటీ భాషలనుకూడ నేర్చినారు. ఉద్యోగములో మాతృభాషలో కన్న నెక్కువ ధోరణికలదు. పార్సీ బాగుగా చదివినారు- మునలి తనములో వేలు యువరాజింకొక సంవత్సరమునకు రానుండగా ఇంగ్లీషు మొదలుపెట్టినారు ఆభాషలో నిప్పుడు బాగుగా పరిచయముకలదు. ఈభాషల పరిచయము వారి పోలీసు యుద్యోగమునకు చాల పనికివచ్చినది. పోలీసులవద్దకు నానాభాషలవారు వచ్చుచుందురు, ఇప్పుడనేకోద్యోగు లకు జనులభాష తెలియనందున వారు జనుల కష్టసుఖములను గుర్తించలేరు. వారి మనస్సుల, వారి యిష్టముల, వారి యాశయముల గుర్తుపట్టలేరు. వీరట్లుగాక యెంతటి బీదవాడైనను వానితో వాని భాషయందే మాట్లాడి వానికి న్యాయముచేసి పంపుచుండెడివారు.

పోలీసు పేరే భీతిదాయకము. వారి డ్రెస్సు చూచినంతనే యింకకొంత భీతిహెచ్చును. వారి గర్జనలు ప్రాణములుతీయును- అట్టిశాఖ కధ్యక్షులైన వారెట్లుందురో యూహించుడు. పైకిచూచుటకు నేరస్థులను గర్జనతర్జనములచే బెదరింతురు. కాని వీరి హృదయము మాత్రము పోలీసు శాఖకు పనికిరానిది- వీరు పైకి చూచుటకెంత భయంకరముగా మాట్లాడినను మనసార నెవ్వరిని (క్రూరులను, హంతకులను తప్ప) కష్టపెట్టలేదు.

కొత్వాలు పదవి కత్తిపై సామువంటిది. "క్షురస్యధారానిసితం దురత్యయా" అనునది వేదాంత సంబంధమైన దైవను నీపదవికి వర్తించునదే, అందు హైదరాబాదు కొత్వాలు పదవియనిన అది ప్రత్యేకత గలదే యనవలెను. పూర్వము కొత్వాలుగా నుండినవారి పద్ధతులు వేరు. ఆకాలము వేరు, కాని యీ కాలము దినదినము నాజూకు అగుచున్నది. వీరుకొత్వాలు పదవికి వచ్చినకాలములో సేతు శీతాచల పర్యంతము సంచలనము కలిగించుచున్న అసహాయోద్యమ ఖిలాఫతు ప్రచారము మిన్ను ముట్టుచుండెను. హైదరాబాదులో కూడ సంచలము కలిగెను. కానియేమాత్రమును గడబిడలు కాకుండునట్లుగా నాయుద్యమములను వశపరచుకొనెను. ఆయుద్యమములయనంతర మింకొక విపరీతోద్యమము హిందూస్థానమంతటను జర్మను విషవాయువువలె వ్యాపించుకొనెను. ఏనగరమున జూచినను హిందూముసల్మానుల కలహములే. బ్రిటిషిండియా రాజకీయ వాతావరణమేరీతిగానుండునో ఆరీతిగా నించుమించు సంస్థానములో గూడ నుండును. మనరాష్ట్రములోగూడ నా గాలివీచెను. జిల్లాలలో అనేకచోట్ల గుల్బర్గా, సూర్యాపేట, నాందేడు మున్నగు ననేక ప్రదేశములలో హిందూ ముసల్మానుల కలహములు జరిగెను. కాని హైదరాబాదు నగరములో నేటివరకు ఒక్క కలహమైనను జరుగలేదు. ఇది సామాన్యవిష

యుమా ? దీనికి కారకులు రాజా వేంకటరామారెడ్డిగారు తప్ప యితరు లెవ్వరునుగారు. కలహ వాయువులు వీచు కాలములో వారుసుఖముగా నిద్రించువారుకారు. రాత్రింబవళ్లును అదే చింతతో నుండువారు. అందరిని సంతృప్తిపరచువారు. కలహ కారకులుండిన వారిని గుర్తించి వారికి భీతిగొల్పువారు.

బ్రిటిషిండియాలో వైస్రాయీలకే కాక వేల్సుయువ రాజుకు సహితము ఇబ్బందులు కలిగించు ప్రయత్నములు జరిగెను. కాని మన నగరములో మాత్రము వారికి విజయవంతముగా సర్వసుఖముగా సంపూర్తి గౌరవ పురస్సరముగా మర్యాదలు జరిగెను. వారు నగరమునకు వచ్చుటకు ఆరునెలలకు పూర్వము రాజాగారు వైస్రాయి సేనా నొకటిస్థాపించి పోలీసుజవానులను హెచ్చుచేసి ఖుఫ్యాలను హెచ్చుచేసి నగరములోనికి వచ్చు ప్రతిమనుష్యుని పరిక్షింపచేసి ఎన్నెన్నియో కట్టుదిట్టములుచేసి ప్రతి చిన్న విషయమునుగూడ తామే విచారించుకొనువారు.

వీరింత గ్సావపదవిపై — అందు పోలీసుపదవిలో — నుండినను రాజులకు, నవాబులకు వీరి దర్శనము ఎంత సులభమో అంతకన్న హెచ్చుగా గొంగటి వాండ్లకు, గోచిబట్టలవాండ్లకు, అంత్యజులకు, బీదలకు. సర్వులకు లభించుచుండెడిది. గొంగడిలో నేమి ఆకర్షణయున్నదో కాని దానిని

కష్టకొని వచ్చినవానిని వీరు చాలశ్రద్ధగా ఓపికతో విచారించి వారికష్టములు విచారించుటకై వెంటనే ఆజ్ఞలనిచ్చువారు.

వీరు కచ్చేరీచేసిన అది కచ్చేరీవలె నుండదు. ఒకపటేలుగారి చావడివలె నుండెడిది- బీదవారందరు దరఖాస్తులు వీరికే యిత్తురుగాని యితరులకీయ్యరు. వారిని పిలిచి వారి దరఖాస్తులుచదివి వారిని విచారించి వారు చెప్పకొను కథలనంతయు నోపికతోవిని యథాయోగ్యముగా విచారణ చేసెడివారు. కొన్ని సందర్భములలో పోలీసులకు సంబంధించని పిర్యాదులుకూడ వీరివద్దకు తెత్తురు. అవి న్యాయమనితోచిన ఉభయపక్షములవారిని పిలిపించి రాజీచేయించి తీర్పుచేసెడివారు. ఇట్లుచేయుటచే వేలకొలది మందికి ద్రవ్యనష్టము, క్లేశము, ఇతర యిబ్బందులు అన్నియు మిగిలి పోయినవి.

వీరు పేరునకు ౧౦ గంటలనుండి ౪ గంటలవరకు కచేరీ నౌకరి చేయువారు. కాని నిజముగాచూచిన రాత్రి ౧౨ గంటలనుండి తెల్లవార ౫ గంటలవరకు తప్ప తక్కిన ౧౯ గంటలకాలము వీరు సర్కారీ నౌకరి చేసిరి. సగము రాత్రి వరకు నగరములో జరుగు నేరములు ఎప్పటి కప్పుడు టెలిఫోనుద్వారా ప్రతి నాకానుండి వీరికి తెలుపుచుండెడి వారు. ప్రతివారికి వీరు టెలిఫోనుద్వారానే హుకుము లిచ్చుచుండిరి.

రాత్రి కాలములో ౧౦ నుండి ౧౨ వరకు కూడ జనులు తమకు విపత్తు కలిగిన పోలీసు సహాయ మవసరమైన న్యాయముగా పోయి వీరితో చెప్పుకొనెడివారు. వీరుకు పోలీసు పహారా యింటి పైనున్నది. కాని యెవ్వరు కొత్వాలీ దేవిడీలో పోయినను, "ఎవరు, ఎక్కడ, ఎందుకు" అని విచారించువారే లేరు. ఇదియే నిజమైన రక్షకభటులపై పెద్దల కుండవలసిన ముఖ్య లక్షణము.

కేవలము కొత్వాలీ పదవియేకాక వీరు ప్రతి దినము సాయంకాలము ౫-౬ యేలికలగు శ్రీ ప్రభువుగారి దర్శనమున కేగి యొక్కొక్కమారు గంట రెండు గంటలవరకు వారికినివే దించుటయో వారి ఆజ్ఞలను నిర్వహించుటయో చేయుచుం డెడివారు. వీరియందు శ్రీప్రభువుగారి కుండునట్టి విశ్వాసము బహుశః రాష్ట్రములో నింకెవ్వరిపైనను లేదనవచ్చును.

కొత్వాలు వేంకట రామారెడ్డిగారు కొత్వాలీ పని లోనే కాక యితర సంస్థలలోను చాల సాయపడువారు. శాసనసభ, సరాయి, సర్ఫెఖాసు కమిటీ, కో ఆపరేటివ్ యూనియన్ మున్నగు ప్రభుత్వ శాఖలలోనే కాక అనేక ప్రజాసంస్థలగు విద్యాసంస్థలందును ముఖ్యులై తమ యమూల్యానుభవ జనితములైన అభిప్రాయములతో తోడ్పడెడువారు.

మేము మొదలే వ్రాసినట్లుగా వీరి చరిత్ర నెంత వ్రాసినను పెరుగుచునేయుండును. వీరు కొత్వాలు పదవి వదలుకొనినను వీరికి మరల యితరోద్యోగములను శ్రీ ప్రభువుగారు నిర్ణయించినారని వినుచున్నాము. శ్రీరాజాగారు ఇంత వృద్ధులైనను మంచి ఆరోగ్యములో నున్నారు. మంచి యువకులకన్నను హెచ్చుగా కష్టించుచున్నారు. వీరికి సర్వేశ్వరుడు సంపూర్ణారోగ్యమును, బహుదీర్ఘాయుష్యమును, ప్రభుప్రజాసేవాశక్తిని, వంశాభివృద్ధిని, నిత్య కళ్యాణమునిచ్చి వృద్ధినొనగుగాత యని ప్రార్థించుచున్నాము.

రా జా బ హా ద్ద రు

# వేంకటరామారెడ్డి గార్లు ఓ. బి. ఇ.

యువ శ్రావణ శు. ౧౩

గోలకొండపత్రిక

మోటారుకార్లు భుయ్, భుయ్, అని ఘీంకారాలు చేస్తూవస్తూయున్నవి. ముసల్మానులు, గుజరాతీలు, మార్వాడీలు, అంధ్రులు ఒక్కొరొక్కరేవచ్చి వసారాలోని కుర్చీల మీద కూర్చుంటున్నారు. ఎనిమిదింటికి పది నిముషములున్నది. తెల్లటిలాగు, కోటు వేసుకొన్న ఒక నౌకరు వచ్చి కాగితాల చుట్టను, పోర్టుపోర్టుకలాన్ని, సులోచనాల జోడును బల్లమీదపెట్టి వెళ్ళిపోయాడు. సరిగా ఎనిమిది గంటలు కొట్టే సరికి బంగాళా లోపలనుంచి ఒకరువచ్చి బల్లదగ్గవున్న కుర్చీలో కూర్చున్నారు. వీరు రావటంతోనే కుర్చీలమీద కూర్చున్న వారంతా లేచి, మొగలాయిపద్ధతిని ముమ్మారు తలవంచి, సలాముచేసి తిరిగి కూర్చున్నారు. బంగ్లాలోపలనుంచి వచ్చిన పెద్దకు సుమారు ౫౦ సంవత్సరాల లోపు వయస్సు, పరిమాణంలో పొట్టి, కాస్తస్థూలశరీరం, నలుపురంగు, కుచ్చుక్రేలా

డేమొక్రటి ఫెజ్‌టోపి, తెల్లటి వదులులాగు, నీలపురంగు గుడ్డ మీాద తెల్లచారలు కప్పువున్న పొడుగైనషర్టు. వీరే హైదరాబాదు కొత్వాలుగా నుండిన రాజాబహాద్దరు వేంకట రామారెడ్డి ఓ. బి. ఇ. గారు- వీరి విగ్రహంలో ఆకర్షణీయమైన అంశమేమి లేదుగాని వారి సులోచనాల అడుగున దాక్కొనియున్న ప్రకాశమైన నేత్రములు, దయాసంకలిత హృదయాన్ని సూచించే ఆ నిష్కల్మషపు ముఖవికాసం ధృఢసంకల్పాన్ని ప్రకటించే ఆ చెక్కిళ్ళు చూపరులకు ప్రస్ఫుటముగా కనిపిస్తవి. వీరు పోలీసు ఉద్యోగియైనప్పటికి భయంకర ఆకృతియేమి లేక కొంత ప్రేమ, దయాళుత్వమే అధికంగా వీరియందున్నవి. బల్లదగ్గరవీరు కూర్చుండిన రెండునిముషాలకు కొందరు గుమాస్తాలు వచ్చి సర్కారు కాగితాలను కట్టలకు కట్టలు వారిముందుంచి, ఒక్కొక్కదానిమీాదనే వారిసంతకం పుచ్చుకొన్నారు. వ్రాలు చేయవలసిన కాగితాలు యెన్ని ఉన్నప్పటికి, ప్రతికాగితాన్ని శ్రద్ధగాచూచి సంతకం చేసిరిగాని చదువకుండా సంగతి గ్రహించకుండా మాత్రము చేయలేదు. ఒకవేళ గుమాస్తాలు వేసుకొని వచ్చిన వుత్తరువులు తమకు తృప్తికరంగా లేనియెడల వాటిని మారుస్తూవచ్చినారు. ఈ ప్రకారం ప్రొద్దున ౮ గంటలనుండి సాయంకాలము ౪ గంటలకు తమ ఆఫీసుపని పూర్తి చేసుకొన్న తర్వాత వీరి దర్శనార్థమై వచ్చినవారు ఒక్కరో

క్కరే వారి యొద్దకు వెళ్ళి. మాట్లాడవలసిన సంగతులు మాట లాడి పోతూవచ్చిరి. రహస్య విషయములు మాటలాడవలసిన వారుంటే అట్టివారిని లోపలికి తీసుకొనిపోయి యేకాంతంగా మాటలాడి పంపివేసిరి. ఎంతమంది వచ్చినాసరే నిదానంగా, నెమ్మదిగా మాట్లాడి పంపవేయుదురు గాని విసుగు జెందరు. తొందరపడరు. కోప్పడరు. చెప్పినసంగతులే తిరిగి తిరిగి చెప్ప టం, కాలహరణం చేయటము మనవారి స్వభావమైన చెప్పే మాటలను ఓపికతో విందురు గాని కాలహరణ మయినది వెళ్ళిరండి అనేమాట వినబడదు. అధికంగా యెక్కువసేపు మాటలాడ దలచినవారుంటే రాత్రి ఎనిమిది గంటల ప్రాంతి ములో ప్రత్యేకదర్శన మిచ్చి మాట్లాడుతూవుంటారు మోట ర్లమీద, గుర్రపుబండ్లమీద తిరుణాలకు వచ్చినట్లు వచ్చే ప్రజ యావత్తు ఒక తరగతివారు ఒకపనికై వచ్చినవారు గారు. పెద్ద ఉద్యోగులు, లఘ్వాధికారులు మొదలు ఉద్యోగాలకు, శిఫార సులకు, రాజ్యవ్యవహార సంబంధమైన సంప్రతింపులకు స్కూలు జీతాలకు, విరాళాలకు అది ఇది అని విడదీయటం ఎందుకు! అన్నివిధాల సహాయ్యానికి వచ్చేవారుగా ఉంటారు.

వేంకట రామారెడ్డిగారికి ఆంగ్లవిద్యా పరిచయం స్వల్పం నవనాగరిక సంప్రదాయం అభ్యాసం కాలేదు. పాశ్చాత్య దేశాలకుపోయి ఆధునిక పోలీసు పద్ధతులను పరిశో

లింపలేదు. రాజ్యాంగ శాస్త్రాన్ని పఠించలేదు. ఈలాంటి శిక్షణ యేమీ లేకపోయినప్పటికి ముస్లిమురాష్ట్రానికి ప్రధాన నగరమున్ను, అనేకజాతుల ప్రముఖులకు నివాసస్థానమున్ను అయిన హైదరాబాదు కొత్వాలు పని అనగా పోలీసు కమిషనరు పదవినే ఎట్లా నిర్వహించారు? నిజాం ప్రభువుయొక్క ప్రత్యేక విశ్వాసానికి, గౌరవానికి. యెట్లా పాత్రులయ్యారు? గొప్పసమర్థులు, రాజనీతిజ్ఞులు అనే ప్రతిష్ఠను ఎట్లాగడించారు? ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానము బట్టే వేంకట రామారెడ్డి గారి పరిపాలనా దక్షతయొక్క రహస్యము గ్రాహ్యమగుతుంది. ఆధునిక విద్యావంతులలో మంచితనము, పరోపకారబుద్ధి లేవని చెప్పుటగాని, వేంకట రామారెడ్డిగారికి ఆధునిక నాగరికత విశేషముగా అబ్బకపోవడం మీదనే వారిలో అధికముగా కనుపించే ప్రాచీనుల నిగర్వము, సేవానురాగము, ప్రజోపయోగ కార్యనిరతి, కల్మష రహితమైన వర్తనము, సర్వజన శ్రేయోభిలాష జయప్రదమగు పాలనము ఆధారపడి యున్నదని నావిశ్వాసము. విద్యవల్ల లభించని యోగ్యత, సామర్థ్యము, పరిపాలనా దక్షత అనుభవంవల్ల స్వయం శిక్షలవల్ల లభించినవి. కేవలము స్వశక్తివల్ల ఉన్నతస్థితికి వచ్చిరి.

హైద్రాబాదు సంప్రదాయం విశేషంగా ముస్లిం నాగరికతకు సంబంధించివున్నది. అయినా రాజ్యాంగంలో హిం

దువున్న ప్రాముఖ్యస్థానాలను వహిస్తువున్నారు. బ్రిటిషు ప్రదేశంలో కంటె హైదరాబాదులో హిందు ముస్లిం సఖ్యత అధికంగా ఉన్నదని ప్రతీతి. ఎంతవున్నా, అప్పుడప్పుడు విషమ పరిస్థితులు యేర్పడకపోవటంలేదు. ఇటువంటి విషమ పరిస్థితులు యేర్పడినప్పుడెల్ల మన కొత్వాలుసాహెబ్ గారు చూపుతువచ్చిన వివేకము, దూరదృష్టి, కార్యదక్షత ప్రజ యొక్క, ప్రభుత్వముయొక్క ప్రశంసా పాత్రమయినవి. వీరు కమిషనరుగా వుండినంతకాలం హిందూ ముస్లింకలహాలులేక శాంతంగా గడచిపోయింది. రెడ్డిగారు మతరీత్యా హిందువులున్ను, జాతీయులుగా ఆంధ్రులున్ను, అయినప్పటికి హిందూ ముస్లిం సఖ్యభావాన్ని, వీరు పోషించినంతగా మరెవరున్ను పోషింపలేదు. స్వజాతీయుల విశ్వాసాన్ని, ప్రేమను యెంత గడించిరో అంతగా ముస్లింజాతీయుల విశ్వాసాన్ని, ప్రేమను గూడ గడించినారు. దీనికి వీరి నిష్కల్మష హృదయం. నిష్కాపట్య స్వభావం. ప్రజాభిమానం కారణంగా యెంచవచ్చును. వివాదగ్రస్తములగు ముస్లిం వ్యవహారాలను సహా వేంకటరామారెడ్డిగారి పరిష్కారము పై ప్రభుత్వంవారు నిర్ణయించటాన్నిబట్టి యీ ఆంధ్రుని న్యాయబుద్ధియందు ప్రభుత్వంవారికిన్ని, ముస్లింమహాజనులకున్ను యెంత పూజ్యభావం గలదో విశదంకాగలదు.

పరిపాలనా దక్షతకు ఆంగ్లవిద్యగాని, విదేశీయ శిక్షణ గాని అవసరం లేదనే సంగతికి వేంకటరామారెడ్డిగారి చరితమే మనకు నిదర్శనంగావుంది. వీరిలో మనకు గ్రాహ్యాము కానియేవో మంచితనము, గొప్పశక్తి లేసియెడల, హైదరాబాదు శాసన సభయందు, మునసిపల్ కార్పొరేషన్లలో సభ్యతను వహించి, ఆయా పదవులనెల్ల తెలివితేటలతోను, శక్తిసామర్థ్యములతోను, ప్రజానుకూలముగాను నిర్వహించుటయే సంభవించియుండదు. దీనజన సేవానురాగమే లేనియడల కుష్ఠుల, వృద్ధుల, అనాథ బాల బాలికల శరణాలయముల నిర్వాహక భారాన్ని వహించి వాటిఉన్నతికై శ్రమచేయుటమే పొసగియుండదు. ఒకవైపున ప్లేగు, ఇంకొవైపున ఇన్ఫ్లుయన్జా బయలుదేరి ప్రజను నాశనం చేస్తూవున్న సమయంలో తమప్రాణాలకైనా లెక్క చేయక వీధి వీధి తిరిగి బీదల కౌషధపానాదుల సమర్చి అత్యుత్సాహంతో ప్రజాసేవకు దిగివుండరు-యింకా రెవిన్యూ, జ్యుడిషల్ మ్యునిసిపల్ యుద్యోగీయుల, ట్రయినింగు స్కూలు విద్యార్థుల ప్లీడర్ పరీక్షార్థుల పరీక్షకులుగా వుండి ప్రసిద్ధినిగాంచియుండరు. యిట్లన్ని మార్గాల ప్రభుత్వాన్ని, ప్రజను, దేశాన్ని సేవిస్తూవచ్చిన రెడ్డిగారిని కొత్వాలు స్థానంనుండి నిర్గమింపజేసేదానికై యెందరెంతప్రయత్నించినప్పటికి నైజాంప్రభువు వీరి యుద్యోగ కాలాన్ని హెచ్చిస్తూ వచ్చిన సంగతి ఒక్కటే చాలు, వీరి యోగ్యతను న్యాయశీలాన్ని ప్రజాసేవను నిర్ణయించేదానికి.

చివరకు వేంకటరామా రెడ్డిగారు పింఛను పుచ్చుకొని తమయుద్యోగంనుంచి మగల వలసివచ్చినదు ప్రజలు దీనిని ఒక నష్టంగా తలచి బహుదుఃఖించిరి. ఈసందర్భంలో పోలీసువారు, ఆయాసంస్థలలో నిర్వాహకులు, పౌరులు, తమ విచారాన్ని ఒక ప్రక్క; రెడ్డిగారిపై గల ప్రేమను అభిమానాన్ని పూజ్యభావాన్ని తెలుపుతూ యింకో ప్రక్క; సమర్పించిన అసంఖ్యాకములగు పత్రములే నిదర్శనములు. ప్రజలు ప్రకటించిన సద్భావనంకంటె నైజాంప్రభువిట్టి ప్రజాభిమాని యగు నుద్యోగిని వదలుకొనుట కిష్టంలేక తమ సొంత ఎస్టేటు ఐన సరఫ్ఖాస్ ఉద్యోగిగ నియమించి ప్రకటించిన గౌరవభావం మహత్తరమైన విషయం మరువ తగనిది. నైజాము ప్రభువుకును వేంకటరామా రెడ్డిగారికిని గల సన్నిహిత సంబంధాన్ని బట్టి యీ గౌరవభావం సహజంగానే ఉన్నది.

హైదరాబాదు రాష్ట్రంలోని ఒక కోటి ఠఠలక్షల ప్రజలోను ౭౦లక్షలమంది ఆంధ్రులు, విశ్వవిద్యాలయ పండితులు లాయరులు, డాక్టర్లు, వర్తకులు, ధనవంతులు, ఎందరో వున్నారు కానివీరు అందరిలోను ఆంగ్లవిద్యాపరిచయం లేనట్టి,ఆధునిక నాగరికత అబ్బనట్టి, పట్టి సామాన్య వ్యక్తిగా తమజీవితాన్ని ప్రారంభించినట్టి,కొత్వాలు వేంకట్రామా రెడ్డిగారివలె అంతగా ప్రజయొక్క,ప్రభుత్వంయొక్క, నిజాంప్రభువుయొక్క గౌరవానికి

అనుగ్రహానికి పాత్రమై అపారమైన తమ పలుకుబడికి ప్రజోపయోగ కార్యాలకై వినియోగించివారు మిక్కిలి తక్కువ. ఈ గౌరవాన్ని ఘట్టించింది ఉద్యోగమా? కాదు. విద్యా? కాదు. భాగ్యమా? కాదు. వెంకట్రామా రెడ్డిగారియందు సహజంగా నున్న శక్తి సామర్థ్యాలు. సమదృష్టి, న్యాయశీలము, సేవాభిలాష ప్రబల కారణాలని నా నమ్మకము. నిజాం రాష్ట్రములోని ౫౦ లక్షల ఆంధ్రులలోను ప్రజలకు సహాయం చేసేవారు, యిచ్చియున్నవారు, చేస్తూయున్నవారు మన వెంకటరామా రెడ్డిగారే. వీరిస్వభావం చేతనైన ఉపకారం చేయటం కాని తియ్యని మాటలు చెప్పి పంపడం కాదు. ఉద్యోగీయులమని ప్రజకు దూరంగానుండటం కాదు. వారితో కలిసి వారికష్ట సుఖాలను గ్రహించి వారికి తోడ్పడుతూ ఉండడమే వీరి ఆశయము. హైదరాబాదులో ఆంధ్రులకు గౌరవ ప్రతిష్ఠ లేమయినా కలిగినట్లయితే అవి కొత్వాలు వెంకట్రామా రెడ్డిగారియొక్క డాక్టరు గోవిందరాజులు నాయుడుగారియొక్క పేర్లను ఆశ్రయించియున్నవి.

మొత్తాన హైదరాబాదురాష్ట్రీయాంధ్రులలో ప్రత్యేక వ్యక్తిత్వము, జాత్యభిమానం, స్వయం సహాయ కృషి అంటూ వొకటివుంటే, అది రెడ్లలోమాత్రమున్నది. వీరిలో విద్య యున్నది. ద్రవ్యమున్నది. నాయకత్వమున్నది.

పరోపకార పారీణురాంధ్రదగు గద్వాల, వనపర్తి రాణులున్నారు. అన్నిటికంటెకంటె ప్రధానమైన రాజా బహద్దరు వేంకట రామారెడ్డిగారున్నారు. హైదరాబాదులో సుమారు రెండు లక్షల రూప్యములను వెచ్చించి, ౧౫౦ మంది విద్యార్థుల నివాస, భోజనాదులకు వసతిభవనాలు నిర్మింపబడినవంటే; ౨౫౦ మంది బాలికల విద్యాభివృద్ధికై ప్రశస్తమైన ఒక బాలికోన్నత పాఠశాల స్థాపితమై జయప్రదంగా నిర్వహింపబడుతూ ఉన్నదంటే; కవులు, గాయకులు, పండితులు సన్మానింపబడుతున్నారంటే—ఈలాటి ప్రజోపయోగ కార్యాలలో వేంకట రామారెడ్డిగారు ప్రకటించే అభిమానము, చూపే శ్రద్ధ, చేసేశ్రమ ముఖ్య కారణాలుగా కనిపిస్తున్నవి. వీరు సహాయముచేయని సంస్థ లేదు, ఆదరింపని పండితుడు లేడు, దాతృత్వముచూపని ఆశ్రితుడు లేడు. డెబ్బది లక్షల ప్రజకు మిత్రులు, నాయకులు, ఉద్ధారకులు ప్రజయొక్క ప్రభుత్వము యొక్క అనురాగానికి పాత్రులు మన రాజాబహద్దరు వేంకట రామారెడ్డిగారు.

అవుటుపల్లి నారాయణరావు

# అఖిలభారత పద్మశాలీయ మహాసభ

## వస్త్ర ప్రదర్శన ప్రారంభోపన్యాసము

౮, ఆగష్టు ౧౯౩౭ వ తేదీన మ. రా. రాజశ్రీ రాజాబహద్దరు కొత్త్వాలు వేంకట రామారెడ్డిగారు ప్రదర్శనమును తెరచుచు ఉద్ఘాటనలో నీ క్రింది యుపన్యాసము నొసంగిరి.

స్నే హి తు లా రా !

అఖిలభారత పద్మశాలీయ మహాసభ సందర్భమున వస్త్రప్రదర్శన ప్రారంభోత్సవ మొనరించుట నాకొరకు మిగుల ముదావహ విషయము. కర్షకవృత్తికి జెందినవాడ నగు నాకు జానపద పరిశ్రమయగు వస్త్రనిర్మాణముతో గల గాఢ సంబంధమును మీరు దృష్టియం దుంచుకొని ఈయుత్కృష్టోత్సవము నందు పాల్గొనుటకవకాశ మొసంగినందులకు నే నెంతయు హృదయ పూర్వకముగ మెచ్చుకొనుచున్నాను.

జానపద జీవితమున కర్షకవృత్తికిని వస్త్ర పరిశ్రమకును కడి వెడమ కరములకు గల సామాన్య సంబంధము కలదు. ఐశ్వర్య వృత్తియం దీ రెండును కలసి మెలసి పనిచేయుచుం

డును. మరియు కృషి విభజనయందును, క్రమాగత సంఖ్యను బట్టియు భారత సామ్రాజ్యమున కర్షకుల తర్వాత పద్మశాలీయులే దేశసంరక్షణకు కారణభూతులు. ఈ విషయము గాంచుచు యీ సమయమున మీ మధ్యనుండుట వలన నాకు మరింత యుత్సాహము జనించుచున్నది.

ఈ సమయమున నేజేయు సంతోషదాయక కర్తవ్యము ప్రదర్శన ప్రారంభమే. అయినను క్లిష్టముగ కొన్ని భాగముల వ్యక్తపరచుట అనుచితముకాదు.

ఆధునిక యుగయంత్రాభివృద్ధిసూత్రమున హస్తవస్త్ర పరిశ్రమ గతి గోపి మోసదని విశ్వసించువారల ప్రాస్యదృష్టిని నేను మెచ్చుకొనను. భారతమునందు పల్లెపదములును కర్షకవృత్తియు ఉన్నంతవరకు కరవసన పరిశ్రమ మిగిలియుండు నని నా నిగూఢవిశ్వాసము. ఉపయోగించువారి అభిరుచిని బట్టి హెచ్చు తచ్చులు కలుగవచ్చును. కాలమునుబట్టి వ్యవసాయమున కరువు, సుకాలమున్నట్లు సత్కాలము ఫలించుటత్యవసరములు.

భారత దేశముయొక్క పురాతనమైనట్టియు ముఖ్యమైనట్టియునగు వస్త్ర పరిశ్రమ సజీవముగ నుండుటకై పద్మశాలీయులు ధైర్యముతో, తెలివితో, కృషితో సర్వప్రయత్నముల సలుపుట అత్యవసరము. తర్వాత దేశీయుల మెప్పుదల మరియు ప్రభుత్వ సహాయముపై వారు నమ్మకముంచవలెను.

మన పరిశ్రమల వలన నిస్సంశయముగ ప్రతి దేశమున గౌరవము కలుగగలదు. అనుభవసిద్ధమగు నొక దృష్టాంతరమునుబట్టి అది తెల్లముకాగలదు. పట్టుబట్టలకై పరాసునొందిన ఫ్రాన్సు దేశమున నామిత్రుడొకడు సంగారెడ్డియందు నేయబడిన సామాన్యమైన పట్టుబట్టను పట్టును పరీకించుటయందు ప్రత్యేక నైపుణ్యముగల ఫ్రాన్సుయువిదలకు చూపించెను. ఆయువిదలు యావసనము ను చూచిపొగడిరి-దానిస్వల్ప వెలపై ఆశ్చర్యపడిరి. ప్యారిసునందట్టి బట్ట దొరకిన బాగుండెడిదనికోరిరి. అందమగు ప్యారిసు పట్టుకంటె పల్లెలయందు తయారైన మోటుగ నగుపడుచుండెడి వస్త్రమునెందులకై మెచ్చుకొనిరని వారిని నా స్నేహితుడు విచారించ వారలు భారత దేశ హస్తజనిత పర్పటాంబరముయొక్క మోటుదనమునందే సహజ సౌందర్యమున్నదో పరాసునందలి యంత్రనిర్మిత వస్త్రమునందు కనబడదని వారు జవాబిచ్చిరి. ఈమెప్పుదల అసహజమనియో, పాశ్చాత్య వైపరీత్యమనియో మీరు తలంపవచ్చు. కాని దానివలన మనచేతిపట్టు ఐరోపాఖండమునందును వ్యాపమగునని తేటపడినది. పరాసు దేశ చక్రవర్తియగు లూయి మహాశయుడు నాండేడు వస్తువుల నుపయోగించుచుండెనను విషయము నూతనమైన వార్తకాదు. అది అనాదియైనది.

హాస్తవస్త్ర పరిశ్రమను గురించి మన దేశమునకు ఉత్తమ మార్గదర్శకులయొక్కయు, మంచి విద్యయొక్కయు, ఉత్కృష్ట కౌశలము యొక్కయు, మరియు అతిముఖ్యమైన కట్టుదిట్టములుగల విక్రయస్థానముల అవసరమున్నది

వ్యక్తి ప్రయత్నమును, సమిష్టి కృషి యు సహకార సంఘమునకు తోడ్పడునటుల ప్రభుత్వ పోషకత్వమువలనను నా యీ పర్యవసానములు గోచరము కాగలవు. వారి వశీకరణము వస్త్ర పరిశ్రమయొక్క భావిజమును ధృఢపరచును.

హాస్తవస్త్ర పరిశ్రమాభివృద్ధికై గత వత్సరములందు ప్రభుత్వ మొనరించిన సహాయమెంతయు ప్రశంసనీయాంశము.

వస్త్రనిపుణులు మరియు రంగు వేయుటయందు కుశలుల యొక్క సహాయమున, వస్త్రపరిశ్రమకు సంబంధించిన విద్యను వ్యాపింపజేయుటకై అతి వ్యయముతో చేసిన యేర్పాటులు, ప్రచురముజేయు ప్రదర్శకుల నియామకము, ఉత్తమ విధమగు పరికరముల ఆచారమునకై చేయుచున్న ప్రబోధము ప్రభుత్వముయొక్క పారిశ్రామిక సంస్థయొక్క అమూల్యసేవలు. మరియు పద్మశాలీయుల కుదారముగ సప్పులనిచ్చుట, సహకారసంఘముల సహాయమున పద్మశాలీల స్థితిని బాగుపరచు ప్రయత్నములు ప్రభుత్వముయొక్క యుద్దేశము, ఔదార్యమును వ్యక్తపరచుచున్నవి. పద్మశాలీయుల స్థితిని తొల ంచుటకై వాని యవసరము ముఖ్యము.

మన దేశపు పరిశ్రమలు మనకట్టి యవసరములను దీర్చునో అమెరికా మరియు యూరపు యాత్రికులకు దీర్చుచున్నను వారు వాని సంగ్రహము చేయుటవలన మనకొక విషయము గోచరించగలదు. ఏవస్త్రములను మనము "షిఫ్యాన్సీ"లనుగా జేసికొనుచున్నామో అవి వారియింటి యలంకరింపునకే ఉత్తమపద్ధతిని ఉపయోగపడుచున్నవి. మన చీరలు వారికి మంచి పరదాలపని చేయుచున్నవి. ఉత్తమ విక్రయపద్ధతి నవలంబించిన యూరపు మరియు అమెరికా ఖండముల ప్రతి పట్టణమును లక్షల విలువగల వస్తుసముదాయమును కొనగలదు. కాని మన పద్మశాలీయుని స్థితియో, అతడు పది దినములు పనిచేయును, పది దినములు వస్త్రవిక్రియమునకై వ్యయపరచును. ఈ దినములలో వాని కుక్షింభరము మార్గము మాయమైపోవును. అతడు భిక్షుకుని జీవితము నవలంబించును. కాని అతని దుర్దశ కౌషధము మనకడనే కలదు.

భాగ్యనగరమున పద్మశాలీయ మహాసభ యాజమాన్యమున స్వప్రదర్శన స్థాపన మెంతయు శుభముగ పరిణమించగలదు.

భాగ్యనగరమునందు ధనవంతుల సహాయమునను, జన్మభూమిపైగల ప్రేమ మూలముననను భాగ్యనగరమున నొక

గొప్ప కళను ప్రోత్సహించి పరదేశములందు స్వదేశవస్తు విక్రయమునకై సంస్థల స్థాపించి వస్త్రపరిశ్రమ సౌభాగ్యమును పెంపొందింప కీర్తి ఐశ్వర్యమును పొంగి పొరలునటుల జేయు యాదర్శముతో పద్మశాలీయ మహాసభ యాజమాన్యముఁ ప్రదర్శన స్థాపనము మెంతయు శుభప్రదముగ పరిణమించగలదు.

బీదతనముచేతను తగినంత ధనములేనందునను మీజాతికి జెందినవారలు స్వవృత్తియగు వస్త్రపరిశ్రమను వదలి సామాన్యులు కూలినాలియందు మగ్నులైయుండుట దీనికి కారణము. పూర్వకాలమున ప్రతిపల్లెయందును పద్మశాలీయులుండెడివారు. అక్కడ పండిన ప్రత్తిని కర్షకులకడనుండి స్వీకరించుకొని బట్టల నేసి బీదసాదలకును, మధ్యమస్థితియందున్న వారలకును విక్రయించుచుండిరి. కాని యీకాలమున చిన్నతనపు పెండ్లిండ్లవలన బీదతనముచేతను కలిగిన దౌర్బల్యము మూలమున మీ వరుస్త్రైన దళసరమయిన బట్టలు మోయుటకైనను తగనివారైపోయిరి. అందముగ నగుపడు ఆధునిక వస్త్రముల నుపయోగించు నుత్సాహముకలవారై పోయినారు.

పూర్వకాలమున వి లు వ గ ల ప ట్టు మ రి యు గద్వాల చీరలు గట్టిగనుండి తరతరములవరకు వారసత్వమున వచ్చుచుండెడివి. అవసరమునుబట్టి విక్రయింప దలచినచో పరిశుద్ధమైన జరీయున్నందున నగముకంటె నెక్కువ వెల లభించుచుం

డెను. పట్టుసందుజరీతయారుచేయువారలు ముఖ్యముగ మునో ల్మానులేయుండిరి. ఆ జరీ యేండ్లకొలదిగ వాడుకొనినను దాని మెరుపు, అందములో భేదము కలుగకుండెడిది. అందువలన ప్రతి సంవత్సరమును బరోడా మహారాజులకడకును, పూనా, దమిష్కు మొదలగు దేశములకును లక్షల విలువగల వస్తుచ యము పంపబడుచుండెను. ఇప్పుడు లక్షలవస్తువులు పోకున్నను వేల విలువగల వస్తువులయినను పోవుట అసంభవమైనది. దీనికి కారణమేమన కాలానుసరణముగ మీా జాతీయులు వస్త్రపరి శ్రమయందు మార్పులుజేయలేదు. ఇప్పటికిని పూర్వాచార పరాయణులుగనే యున్నారు. అందువలన నూతనశకపు యువ తులును, యువకులును మీావస్తువులను కొనుటకై వెనుదీయు చుందురు. మీారు నూతనవిధ వస్త్రమును తయారుచేయుట యేకాక అక్కడ వాని క్రయమునకై అడతీ దుకాణములను విచారించి తెరువవలసియుండును. ఈ కాలమున వస్తువుల యొక్క గట్టిదనమును విలువ విచారించువారలులేరు. చాల కాలమువరకు పై మెరుగుగల వస్తువులను జనసామాన్యము మెచ్చుకొనుచుండెను. ప్రస్తుతము ఆలేరులో వస్త్రపరిశ్రమకయి తెరువబడిన కర్మాగారము నందు తయారుచేయబడిన వస్తు వుల కెక్కువ క్రయమున్నదనియు, ప్రజలు మెచ్చుకొనుచు న్నారనియు తోచుచున్నది.

నిజాంరాష్ట్రమందు మాజాతివారు జమీందారులుగను, కృషీవలులుగను, గ్రామోద్యోగులుగనుగలరు. స్వయం కృషి వలన వ్యవసాయ సాయముచే ప్రతివిధమగు ధాన్యము పండించి జంతువులకు- పక్షులకు వేయేల ప్రతిజీవ వస్తువుల కాహారమిడుటయే వారి కర్తవ్యము. వారివలన ఫలింపబడిన ప్రత్తివలననే మీజాతివారు మానవులకు మానము కాపాడు కొనుటకు వస్త్రములనిచ్చుచున్నారు. మొత్తముపై వీరిసంబంధములు సమ్మిళితములు.

మీజాతివారి ఆర్థికస్థితి నానాటికి హేయమగుచున్నది. దీని వలననే జాతివృత్తి నిర్వాహణము దుర్భరమగుచున్నది. వీరిని యీబాధనుండి తప్పించుటకు ధనికులు వీరికి ధనసహాయముకావించి వీరి ప్రాచీనవృత్తికా గౌరవము కలిగించుటత్యవసరము. దీనికై యైక్యత, సంఘీభావనము, సహకారము కలిగియుండవలయును. దీనితో విదేశములందు తయారగు యంత్రముల సాయము బడయునంతవరకు వీరికి మోక్షము లేదు.

ఇంతమాత్రముననే మీజాతియందలి విద్యావంతులు ప్రభుత్వశాఖ సేవయందు చేరవలదనిగాని, లేక లాభదాయకమగు మరొకవృత్తి నవలంబింప గూడదనిగాని నా యభిప్రాయముగాదు. మీ ప్రాచీన జాతీయవృత్తినే తగురీతిగా అభివృద్ధి

పరచి మీరు లాభము గడించుటయే నేను కోరినది. నూతన విధమగు చర్ఖాలు, పరికరము లుపయోగించి చక్కని అందమైన వస్త్రమువలన లాభముగడించుటయే నేను కోరుచున్నది

ప్రదర్శన ప్రారంభోత్సవము దేశమందలి ప్రతిబుద్ధిమంతునికొరకై యమూల్యమైన విద్యా, క్రియా పాఠముగనిపించును. ఈ ప్రదర్శనము పరిశ్రమ తరగతులలో జయమందుటకు ప్రతివారు శక్తికొలది ప్రయత్నము చేయవలసి యుండును. యీ జాతీయ సేవయందు పాల్గొనువారు నిజముగా ధన్యులనవచ్చును.

పైన చెప్పిన విషయములు జయమొందుటకు పరమేశ్వరుని ప్రార్థించుచు ప్రదర్శనము ప్రారంభించుటకు గడంగుచున్నాను. మీ సదుద్దేశ్యము, త్యాగము మీ విషయమున నాకు సాయపడునని విశ్వసించుచున్నాను.

నేతపరిశ్రమకు తగినంత ప్రోత్సాహము లేకుండుట వలననే దేశీయపరిశ్రమలు నశించుచున్నవి. ఇప్పటికైనను మన దేశమందు తయారగు వస్త్రములు పరిశ్రమయొక్క యున్నత చిహ్నముగాగలవు. ఫ్రాన్సునందలి కొందరుస్త్రీలు సహితము మన సంగారెడ్డి పట్టువస్త్రములను మిగుల ప్రేమించుచున్నటుల స్వానుభవముపై ఒక మిత్రుడు నాకు తెలియపరచెను. ఈ వస్త్రములను వారు తమ దేశపు వస్త్రములకు ప్రమా

తులని నుదువగలిగిరి. ఈ వస్త్రములను వారు మిక్కిలి యపేక్షతో యిచ్చటినుండి తెప్పించుకొనిరి, ఆ పేరుసం దిప్పుడు భండారు ఆగయ్యాగారి వస్త్రాలయములో తయారగు వస్త్రములుకొన్ని చాలా అంద మైనవిగను ప్రశంసాపాత్రములు గాగలవు. మన దేశపు నేతవారు కాలానుసారము నూతన పరిస్థితులలో అవసరములనుబట్టి పురాతనవిధముగా యితరవస్తువులవారివలె, స్థిరపరచు సమయమే తెంచినది. పరిశ్రమాభివృద్ధికై వీరు నూతన సంస్కరణము లవలంబించు టత్యవసరము. పద్మశాలీయులు నేతపరిశ్రమ తప్ప మరొకటి యవలంబించ కూడదని దెలుపువారలలో నేనొకడనుగాను. అవసరములను పరిస్థితులనుబట్టి యితర గౌరవనీయమగు వృత్తులను యవలంబించవచ్చును. పద్మశాలీయ సంఘమునకు జెందిన మామిత్రులగు శ్రీ హకీం నారాయణదాసు, హకీం జనార్దనస్వామి గార్లు వైద్యవృత్తిని యవలంబించియున్నారు. పరిశ్రమ వృత్తి గలవారి సుపుత్రులందరు నేతపరిశ్రమకు ప్రాముఖ్యత నొసంగుట వారి విద్యుక్తధర్మమని మాత్రము దెలుపగలను. తచ్చు ఆదాయముగల వృత్తులను యీ వృత్తికన్న మంచిదని భావించి స్వీకరించుట తగదు.

సభ్యులారా! మా రెడ్డిజాతికి పద్మశాలిజాతికి ధృఢమైన సంబంధముగలదని సగర్వముగా తెలుపగలను. ఏ రుధ

యులు మానవ జీవితావసరములు పవిత్రవంతమగు విధ్యుక్త ధర్మములే నిర్వహించు చున్నవారు. రెడ్డిజాతి వ్యవసాయపు వృత్తివలన మానవులకే గాక జంతువులకు, పక్షులకు సహితము సంతోషము చేకూర్చు సామగ్రి కూర్చుచున్నది. ఇంచు మించుగా జీవరాసులన్నియు వీరికి కృతజ్ఞులుగా గలవు. పద్మశాలి జాతి మానవసంఘమునకు శరీరసంరక్షణార్థపు సేవ సలుపుచున్నది. దేశీయులందరీవృత్తిగలవారికి సాయమొనర్చి ప్రశంసించుట ముఖ్యకర్తవ్యము, ఈ రెండు వృత్తులవారుగాక వాణిజ్యవృత్తిగలవారు సహితము ముఖ్యులు ఏ విషయములందు కూడ వీరు వారికన్న తచ్చుకాజాలరు.

ఈ ప్రదర్శన ప్రారంభోత్సవములో నొక మహాసభ యందు పాల్గొను యవకాశము కలిగించినందులకు నేనెంతయో కృతజ్ఞుడను. అఖిలభారత పద్మశాలీయ సంఘపు యీ మహాసభ వ్యవహారములలో అధికార రీత్యా పాల్గొనుటకు నాకెంతయో యభిరుచిగలదు. ఈ అధికారముతో వారి చిత్తుతీర్మానముల గాంచితిని. మహాసభ సమావేశములు తమ సంఘము వారి అభివృద్ధి వారి నైతికాభివృద్ధి, సంస్కారముకయి ప్రయత్నించుటకు బూనుకొనుట చాలా ప్రశంసింపదగినది, అప్పు

డప్పుడు జరుగుచుండు అధికారుల నిందకు వీరు బూనుకొన కుండుట శ్రేయస్కరము. ఈపద్ధతుల వలన వీరు అభివృద్ధి గాంచగలరని నేను పద్మశాలీయ సోదరులకు విశ్వాసము కలిగించగలను. దేశీయ పరిశ్రమల పోషకత్వము వహించిన ప్రభుత్వము వారి సంఘమువారికి పూర్తిగా సాయపడితీరెదరు.

వస్త్ర ప్రదర్శన శాలాధ్యక్షులగు

శ్రీ రాజాబహద్దరు వేంకట రామారెడ్డి కొత్వాలుగారి

# ప్రశంస

సీ. ఘనమైన నీరాజ్య కార్యసాధన ధీ ప్ర
భానత కీవున్న పదవిసాక్షి
లలితమౌ నీ నిజకుల సేవ కీవొన
రించిన రెడ్డి బోర్డింగు సాక్షి
ప్రతిలేని నీ ప్రభుభక్తికి నీకును
ప్రాపించునట్టి తపస్సు సాక్షి
తరములేనట్టి నీ పరమ పుణ్యమునకు
హిత గుణుండైన నీ సుతుడె సాక్షి

గీ. అసదృశంబగు నీ దయారసమునకును
క్రమములైనట్టి నీదు వాక్యములె సాక్షి
విబుధవర్యుల పాలిటి వేల్పుగిడ్డి
ప్రథిత కొత్వాలు వేంకట రామరెడ్డి-

సీ. పంకజోదరు పాదపద్మ చింతనమన్న
నిరుపమంబైన పెన్నిధి మీకు
సంఘసంస్కార ప్రచార సభాదిన
సంబన్న పెద్ద పర్వంబు మీకు

శ్రిత బుధ జనకోటి వితతరక్షణమన్న
తప్పని నిత్యకృత్యమ్ము మీకు
ఆంధ్ర జాత్యభ్యుదయాంచి తోద్యమమన్న
భక్తిచే సలిపెడు వ్రతము మీకు
గీ. కుటిల జనపాటనము మీకు కులగుణంబె
సత్యధర్మంబులును మీకు సహజవృత్తి
విబుధవర్యుల పాలిటి వేల్పురెడ్డి
ప్రథిత కోత్వాలు వేంకట రామరెడ్డి.

సీ. వేనవేల్ ప్రజలను విహితాత్ములుగ జేసి
ప్రఖ్యాతి జెందిన ప్రభువటంచు
బహుసంఘ సంస్కార బద్ధకంకణుడవై
నిలచిన సుజ్ఞాన నిధివటంచు
యాంధ్రాభివృద్ధికై యాత్మనైన నొసంగు
త్యాగంబుగల ధన్యతముడవనుచు
నిజదేశ జనవృద్ధి నిర్వాహణమునకై
ప్రతిన బూనినయట్టి హితుడవంచు
గీ. భవ్యవస్త్ర ప్రదర్శన భవనము నకు
నాధిపత్యముబూని మే మాదరమున
సలుపు కార్యంబు దీర్చిన శాంతమూర్తి
ప్రథిత కోత్వాలు వేంకట రామరెడ్డి.

రాజా బహద్దరు

# వేంకట రామారెడ్డి ఓ. బి. ఇ. గారికి

శ్రీవారి జన్మదినోత్సవ సందర్భమున

ప్రాతవిద్యార్థినీ సంఘము సమర్పించు

# సన్మాన పత్రము

మహాశయా!

నేడు సుదినము. లోక కల్యాణార్థమై మహాత్ము లుదయించుచుందురు. క్షణభంగురములగు జీవితములను కొందరు ఆదర్శవంతముగఁ జేయుదురు. అట్టి యాదర్శ జీవుల పుట్టుం దినములు పండుగలు. నేఁడు మాకు పండుగ. మీ పుత్రికలు జేసికొను పండుగ కాతిథ్యము స్వీకరించినందుకు వందనములు.

ఉదారచరితా!

విద్యాహీనమై, జడమైయున్న స్త్రీలోకముంజూచి కనికరించిన మహాయశోవిభాసితులచే స్థాపింపఁబడినట్టి, మాతృభాషాద్వారా యున్నతవిద్యఁ గరపుటయం దఖిలాంధ్ర దేశమునకు మార్గదర్శినియై, ఏఁటేట నెందఱనో యుత్తమ గృహిణులుగాఁ జేసి దేశమున కర్పించుచున్న; ఈ పాఠశాల కధ్యక్షత వహించి సర్వవిధముల విద్యను బ్రోత్సహించు మీ యుదారచరితే యంతయుం శ్లాఘ్యము.

**కార్యదీక్షాదక్షా!**

నానాటికి మీ యవ్యాజ దయవలెనే, వెలుగుచున్న పాఠశాలా విద్యార్థినీసంఖ్యచే స్థల సంకోచ మనుభవించుట తప్పనిసరి యగుచుండగా, సజ్జనులఁ బ్రోత్సహించి పలుకుబడి నుపయోగించి పాఠశాలకు దివ్యభవన నిర్మాణము నకై 25 వేల రూ. వెలగల భూదానముఁ జేయించి మరి యంత ధనవ్యయమున దివ్యభవనముఁ గట్టింప దీక్ష వహించిన దక్షుడవు.

**పరోపకారపారీణా!**

నేఁ డాంధ్రావనియందు తలజూపు ప్రతి సత్కారము ప్రత్యక్షముననో, పరోక్షముననో, మీ చేయూత నొందకుండ నుండలేదనిన అతిశయోక్తి కానేరదు. పఠనాలయములు, వసతిగృహములు, ప్రార్థనా మందిరము లన్నియు మీ సహాయ మపేక్షించునవియే! వెలితిలేని యివి విసువులేని యుపకారము.

**పరిపాలనాధురీణా!**

నగర రక్షా ప్రధానపదవిఁబోలు, ఉన్నతస్థాన మలంకరించి సమీచీన కార్యనిర్వాహణముఁ జేసి ప్రభుత్వము నలరించి పూజనీయుమగు రాజాబహద్దూర్, ఓ. బి. ఇ. బిరుదముల నంది యాంధ్రుల కపార కీర్తి గడించిపెట్టిన ప్రధానాంధ్రుడవు; నిను గన్న యాంధ్రావని వీరమాత, నీ సోదరాంధ్రులు ధన్యులు.

మాన్య వర్యా !

గత ఎనిమిది సంవత్సరములనుండి ఉన్నత విద్యాలాభమును యీ పాఠశాలలోఁ బడసిన విద్యార్థినులందరు ఒకచో జేరి తమ పాఠశాలకు తగు సహాయముఁ చేసి యద్దానతా మిఁకను బడయదగిన యుపకృతిఁ బడయు నుద్దేశముతో మా ప్రాతవిద్యార్థినీసంఘ మేర్పడినది. తమబోటి ధన్యజీవుల జన్మదినోత్సవము ప్రప్రథమముగా జేయంజాలు భాగ్యమును మా సంఘమున కొసగూర్చిన భగవంతున కభివందనములు. తమ జీవిత చరిత్రనుగూడ గ్రంథరూపమున వెలువరించి యాంధ్రుల కర్పించి ధన్యముగావలె నని ఈ సంఘ ముద్దేశించి యున్నది. ఈ పవిత్రోద్దేశము నెరవేర్ప సర్వేశుని వేడుచున్నారము.

శ్రీ విద్యాభిమానీ !

పూర్వమువలెనే ముందును మీ స్వర్ణహస్తచ్ఛాయలో మా పాఠశాలాకన్య పోషితయై, దివ్యభవనమున, తన సహజకలకంఠమున మీ యశోగీతికలఁ బాడుగాతమనియు స్త్రీ విద్యాభిమానులును, దేశహితైక పరులును, ఉదారచరితులును అగు తమకు సంపూర్ణ పురుషాయుస్సు నొసంగి ఇట్టి జన్మదినోత్సవముల నెన్నింటినో చేయగల భాగ్యము మా కొసంగ భగవంతుని వేడుచున్నారము.

ప్రాతవిద్యార్థినీసంఘము
౨౦-౩-౩౭

ఇట్లు విన్నవించు,
ప్రాతవిద్యార్థినీసంఘ సభ్యురాండ్రము.

మహారాజ రాజశ్రీ కొత్త్వాలు

# వేంకట రామారెడ్డిగారి సన్నిధికి

# విజ్ఞాపనము.

---

మ. కనక క్ష్మాధర రత్నకందరములన్
గంగాతటం బందుఁ జం
దనంపు గోనలఁ గ్రీడలం జెలఁగియుం
దారన్ దమిన్ వక్షమం
దునఁ జెన్నారఁగఁ దాల్చు మాధవుఁడు సం
తోషంబునన్ బ్రోఁచుతన్
ఘనుఁ గొత్త్వాల్విభు సద్గుణాకరుస వేం
కటరామ రెడ్డ్యగ్రణిన్.

సీ. బల వైభవ ఖ్యాతి కలితులౌ రెడ్డి రాణ్మణుల కెల్లను
శిరో మాల్యమగుచు
నధిక తేజశ్శక్తి నలరు సుద్యోగియ రత్నాళి
నాయక రత్న మగుచు
సర్వేశ వంద్యుఁడౌ యుస్మానలీ పాదుషాకు వజ్రఁపు
కవచంబు నగుచు

# ఆంధ్రులకు సందేశము

మనదేశములో మద్యపాననిషేధము ప్రారంభింప
బడినది - దానివలన బీదవారు ముఖ్యముగ వ్యవసాయకూ
లీలకు [illegible]
[illegible]
[illegible]
[illegible]
వలయును

రెండవ ముఖ్యవిషయము మన [illegible] బాలికలకు
మంచి విద్యను చెప్పించుటకై [illegible]
ను - [illegible] బాలికల పాఠశాలలు [illegible]
పించవలెను [illegible]

రాయబహద్దరు వెంకటరామారెడ్డి

రా. బ. వేంకట రామారెడ్డిగారి స్వహస్తాక్షరములు

آندھروں کو پیام و ہدایت

میں آپکو مبارکباد دیتا ہوں آپ حضرات نے آندھرا کانفرنس قائم کرکے
[illegible] بڑا احسان کیا ہے

تلنگانہ میں ابھی [illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]

رా. బ. వేంకట రామారెడ్డిగారి స్వహస్తాక్షరములు

ధనధాన్య సంపద దనరు నైజాము ప్రజాప్రతతికిఁ
గాలి నెలబాలుఁ డగుచు

గీ. భూరి విద్యాగుణోన్నత పుత్ర రత్న
భూతుఁడు నాచుఁ నెవ్వంబు పొలుచునట్టి
ప్రథిత గోత్వాల వేంకట రామరెడ్డి
వరుని ధీ విభవోన్నతుల్ పలుక వశమె.

సీ. అత్యున్నత పదంబు నధివసించినఁ గాని పొలివోని
యాంధ్రత్వమును దలంచి
గద్వాల మొదలుగాఁగల యాంధ్రసంస్థానములకుఁ
జేసిన సాయములఁ దలఁచి
విద్యగఱచు రెడ్డి విద్యార్థులకు రెమ్ము రాజిత
శ్రీసౌధ రాజిఁ దలచి
యాంధ్రభాషా నిలయాంధ్రల పచియించు సాహిత్య
తోద్యమ సరణి దలఁచి

గీ. భవ్య కవితా విలాస సంపదలఁ బొదలు
టరసి నీ జేయునట్టి యాదరణఁ దలఁచి
యాత్మ నిక మెచ్చుకుండెడి యాంధ్రుఁ డున్న
ప్రథిత కొత్వాలు వేంకట రామరెడ్డి.

ఉ. పుట్టితి వాంధ్ర దేశమునఁ బూజ్యతఁ గంటివి విద్యలందుఁ జేఁ
బట్ట నిజాంప్రభుండుఁ జనవంద్య పదంబున మెట్టియుంటి వె

ప్పట్టున నాంధ్రు లాంధ్రమన భాష మెలర్పఁగ నాదరించు నీ
యట్టిగుణాఢ్యుడుండు నె,దయాకర వేంకటరామ ధీమణీ.

గీ. తనరుచు నొనర్చు నీ సుకృతంబులకును
దోడుగాఁ గవి యాశీస్సు లీడులేని
వైభవోన్నతు లొసఁగూర్ప వలయు మెపుడు
ప్రథిత కొత్వాలు వేంకట రామరెడ్డి.

హైదరాబాదు (దక్కను)
తేది ౬౫ సెప్టెంబరు ౧౯౨౮

బాలమిత్రసభ, గుంటూరు.
శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రి.

GEORGE R. I.

**GEORGE THE FIFTH** by the Grace of God of Great Britain, Ireland and the British Dominons beyond the Seas, King Defender of The Faith, Emperor of India and Sovereign of the Most Excellent Order of the British Empire to our trusty and well beloved Raja Bahadur Venkat Rama Reddy GREETING Whereas we have thought fit to nominate and appoint you to be an Officer of the Civil Division of our said Most Excellent Order of the British Empire. We do by these presents grant unto you the Dignity of an officer of our said order and hereby authorise you to have, hold, and enjoy the said Dignity and Rank of an officer of our aforesaid order together with all and singular privileges thereunto belong or appertaining.

Given at Our Court at Saint James's under Our Sign Manual and the Seal of our said order, this Fifteenth day of December 1930 in the Twenty first year of Our Reign.

By the Sovereign's Command
S/d EDWARD T.
Grand Master.

Grant of the dignity of an officer
of the Civil Division of the Order of The
British Empire to
Raja Bahadur Venkat Rama Reddy.

రాజా బహద్దరు గారికి
ఓ. బి. ఇ. బిరుదము ప్రసాదింపబడిన
సందర్భములో పంపబడిన లేఖయొక్క

# అభిప్రాయము

గ్రేట్ బ్రిటన్, ఐర్లాండ్, బ్రిటిషు సామ్రాజ్యముల యొక్క చక్రవర్తియు, ఇండియా చక్రవర్తియు, అయిన అయిదవ జార్జి, మా ప్రియమైన విశ్వాసపాత్రుడైన రాజా బహద్దరు వేంకట రామారెడ్డికి వ్రాయుట యేమనగా:—

మేము నిన్ను మాయొక్క ఉత్తమమైన ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (ఓ. బి. ఇ.) యొక్క అధికారిగా నిర్ణయించుటకు నిశ్చయించినాము. కావున ఇందుమూలముగా మిమ్ములను పై వర్గములో చేర్చి గౌరవించుచు పై బిరుదమును దానికి సంబంధించిన గౌరవములతో వహించుటకు అధికార మిచ్చుచున్నాము.

మా ముద్రతో, మా సంతకముతో యీ ౧౯౩౧ డిసెంబరు ౯౯ 30 నాటి తేదీన మాయొక్క ౨౧ వ పరిపాలనా సంవత్సరమున నియ్యబడినది.

చక్రవర్తిగారి ఆజ్ఞచే

సంతకము. ఎడ్వర్డు. టి.

# రాజా బహద్దరుగారికి

ప్రసాదింపబడిన

పతకముల యొక్కయు, బహుమానముల యొక్కయు

# వివరణము

౧. చక్రవర్తిగారి రజితోత్సవ పతకము.

ఈ పతకము ౬ మే ౧౯౩౫ తేదినాడు ప్రసాదింపబడినది. ఆ తేదినాడు ఈ ప్రకారముగా ఆజ్ఞ అయినది.

"చక్రవర్తిగారి ఆజ్ఞచే - ఇందు వెంట పంపబడిన పతకము రాజాబహద్దరు వేంకట రామారెడ్డి ఓ. బి. ఇ. గారికి చక్రవర్తులయొక్క రజతోత్సవ జ్ఞాపకార్థముగా ధరించుకొనుటకై ప్రసాదింపబడినది."

౨. లార్డు ఇర్విన్ వైస్రాయిగారు బహూకరించిన బంగారు గుండీలు.

హైద్రాబాదుకు పై వైస్రాయిగారు దయచేసి నప్పుడు ప్రసాదించినారు.

౩. వజ్రాల గుండీలు.

ఇవి బీరారుయువరాజుగారగు నవాబ్ ఆజంజాబహద్దరుగారిచే వారు ఇంగ్లాండునుండి తిరిగి

వచ్చి నప్పుడు రాజా బహద్దరుగారికి ప్రసాదింప బడినవి.

౪. ఓ. బి. ఇ. బిరుదముతో కూడ ఒక గురుతుగల పతకము (Insignia) పంపబడినది.

౫. రిపీటర్ జోబిగడియారము వెండిది. సుమారు ౧౫౦ రూపాయిల విలువగలది.

పూర్వము కరీంనగరు తాలూక్దారుగా నుండిన పిస్టింజీ జీవాంజీగారు రాజాబహద్దరుగారికి ప్రసాదించిరి, పిస్తంజీగారి యింటిలో ౧౯౦౨లో దొంగతనము జరిగినప్పుడు దొంగను పట్టుకొనినందులకు పై బహుమాన మియ్యబడెను.

౬. జిల్లాపోలీసు డైరెక్టరుగా అయిన హెంకిన్ గారు రాజా బహద్దరుగారు సిర్సిల్లా, జగిత్యాల మున్నగు తాలూకాలలో ౧౯౦౨లో ఉత్తమమైన సేవజేసినందులకు వెండి జోబీగడియార మిచ్చినారు.

౭. ఒక బంగారు పతకము.

౧౯౧౮ - ౧౯౧౯ సం॥లో ప్రభుత్వము వారిచే ప్రసాదింపబడినది. ఆ పతకముపై ఇట్లు వ్రాయ బడినది.

" నిజాం ప్రభుత్వము వారు వేంకట రామా

రెడ్డిగారు ౧౯౧౮ - ౧౯౧౯ సం||లో ఇన్ ఫ్లూయంజా జ్వరాల ఆపత్తులో ప్రశంసనీయమైన సేవ జేసినందులకు బహూకరించుచున్నారు.

౮. వెండి క్యాలెండరు.

ఇది లార్డు వెలింగ్డన్ వైస్రాయిగారు హైదరాబాదు వచ్చినప్పుడు ప్రసాదించియుండిరి.

౯. శ్రీ మేసన్రీ సంఘము వారిచ్చిన పతకము ఒకటి.

౧౦- చక్రవర్తిగారి రజతోత్సవ సందర్భములో నియ్యబడిన పతకము.

౧౧. బంగారు గడియారము,

బీరారు యువరాజుగారు ఇంగ్లాండునుండి రెండవ మారు తిరిగివచ్చినప్పుడు ప్రసాదించినారు.

౧౨. లార్డు రీడింగు వైస్రాయిగారు హైద్రాబాదు వచ్చినప్పుడు ప్రసాదించిన వెండి సిగరెట్టుకేసు.

౧౩. ౮వ ఎడ్వర్డు డ్యూక్ ఆఫ్ విండ్జర్, వేల్సు యువరాజుగారు హైదరాబాదుకు వచ్చియుండినప్పుడు ఒక వెండి సిగారుకేసును బహుమతిగా ఇచ్చినారు.

సమాప్తము

## గోలకొండ పత్రికాప్రచురములు.

గోలకొండ కవుల సంచిక
నిజాంరాష్ట్ర పరిపాలనము
హిందువుల పండుగలు
సంఘోద్ధరణము
గయోపాఖ్యానము
ఉచ్ఛల విషాద నాటకము
కర్నూలు రాజవంశావళి
కృష్ణాలహరి, (శ్లోకములు, పద్యములు.)